# భారత దేశ పాలన

## బి.ఏ. ప్రభుత్వ పాలనా శాస్త్రం, రెండవ సంవత్సరము


*రచయితలు*

**డా॥ కె. రఘునాథ్,** ఎం.ఏ. పిహెచ్.డి.
ప్రాంతీయ ఉప సంచాలకులు
బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం
పి.బి. సిద్ధార్థ కళాశాల కేంద్రం, విజయవాడ

**శ్రీమతి మెహ్రున్నిసా బేగం,** ఎం.ఏ., బి.యిడి.
సీనియర్ లెక్చరర్
రాజనీతి శాస్త్రం
జె.యం.జె. మహిళా కళాశాల, తెనాలి.

**శ్రీ వి. పూర్ణ చంద్రరావు** ఎం.ఏ.,
రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు
వి.ఆర్.యస్ అండ్ వై.ఆర్.యన్. కళాశాల,
చీరాల

**శ్రీ యస్. వెంకటేశ్వర్లు,** ఎం.ఏ.
ప్రభుత్వ పాలనా శాస్త్ర ఉపన్యాసకులు
బి.బి.హెచ్. డిగ్రీ కళాశాల,
వేటపాలెం.

సంపాదకులు

**డా॥ బి.జె.బి. కృపాదానం,** ఎం.ఏ. పిహెచ్.డి.
ఉపన్యాసకులు, ప్రభుత్వ పాలనాశాస్త్రం
ఏ.సి. కళాశాల, గుంటూరు

సమన్వయకర్త

**డా॥ యం. రవిశేఖర్** ఎం.ఏ. పిహెచ్.డి.
రాజనీతి మరియు ప్రభుత్వపాలనాశాస్త్ర విభాగం
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జుననగర్

డైరెక్టర్

**ఆచార్య ఎం.వి. రామ్‌కుమార్ రత్నం,** M.A., Ph.D.



**దూర విద్యా కేంద్రం**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జుననగర్ - 522 510

Ph.: 0863 - 2293189 - Ext. 180; 2293299, Cell : 98482 85518
E-mail : info@anucde.ac.in
Website : www.anucde.ac.in (or) www.anucde.info

**B.A., Indian Administration**

First Edition : 1993

Second Edition : 2004

Third Editon : 2005

Fifth Edition : 2014
Sixth edition : 2015
Copies : 2000

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

*Published by :*
**Prof. M.V. Ramkumar Ratnam**
Director
Centre for Distance Education
Acharya Nagarjuna University

Dr. P.P.S. Paul Kumar
Deputy Director
CDE, ANU

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించబడి మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికగల్గిన గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికీ తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్దిష్ట సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**Prof. K. Viyyanna Rao**
Vice-Chancellor
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

## B.A. Public Administration 2nd year

## Syllabus

## Paper - II : Indian Administration

1. Evolution of Indian Administration
2. Characteristics of Administration during British Period
3. Administrative system at the time of Independence - Continuity and Change.
4. Political Contest of Indian Administration.
5. Social and Economic contest of Indian Administration.
6. Chief Characteristics of the Union Administrative System.
7. The Role of Cabinet Secretariat.
9. Union - State Administrative Relations : Role of the All India Services.
10. Election Commission.
11. Finance Commission.
12. Union Public Service Commission.
13. Comptroller and Auditor General.
14. The Organisational Pattern of Public Enterprises.
15. The Profile of State Level Administrative System.
16. The Secretariat : Organisation and Functions.
17. The Relations between Secretariat and Directorate.
18. Administrative Reforms at the District and Lower Levels.
19. Organisation and Functions of Social Welfare Department in A.P.
20. (a). Ramachandra Reddy Committee Report.
    (b). Rustomiji Committee Report
21. Judicial Control over Administration.

## B.A. DEGREE EXAMINATION, MAY 2006.

(Examination at the end of Second Year)

Part II - Public Administration

Paper II - **INDIAN ADMINISTRATION**

Time : Three hours Maximum : 100 marks

SECTION A - (2 x 15 = 30 marks)

Answer any TWO of the following

1. Write an essay on Political factors, which influence the Indian Administration.
   భారతదేశ పాలనను ప్రభావితం చేయు రాజకీయ అంశములపై ఒక వ్యాసం వ్రాయుము.

2. Examine the characteristics of Indian Administration during the British period.
   బ్రిటీషు కాలం నాటి భారతదేశ పాలనా లక్షణాలను పరిశీలించుము.

3. Explain powers and functions of President of India.
   భారత రాష్ట్రపతి అధికారాలు – విధులను గూర్చి వివరించుము.

4. Explain the salient features of Indian Constitution.
   భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలను గూర్చి వివరించుము.

5. Analyse the role of collector in District Administration.
   జిల్లా పరిపాలనలో కలెక్టరు పాత్రను విశ్లేషించుము.

SECTION B - (3 x 10 = 30 marks)

Answer any THREE of the following

6. Write an essay on the functions of the Chief Secretary.
   ప్రధాన కార్యదర్శి విధులపై ఒక వ్యాసం వ్రాయుము.

7. Discuss the powers and functions of Cheif Minister.
   ముఖ్యమంత్రి యొక్క అధికారాలు మరియు విధులను చర్చించుము.

8. Describe the Mauryas' administrative system.
   మౌర్యుల పరిపాలనా వ్యవస్థను వర్ణింపుము.

9. "Comptroller and Auditor General" is the custodian of Indian Fincance". Comment.
   భారతదేశంలో ఆర్థిక నిధుల సంరక్షకుడు 'కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్" – వ్యాఖ్యానించుము.

10. Explain the Financial relations between Central and State Government.
    కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గల ఆర్థిక సంబంధాలను వివరించుము.

11. Examine the nature of Fundamental rights.
    ప్రాథమిక హక్కుల స్వభావాన్ని పరిశీలించుము.

12. Explain the powers and functions of Prime Minister of India.
    భారత ప్రధాని అధికారాలు మరియు విధులను గూర్చి వివరించుము.

## SECTION C - (3 x 5 = 15 marks)
### Answer any THREE of the following

13. (a) General Administration.
సాధారణ పరిపాలన.

(b) Cabinet Secretary.
కేబినెట్ సెక్రటరీ.

(c) All India Services.
అఖిల భారత సర్వీసులు

(d) District Development Review Board.
జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి.

(e) Chairman of Rajya Sabha.
రాజ్యసభ ఛైర్మన్.

(f) Zilla Parishad.
జిల్లా పరిషత్.

(g) Administrative Reforms Commission.
పాలనా సంస్కరణల సంఘం.

## SECTION D - (25 marks 10 x 2 = 20 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences :

(i) Habeas Corpus.
హెబియస్ కార్పస్.

(ii) Emergency powers.
అత్యవసర అధికారాలు

(iii) Mandal Parishad.
మండల పరిషత్.

(iv) No confidence motion.
అవిశ్వాస తీర్మానం.

(v) Public Corporation.
ప్రభుత్వ కార్పొరేషన్.

(vi) Sri Bagh Pact.
శ్రీబాగ్ ఒప్పందం

(vii) Mandal Development Officer.
మండల అభివృద్ధి అధికారి.

(viii) General Bill.

సాధారణ బిల్లు.

(ix) Union Public Service Commissior

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్.

(x) Revenue policy of akbar.

అక్బర్ రెవిన్యూ విధానం.

(b) Answer the following in 1 or 2 words : (5 x 1 = 5)

(i) Who is the President of India ?

భారత రాష్ట్రపతి ఎవరు ?

(ii) Who appoints the Cabinet Minister ?

క్యాబినెట్ మంత్రిని ఎవరు నియమిస్తారు ?

(iii) Which article prescribes the constitutional Amendment procedure ?

రాజ్యాంగ సవరణా విధానాన్ని తెలుపు నిబంధన ఏది ?

(iv) Through which amendment "Socialist and Secular" words are added to our Indian Constitution?

భారత రాజ్యాంగ ప్రవేశికలో ఏ సవరణ ప్రకారం 'సామ్యవాద మరియు లౌకిక' అనే పదాలు చేర్చబడ్డాయి ?

(v) Who is the First Chief Minister of Andhra Pradesh ?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి ఎవరు ?

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | భారతదేశ పాలనా పరిణామము | 1.1 - 1.10 |
| 2. | బ్రిటిష్ కాలంలో పాలనా లక్షణాలు | 2.1 - 2.7 |
| 3. | స్వాతంత్ర్య కాలములో భారతదేశ పరిపాలనా వ్యవస్థ కొనసాగింపు - మార్పులు | 3.1 - 3.7 |
| 4. | భారత దేశ పాలన - రాజకీయ సందర్భం | 4.1 - 4.4 |
| 5. | భారత దేశ పాలన వ్యవస్థ సాంఘీక - ఆర్థిక పరిస్థితులు | 5.1 - 5.6 |
| 6. | కేంద్ర పాలనా విధానము. | 6.1 - 6.6 |
| 7. | మంత్రిత్వ శాఖల పాత్ర | 7.1 - 7.7 |
| 8. | మంత్రి మండలి సచివాలయ పాత్ర. | 8.1 - 8.5 |
| 9. | యూనియన్ - రాష్ట్ర పరిపాలనా సంబంధాలు : అఖిల భారత సర్వీసుల పాత్ర | 9.1 - 9.8 |
| 10. | ఎన్నికల సంఘము | 10.1 - 10.4 |
| 11. | ఆర్థిక సంఘం | 11.1 - 11.5 |
| 12. | యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ | 12.1 - 12.4 |
| 13. | కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ | 13.1 - 13.5 |
| 14. | ప్రభుత్వ రంగ సంస్థలు | 14.1 - 14.7 |
| 15. | రాష్ట్రస్థాయి పాలనా వ్యవస్థ - రేఖా చిత్రము. | 15.1 - 15.6 |
| 16. | సచివాలయము - వ్యవస్థీకరణ మరియు విధులు | 16.1 - 16.5 |
| 17. | సచివాలయము - సంచాలక కార్యాలయమునకు మధ్య గల సంబంధము | 17.1 - 17.6 |
| 18. | జిల్లాపాలన | 18.1 - 18.9 |
| 19. | పరిపాలనపై పౌర నియంత్రణ | 19.1 - 19.3 |
| 20. | పరిపాలనపై శాసన సభ నియంత్రణ | 20.1 - 20.5 |
| 21. | పరిపాలనపై న్యాయశాఖ నియంత్రణ | 21.1 - 21.5 |

పాఠము - 1

# భారతదేశ పాలనా పరిణామము

## విషయసూచిక

1.0 లక్ష్యం
1.1 పరిచయం
1.2 మౌర్యుల పాలన
1.3 గుప్తుల పాలన
1.4 మొగలుల పాలన
1.5 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు

## 1.0 లక్ష్యము :

భారతదేశంలో పరిపాలన వివిధ కాలాలలో అనగా మౌర్యుల కాలంలోను, గుప్తుల కాలంలోను, మొగలుల కాలంలోను ఏవిధముగా పరిణామం చెందినదీ వివరించుటయే ఈ పాఠము యొక్క లక్ష్యము.

## 1.1 పరిచయం :

ప్రస్తుత భారతదేశ పరిపాలనా వ్యవస్థలోని ఎక్కువ అంశాలు దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు మనదేశాన్ని పరిపాలించిన బ్రిటిష్ వారసత్వము ద్వారా మనకు సంక్రమించినవే. అయినప్పటికీ మనదేశంలో పాలనకు సంబంధించిన పునాదులు ప్రాచీన కాలము నుండీ ఏర్పడి వివిధ కాలాలలో, వివిధ రాజకీయ మరియు ఇతరవ్యవస్థలలో వచ్చిన మార్పులకనుగుణంగా అనేక మార్పులు చెందుతూ ప్రస్తుతము ఈ స్థితికి వచ్చినవి. అయితే భారతదేశ పరిపాలనా స్వరూప, స్వభావాలను సమగ్రంగా అవగాహన చేసుకొనవలెనంటే తప్పనిసరిగా పరిపాలనకు సంబంధించిన ముఖ్య చారిత్రక పరిణామాలను స్థూలముగా తెలుసుకొనవలసిన అవసరము ఎంతైన ఉన్నది. ఎందుచేతంటే మనదేశంలో బ్రిటిష్ వారి పాలన ప్రారంభమయ్యేటప్పటికి వారు మొగలుల పాలనాయంత్రాగముపై ఆధారపడ్డారు. అదే విధంగా మొగలులు తమ పాలనా కాలంలో వారి కంటె ముందు పరిపాలించిన షేర్షా, గుప్తులు, మౌర్యులు మొదలగు వారి కాలంలో ప్రవేశపెట్టిన పాలనా పద్ధతులను అనుకరించి పరిపాలన చేయటం జరిగింది. కాబట్టి భారత దేశంలో పాలనా పరిణామాన్ని అవగాహన చేసుకోవాలంటే ప్రాచీన కాలంలోని మౌర్యుల పాలన, గుప్తుల పాలన, మధ్యయుగంలోని మొగలుల పాలన, ఆధునిక కాలంలోని బ్రిటీష్ పాలనకు సంబంధించినటువంటి పరిణామాలను సమగ్రంగా అవగాహన చేసుకోవడం ఎంతైనా అవసరము.

## 1.2 మౌర్యుల పాలన :

వేదకాలంనుండే భారత దేశంలో పరిపాలన ప్రారంభమైనప్పటికి ఒక నిర్దిష్టమైన పరిపాలనా విధానము వాస్తవంగా మౌర్యుల కాలములోనే ఏర్పడిందని చెప్పవచ్చు. మౌర్య సామ్రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. మౌర్యసామ్రాజ్యము

క్రీ.పూ. 322 నుంచి 237 వరకు కొనసాగినది. మౌర్య చక్రవర్తులలో చంద్రగుప్త మౌర్యుడు, బింబిసారుడు, అశోకుడు మొదలగు వారు ముఖ్యులు. అశోకుని తరువాత మౌర్య వారసులు కొంతమంది ఉన్నప్పటికీ ఒక అర్ధ శతాబ్దములోనే మౌర్య సామ్రాజ్యము అంతరించిపోయింది. అయితే మౌర్యుల పరిపాలనను గురించి తెలుసుకొనటానికి మనకు ఎన్నో చారిత్రక ఆధారాలు కలవు. వాటిలో కౌటిల్యుని 'అర్ధ శాస్త్రము' మెగస్తనీసు వ్రాసిన 'ఇండికా' అను గ్రంథము, అశోకుని కాలము నాటి శిలాశాసనములు ప్రధానమైనవి. అయితే వీటిలో కౌటిల్యుడు వ్రాసిన అర్ధ శాస్త్రము చాలా ప్రధానమైనది. ఇతనినే చాణుక్యుడు లేదా విష్ణుశర్మ అని కూడా అంటారు. ఇతడు వ్రాసిన అర్ధశాస్త్రాన్ని మౌర్యులు తమ పరిపాలనకు ఒక మార్గదర్శక ఉద్గ్రంథంగా భావించారు. కౌటిల్యుడు చంద్రగుప్త మౌర్యునికి గురువుగాను, ఆ తరువాత అతని ఆస్థానంలో మంత్రిగాను పనిచేసాడు. మౌర్యుల కాలంలోని పాలనా లక్షణాలను ఈ క్రింది విధముగా వివరించవచ్చు.

### 1.2.1 మౌర్యుల పాలనా లక్షణాలు :

**ఏ. కేంద్రపాలన - రాజు, రాజ్య స్వభావము :** మౌర్యుల కాలంలో రాజ్యము, 'రాజరిక వ్యవస్థ' స్వభావము కలిగి ఉండేది. ఫలితంగా సర్వాధికారాలు రాజుచేతిలో కేంద్రీకృతమైనాయి. అతడే ప్రధాన శాసన కర్త, పాలకుడు, న్యాయనిర్ణేత, సర్వసైన్యాధ్యక్షుడు. అయినప్పటికీ రాజు నిరంకుశంగా పరిపాలించక, దేశధర్మానికి కట్టుబడి ఉండేవాడు. రాజు అధికారాలపై పౌరసభ, జనపద సభ అనే రెండు ప్రజాసభలు అదుపు కలిగిఉండేవి. పౌర సభలో నగర ప్రతినిధులు సభ్యులుగాను, జనపద సభలో గ్రామీణ ప్రాంతాల ప్రతినిధులు సభ్యులుగాను ఉండేవారు. పరిపాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకొనడానికి ఈ సభలు ఉపయోగపడేవి. ఈ సభల ద్వారా మౌర్యులు కొంతవరకు పాలనలో ప్రజలను భాగస్వాములను చేసినారు.

**బి. మంత్రి పరిషత్ :** మౌర్యుల కాలంలో రాజుకు సలహాలివ్వటానికి 4గురు లేదా 5గురితో కూడిన ఒక మంత్రి పరిషత్ ఉండేది. అవసరాన్ని బట్టి ఒక్కొక్క సభ్యుడు మంత్రిత్వశాఖకు అధిపతిగా ఉండేవాడు. వీరికి సహాయము చేయుటకు కొంతమంది అధీనోద్యోగులుండేవారు. మంత్రి పరిషత్‌కు కార్యాలయ విధులలో సహాయమందించేందుకు ఒక సెక్రటరీ ఇన్ చార్జీ ఉండేవాడు. మెజారిటీ మంత్రుల అభిప్రాయం ప్రకారం రాజు నడుచుకొనేవాడు. ఈ విధంగా మంత్రుల సలహాల ప్రకారమే రాజు నడుచుకునే ఉత్తమ సాంప్రదాయంతో మౌర్యుల పరిపాలనా కాలము కొనసాగినదని చెప్పవచ్చు.

### 1.2.2 రాష్ట్ర పాలన :

పరిపాలన సౌలభ్యము కొరకు సువిశాలమైన మౌర్య సామ్రాజ్యము కొన్ని రాష్ట్రాలుగా విభజింపబడింది. ఉత్తరా పథానికి తక్షశిల, దక్షిణ ప్రాంతానికి సువర్ణ గిరి, తూర్పు రాష్ట్రానికి తోసాల, పశ్చిమ రాష్ట్రానికి ఉజ్జయిని, మధ్య రాష్ట్రానికి పాటలీపుత్రము ముఖ్యపట్టణాలు లేదా రాజధానులుగా ఉండేవి. ఈ రాష్ట్రాల అధిపతులుగా సాధారణముగా రాజకుటుంబ వంశీకులను లేదా వారి రక్తసంబంధీకులను రాజు నియమించేవాడు. రాష్ట్ర పాలకులను, 'కుమారామాత్య' అని పిలిచేవారు. పరిపాలనకు సంబంధించి చక్రవర్తి వారికి సవివరమైన ఆదేశాలనిచ్చేవాడు. రాజ ప్రతినిధులు ఎప్పటికప్పుడు రాజుకు పరిపాలనకు సంబంధించిన వివరాలను నివేదికల రూపంలో పంపుతూ ఉండేవారు. రాజ ప్రతినిధులకు అన్ని విధాలుగా సహాయ సహకారమందించుటకు సమర్థులైన మంత్రులుండేవారు. రాష్ట్రాలను తిరిగి జిల్లాలుగా, జనపదాలుగా విభజించారు. జిల్లాలకు 'ప్రాదేశిక' అనే అధికారి అధిపతిగా ఉండేవాడు. 'జనపదాలకు' అధిపతులుగా ప్రజలలో మంచి పలుకుబడి, పరిపాలనా సమర్థతగల వారిని నియమించేవారు. అంతేగాక పన్నుల వసూలు, జనన మరణాల లెక్కలు, వివాదాల పరిష్కారం మొదలైన విషయాలు చూడటానికి అనేక మంది ఉద్యోగులుండేవారు. వీరు పాలనా వ్యవస్థలో అతి కీలకమైన పాత్ర వహించేవారు.

**1.2.3 స్థానిక ప్రభుత్వము :**

మౌర్యుల కాలములోని స్థానిక ప్రభుత్వాలను రెండు రకములుగా విభజించవచ్చును. అవి 1. నగర పాలన 2. గ్రామీణ పాలన. నగరపాలనకు 'నాగరిక' అనే అధికారి బాధ్యత వహించేవాడు. మౌర్యుల రాజధానీ నగరమైన 'పాటలీపుత్రము' ను పాలించటానికి ఒక నగర కౌన్సిల్ ఉండేది. ఈ కౌన్సిల్ 30 మంది సభ్యులతో, 6 సంఘాలుగా ఏర్పడింది. ఒక్కొక్క సంఘములో 5గురు సభ్యులుండేవారు. ఒక్కొక్క సంఘము ఒక్కొక్క కార్యకలాపాన్ని నిర్వహించేది. అవి 1. పరిశ్రమలు 2. విదేశీయుల సౌకర్యాలు 3. వాణిజ్య కార్యకలాపాలు 4. జనన, మరణ లెక్కలు 5. వస్తు విక్రయము 6. పన్నుల వసూలు. ఈవిధముగా పాటలీ పుత్ర నగర పరిపాలన ఆధునిక పరిపాలనను ప్రతిబింబిస్తున్నదని చెప్పవచ్చును. గ్రామపరిపాలనలో ప్రతి గ్రామము ఒక యూనిట్‌గా ఉండేది. దీని అధిపతి 'గ్రామిక'. ఇతడు ప్రజలచే ఎన్నుకోబడే వాడు. 5 లేక 10 గ్రామాలపై 'గోప' అనే వ్యక్తి అధిపతిగా ఉండేవాడు.

**1.2.4 న్యాయపాలన :**

న్యాయపాలనకు చక్రవర్తి ప్రధాన అధినేతగా ఉండేవాడు. పట్టణాలలోను, గ్రామప్రాంతాలలోను ఎన్నో న్యాయస్థానాలుండేవి. వీటిలో గ్రామాధిపతి మరియు కొంతమంది గ్రామపెద్దలు సభ్యులుగా ఉండేవారు. న్యాయస్థానాలను ప్రధానంగా రెండు రకములుగా వర్గీకరించవచ్చు. అవి. 1. ధర్మ స్థీయ 2. కంటక శోధన. వీటిలో మొదటి దానిని సివిల్ కోర్టుతోను, రెండవ దానిని క్రిమినల్ కోర్టుతోను పోల్చవచ్చు. మౌర్యులు కాలంలో శిక్షలు చాలా కఠినంగా ఉన్నందు వల్ల నేరాలు చాలా తక్కువ ఉండేవని మెగస్తనీసు తన గ్రంథములో వ్రాసినాడు. అయితే అశోకుని కాలంలో న్యాయనిర్వహణ విధానం చాలా సరళం చేయబడింది.

**1.2.5 రెవిన్యూపాలన :**

మౌర్యులకాలంలో అధిక సంఖ్యాక ప్రజానీకము గ్రామాలలో నివశిస్తూ, వ్యవసాయమే ప్రధానవృత్తిగా చేసికొని జీవించేవారు. పన్నులలో భూమిశిస్తు ప్రధానమైనది. పంటలో 1/4 వంతు పన్నుగా నిర్ధారించేవారు. దీనిని ధన రూపంలో గానీ, ధాన్యరూపంలో గానీ చెల్లించవచ్చు. నగరాలలో తయారైన వస్తువులను ఇతర ప్రాంతాలలోనికి అమ్మకానికి తీసుకొని వెళ్ళినపుడు వాటిపై పన్ను చెల్లించవలసి ఉండేది. చేపలు పట్టడం, అటవీ సంపద, గనులు, జూదగృహాలు, పడవలు నడపటం మొదలగు వాటికి లైసెన్సు లివ్వటానికి ఫీజులను వసూలు చేసేవారు. ఇవిగాక వృత్తి పన్ను, రహదారి పన్ను, జరిమానాలను విధించటం మొదలైన వాటి ద్వారా ప్రభుత్వమునకు ఆదాయము వచ్చేది.

**1.2.6 సైనిక పాలన :**

మౌర్యుల కాలంలో రాజు సర్వసైన్యాధ్యక్షుడు. యుద్ధ సమయాలలో రాజు స్వయంగా పాల్గొని సైన్యాన్ని నడిపించేవాడు. మౌర్యుల సైనిక బలంలో కాల్బలము, అశ్వబలము, గజ బలము, నావికా బలము ముఖ్యమైనవి. అంతేగాక వీరి కాలంలో సమర్ధవంతమైన గూఢచార వ్యవస్థ ఉండేది. వీరు వర్తకులు, విద్యార్థులు, సన్యాసుల రూపంలో రాజ్యంలో జరిగే విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొనేవారు.

ఈ విధంగా పైన చెప్పబడిన విషయాలను సమగ్రముగా పరిశీలించినట్లయితే మౌర్యులు సుస్థిరమైన, సమర్ధవంతమైన పాలనను అందించారని చెప్పవచ్చు. ఫలితంగా వీరి పాలన నుండి మొగలులు, బ్రిటిష్ వారు తమ తమ పరిపాలనలకు సంబంధించిన ముఖ్య విషయాలను గ్రహించారు.

## 1.3 గుప్తుల పాలన :

మౌర్య సామ్రాజ్యము అంతరించిన తరువాత అనేక రాజ్యాలు ఏర్పడటం, పతనము కావటము జరిగినప్పటికీ సామ్రాజ్యాలను ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష పాలకులలో సన్నగిల్లలేదు. ఫలితంగా మౌర్య సామ్రాజ్యము తరువాత చెప్పుకోదగినది గుప్త సామ్రాజ్యము. క్రీ.శ. 300 నుండి క్రీ.శ. 550 వరకు అంటే దాదాపు 250 సం॥ల పాటు ఉత్తర భారతదేశంలో గుప్త సామ్రాజ్యము కొనసాగినది. వీరి కాలాన్ని భారతదేశ చరిత్రలో స్వర్ణయుగమని చరిత్రకారులు వర్ణిస్తారు. గుప్తులలో సముద్రగుప్తుడు, రెండవ చంద్రగుప్తుడు, కుమార గుప్తుడు, స్కంధగుప్తుడు మొదలగువారు ముఖ్యులు. గుప్తుల పరిపాలనను గురించి తెలుసుకొనటానికి కాళిదాసు రచనలు, సముద్రగుప్తుని అలహాబాద్ శాసనము, చైనా యాత్రికుడైన ఫాహియాన్ రచనలు ముఖ్యమైన ఆధారాలు.

### 1.3.1 రాజు - అతని అధికారాలు :

గుప్తుల కాలంలో రాజరికము వంశ పారంపర్యము. అయితే రాజులు తమ కుమారులలో సమర్థులైన వారినే తమ వారసునిగా ప్రకటించేవారు. అలహాబాద్ శాసనములో రాజు దైవాంశ సంభూతునిగా వర్ణింపబడినాడు. రాజు సర్వాధికారి, శాసన, రాజకీయ, కార్యనిర్వాహక, సైనిక అధికారాలన్నీ అతనికే అప్పగించబడినాయి. రాజే ఉన్నత న్యాయాధీశుడు.

### 1.3.2 మంత్రిమండలి :

రాజుకు పరిపాలనా వ్యవహారాలలో సహాయ, సహకారాలందించుటకు 8 లేదా 9 మంది మంత్రులతో కూడిన ఒక మంత్రిమండలి ఉండేది. వీరందరి పదవులు వంశపారంపర్యాలే. మంత్రిమండలిలో సాధారణముగా యువరాజులు, కుమారామాత్యులు మొదలగు వారు సభ్యులు. వీరిని రాజే నియమించేవాడు. అయితే మంత్రిమండలి యిచ్చిన సలహాలను రాజు పాటించవచ్చు లేదా పాటించక పోవచ్చు. తుది నిర్ణయము తీసుకునే అధికారము రాజుకే వదిలివేయటము జరిగినది.

### 1.3.3 కేంద్ర పాలన :

మౌర్యుల వలే గాక గుప్తులు పరిపాలనా వికేంద్రీకరణపై తమ దృష్టిని ఎక్కువగా సారించినారు. రాజధాని నగరంలో 'సర్వాధ్యక్షుడు' అనే అధికారి కేంద్ర ప్రభుత్వము యొక్క ఆదేశాలను రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసేవాడు. అంతేగాక రాజు గారి కొలువులో 'ప్రతిహార', 'ముఖ్య ప్రతిహార' అనే అధికారులుండేవారు. వీరు రాజ ప్రసాదానికి సంబంధించిన ముఖ్య పనులన్నింటిని చూచెడివారు. వీరుగాక కేంద్ర స్థాయిలో ఎంతోమంది అధికారులుండేవారు.

### 1.3.4 రాష్ట్ర, స్థానిక పాలన :

గుప్తుల కాలంలో సామ్రాజ్యమును పరిపాలనా సౌలభ్యము కొరకు భుక్తిలుగా (రాష్ట్రాలుగా), భుక్తిలు 'విషయాలుగా' (జిల్లాలుగా) 'విషయాలు' కొన్ని గ్రామాలుగా విభజించబడినవి. భుక్తిలకు 'ఉపారిక' ను అధిపతిగా నియమించేవారు. అయితే వీటిలో కొన్ని సామంత రాజుల ఆధీనములోను, మరికొన్ని రాజప్రతినిధుల అధీనంలోనూ ఉండేవి. 'విషయాల' కు అధిపతిగా 'విషయ[illegible]ండేవాడు. గ్రామ వ్యవహారాలను 'మహత్' అనే గ్రామ పెద్ద చూచెడివాడు. ఇతనికి 'గ్రామజనపద' అనే ప్రముఖులతో కూడిన ఒక సభ తోడ్పడేది. ఇవిగాక గుప్తుల కాలంలో వివిధ రకాల ప్రతినిధులతో కూడిన జిల్లా పరిపాలనా సంఘాలు ఉండేవి. ఇవి జిల్లాపాలనను నిర్వహించేవి. నగరాల పాలన నగర సంఘాల ద్వారా జరిగేది. దీని అధిపతిని 'నగరిక' అని పిలిచేవారు.

### 1.3.5 న్యాయ పాలన :

గుప్తుల కాలంలో రాజే ఉన్నత న్యాయాధీశుడు. అతని తీర్పులపై అప్పీలు లేదు. దిగువ న్యాయస్థానాలు యిచ్చిన తీర్పులపై రాజధాని నగరములో ఉన్నటువంటి ఉన్నత న్యాయస్థానమునకు అప్పీలు చేసుకొనవచ్చును. గుప్తుల కాలంలో నేరాల

సంఖ్య చాలా తక్కువగా ఉండేది. చాలా నేరాలకు జరిమానా మాత్రమే శిక్షగా విధించేవారు. దేశద్రోహము, తిరుగుబాటు వంటి పెద్దనేరములకు అంగవిచ్ఛేదనము శిక్షగా ఉండేది. ఉరిశిక్ష ఆ కాలంలో లేదని అనేక రచనల ద్వారా తెలియుచున్నది. ఇంతేగాక శ్రేణులు, తదితర స్వచ్ఛంద వ్యవస్థల సభ్యులు వారి మధ్య వివాదాలను పరిష్కరించుకొనటానికి అనధికార న్యాయస్థానములను ఏర్పరచుకొనేవారు.

**1.3.6 సైనిక పాలన :**

గుప్తుల కాలంలో సమర్ధవంతమైన సైనిక బలము ఉండేది. రాజే సర్వసైన్యాధ్యక్షుడు. ఎందరో మహాసేనాపతులు సైన్యాన్ని నిర్వహించేవారు. యుద్ధాలలో రాజే స్వయముగా సేనలను నడిపేవాడు.

**1.3.7 రెవిన్యూ పాలన :**

ఆనాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయము. కావున భూమిశిస్తు ప్రధాన ఆదాయ వనరుగా ఉండెడిది. పండిన పంటలలో 1/6 వంతును శిస్తుగా నిర్ణయించేవారు. శిస్తును ధన రూపంలో గానీ, ధాన్య రూపంలో గానీ చెల్లించవచ్చును. ఇవిగాక రేవులు, వస్తువులపై అమ్మకపు పన్ను, గనులు, అడవులు మొదలగు వాటి నుండి ప్రభుత్వమునకు ఆదాయము వచ్చేది.

**1.3.8 సమాజము :**

గుప్తుల కాలంలో సమాజము కుల ప్రాతిపదికపై విభజింపబడినది. అయితే కుల పద్ధతి కొనసాగినా ప్రజలు తమ వృత్తులను మార్చుకొనుటకు అవకాశము కలదు. ప్రజలు సన్మార్గవర్తనులుగా జీవించేవారు. సామాజిక వ్యవస్థ నుంచి వెలివేసిన చండాలురు మాత్రమే మద్యము, మాంసాహారము తీసుకొనేవారు. మిగిలిన వారందరూ శాఖాహారులే. అంటరాని తనము పాటించబడేది. ఆ రోజులలో బ్రాహ్మణులను ద్విజులుగా వ్యవహరించేవారు. చండాలురు వారికి ఎదుట పడరాదు. బ్రాహ్మణులకు భూములు, దేవాలయాలు దానముగా యివ్వబడేవి. కొన్ని గ్రామాలు కూడా అనుదానముగా వారిలో కొందరికి యివ్వబడేవి. వాటిపై వచ్చిన ఆదాయాన్ని వారే అనుభవించుచూ వారు కొన్ని పాలన మరియు న్యాయాధికారాలు కలిగి ఉండేవారు. గుప్తుల కాలంలో స్త్రీల యొక్క ప్రాధాన్యత చాలా తక్కువ. యుక్త వయస్సు రాక పూర్వమే స్త్రీలకు వివాహము జరిగేది. బహు భార్యత్వము చాలా సాధారణమైన విషయము. దేవదాసీ వ్యవస్థ కూడా ఉన్నట్లు తెలియుచున్నది.

ఈ విధముగా గుప్తుల యుగము ప్రజానురంజకమైన పరిపాలన ప్రవేశపెట్టి దేశంలో రాజకీయ సమైక్యతను సాధించినది. పటిష్టమైన మిలటరీ, పోలీసు, న్యాయవ్యవస్థ, పరిపాలనా వికేంద్రీకరణలు గుప్తుల పరిపాలన యొక్క ముఖ్య లక్షణాలుగా పేర్కొనవచ్చును. అందుచేతనే గుప్తుల కాలమును స్వర్ణయుగంగా చాలా మంది చరిత్రకారులు భావిస్తారు.

## 1.4 మొగలుల పాలన :

మౌర్య, గుప్త చక్రవర్తుల తరువాత భారతదేశాన్ని ఒక సార్వభౌమత్వ దేశముగా తీర్చిదిద్దటానికి వివిధ ప్రయత్నాలు జరిగినప్పటికీ ఈ ప్రయత్నాలలో మొగలులు మాత్రమే విజయం సాధించినారని చెప్పవచ్చును. మొగలు సామ్రాజ్యమును క్రీ.శ. 1526వ సం॥లో బాబరు స్థాపించాడు. మొగలు సామ్రాజ్య పాలకులలో బాబరు, హుమాయూన్, అక్బరు, షాజహాను, ఔరంగజేబులు ముఖ్యులు. 1707 సం॥లో ఔరంగజేబు మరణించుటతో మొగలు సామ్రాజ్యము దాదాపు అంతరించినదని చెప్పవచ్చును. మొగలులు భారతదేశాన్ని దాదాపు పూర్తిగా తమ పరిపాలన క్రిందకు తెచ్చుకొనగలిగినారు. మొగలు చక్రవర్తులలో ప్రధానమైనవాడు అక్బరు. ఇతడు తన 50 సంవత్సరాల పరిపాలనలో దేశంలో సమర్ధవంతమైన పరిపాలనా పద్ధతులను ప్రవేశపెట్టి మంచి

పరిపాలనాదక్షునిగా పేరుగాంచినాడు. అయితే హుమాయూన్‌ను ఓడించి ఢిల్లీని ఆక్రమించిన ఆఫ్ఘన్ నాయకుడైన షేర్‌షా పరిపాలన పద్ధతుల ప్రభావము అక్బరుపై ఎంతగానో కలదు. షేర్‌షా క్రీ.శ. 1540 సం॥లో జరిగిన కనోజ్‌యుద్ధములో హుమాయూన్‌ను పూర్తిగా ఓడించినాడు. ఫలితముగా మొగలు రాజ్యము తాత్కాలికముగా పతనమై పోయినది. షేర్ 5 సం॥లు మాత్రమే పరిపాలించినప్పటికీ చక్కని పరిపాలనా పద్ధతులను ప్రవేశ పెట్టినాడు. కావున అక్బరు ప్రవేశపెట్టిన పరిపాలనా వ్యవస్థపై షేర్‌షా ప్రవేశపెట్టిన పరిపాలనా వ్యవస్థ ప్రభావము ఎంతగానో కలదు. షేర్‌షా గ్రామస్థాయి నుండి దేశ స్థాయి వరకు చక్కని పరిపాలనా పద్ధతులను ప్రవేశపెట్టినాడు. పరిపాలనా వ్యవహారాలలో చక్రవర్తే సర్వాధికారి అయినప్పటికి అతడు నిరంకుశముగా పరిపాలించలేదు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పరిపాలించినాడు. తన సామ్రాజ్యాన్ని 47 సర్కారులుగా విభజించి వాటికి వేరు వేరు ఉద్యోగులను నియమించినాడు. భూసారాన్ని మరియు పండే పంటను బట్టి భూమిని అనేక తరగతులుగా విభజించినాడు. పంటలో 1/3 వంతు శిస్తుగా వసూలు చేసేవారు. రైతులకు పట్టాలిచ్చి వారి నుండి 'కబాలియత్' లను తీసుకొనినాడు. ప్రభుత్వము పట్ల రైతుకు గల బాధ్యతను తెలుపునది కబాలియత్. రోడ్ల కిరువైపులు చెట్లను నాటించుటయే గాక, బాటసారులు సౌకర్యము కొరకు అక్కడక్కడ సత్రములను ఏర్పాటు చేసినాడు. మొత్తము మీద షేర్‌షా పరిపాలనా కాలము కొద్ది కాలమే అయినప్పటికి చక్కని పరిపాలనా పద్ధతులను ప్రవేశపెట్టినాడు.

### 1.4.1 మొగలుల పరిపాలనా వ్యవస్థ :

క్రీ.శ. 1526 సం॥లో పానిపట్టు వద్ద నాటి ఢిల్లీ సుల్తానయిన ఇబ్రహీం లోడిని ఓడించి బాబరు మొగలు సామ్రాజ్యమునకు పునాదులు వేసినాడు. నాటి నుండి దాదాపు 1857 వరకు మనదేశమును మొగలులు పరిపాలించినారు. మొగలు చక్రవర్తులలో బాబరు, హుమయూన్, అక్బరు, జహంగీరు, షాజహాన్, ఔరంగజేబులు ప్రధానమైన వారు. అయితే వీరిలో బాబరు, హుమయూన్‌లు సామ్రాజ్య విస్తరణకై కృషిచేయగా అక్బరు దాదాపు 50 సం॥ పాటు పరిపాలించి సుస్థిరమైన పరిపాలనా వ్యవస్థను ప్రవేశపెట్టినాడు. కావున మొగలుల పాలనకు సంబంధించిన అధ్యయనము అక్బరు నుండి మాత్రమే ప్రారంభమవుతుంది. ఆ తరువాత వచ్చిన మొగలు చక్రవర్తులు కొద్దిపాటి మార్పులతో అక్బరు పాలననే అనుకరించినారు.

### 1.4.2 కేంద్రపాలన :

ఎ. రాజు : మొగలుల పరిపాలనా పద్ధతిని మజుందార్ అనే రచయిత పారశీక అరబిక్ పద్ధతిగా అభివర్ణించినాడు. ఎందుచేతనంటే తూర్పున ఖురాన్ భాషయైన అరబ్బీని, పురాతనము, ప్రసిద్ధమైన పారశీకాన్ని మేళవించి రెండు నాగరికతలను ఐక్యము చేసినాడు. ఈ మిశ్రమంలో పర్షియా నాగరికత పాలు ఎక్కువ కావటంతో దీనిని పారశీక - అరబ్బీపద్ధతి అని పిలిచినారు. మొగలుల కాలంలో రాజుకున్న అధికారాలు అసాధారణమైనవి. అతడు శాసన, కార్యనిర్వాహక, న్యాయాధిపతి, సైన్యాధిపతి. అతని మాటకు తిరుగు లేదు. అయినప్పటికీ ఇస్లాం మత సంప్రదాయాలు, సంస్కృతులు అతని పాలనా చర్యలను నియంత్రణ చేసేవి.

బి. మంత్రి మండలి :

చక్రవర్తికి పరిపాలనా వ్యవహారాలలో సహాయ సహకారాలందించుటకు 4 గురు అధికారులతో కూడిన ఒక మంత్రిమండలి ఉండేది. వీరిలో 'వకీల్' అనే అధికారి భూమిశిస్తు, పన్నులు, ఆదాయ, వ్యయాలు మరియు ఇతర ఆర్థిక విషయాలకు సంబంధించి చక్రవర్తికి కుడి భుజముగా వ్యవహరించేవాడు. 'మీర్‌భక్షీ' సైన్యాధికారిగా వ్యవహరించి చక్రవర్తికి సైనిక విషయాలలో సహాయ సహకారాలందించేవాడు. దేశంలోని వివిధ అధికారులు, రాజప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారుల యొక్క కార్యకలాపములకు సంబంధించి సమగ్రమైన నివేదికలను తయారుచేసి దానిని చక్రవర్తికి సమర్పించేవాడు. అంతేగాక చక్రవర్తికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లు కూడా ఇతనే చూసెడివాడు. 'సాదర్' అనే అధికారి మతపరమైన వ్యవహారాలు చూసేవాడు. అంతేగాక ఇతడు

విద్యాసంస్థలు పనిచేసే తీరును, ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు, న్యాయాధికారుల నియామకము న్యాయశాఖ పనిచేసే విధానమును పరిశీలించుట మొదలగు విషయాలు చూచేవాడు. 'మీర్‌సమన్' అనే అధికారి రాజ్యమునకు, రాజభవనానికి అవసరమయ్యే సామాగ్రిని సమకూర్చే విభాగానికి అధిపతి. అంతేగాక ముత్యాలు, రత్నాలు మొదలుకొని మందుగుండు సామాగ్రి, తుపాకులను సమకూర్చే బాధ్యత ఇతనికి అప్పగించబడినది. ఇతనికి తన విధి నిర్వహణలో కొంతమంది ఉద్యోగులు సహాయ, సహకారాలందించేవారు.

పైన చెప్పిన విధముగా అక్బరు పరిపాలనా వ్యవస్థను 4గురి మంత్రుల మధ్య విభజించినాడు. అయితే వీరు తమకు చెందిన అధికారమును దుర్వినియోగపరచకుండా ఉండుటకు తన వ్యక్తిగత పర్యవేక్షణతో పాటు, కొంతమంది అధికారులను కూడా నియమించి అక్బరు మంత్రుల కార్యకలాపములను కనిపెడుతూ ఉండేవాడు.,

## 1.4.3 రాష్ట్ర పాలన :

మొగలుల రాష్ట్ర పాలనావ్యవస్థ కేంద్రీయ పాలనా వ్యవస్థకు ప్రతిబింబమని చెప్పవచ్చును. పరిపాలనా సౌలభ్యము కొరకు సామ్రాజ్యమంతటిని 'సుభాలుగాను' (రాష్ట్రాలుగా), సుభాలును 'సర్కారులు' గాను (జిల్లాలుగాను), సర్కారులను 'పరగణాలు' గాను విభజించినారు. 'పరగణ' అంటే కొన్ని 'గ్రామాల' సముదాయమని చెప్పవచ్చును. అక్బరు తన సామ్రాజ్యమును 15 సుభాలుగా విభజించినాడు. సుభాకు అధిపతిని 'సుబేదార్' అని అందురు. ఇతనిని చక్రవర్తే స్వయముగా నియమించేవాడు. ఇతడు ప్రతిరోజూ చక్రవర్తి మాదిరిగా రాష్ట్ర స్థాయిలో దర్బారును ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను పరిష్కారము చేసేవాడు. రాష్ట్రానికి చెందిన సైన్యము ఇతని ఆధీనంలో ఉండేది. ఇతనికి కార్యనిర్వాహక, న్యాయాధికారులు యివ్వబడినవి. సుబేదార్ గాక రాష్ట్ర స్థాయిలో దివాన్, సాదర్, క్వాజీ, భక్షీ వంటి అధికారులుండేవారు. వీరిలో 'దివాన్' అనే అధికారి పన్నులను వసూలు చేయుట, భూమికి సంబంధించిన వివాదాలను పరిష్కరించుట, వ్యవసాయాభివృద్ధి కవసరమైన చర్యలను చేపట్టుట మొదలగు విధులను నిర్వహించేవాడు. ఈ విధుల నిర్వహణలో దివానుకు కొంతమంది ఉద్యోగులు సహాయ సహకారాలందించేవారు. ఒక వేళ సుబేదారుకు, దివానుకు మధ్య ఏవైనా వివాదాలేర్పడినట్లయితే వాటిని చక్రవర్తి స్వయముగా పరిష్కరించేవాడు. 'సాదర్' అనే అధికారి రాష్ట్రానికి సంబంధించిన మతపరమైన వ్యవహారాలకు బాధ్యత వహించేవాడు. ఇతడిని కేంద్రప్రభుత్వము నియమించేది.. ఇతడు కష్టాలలో ఉన్నవారికి సహాయము చేయుట, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సహాయము చేయుట మొదలగునవి ఇతని యొక్క ప్రధాన బాధ్యతలు. 'క్వాజీ' అనే అధికారి అధీనంలో న్యాయశాఖ ఉంచబడినది. అయితే కొన్ని సందర్భాలలో 'సాదర్' యే క్వాజీగా నడచుకొని జిల్లాస్థాయి న్యాయాధిపతి పదవులకు అభ్యర్థులను సిఫారసు చేసేవాడు. 'భక్షీ' అనే అధికారి అధీనంలో రాష్ట్రములోని సైన్యమునకు సంబంధించిన వ్యవహారాలను అనగా వారి భర్తీ, జీతభత్యాలు, ఇతర అలవెన్సులు, సైన్యాలు మోహరింపు, సైనికులలో క్రమశిక్షణ మొదలగు విషయాలను చూచేవాడు. అంతేగాక సైనిక విషయాలకు సంబంధించి మీర్‌బక్షీకి ఎప్పటికప్పుడు నివేదికలు పంపేవారు.

## 1.4.4 స్థానిక పాలన :

అక్బరు చక్రవర్తి సుభాలను సర్కారులుగను, (జిల్లాలు) సర్కారులను 'పరగణాలు' గను విభజించినాడు. అయితే వీటి సంఖ్య ఎంత అనునది ఖచ్చితముగా తెలియదు. సర్కారు స్థాయిలో ఫౌజుదార్, అమిన్, కొత్వాల్, క్వాజీ అనే అధికారులు ముఖ్యులు. వీరి అధికారాలు, విధులను గురించి వివరముగా తెలుసుకొందాము.

ఎ. ఫౌజ్‌దార్ : సర్కారు కార్యనిర్వాహక అధికారిని ఫౌజ్‌దార్ అని పిలిచేవారు. సర్కారు స్థాయిలో శాంతి భద్రతలను కాపాడుట, చిన్న, చిన్న తిరుగుబాటులను అణచివేయుట, జాతీయ రహదారుల రక్షణ, రెవిన్యూ వసూళ్ళలో 'అమిల్'కు సహకరించుట మొదలగునవి ఇతని యొక్క ప్రధానమైన విధులు. ఇతని అధీనంలో కొంత సాయుధ దళము కూడా ఉంటుంది.

బి. అమిన్ : రెవిన్యూ శాఖ యావత్తు 'అమిన్' అనే అధికారి అధీనంలో ఉంటుంది. ఇతడు జిల్లాలోని వ్యవసాయదారులతో సన్నిహిత సంబంధాలేర్పాటు చేసుకొని ఎక్కువ శాతము భూమిని సాగులోనికి వచ్చేటట్లు చూసేవాడు. అంతేగాక రైతుల కవసరమైన ఋణములను తక్కువ వడ్డీకి యిప్పించి వాటిని అనేక సులభ వాయిదాల పద్ధతిలో చెల్లించుట కవసరమైన చర్యలను తీసుకొని మధ్య దళారీలు బారి నుండి రైతును కాపాడేవాడు. రైతుల స్థితిగతులను గురించి ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో 'ఇంపీరియల్ కోర్టు'కు పంపేవాడు. ఈ విధముగా 'అమిన్' రాష్ట్ర ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేస్తూ తన విధులను నిర్వర్తించేవాడు.

సి. కొత్వాల్ : ఇతడు న్యాయసంబంధమైన విధులను నిర్వహించేవాడు. అదేవిధంగా జిల్లాలోని ప్రతి పట్టణములో శాంతిభద్రతలను కాపాడుటకు, పోలీసు, న్యాయవిదులను నిర్వహించుటకు, తూనికల, కొలతలలో ఉన్న మోసములను అరికట్టుటకు కూడా ఇలాంటి 'కొత్వాల్' అనే అధికారులు నియమింపబడినారు.

డి. క్వాజీ : సర్కారులో న్యాయపాలన చేయుట క్వాజీ అనే అధికారి ముఖ్య విధి, అంతేగాక మతసబంధమైన కార్యాలు, పేదవారికి బట్టలు నిమిత్తము ఇచ్చు విధులు ఇతని అధీనంలో ఉండేవి.

### 1.4.5 పరగణా పాలన :

మొగలుల పాలనా వ్యవస్థలో సర్కారు తరువాత 'పరగణ' అనునది ముఖ్యమైనది. కొన్ని గ్రామాల సముదాయాన్ని 'పరగణ' అని పిలిచేవారు. దీనిలో ముగ్గురు ముఖ్యాధికారులుండేవారు - వారే షిక్దార్, అమిన్, కానుంగో అనువారు. వీరిలో 'షిక్దార్' పరగణ ముఖ్య కార్యనిర్వహణాధికారి. కాగా భూమిని సర్వే చేసి, రెవిన్యూ వసూళ్ళకు సంబంధించిన కార్యకలాపము నిర్వహించు అధికారులే అమిన్, కానుంగోలు. వీరికి తమ విధి నిర్వహణలో సహాయ సహకారాలందించుటకు కొంతమంది సహాయకులుండేవారు. 'క్వాజీ' పరగణాస్థాయిలో న్యాయాధికారిగా వ్యవహరించేవాడు.

### 1.4.6 గ్రామ పాలన :

మొగలు పరిపాలనలో గ్రామాలు, ప్రభుత్వ యంత్రాంగము మధ్య సంబంధాలు దృఢంగా ఉండేవి. పన్నుల వసూళ్ల తప్ప మిగిలిన అధికారాలన్నీ గ్రామపంచాయితీకే వదలి వేయటమ్ము జరిగినది. ప్రభుత్వము, గ్రామ ప్రజల మధ్య అనుసంధాన కర్తలుగా 'ముకద్దం' పట్వారీ అనే గ్రామోద్యోగులుండేవారు. వీరిలో గ్రామంలో శాంతిభద్రతలు పరిరక్షించి, పన్నులు వసూలు చేసే విషయంలో అధికారులకు సహకరించే బాధ్యతను 'ముకద్దం' నిర్వహించగా, 'పట్వారీ' రైతుల, కౌలుదార్ల భూయాజమాన్య వివరాలను నమోదు చేసేవాడు.

### 1.4.7 సైనిక పాలన :

మొగలు ప్రభుత్వము సైనిక స్వభావము కలిగినటువంటిది. నాటి సైన్యంలో అశ్విక దళం, కాల్బలము, ఫిరంగి దళము, గజదళమనే నాలుగు ముఖ్య భాగములు కలవు. వీటికి తోడు అక్బరు కాలము నుంచి నైకాదళము కూడా కలదు. నాటి సైన్యాన్ని రెండు విధాలుగా నిర్వహించేవారు. అవి. 1. సిద్ధ సైన్యం 2. రాష్ట్ర గవర్నర్లు, సామంతులు పోషించే మునసబుదార్ల సైన్యము. వీటిలో సిద్ధ సైన్యము చక్రవర్తి అధీనంలో ఉంటుంది. దీనిని చక్రవర్తే స్వయముగా ఎంపిక చేసుకొని, జీతభత్యాలు నిర్ణయించేవాడు. మనసబ్ అంటే పదవీ లేదా హోదా. అధికారుల యొక్క హోదాను తెలియజేయటానికి ఈ పదవి

ఉద్దేశించబడినది. వీరు సివిల్ మరియు మిలటరీ వ్యవహారాల రెండింటినీ నిర్వహించేవారు. మునసబుదారులలో మొత్తము 33 గ్రేడులుండేవి. అతి తక్కువ గ్రేడు మునసబుదారు 20 మంది అశ్వికులను పోషించగా, అత్యున్నత గ్రేడు మునసబుదారు 10,000 మంది అశ్వికాలను పోషించేవాడు. మునసబుదారుల నియామకము, పదోన్నతి, తొలగింపు మొదలగు అధికారాలన్నీ చక్రవర్తి చేతుల్లోనే ఉండేవి. ఎక్కువస్థాయి కలిగిన మునసబు పదవులు సాధారణముగా రాజకుటుంబీకులకు మాత్రమే యిచ్చేవారు. మునసబుదారులు అవినీతికి పాల్పడకుండా ఉండుటకు, 'డాగ్‌చిథాహ' పద్ధతిని ప్రవేశపెట్టినారు. దీని ప్రకారము ప్రతి మునసబుదారు తన వద్ద ఉన్న గుర్రాల సంఖ్యకు సంబంధించిన వివరాలను చక్రవర్తి వద్దకు పంపించగా, చక్రవర్తి వాటిని పరిశీలించి ఒక వైపు తన ముద్రను, మరొక వైపు మునసబుదారీ ముద్రను వేయించేవాడు. దీనినే బిరహా లేదా సైనిక చిట్టా అని అందురు. ఇక్కడ 'డాగ్' అంటే గుర్రాలను ప్రత్యేక చిహ్నాలతో ముద్రించే పద్ధతి అని చెప్పవచ్చును.

**1.4.8 రెవిన్యూ పాలన :**

రెవిన్యూ విషయంలో ముఖ్యంగా భూమిశిస్తు విషయంలో అప్పటి దివాన్ అయిన తోడరమల్లు కృషి ఫలితంగా అక్బరు సరియైన భూమిశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టినాడు. భూసారాన్ని బట్టి భూములను నాలుగు రకాలుగా వర్గీకరించినాడు. పంటలో 1/3 వంతును పన్నుగా చెల్లించవలసి ఉంటుంది. పన్నును ధనరూపంలో గానీ లేదా ధాన్య రూపంలో గానీ చెల్లించవచ్చును. కరువు కాటకాలు వచ్చినపుడు శిస్తును పూర్తిగా మాఫీ చేయుటయే గాక, తిరిగి పంటలకు ఋణాలు యిచ్చేవారు. రైతులు తమ భూమి శిస్తును నేరుగా ప్రభుత్వ కోశాగారమునకు చెల్లించే సదుపాయము కల్పించబడినది. భూమి శిస్తేగాక ఎగుమతి, దిగుమతి పన్నులు, ఉప్పు పన్ను, వర్తక, వ్యాపారాలపై అమ్మకపు పన్ను, గనులపై పన్ను మొదలగు వాటి ద్వారా, ప్రభుత్వమునకు ఆదాయము లభించేది. అయినప్పటికీ ప్రభుత్వమునకు లభించే ఆదాయములో అధికభాగము భూమిశిస్తు నుండే లభించేది.

**1.4.9 న్యాయపాలన :**

మొగలుల కాలంలో న్యాయపాలనకు మంచి ప్రాముఖ్యత యివ్వబడినది. అందుకుగాను క్రిందిస్థాయి నుండి పై స్థాయివరకు వ్యవస్థీకృతమైన న్యాయస్థాన యూనిట్లు ఉండేవి. దేశంలో అత్యున్నత న్యాయస్థానము 'చక్రవర్తి న్యాయస్థానమే'. ఇతడు ఇస్లామిక్ చట్టము ప్రకారము నిర్ణయములు చేసేవాడు. ఈ విధి నిర్వహణలో చక్రవర్తికి ఇతర న్యాయవేత్తలు సహాయపడేవారు. ఇదేగాక ప్రతిరోజు సూర్యోదయమైన కొద్దిసేపటికే చక్రవర్తి ప్రజలకు దర్శనమిచ్చి వారి అర్జీలను, ఫిర్యాదులను విచారించి న్యాయనిర్ణయము చేసేవాడు. దీనినే, 'జరోఖి-ఇ-దర్శన్' అని అందురు. ఇది ఒక ధర్మ దర్శనము వంటిది. కానీ ఔరంగజేబు కాలంలో ఈ పద్ధతి రద్దుచేయబడినది. ఆనాటి కాలంలో శిక్షలు చాలా భయంకరముగా ఉండేవి. కనుగుడ్లలో సూదులను గుచ్చి అంధులను చేయటం, జంతు చర్మాలతో నేరస్తులను కట్టి వీధులలో తిప్పడం, కొరడా దెబ్బలను కొట్టడం, జైలులో విషమివ్వటం మొదలగు శిక్షలను రాజకుటుంబీకుల నుంచి సామాన్యుల వరకు విధించేవారు. ఫలితంగా నేరాల సంఖ్య అతి స్వల్పంగా ఉండేది.

**1.4.10 తపాలా-గూఢచారి శాఖ :**

ఈ శాఖకు అధిపతిగా కేంద్రములో ఒక మంత్రి ఉండేవాడు. ఇది దేశ వ్యాప్తమైన శాఖ. ఈ శాఖకు సంబంధించిన మంత్రికి దేశములోని వివిధ యూనిట్ల నుండి ఎప్పటికప్పుడు వార్తలందుతూ ఉండేవి. గూఢాచారులలో కొరియర్, రన్నర్ అనే 2 రకాల వారుండేవారు. వీరిలో 'కొరియర్' గుర్రము మీద దూర ప్రాంతాలకు, రన్నర్ నడిచి గానీ, పరుగెత్తి గానీ కొన్ని దగ్గర ప్రాంతాలకు వెళ్ళేవాడు. ఈ విధంగా మొగలుల కాలంలో తపాలా గూఢాచారి శాఖ సమర్థవంతంగా తన విధులను నిర్వహించేది.

2)

## 1.5 ముగింపు :

భారతదేశ పాలనా పరిణామ చరిత్రలో మౌర్యులు, గుప్తులు, ముఖ్యంగా మొగలులు ప్రవేశపెట్టిన పాలనా విధానాలు మైలు రాళ్ళ వంటివి. వరీముఖ్యంగా కేంద్ర, రాష్ట్రాలు మధ్య పాలనాంశాలు విభజన, రెవిన్యూ సైనిక, న్యాయపాలనలలో వీరు ఏర్పాటు చేసిన రెవిన్యూ వ్యవస్థ నేటికీ కొద్ది మార్పులతో మన దేశంలో కొనసాగుచున్నది. ఈ విధముగా మొగలులు అనుసరించిన విధానాలు తరువాత తరాల వారికి ముఖ్యంగా బ్రిటిష్ ఇండియా పాలకులకు గొప్ప మార్గదర్శక సూత్రాలుగా ఉపయోగపడినాయని చెప్పుటలో ఏమాత్రము సందేహము లేదు.

### మాదిరి ప్రశ్నలు :

**వ్యాసప్రశ్నలు : (ఈ క్రింది వాటికి ఐదు పుటలకు మించని సమాధానములు వ్రాయుము)**

1 భారతదేశ పాలనా పరిణామమును గురించి సంక్షిప్తముగా వ్రాయుము.

2 మొగలుల పరిపాలనా వ్యవస్థను గురించి సవివరముగా వ్రాయుము.

**లఘు వ్యాసప్రశ్నలు : (ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులు మించకుండా సమాధానములు వ్రాయుము)**

1 మౌర్యుల కాలంలోని పరిపాలనా విధానమును సంక్షిప్తముగా వర్ణింపుము.

2 గుప్తుల పాలనా లక్షణములను వివరింపుము.

**కుశాగ్రబుద్ధి ప్రశ్నలు : (ఒకటి లేదా రెండు వాక్యాలలో సమాధానం వ్రాయండి)**

1. 'ఇండికా'
2. అర్థశాస్త్రము
3. జిజియా
4. తోడర్‌మల్
5. అమీన్
6. ఫౌజ్‌దార్
7. కబూలియత్

### 3 ఉపయుక్త గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1 | Gangulay D.K. | : | Aspects of Ancient Administration |
| 2 | Smt. V. Yasoda Devi | : | |
| | Dr. B.S.L. Hanumantha Rao | : | భారతదేశ చరిత్ర - సంస్కృతి తెలుగు అకాడమి |
| 3 | P. Satayanarayana | : | |
| | B. Jagadeswara Rao | : | భారతదేశ పాలనా వ్యవస్థ తెలుగు అకాడమి |
| 4 | S.K. Chatteerjee | : | Indian Administration |

పాఠము - 2

# బ్రిటీష్ కాలంలో పాలనా లక్షణాలు

విషయసూచిక


2.0 లక్ష్యం
2.1 పరిచయం
2.2 ఈస్టిండియా కంపెనీ పాలన
2.3 1858 భారత ప్రభుత్వ చట్టము
2.4 బ్రిటీష్ పాలనా ముఖ్య లక్షణాలు
2.4.1 కేంద్రీకృత పాలన
2.4.2 విస్తృతమైన రాజ్య వ్యవస్థ
2.4.3 ప్రాంతీయ ప్రభుత్వాలు
2.4.4 జిల్లా పాలన
2.4.5 సమన్యాయ పాలన
2.4.6 వ్యవస్థీకృత సివిల్ సర్వీసు
2.4.7 స్థానిక సంస్థలు
2.4.8 న్యాయ వ్యవస్థ
2.5 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువవదగిన గ్రంథాలు


## 2.0 లక్ష్యం :

బ్రిటీష్ వారు భారత దేశంలోనికి ఏ ఉద్దేశ్యంతో ప్రవేశించినది, ఆ తరువాత వారు క్రమేణా యావత్ భారత దేశమును తమ పాలన క్రిందకు తెచ్చుకొని వివిధ పాలనా వ్యవస్థలను, వాటి నిర్మాణాలను ఏ విధముగా అభివృద్ధి చేసినది వివరించుటయే ఈ పాఠము యొక్క లక్ష్యము.

## 2.1 పరిచయం :

భారతదేశ పాలనా పరిణామములో బ్రిటీష్‌వారి పాలన గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. ఎందుచేతనంటే బ్రిటీష్‌వారి పరిపాలన భారత దేశ ప్రజానీకముపైన, పరిపాలనా వ్యవస్థపైన ఒక గొప్ప చెరగని ముద్రవేసినది. బ్రిటీష్ వారు మనదేశంలో ఏ ఉద్దేశ్యంతో ప్రవేశించినది, కాలక్రమేణా ఏ విధముగా ఈ దేశమును ఆక్రమించుకొని కొన్ని పరిపాలనా వ్యవస్థలను ఏర్పాటు చేసినది వివరముగా తెలుసుకొందాం.

## 2.2 ఈస్టిండియా కంపెనీ పాలన :

క్రీ.శ. 1600 సం॥లో చొరవ కలిగిన కొంతమంది ఆంగ్లేయ వర్తకులు ఒక వర్తక సంఘమును ఏర్పాటు చేసినారు. దీనినే 'లండన్ కంపెనీ' అని అందురు. ఈ కంపెనీ నాటి ఇంగ్లండు రాణియైన ఎలిజబెత్‌ను భారతదేశముతోను, ఇతర తూర్పు

దేశాలతోను వర్తకము చేయుటకు తమ కంపెనీకి అనుమతి నివ్వవలసిందిగా అభ్యర్థించినారు. ఫలితంగా క్రీ.శ. 1600 సం॥ డిసెంబరు 31వ తేదీ నాడు 'లండన్ కంపెనీ' కి 15 సం॥ పాటు స్వేచ్ఛగా వ్యాపారము చేసుకొనుటకు అనుమతి పత్రాన్ని మంజూరు చేయడమైనది. ఫలితంగా కంపెనీ నాటి భారత దేశ చక్రవర్తియైన జహంగీరు అనుమతితో భారత దేశంలోని ముఖ్య పట్టణాలలో ముఖ్యంగా సముద్ర తీరప్రాంతమందలి రేవు పట్టణాలలో వ్యాపార కేంద్రాలను నెలకొల్పి వాటి పరిరక్షణకై బలమైన కోటలను నిర్మించినది. 1702 సం॥లో లండన్ కంపెనీకి పోటీగా మరొక క్రొత్త కంపెనీ అవతరించి దానితో పోటీకి సిద్ధపడినది. ఫలితంగా రెండు కంపెనీలు తీవ్రంగా నష్టపోయి ఒక ఒప్పందానికి వచ్చినాయి. ఆ ఒప్పందము ప్రకారము రెండు కంపెనీలు కలసి 'యునైటెడ్ ఈస్టిండియా కంపెనీ'గా ఏర్పడినాయి. అయితే బ్రిటీష్ వారు భారత దేశానికి రాక పూర్వమే పోర్చుగీసువారు, డచ్చివారు, ఫ్రెంచివారు మన దేశంలో వర్తకము చేస్తూ వుండేవారు. భారత దేశంలో వర్తకాధిపత్యము సాధించుటకు ఒకరితో మరొకరు ఘర్షణలకు దిగి పోరాటాలు కొనసాగించినారు. ఈ పోరాటాలలో బ్రిటీష్‌వారు ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు వారిని ఓడించి విజేతలైనారు. కాలక్రమేణా కంపెనీ తన సైనిక బలగాలను పెంపొందించుకొంటూ భారత దేశ రాజకీయాలలో తలదూర్చి కొన్ని స్వదేశీ సంస్థానాలపై యుద్ధాలను ప్రకటించి వాటిని కైవసము చేసుకొన్నది. ఈ యుద్ధాలలో 1757వ సం॥లో జరిగిన ప్లాసీ యుద్ధము, 1764వ సం॥లో జరిగిన బక్సారు యుద్ధాలు చాలా ప్రధానమైనవి. ఈ విధంగా 1773వ సం॥ నాటికి కంపెనీ సువిశాలమైన సామ్రాజ్యమును స్థాపించి, నూతన పరిపాలనా విధానమును ప్రవేశపెట్టినది. కానీ కంపెనీ పరిపాలన అవినీతికి, అధిక వ్యయానికి గురి కావడంతో సమస్యల సుడిగుండంలో చిక్కుకొని దివాలాకు సిద్ధమైనది. ఇటువంటి పరిస్థితులలో కంపెనీ వారు ఇంగ్లండు ప్రభుత్వాన్ని ఒక మిలియన్ పౌండ్ల ఋణానికై అర్థించినారు. కంపెనీ వ్యాపారుల మరియు ఉద్యోగుల అవినీతి, అక్రమ చర్యలను అరికట్టుటకు బ్రిటిష్ పార్లమెంటు, కంపెనీ భారతీయ వ్యవహారాల్లో జోక్యము చేసుకొనవలసి వచ్చినది. దీని పర్యవసానమే 1773వ సం॥లో బ్రిటీష్ పార్లమెంటు రూపొందించిన మొట్ట మొదటి చట్టము రెగ్యులేటింగ్ చట్టము. ఈ చట్టము ప్రకారము బెంగాల్‌ను పరిపాలిస్తున్న గవర్నరు ఇకపై గవర్నరు - జనరల్‌గా వ్యవహరించబడతాడు. అంతేగాక మద్రాసు, బొంబాయి గవర్నరులు తమ విధి నిర్వహణలో బెంగాల గవర్నర్-జనరల్ ఆజ్ఞలకు లోబడి వ్యవహరించవలసి ఉంటుంది. ఆ తరువాత ఈ చట్టములో వున్నటువంటి లోపాలను 1781వ సం॥లో రూపొందించబడిన సవరణ చట్టము, 1784వ సం॥లోని పిట్స్ ఇండియా చట్టాలు తొలగించినాయి. ఈ విధంగా అవసరాన్ని బట్టి బ్రిటీష్ పార్లమెంటు కంపెనీ వ్యవహారాలలో జోక్యము చేసుకొని కావలసిన శాసనాలను రూపొందించినది. ఆ తరువాత ప్రతి 20 సం॥ల కొకసారి కంపెనీ వ్యాపార హక్కుమ పొడిగిస్తూ బ్రిటీష్ పార్లమెంటు ఛార్టర్ చట్టాలను రూపొందించినది. వీటిలో 1793, 1813, 1833 చట్టాలు ప్రముఖమైనవి.

1813 ఛార్టరు చట్టము కంపెనీ గుత్త వ్యాపారము చేసుకొనే హక్కును రద్దుచేసి ఆ హక్కును బ్రిటనులోని వర్తకులందరికీ అప్పగించినది. 1833 ఛార్టరు చట్టము మిగిలిన శాసనములలో కెల్లా చాలా ప్రధానమైనది. ఈ చట్టము ప్రకారము బెంగాల్ గవర్నర్ - జనరల్ భారత దేశ గవర్నరు - జనరల్ అయినాడు. అంతేగాక ఈ చట్టము ద్వారా కంపెనీ వ్యాపారధికారాలు రద్దయి పాలనాధికారాలు మిగిలినాయి. పార్లమెంటు అధికారము పెరిగినది. 1853 ఛార్టరు చట్టము ఆంగ్లదేశపు పార్లమెంటు జారీ చేసిన చిట్టచివరి శాసనము. ఈ చట్టము కంపెనీ అధికారాలను మరొక 20 సం॥లకు పొడిగించలేదు. దీని ప్రకారము కంపెనీ అధికారాలు పూర్తిగా తొలగిపోయి పార్లమెంటు అధికారము పెరిగినది. ఇదే క్రీ.శ. 1858 సం॥లో కంపెనీ ప్రభుత్వము రద్దు కావడానికి నాంది అని చెప్పవచ్చును.

## 2.3 1858 భారత ప్రభుత్వ చట్టము :

అసమర్థమైన కంపెనీ పరిపాలన, డల్‌హౌసీ ప్రవేశపెట్టిన రాజ్య సంక్రమణ సిద్ధాంతము వలన స్వదేశ రాజులలోను, ఉన్నత వర్గాలలోను తీవ్రమైన అసంతృప్తి ఏర్పడి 19వ శతాబ్దంలో భారతీయులు అనేక తిరుగుబాటులు చేసినారు. వాటిలో

1857వ సం॥లో జరిగిన తిరుగుబాటు చాలా ప్రధానమైనది. దీనినే 'సిపాయిల తిరుగుబాటు' లేదా 'మొదటి స్వాతంత్ర్య సంగ్రామము' అని అందురు. ఈ తిరుగుబాటు 1857వ సం॥ మే 10వ తేదీన మీరట్‌లో ప్రారంభమైనది. ఢిల్లీ, ఆగ్రా, అయోధ్య ప్రాంతాలలోను, మధ్య ఇండియాలోనూ ఉధృతముగా కొనసాగినది. మీరట్‌లో సిపాయిలు యూరోపియన్ అధికారులను వధించి వెంటనే ఢిల్లీకి పోయి రెండవ బహదూర్‌షాను భారత చక్రవర్తిగా ప్రకటించినారు. కానీ బ్రిటీష్ వారు ఈ తిరుగుబాటును చాలా క్రూరముగా అణచివేసినారు. చక్రవర్తి బహదూర్‌షాను పదవి నుండి తొలగించి, రంగూన్‌లో ప్రవాస శిక్షను విధించినారు. తిరుగుబాటు ప్రయత్నము విఫలము కావటంతో దీనిని ఆసరాగా తీసుకొని బ్రిటీష్ పార్లమెంటు 1858 వ సం॥ ఆగస్టులో భారత ప్రభుత్వ చట్టమును రూపొందించినది. ఈ చట్టము ద్వారా భారతదేశంలో పాలనాధికారము కంపెనీ నుండి రాజమకుటానికి బదిలీచేయబడింది. అంతేగాక పిట్స్ ఇండియా చట్టము ప్రవేశపెట్టిన ద్వంద్వ ప్రభుత్వము రద్దుచేయబడి బ్రిటీష్ మంత్రిమండలిలోని సభ్యుడైన భారత వ్యవహారాల కార్యదర్శి (Secretary of State for India) ద్వారా భారత దేశములో పరిపాలన సాగించటము ప్రారంభమైనది. ఇతడు భారత దేశ పరిపాలనకు సంబంధించి బ్రిటీష్ పార్లమెంటుకు బాధ్యత వహిస్తాడు. పాలనా వ్యవహారాలలో ఇతనికి సలహాల నిచ్చేందుకుగాను ఒక 'సలహా మండలి' (Advisory Council) ఏర్పాటైనది. దీనిలో మొత్తము 15 మంది సభ్యులుంటారు. వీరిలో 8 మందిని బ్రిటీష్ రాజు లేదా రాణి నియమించగా, మిగిలిన 7గురిని కంపెనీ డైరెక్టర్లు ఎన్నుకుంటారు. వీరిలో సగము మందికి పైగా భారత దేశ పాలనా వ్యవస్థలో కనీసము 10 సం॥లు అనుభవము కలిగిన వారై ఉండవలెను. ఈ మండలికి అధ్యక్షులుగా భారత వ్యవహారాల కార్యదర్శి ఉంటాడు. ఆర్థిక విషయాలలో తప్ప మిగిలిన విషయాలలో కౌన్సిల్‌లోని అధిక సంఖ్యాకుల అభిప్రాయాన్ని కార్యదర్శి త్రోసిపుచ్చవచ్చును. అంతేగాక ఈ చట్టము ద్వారా గవర్నర్-జనరల్‌ను ఇక నుండి రాజప్రతినిధిగా (Viceroy) కూడా వ్యవహరిస్తారు. అయితే ఈ చట్టంలో కూడా కొన్ని లోపాలు లేకపోలేదు. ముఖ్యంగా ఈ చట్టము శాసన నిర్మాణంలో భారతీయులకు ప్రాతినిధ్యము కల్పించలేదు. అందువలన 1861వ సం॥లో భారత కౌన్సిళ్ళ చట్టాన్ని బ్రిటీష్ ప్రభుత్వము రూపొందించి కేంద్ర, రాష్ట్ర శాసనసభలలో అనధికార సభ్యుల పేరిట భారతీయులకు ప్రాతినిధ్యము కల్పించినది. ఆ తరువాత 1909, 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలను బ్రిటీష్ పార్లమెంటు ఆమోదించి భారతీయులకు తగు విధంగా శాసన నిర్మాణ శాఖలలో ప్రాతినిధ్యము కల్పించినది.

## 2.4 బ్రిటీష్ పాలన ముఖ్య లక్షణాలు :

దాదాపు 200 సం॥ల పాటు బ్రిటీష్ వారు మనదేశమును పరిపాలించుట జరిగినది. ఈ సుదీర్ఘ పాలనా కాలంలో తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవటానికి భారతదేశ పరిపాలనలో వారు అనేక మార్పులను ప్రవేశపెట్టినారు. ఈ మార్పులు ప్రత్యక్షముగా బ్రిటీష్ వారికి అనేక లాభములు చేకూర్చి పెట్టినప్పటికీ, పరోక్షంగా భారతీయులకు కూడా కొన్ని ప్రయోజనములు కలుగ చేసినవి. వీటిని దృష్టిలో పెట్టుకొని ఇపుడు బ్రిటీష్ పాలనా ముఖ్య లక్షణాలను పరిశీలించుదాము.

### 2.4.1 కేంద్రీకృత పాలన :

బ్రిటీష్ వారు తమ వ్యాపార మరియు వ్యాపారేతర ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి కేంద్రీకృత పాలనా వ్యవస్థను ప్రవేశపెట్టినారు. దీనికి సంబంధించిన ఛాయలు మొట్టమొదటిసారిగా 1773వ సం॥లో చేసిన రెగ్యులేటింగ్ చట్టములో మనకు విశదమవుతాయి. ఈ చట్టము ప్రకారము బెంగాల్ గవర్నరు ఇకపై ఇతర ప్రెసిడెన్సీలైన బొంబాయి, మద్రాసు గవర్నర్లపై గవర్నర్ - జనరల్‌గా వ్యవహరించబడతాడు. వీరు తమ విధి నిర్వహణలో బెంగాల్ గవర్నర్ - జనరల్ ఆజ్ఞలకు ఆదేశాలకు లోబడి వ్యవహరించవలసి ఉంటుంది. పరిపాలనా విషయాలలో గవర్నర్ - జనరల్‌కు సలహాలిచ్చుటకు 4 గురు సభ్యులతో కూడిన ఒక కౌన్సిల్ ఏర్పడినది. అదే విధంగా 1784వ సం॥లో చేసిన పిట్స్ ఇండియా చట్టము కూడా మరింత కేంద్రీకృత పాలనకు దోహదము చేసినది. ఈ చట్టము ప్రకారము ఇంగ్లండులో ఒక 'నియంత్రణ బోర్డు' (Board of Control) ఏర్పాటు చేయబడినది. దీనిలో 6 గురు సభ్యులుంటారు. కంపెనీకి సంబంధించిన సివిల్, మిలటరీ, రెవిన్యూ వ్యవహారాలను పర్యవేక్షించే

అధికారము ఈ బోర్డుకుంటుంది. ఈస్టిండియా కంపెనీ యొక్క 'సంచాలకుల కోర్టు' (Court of Directors) కేవలము నామమాత్రపు సంస్థగా మిగిలిపోయింది. మద్రాసు, బొంబాయి రాష్ట్రాలపై గవర్నర్ - జనరల్ అధికారాలు విస్తృతమైనవి. అదే విధముగా 1833 చార్టరు చట్టము బెంగాల్ గవర్నరు - జనరల్ హోదాను భారత గవర్నర్ - జనరల్‌గా మార్చి మరింతగా కేంద్రీకృత పాలనను ప్రవేశపెట్టినది. ఆ తరువాత 1857వ సం॥లో జరిగిన సిపాయిల తిరుగుబాటు వలన 1858వ సం॥లో భారత ప్రభుత్వ చట్టాన్ని రూపొందించవలసి వచ్చినది. ఈ చట్టము వలన భారత దేశ పరిపాలన కంపెనీ నుండి రాజమకుటానికి (Crown) బదిలీ చేయబడి, భారత వ్యవహారాల కార్యదర్శి (Secretary of State for India) అనే పదవి ఏర్పాటయినది. ఫలితంగా అంతకు ముందున్న బోర్డు ఆఫ్ కంట్రోలు, డైరెక్టర్ల కోర్టులు రద్దయి, వాటి అధికారాలు భారత వ్యవహారాల కార్యదర్శికి బదిలీ చేయబడినాయి. అంతేగాక 1915లో చేయబడిన ఏకీకరణ చట్టము (Consolidation Act of 1915) కూడా కేంద్రీకృత పాలనా వ్యవస్థను మరింత బలపడేటట్లు చేసినది. అయినప్పటికీ పరిపాలనలో కొంతవరకు భారతీయులకు భాగస్వాములను చేయుటకు కూడా కొన్ని ప్రయత్నాలు జరిగినవి. ముఖ్యంగా 1919 మాంటేగు - ఛేమ్స్ ఫర్డు సంస్కరణల చట్టము కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య అధికార విభజన చేసినది. అంతేగాక ప్రాంతీయ ప్రభుత్వాలకు కొంతవరకు వాటికి సంబంధించిన అంశాలలో స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించినది. అయినప్పటికీ భారతదేశ వ్యవహారాల కార్యదర్శి శక్తివంతమైన అధికరిగా కొనసాగినాడు. ఈ విధంగా బ్రిటీష్ వారు భారతదేశంలో కేంద్రీకృత పాలనను నెలకొల్పినారు.

### 2.4.2 విస్తృతమైన రాజ్య వ్యవస్థ :

ప్రారంభంలో తూర్పు ఇండియా కంపెనీ కేవలము రెండు శాఖల లేదా కమిటీల సహాయంతో పనిచేసేది. అవి సెలక్ట్ కమిటీ మరియు రహస్య కమిటీలు. కానీ ఆ తరువాత పబ్లిక్ శాఖ, వాణిజ్య శాఖలు ఏర్పడినవి. కానీ 1772వ సం॥లో సెలక్ట్ కమిటీ స్థానంలో రెవిన్యూ బోర్డు ఏర్పాటైనది. ఆ తరువాత 1774లో సైనిక శాఖ ఏర్పాటైనది. ఈ విధంగా అవసరాల కనుగుణముగా అనేక శాఖలను ఏర్పాటే చేయవలసి వచ్చినది. ఫలితంగా 1945వ సం॥ నాటికి కేంద్రంలో శాఖల సంఖ్య 19కి పెరిగినది. ఈ విధంగా బ్రిటీష్ ప్రభుత్వము విస్తృతమైన రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేసినది.

### 2.4.3 ప్రాంతీయ ప్రభుత్వాలు :

వర్తక, వ్యాపారాల కొరకు మన దేశానికి వచ్చిన బ్రిటీష్ వారు ఇక్కడ వున్న రాజకీయ అనైక్యతను ఆధారముగా చేసుకొని భూభాగములను ఆక్రమించుచూ క్రమేణా భారత దేశమునంతటిని తమ ఆధీనంలోనికి తెచ్చుకొనినారు. మొదట బొంబాయి, మద్రాసు, కలకత్తా, ప్రెసిడెన్సీలను ఏర్పాటు చేసినారు. కానీ అవి చాలా చిన్న ప్రదేశాలు, కానీ కాలక్రమేణా కంపెనీ కొత్త ప్రదేశాలను సంపాదించి వాటిని ఈ మూడు ప్రెసిడెన్సీలలో ఏదో ఒక దానిలో విలీనము చేయటము జరిగినది. కానీ ఆ తరువాత కంపెనీ ఎక్కువ భూభాగాలను సంపాదించటంతో నూతన రాష్ట్రాలను ఏర్పాటు చేయవలసిన అవసరము ఏర్పడినది. 1919 చట్టము రూపొందించే సమయము నాటికి మద్రాసు, బొంబాయి, కలకత్తా, సంయుక్త పరగణాలు, పంజాబ్, బీహార్, ఒరిస్సా, బర్మాలు లేఫ్టినెంట్ గవర్నర్లు అధీనంలోని రాష్ట్రాలుగా ఉండేవి. అస్సాము, మధ్య పరగణాలు చీఫ్ కమీషనరుల అధీనంలోని రాష్ట్రాలుగా ఉండేవి. 1919 చట్టము పాలనా విషయాలను కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య విభజించినది. అంతేగాక ఈ చట్టము ప్రాంతీయ ప్రభుత్వాలలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, అవి నిర్వహించుకొనే వ్యవహారాలలో కొంత వరకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించినది. కానీ ఇది మన దేశ నాయకులను సంతృప్తి పరచలేదు. 1935 భారత ప్రభుత్వ చట్టము క్రింద 11 గవర్నర్ రాష్ట్రాలున్నాయి. ఈ చట్టము రాష్ట్రాలలోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి వాటికి కొంతవరకు స్వయంపాలనాధికారము కల్పించి బాధ్యతాయుత ప్రభుత్వ విధానమును ఏర్పాటు చేసినది. ఈ చట్టము పాలనాంశాలను మూడు జాబితాలుగా విభజించినది. అవి 1. సమాఖ్య జాబితా 2. రాష్ట్ర జాబితా 3. ఉమ్మడి జాబితా. ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగినటువంటి దాదాపు 54 పాలనాంశాలు రాష్ట్ర జాబితాలో చేర్చబడినాయి. వీటిపై చట్టము చేసే అధికారము పూర్తిగా రాష్ట్ర

ప్రభుత్వాలకుంటుంది. అంతేగాక ప్రజల చేత ఎన్నుకొనబడిన మంత్రుల సలహా ననుసరించి గవర్నర్ రాష్ట్ర పరిపాలనను నిర్వహించవలసి ఉంటుంది. దీనినే రాష్ట్రాల స్వయంపాలన (Provincial Autonomy) అని అంటారు. ఈవిధముగా 1919 చట్టముతో పోల్చి చూచినట్లయితే 1935 భారత ప్రభుత్వ చట్టము రాష్ట్రాలకు అధిక స్వయం ప్రతిపత్తిని కల్పించినది. స్వాతంత్ర్యము పొందే నాటికి A, B, C అనే మూడు తరగతుల రాష్ట్రాలు, D తరగతికి చెందిన కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి.

తూర్పు ఇండియా కంపెనీ పాలక వర్గము యొక్క అనుమతితో 1786వ సం॥లో మొట్ట మొదటిసారిగా మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ బోర్డు ఏర్పాటు చేయుట జరిగినది. ప్రారంభంలో ఈ బోర్డు న్యాయపాలనతో సహా, పాలనా పరమైన కొన్ని బాధ్యతలను కూడా నిర్వహించేది. 1956 సం॥లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు అంతకు పూర్వము ఉన్న హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాలలోని రెవిన్యూ బోర్డులను సమైక్యపరచి ఒక ప్రత్యేక రెవిన్యూ బోర్డును ఏర్పాటు చేసినారు. కానీ ఈ బోర్డు జాప్యమునకు, అసమర్థతకు, నిలయమైనదని భావించుటతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 1977 ఫిబ్రవరిలో బోర్డును రద్దు చేసి దీని స్థానంలో ఆరుగురు కమీషనర్లను నియమించినది.

**2.4.4 జిల్లా పాలన :**

బ్రిటీష్ పాలనా కాలంలో రాష్ట్రాలు చాలా పెద్దవిగా ఉన్నందువలన వలస పాలకులు పెద్ద మొత్తంలో భూమి శిస్తును వసూలు చేయుటకు ఆనాటి రాష్ట్రాలను అనేక జిల్లాలుగా విభజించినారు. జిల్లా పరిపాలక అధికారిని 'కలెక్టరు' అని అందురు. ఈ కలెక్టరు పదవి 1772వ సం॥లో ఏర్పాటు చేయబడినది. నాటి నుండి మొత్తము పాలనా వ్యవస్థలో జిల్లా ఒక ప్రధాన యూనిట్‌గా గుర్తించబడినది. అయితే జిల్లా కలెక్టరు కార్యాలయము ప్రసిద్ధిచెందుటకు దోహదము చేసిన వ్యక్తి వారన్ హేస్టింగ్స్ అని చెప్పవచ్చును. భూమిశిస్తు వసూలుచేసే అధికారి కాబట్టి అతనికి కలెక్టరు అనే పేరు స్థిరపడిపోయింది. కానీ నేడు అతడు నిర్వహిస్తున్న అనేక విధులను పరిశీలించినట్లయితే భూమిశిస్తు వసూలు చాలా స్వల్పమైన విషయమైనది. నేడు కలెక్టరు రెవిన్యూ విధులు, పోలీసు విధులు, పంచాయితీరాజ్ సంస్థలకు సంబంధించిన విధులతో తనమునకలై ఉన్నాడు. బ్రిటిష్‌వారు ఏర్పరచిన ఈ కలెక్టర్ల వ్యవస్థే నేటికీ కొద్ది మార్పులతో కొనసాగుచున్నది.

**2.4.5 సమన్వయపాలన :**

బ్రిటిష్ పాలనా కాలములోని మరొక ముఖ్య లక్ష్యము దేశంలో 'సమన్వయపాలన' ను ప్రవేశపెట్టుట అని చెప్పవచ్చును. 19 - 20 శతాబ్దాల మధ్య కాలంలో ప్రపంచమంతటా వ్యాపించిన ఉదార భావాల ఫలితముగా మన దేశంలో సమన్యాయపాలనను ప్రవేశపెట్టవలసి వచ్చినది. ఇంతకు ముందున్న ప్రభుత్వాల మాదిరిగా కాక శాసనాల క్రోడీకరణ జరిగి, ప్రభుత్వాల అధికార దుర్వినియోగము చేయకుండా బ్రిటిష్‌వారు ప్రభుత్వాన్ని స్థాపించారు. ఈ విధంగా బ్రిటిష్‌వారు మన దేశంలో 'సమన్వయ పాలన' ను ప్రవేశపెట్టినారు.

**2.4.6 వ్యవస్థీకృత సివిల్ సర్వీసు :**

తూర్పు ఇండియా కంపెనీ తన ప్రయోజనాల పరిరక్షణకు, రెవిన్యూలను పెంచుకోవడానికి ఒక సంస్థాపరమైన సివిల్ సర్వీస్ యొక్క ఆవశ్యకతను గుర్తించినది. 1854వ సం॥లో లార్డ్ మెకాలే అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కమిటి సివిల్ సర్వీసు పదవుల భర్తీకి పోటీ పరీక్షలు నిర్వహించాలని సూచించినది. ఫలితంగా 1861వ సం॥లో ఇండియన్ సివిల్ సర్వీసుల చట్టము ఆమోదించబడినది. ఈ సర్వీసుకు చెందిన అధికారులు కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వములలో చాలా కీలకమైన పదవులు నిర్వహించేవారు. అంతేగాక జిల్లా మరియు హైకోర్టు జడ్జీలుగా కూడా వీరు నియమించబడేవారు. ఈ సివిల్ సర్వీసు రాష్ట్రాలపై కేంద్రానికుండే ఆధిపత్యానికి, ప్రాంతీయ సమగ్రతకు ఉపయోగపడేది. ముఖ్యంగా ఈ సివిల్ సర్వీసులు భారతదేశంలో సామ్రాజ్యవాద పాత్రను సంఘటితము చేయుటలో ప్రధాన పాత్ర వహించేవి. అందువల్ల వీనిని భారతదేశంలో

బ్రిటిష్ పాలనకు ఉక్కు కవచమని చెప్పుటలో ఆశ్చర్యపడవలసిన అవసరము లేదు. అత్యున్నత సివిల్ సర్వీసులల విషయాలపై తగు సూచన లిచ్చేందుకు నియమించబడిన 'ఆచిసన్ కమీషన్' (Aitchison Commission), 1888వ సం॥లో 1924 సం॥లో నియమింపబడిన లీ కమీషన్ (Lee Commission) పరిపాలనకు సంబంధించిన ఉన్నత పదవులలో 20 శాతం రాష్ట్ర సివిల్ సర్వీసులలోని వారికి పదోన్నతిని కల్పించుట ద్వారాను, మిగిలిన 80 శాతం ఉద్యోగాలలో యూరోపియనులకు ప్రత్యక్ష భర్తీ పద్ధతి ద్వారా నియమించవలెనని సిఫారసు చేసినది. ఈ కమీషన్ సిఫారసుల ఆధారమునే 1926వ సంవత్సరములో మొట్టమొదటిసారిగా కేంద్ర పబ్లిక్ సర్వీసు కమీషన్ ఏర్పాటైనది. 1935 భారత ప్రభుత్వ చట్టము ప్రకారము ఈ కమీషన్ పేరు సమాఖ్య పబ్లిక్ సర్వీసు కమీషన్‌గా మార్పు చేయబడినది. అంతేకాక ఈ చట్టము రాష్ట్రాల స్థాయిలలో ప్రత్యేకముగా రాష్ట్ర పబ్లిక్ సర్వీసుల కమీషన్ ఏర్పాటుకు దారి తీసినది. 1947వ సం॥లో మన దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత ఈ పబ్లిక్ సర్వీసు కమీషన్‌లకు నూతన రాజ్యాంగములో ఒక ప్రత్యేక స్థానము కల్పించబడినది. నూతన రాజ్యాంగము కేంద్రానికి ఒక పబ్లిక్ సర్వీసు కమీషన్‌ను, రాష్ట్రాలకు ప్రత్యేకముగా రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమీషనులను ఏర్పాటు చేసినది.

### 2.4.7 స్థానిక సంస్థలు :

1857 వ సం॥లో జరిగిన సిపాయిల తిరుగుబాటు బ్రిటిష్ పాలకుల యొక్క ఆలోచనా విధానములో చాలా మార్పులను తీసుకొని వచ్చినది. ప్రజలలో పెరిగిన అసమ్మతిని, అసంతృప్తిని తొలగించడానికి ప్రభుత్వము అనేక చర్యలను చేపట్టినది. వాటిలో ప్రజలను పరిపాలనలో భాగస్వాములను చేయడానికి స్థానిక సంస్థలను ఏర్పాటు చేయుట ఒకటి అని చెప్పవచ్చును. అయితే బ్రిటిష్ పాలనా కాలంలో స్థానిక సంస్థలు ఏర్పాటు చేసిన ఘనత గవర్నర్ జనరల్ లార్డ్ మేయోకు దక్కుతుంది. లార్డ్ మేయో (Mayo) తన ఆర్థిక వికేంద్రీకరణలో భాగముగా ప్రజలు తమ గ్రామాల, పట్టణాభివృద్ధికి కవసరమైన ధనాన్ని పన్నుల రూపంలో సేకరించి, ఆ ధనాన్ని సక్రమంగా వినియోగించుకోడానికి ప్రభుత్వాధికారుల పర్యవేక్షణలో పనిచేసే స్థానిక సంస్థలను ఏర్పాటు చేయవలెనని 1870వ సం॥లో ఆమోదించిన ఒక తీర్మానంలో ప్రకటించుట జరిగినది. దీనివలవ ప్రభావము చెందిన కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పట్టణాలలో పురపాలక సంఘాలను ఏర్పాటు చేసినాయి. ఆ తరువాత 1882 సం॥లో స్థానిక ప్రభుత్వాలలపై నాటి గవర్నర్ జనరల్ లార్డ్ రిప్పన్ జారీ చేసిన తీర్మానము స్థానిక స్వపరిపాలనా చరిత్రలో ఒక ప్రధాన ఘట్టముగా అభివర్ణించవచ్చును. ఈ తీర్మానము కేవలము ప్రభుత్వ పరిపాలనను మెరుగు పరచుటయే గాక, ప్రజలకు రాజకీయ, లౌకక పరమైన విజ్ఞానమును పెంపొందించుటకు స్థానిక ప్రభుత్వము ఒక పరికరముగా ఉండవలెనని అభిప్రాయపడింది. అంతేకాక స్థానిక సంస్థలలో అనధికారుల సంఖ్య ఎక్కువగా ఉండవలెనని ఈ తీర్మానము గుర్తించినది. ఇది ప్రభుత్వ విధానములో వచ్చిన ఒక గొప్ప మార్పు. అందుచేతనే రిప్పను ప్రభువును భారత దేశంలో స్థానిక స్వపరిపాలనకు మూల పురుషునిగా, పితగా అభివర్ణించుట జరిగినది. ఈ తీర్మానము ఫలితంగా 1882 - 84 సం॥ల మధ్య కాలంలో వివిధ రాష్ట్రాలు అనేక చట్టాలను రూపొందించినాయి. ఫలితంగా దేశమంతటా పురపాలక సంఘాలు, జిల్లా బోర్డులు, తాలూకా బోర్డులు ఏర్పడినాయి. ఇవి వృత్తి పన్ను, ఇంటిపన్ను మొదలగు వాటిద్వారా వచ్చే ఆదాయంలో ప్రజలకు అనేక సౌకర్యాలను కలుగజేసినవి.

1919 చట్టము స్థానిక సంస్థల శాఖను రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించి, దానికి ఒక మంత్రి అజమాయిషీలో ఉంచి, వీటిపై ప్రజాప్రతినిధుల యొక్క పాత్రను విస్తరింపజేసినది. 1935 భారత ప్రభుత్వ చట్టము ఏర్పాటుతో స్థానిక సంస్థలు వేగము పుంజుకొని, స్వాతంత్ర్యము వచ్చిన తరువాత సంపూర్ణ స్థానిక సంస్థల స్థాపనకు కృషి జరిగినది. ఆ తరువాత నూతన రాజ్యాంగము ద్వారా స్థానిక స్వపరిపాలన కొరకు దేశమంతటా గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేయవలెనని ఆదేశ సూత్రాలలో స్పష్టముగా చెప్పటము జరిగినది. ఫలితంగా 1952 సం॥లో దేశవ్యాప్తంగా సమాజాభివృద్ధికి పథకాలను (Community Development Programmes) ఏర్పాటు చేయుట జరిగినది. కానీ అవి ఆశించిన మేరకు సరియైన సత్ఫలితాలు యివ్వక పోవటంతో వాటివ్యవహారాలను పరిశీలించడానికి 1956వ సం॥లో భారత ప్రభుత్వము బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతను ఒక కమిటీని

నియమించినది. ఈ కమిటీ సమగ్ర గ్రామీణాభివృద్ధికి మూడంచెలతో కూడిన పంచాయితీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయవలెనని సూచించినది.

**2.4.8 న్యాయ వ్యవస్థ :**

బ్రిటిష్‌వారు తమ పాలనాకాలంలో వేర్వేరు స్థాయిలలో సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలను ఏర్పాటు చేసి ఒక నూతన న్యాయవ్యవస్థను నెలకొల్పినారు. ఈ వ్యవస్థకు పునాదులు వేసినది వారన్ హేస్టింగ్స్ అయినప్పటికి దీనిని మెరుగుపరచిన గవర్నరు - జనరల్ కారన్ వాలీస్ అని చెప్పవచ్చును. దీని ప్రకారము గ్రామస్థాయిలో గ్రామన్యాయ స్థానాలుండేవి. న్యాయాధికారులు భారతీయులే. జిల్లా స్థాయిలో సివిల్ మరియు క్రిమినల్ న్యాయస్థానాలుండేవి. రాష్ట్రాల స్థాయిలలో నాలుగు సంచార న్యాయస్థానాలను (Circuit Courts) ఏర్పాటు చేసినారు. ఇందులోని న్యాయమూర్తులు సంవత్సరమునకు 2 సార్లు జిల్లాలలోని శాంతిభద్రతలను పరిశీలించి, సివిల్, క్రిమినల్ వివాదాలను పరిష్కారము చేసేవారు. దీనిపై కలకత్తాలోని గవర్నర్ జనరల్ అధ్యక్షతన ఉన్న 'సాదర్ దివానీ అదాలత్' సివిల్ వివాదములను, గవర్నర్ జనరల్ కౌన్సిల్ అధ్యక్షతన ఉన్న 'సాదర్ నిజామత్ అదాలత్' క్రిమినల్ న్యాయవివాదాలను పరిష్కారము చేసేవి. వీటి తీర్పులపై లండన్‌లోని 'ప్రీవి కౌన్సిల్' కు అప్పీలు చేసుకొనవచ్చును. న్యాయ విషయాల శిక్షాస్మృతిని (Penal Code) T.B. మెకాలే ప్రవేశపెట్టినాడు. దీనిని 1860వ సం॥ నుండి అమలు పరచినారు. నేడు మనము అనుసరిస్తున్న సివిల్ మరియు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు ఇదే ప్రధాన మూలాధారమైనది.

**2.5 ముగింపు :**

ఈ విధంగా వ్యాపార నిమిత్తము భారతదేశానికి వచ్చిన బ్రిటిష్‌వారు దేశమును ఆక్రమించి క్రమేణా కొన్ని పాలనా సంస్థలను ఏర్పాటు చేసినారు. వీరు ఏర్పాటు చేసిన పాలన సంస్థలకు సంబంధించిన అవశేషాలే నేటికీ మనదేశంలో కొద్దిపాటి మార్పులతో కొనసాగుతున్నాయి. వీటినే మనము బ్రిటిష్ కాలంలోని పాలన లక్షణాలుగా పేర్కొనవచ్చును.

**మాదిరి ప్రశ్నలు :**

**వ్యాసప్రశ్నలు :** ఈ క్రింది వాటికి ఐదు పుటలు మించని సమాధానములు వ్రాయుము

1. బ్రిటిష్ కాలంలోని పాలనా లక్షణములను సవివరముగా వ్రాయుము.
2. ఈస్ట్ ఇండియా కంపెనీ నుండి 1857 చట్టం దాకా పాలనా లక్షణములను వ్రాయుము

**కుశాగ్ర బుద్ధి ప్రశ్నలు :**

1. రెగ్యులేటింగ్ చట్టము
2. సిపాయిల తిరుగుబాటు
3. 'భారత వ్యవహారాల కార్యదర్శి'
4. బ్రిటీష్ పాలనలో స్థానిక సంస్థలు
5. 1857వ చట్టము
6. సమన్యాయ పాలన

**చదువవలసిన గ్రంథాలు :**


1. యస్.ఆర్. మహేశ్వరి - ఇండియన్ అడ్మినిస్ట్రేషన్
2. పి. సత్యనారాయణ & బి. జగదీశ్వరరావు - భారతదేశ పాలనా వ్యవస్థ తెలుగు అకాడమీ
3. యస్.కె. చటర్జీ - ఇండియన్ అడ్మినిస్ట్రేషన్


రచయిత : **నీలకంఠం వెంకటేశ్వర్లు**

పాఠం - 3

# స్వాతంత్ర్యకాలములో భారతదేశ పరిపాలన వ్యవస్థ కొనసాగింపు - మార్పులు

విషయసూచిక

3.0 లక్ష్యం
3.1 ఉపోద్ఘాతం
3.2 ఆనాటి భారతదేశ పాలనా బాధ్యత - ఎదుర్కొన్న సమస్యలు
3.3 మార్పులు, కూర్పులతో అవిచ్ఛిన్నంగా కొనసాగిన పాలన వ్యవస్థ
3.4 ప్రభుత్వ పాలనలో వచ్చిన మార్పులు
3.5 కేంద్రీకృత లక్షణాలు గల సమాఖ్య పరిపాలన విధానం
3.6 సమన్వయ పాలన - ఏకీకృత న్యాయవ్యవస్థ
3.7 ఆల్ ఇండియా సివిల్ సర్వీసులను - అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులుగా మార్చుట
3.8 అధికార వికేంద్రీకరణ - స్థానిక స్వపరిపాలన సంస్థల కొనసాగింపు - పంచాయితీరాజ్ సంస్థల స్థాపన
3.9 జిల్లా పాలనా వ్యవస్థ - కలెక్టరు పాత్ర
3.10 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు

## 3.0 లక్ష్యం :

విద్యార్థులకు భారతదేశ స్వాతంత్ర్యమునకు పూర్వము, తరువాత కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాల నిర్మాణములో, నిర్వహణలో వచ్చిన మార్పులను తెల్పి, ప్రస్తుతము దేశములో కొనసాగుతున్న పరిపాలనను గురించి తెలియచేయుట.

## 3.1 ఉపోద్ఘాతం :

భారతదేశ పాలన స్వాతంత్ర్యకాలము నాటికి అనేక అంతర్జాతీయ మార్పులకు, స్వదేశీ రాజకీయ ప్రభావమునకు లోనైనది. రెండవ ప్రపంచయుద్ధంలో బలహీనపడ్డ బ్రిటిష్ వారికి 1947 ఆగస్టు 15 నాటికి మన దేశానికి స్వాతంత్ర్యము ఇవ్వక తప్పలేదు. స్వాతంత్ర్య సముపార్జనతో భారతదేశములో సుమారు రెండు వందల సంవత్సరముల వలస పాలన అంతమైనది. బ్రిటిష్ ప్రభుత్వము స్వప్రయోజనాలకు ఉద్దేశించిన అనుసరించిన ఉదారభావ సూత్రాలు భారత సమైక్యత పై దెబ్బతీయుటకు అనుసరించిన విభజించు పాలించు పద్ధతి బ్రిటిష్ ఇండియా పాలనా వ్యవస్థను సుస్థిరము, సంస్థాపితము చేసింది. కాని ఈ పద్ధతులు భారతదేశ రాజకీయ పరిస్థితులపైన, తద్వారా సామాజిక వ్యవస్థపైన ప్రభావాన్ని చూపినవి. అవిభక్త ఇండియా నుండి పాకిస్తాన్ చీలిపోవడమే కాక ప్రజలు, మతం, కులం ప్రాతిపదికన విభజనకులోనై ప్రస్తుత సాంఘిక, సామాజిక అశాంతికి లోనుకావటానికి బ్రిటిష్‌వారు అవలంభించిన కుటిల రాజకీయ నీతి చాలా వరకు కారణము.

## 3.2 ఆనాటి భారతదేశ పాలనా బాధ్యత :

దేశానికి స్వాతంత్ర్యము వచ్చే నాటికి, 1946 సెప్టెంబరు 2వ తేదీన పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఉపాధ్యక్షునిగా ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వము అధికారంలో ఉంది. ముస్లింలీగు సభ్యులు ఈ ప్రభుత్వములో చేరినప్పటికీ ప్రత్యేక పాకిస్తాన్ ఏర్పాటు ఉద్దేశ్యంతో దానితో సహకరించలేదు.

### తాత్కాలిక ప్రభుత్వము ఎదుర్కొన్న సమస్యలు :

దేశ స్వాతంత్ర్యము అత్యంత ఆనందదాయకమైనప్పటికీ జాతిపిత గాంధీ మహాత్ముడితో పాటు అనేక మంది జాతినాయకులకు రెట్టింపుగా కలవరపరచిన మతకలహాలు, మారణహోమం, దేశ విభజనలు పరోక్షంగా ఆనాటి పాలనా వ్యవస్థ భారాన్ని ద్విగుణీకృతము చేసినవి. ఈ క్రింది సమస్యలు ప్రధానమైన సవాలుగా నిలిచినవి. 1. శరణార్ధులకు పునరావాసం 2. బెంగాల్, బీహార్ మొదలగు రాష్ట్రాలలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొనుట 3. 500 స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయుట 4. కాశ్మీర్ సమస్య వలన ఏర్పడిన యుద్ధ పరిస్థితి ఎదుర్కొనుటకు పాలనా వ్యవస్థ యుద్ధ సన్నాహాలు చేయుట 5. ఉన్నత కార్యనిర్వాహణ బాధ్యత నిర్వహించుచున్న యూరోపియన్ అధికారులు మూకుమ్మడిగా వారి స్వదేశానికి తరలి వెళ్ళగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసి పౌరజీవితము స్థంభించకుండా చూచుట.

## 3.3 మార్పులు - కూర్పులతో అవిచ్ఛిన్నముగా కొనసాగిన పాలనా వ్యవస్థ :

సుమారు రెండు వందల సంవత్సరాలు వలస పాలనలో మగ్గి, 1857 సిపాయిల తిరుగుబాటుని మొట్టమొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామముగా పరిగణించినట్లైతే సుమారు 100 సం॥ల జాతీయోద్యమం తరువాత సంపాదించిన స్వాతంత్ర్యము దేశపాలనా వ్యవస్థలను తీర్చిదిద్ద వలసిన అవసరం ఎంతైనా ఏర్పడింది. కాని భారతీయులు సాంప్రదాయ వాదులు కనుక వలస పాలకులు ఏర్పాటు చేసిన పాలనా వ్యవస్థలనే దేశకాల పరిస్థితులకనుగుణంగా మార్చి కొనసాగించారు. అయితే బ్రిటీషువారి పాలనా వ్యవస్థలోని సుగుణాలను కొనియాడక తప్పదు. వీనిలో 1. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ 2. కేంద్రీకృత లక్షణములు గల సమాఖ్య పరిపాలనా విధానము 3. ఏకీకృత న్యాయవ్యవస్థ, సమన్యాయ పాలన 4. ఆల్ ఇండియా సివిల్ సర్వీసులను అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులుగా మార్చుట 5. అధికార వికేంద్రీకరణము - స్థానిక సంస్థల కొనసాగింపు - పంచాయితీ రాజ్ సంస్థల స్థాపన 6. జిల్లా పాలన - కలెక్టరు నిర్వహించు పాత్ర మొదలగు వాటిని వివరంగా పరిశీలిద్దాం.

## 3.4 ప్రభుత్వ పాలనలో వచ్చిన మార్పుల వివరణ :

### 1. పార్లమెంటరీ ప్రభుత్వ విధానము :

బ్రిటీషు వలస ప్రభుత్వం భారత దేశాభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి పాటుపడలేదు. కాని భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన వెలువడక ముందే భారత రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగ రచనకు పూనుకుంది. 1946వ సం॥ డిశంబరు 9వ తేదీన భారతరాజ్యాంగ పరిషత్తు తొలి సమావేశం గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ ఆదేశానుసారం జరిగింది. 296 మంది మొత్తం సభ్యుల్లో, కులమత వర్గాల ప్రాతినిధ్యం ప్రకారం 211 మంది (ముస్లిం లీగ్ పూర్తి బహిష్కరణతో) హాజరైయ్యారు. వీరిలో 82 శాతం కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం కాబట్టి భారత రాజ్యాంగ పరిషత్ కాంగ్రెస్ పార్టీ పరిషత్తుగా విమర్శకు గురి అయింది. డా॥ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడుగా డిశంబరు 11, 1946వ సం॥ జరిగిన తొలి రాజ్యాంగ పరిషత్ సమావేశంలో సహకార ప్రాతిపదికపై భారత దేశం కామన్వెల్తు రాజ్యం కావాలని; కుల, మత వర్గరహిత సమాజం ఏర్పడే దశలో పయనించే ప్రభుత్వ నిర్మాణం ఏర్పాటు జరిగే విధంగా రాజ్యాంగ రచన తన ఆకాంక్షయని తెలియజేశారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగ ఆశయాలను లక్ష్యాలను తన తీర్మానంలో ప్రతిపాదిస్తూ

భారత ప్రజలందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, చట్టరీత్యా సమానత్వాన్ని, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా చట్టబద్ధమైన పరిమితులలో పౌరులందరికీ స్వేచ్ఛను కల్పించడానికి హామీ ఇస్తుందని తెలియ చెప్పారు. భారత ప్రజలకు ప్రజాస్వామ్య, అల్ప సంఖ్యాకులకు వెనుకబడిన తరగతులకు, తెగలకు, అణగారిన వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తూ, ప్రపంచ దేశాలలో గౌరవస్థానాన్ని పొంది, ప్రపంచంలో శాంతి కాముక దేశంగా భారతదేశం తన రాజ్యాంగాన్ని రూపొందించి 1950 జనవరి 26వ తేది నుండి భారత పాలనా వ్యవహారాలను నిర్వహించడం జరిగింది. రాజ్యాంగ రచనలో డా॥ అంబేద్కర్ పాత్ర ప్రముఖమైంది.

పార్లమెంటరీ (ప్రజాస్వామ్య) ప్రజాప్రతినిధుల ప్రభుత్వవ్యవస్థలో, ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రతినిధులు (పార్లమెంటు) తిరిగి ప్రజలకు బాధ్యత వహించి ప్రజలకు విశ్వాసమున్నంతకాలమే ప్రజల నియంత్రణలో అధికారంలో ఉంటారు. రాజకీయ పార్టీలు లేకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణము జరగదు. జాతీయోద్యమంలో ప్రధాన పాత్ర వహించిన భారత జాతీయ కాంగ్రెస్ ఒక గొప్ప రాజకీయ పార్టీగా రూపొందింది. దాని నాయకత్వంలో కేంద్రంలో, రాష్ట్రాలలో ఏక పార్టీ పాలన ఏర్పడింది. పార్లమెంటు (శాసనసభ), మంత్రిమండలి (కార్యనిర్వాహక వర్గం) పాలనపై తమ అధికారాన్ని, నియంత్రణను కలిగి ఉంటుంది. భారతదేశంలో స్వాతంత్ర్యం తరువాత ఉద్యోగి స్వామ్యం (ప్రభుత్వ అధికారులకు చెందిన అధికారం) కేంద్ర రాష్ట్రాలలో ఏకపార్టీ పాలనా ప్రాబల్యానికి గురైందని, తద్వారా ఉద్యోగులు స్వప్రయోజిత సంబంధాలను ఏర్పరచుకొని, సాంఘిక, సంక్షేమ విధానాలను చిత్తశుద్ధితో అమలు చేయటం లేదన్న విమర్శ కూడా ప్రబలంగా ఉంది. అయితే పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో ప్రభుత్వాలను మార్చటం ఓటర్ల చేతుల్లో ఉంది కాబట్టి ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజల అప్రమత్తత ప్రభుత్వాన్ని, ఉద్యోగస్వామ్యాన్ని, చురుకుగా లక్ష్యసాధనకు కృషికి పాటుపడేలా చేస్తుంది.

## 3.5 కేంద్రీకృత లక్షణాలు గల - సమాఖ్య పరిపాలనా విధానం :

భారత రాజ్యాంగములో ఎక్కడ 'సమాఖ్య' అనే పదము వాడబడనప్పటికి భిన్నత్వం ఉన్న ప్రజాసముదాయాన్ని సమైక్యం చేయడానికి సమాఖ్య పరిపాలనా విధానమే సరియైనదని రాజ్యాంగకర్తలు భావించారు. భిన్నత్వంలో ఏకత్వము సాధించడానికి కేంద్రీకృత లక్షణాలు గల సమాఖ్య కేంద్ర ప్రభుత్వ నిర్మాణము తప్పలేదు. కొన్ని సమాఖ్య లక్షణాలు గల ఏకకేంద్ర ప్రభుత్వ నిర్మాణ, నిర్వహణ ఉన్న మన రాజ్యాంగాన్ని 'అర్థ సమాఖ్య' గా కె.సి. వేర్ వర్ణించాడు. రాజ్యాంగరీత్యా విభజింపబడిన కేంద్ర జాబితాలోని అంశాలపై కేంద్ర పార్లమెంటుకు, రాష్ట్ర జాబితాలోని అంశాలపై రాష్ట్ర శాసనసభలకు శాసనాలు చేయు అధికారము యివ్వబడింది. ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్ర పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభలకు యిద్దరికి శాసనాలు చేయు అధికారమున్నప్పటికీ యీ రెండింటి మధ్య ఘర్షణ ఏర్పడితే పార్లమెంటు శాసనము అమలులోకి వస్తుంది. ఇది ఉమ్మడి అంశాలపై కేంద్ర అధికారము పెంచినది. దీనితో కేంద్ర పార్లమెంటు శాసనములు చేయు అంశాలు రెండితలైనవి. పైపెచ్చు అవశిష్టాధికారాలపై కేంద్రానికే పెత్తనము ఇవ్వబడింది. రాజ్యాంగ నిర్మాణవేత్తల అభిప్రాయంలో కేంద్రాన్ని బలపరచటమే అత్యవసరం. ప్రత్యేక పరిస్థితులలో పాటు జాతీయ ప్రయోజనాలు దృష్ట్యా కూడా రాష్ట్ర జాబితాలోని అంశాలపై కేంద్ర ప్రభుత్వ పెత్తనము ఏక కేంద్ర లక్షణాన్ని స్పష్టము చేస్తుంది.

లిఖిత, దృఢ, అత్యున్నత రాజ్యాంగము, కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వాలు, అధికార పంపిణీ, స్వతంత్ర న్యాయవ్యవస్థ, సమాఖ్య లక్షణాలు రాష్ట్రాలపై అధికార అధికారం గల కేంద్రం, కేంద్రంపై ఆధారపడక తప్పని రాష్ట్రాలు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్, రాష్ట్ర గవర్నర్ల కేంద్ర నియామక విధానము, రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధింపు, అత్యవసర పరిస్థితి ప్రకటన, సమైక్య న్యాయవ్యవస్థ, ఏకపౌరసత్వం, కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర రాష్ట్ర పద్దులను ఆడిట్ చేసే కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా, ఆర్థిక కమీషన్, ప్రణాళికా సంఘం ఏర్పాటు మొదలయినవన్నీ ఏక కేంద్ర లక్షణాలు. మన రాజ్యాంగం

సంపూర్ణ సమాఖ్యగాని, సంపూర్ణ ఏకకేంద్రం గాని కాదని, అది ఆ రెంటి కలయికేనని డాక్టరు బాసు పేర్కొన్నారు. డి.ఎన్. బెనర్జీ, ప్రొఫెసర్ మారిన్ జోన్స్, ఆస్టిన్, పాల్ ఆపిల్ బీల అభిప్రాయంలో ఈ రాజ్యాంగ నిర్మాణము భారతదేశాన్ని "సహకార సమాఖ్య"గా రూపొందించింది.

## 3.6 సమన్యాయపాలన - ఏకీకృత న్యాయవ్యవస్థ :

దుష్టశిక్షణ, శిష్టరక్షణకు న్యాయవ్యవస్థ ముఖ్యం. చట్టం దృష్టిలో కుల, మత, వర్గ, లింగ, ధనిక, పేద, ప్రాంతీయ, వ్యత్యాసాలు పాటించక ప్రజలందరూ సమానులు (Rule of Law) అన్నదే సమన్యాయపాలనా విధానం. ప్రజల స్వేచ్ఛా,స్వాతంత్ర్య, సమానత్వాల రక్షణతోపాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేది, ఇంగ్లీషువారు యావత్ ప్రపంచానికి నేర్పిన న్యాయపాలనా విధానాన్ని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా మనం అనుసరిస్తున్నాము. దేశానికి సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానంగా, దాని పాలనాపరమైన పర్యవేక్షణలో పనిచేసే రాష్ట్రాల హైకోర్టులు భారత న్యాయవ్యవస్థను ఏకీకృత లేదా సమీకృత (సంఘటిత) న్యాయపాలనా వ్యవస్థగా మార్చటం జరిగింది.

## 3.7 ఆల్ ఇండియా సివిల్ సర్వీసు - అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులుగా మార్చుట :

బ్రిటిష్ ఇండియా పాలనలో ఐ.సి.యస్. ఉద్యోగులు ఉన్నత కార్యనిర్వహణలో ప్రముఖ పాత్ర వహించారు. రాష్ట్ర గవర్నర్లు, జిల్లా కలెక్టర్లు, న్యాయమూర్తులు అందరూ యూరోపియన్లే. చాలా కొద్ది మంది భారతీయ మేధావులు మాత్రమే ఐ.సి.యస్. స్థాయికి ఎదుగగలిగారు. స్వాతంత్ర్యానంతరం యూరోపియన్ (I.C.S.) ఉద్యోగులందరు స్వదేశానికి తరలివెళ్ళగా, భారత రాజ్యాంగం సివిల్ సర్వీసు ఉద్యోగులకు భర్తీ చేయుటకు స్వతంత్ర ప్రతిపత్తి గల U.P.S.C. (Union Public Service Commission) ని, రాష్ట్రాలలో రాష్ట్రసర్వీసు కమీషన్ను ఏర్పాటు చేసింది. I.C.S. ను I.A.S. (Indian Administrative Service) గా మార్చి, కేంద్ర, రాష్ట్ర ఉన్నత ప్రభుత్వోద్యోగుల విధులలో, బాధ్యతలలో మన సమాజాభివృద్ధికి దోహదము చేయు అనేక మార్పులను సూచించటం జరిగింది. వీరు ప్రస్తుతము మన పాలనా వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో సాంఘిక, సంక్షేమ సమాజ పునఃనిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నారు.

## 3.8 అధికార వికేంద్రీకరణ - స్థానిక స్వపరిపాలన సంస్థల కొనసాగింపు - పంచాయితీరాజ్ సంస్థల స్థాపన :

భారతదేశ పరిపాలన నిమిత్తం బ్రిటిష్ పార్లమెంట్చే జారీచేయబడిన 1919వ సంవత్సరము, 1935వ సంవత్సరము భారత ప్రభుత్వ పరిపాలనా చట్టాలు తెచ్చిన పాలనా మార్పులు, బాధ్యతాయుత పాలన నేపధ్యంలో భారతీయులకు పాలనా వ్యవస్థలో భాగస్వామ్యాన్ని కల్పించినవి. భారతీయ మంత్రులు, శాసనమండలి సభ్యులకు ప్రభుత్వ యంత్రాంగంలో కలిసి పనిచేయుటకు అవకాశాన్ని కల్పించటంతోపాటు పాలనలో అనుభవాన్ని గడించిపెట్టినవి. చట్టరీత్యా, పదవీ బాధ్యత నిర్వహణలో, భారతీయుల స్థానం కొంత బలహీనమయినప్పటికి, సాంఘిక దురాచారాలను అరికట్టి స్థానిక స్వపరిపాలనా సంస్థల ఏర్పాటుకు పై చట్టాలు దోహదము చేసినవి. లార్డ్ మేయో, లార్డ్ రిప్పన్ తీర్మానాలు స్థానిక సంస్థల నిర్మాణ నిర్వహణకు తోడ్పడి లార్డ్ రిప్పన్ భారతదేశంలో స్థానిక సంస్థల పితామహుడుగా కొనియాడబడ్డాడు. కానీ నిజమైన అధికార వికేంద్రీకరణము జరుగలేదు.

భారత రాజ్యాంగ నిర్మాతలు ప్రజాస్వామ్య అధికార వికేంద్రీకరణ కృషిలో భాగంగా, రాజ్యాంగపు 40వ నిబంధనలో పంచాయితీరాజ్ సంస్థ ఏర్పాటును పేర్కొన్నారు. 1952లో సమాజాభివృద్ధికి వేసిన పథకాలు (Community Development Programmes), వాటిని సమీక్షించటానికి 1956లో నియమించబడిన బల్వంత్‌రాయ్ మెహతా కమిటి నివేదికను అనుసరించి మూడంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థ ప్రారంభించబడింది. పంచాయితీ రాజ్ వ్యవస్థను ప్రప్రధమంగా ప్రారంభించిన ఘనత

రాజస్థాన్ రాష్ట్రానికి చెందగా రెండవ రాష్ట్రము ఆంధ్రప్రదేశ్. 1859వ సంవత్సరములో ప్రారంభమయిన పంచాయితీ వ్యవస్థ గ్రామీణ స్థానిక ప్రభుత్వాల ద్వారా అధికార వికేంద్రీకరణ అభివృద్ధికి తోడ్పడినవి.

## 3.9 జిల్లా పాలనా వ్యవస్థ - కలెక్టరు పాత్ర :

భారతదేశంలో జిల్లా కలెక్టరు పదవి బ్రిటిష్ వారి కాలంలో ఏర్పడింది. 1772లో ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో భూమిశిస్తు వసూలుకు, రెవిన్యూ పాలనకు, శాశ్వతమైన, సుస్థిరమైన ఏర్పాటు నిమిత్తం ఈ పదవిని సృష్టించింది. బ్రిటిష్ పాలనకు భారతదేశంలో కలెక్టరు ఉక్కుచట్రం అని అభివర్ణించడం జరిగింది. జిల్లా పరిపాలనకు కలెక్టరు ప్రధాన కేంద్రం అయినాడు.

స్వాతంత్ర్యానంతరం కలెక్టరు పదవి అధికారంలో, బాధ్యతలలో, గణనీయంగా బలపడి కొనసాగించబడుతుంది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే బహిరంగ పోటీ పరీక్షల ద్వారా ఎంపికచేయబడ్డ వ్యక్తిని కలెక్టరుగా నియమించడం జరుగుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం, తరువాత కూడా మనదేశ పాలనకు జిల్లాయే ప్రధాన యూనిట్. కలెక్టరు జిల్లా పరిపాలనాధిపతి. భూమిశిస్తు పరిపాలనా వ్యవస్థలో కలెక్టరు కీలకపాత్ర నిర్వహిస్తాడు. శాంతి భద్రతలకు కూడా అతడు బాధ్యుడు. జిల్లాలోని పోలీస్ సిబ్బందిని అతని నియంత్రణ క్రిందనే ఉంచడం జరిగింది.

జిల్లా కలెక్టరు విధులు ఆరు శీర్షికలలో విభజింపబడినవి. అవి : 1. రెవిన్యూ విధులు, 2. శాంతి భద్రతల నిర్వహణ, 3. అభివృద్ధి విధులు, 4. పౌరసరఫరాల విషయంలో విధులు, 5. జిల్లా పరిపాలనాధిపతిగా విధులు, 6. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా విధులు.

### 3.9.1. రెవిన్యూ విధులు :

భూమిశిస్తు వసూలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టరు బాధ్యత వహిస్తాడు. ఈ విధి నిర్వహణలో రెవిన్యూ మండలాధికారులు, తహసిల్‌దార్లు, గ్రామాధికార్లు తోడ్పడతారు. తక్కావి ఋణాల పంపిణీ, వసూలు, భూమి రికార్డులను నిర్వహించటం, నియంత్రించడం రెవిన్యూ విధుల పరిధిలోనికి వస్తాయి. వ్యవసాయక గణాంకాలను సేకరించడం, వ్యవసాయ ఆదాయం, పన్నులను అంచనా వేసి వసూలు చేయడం, జిల్లాలోని ప్రభుత్వ ఆస్తులు, ఎస్టేట్లను నిర్వహించటం, పర్యవేక్షించటం కలెక్టరు బాధ్యతయే. ఈ విధుల నిర్వహణకు నియమించబడిన సిబ్బందిపై అజమాయిషీ కలెక్టరుదే.

### 3.9.2. శాంతిభద్రతల నిర్వహణ :

భారత రాజ్యాంగము కార్యనిర్వాహక వర్గం నుంచి న్యాయశాఖను వేరు చేయాలనే సిద్ధాంతానికే కట్టుబడి, రాష్ట్ర హైకోర్టు క్రింద వేరుగా పనిచేసే జిల్లా సెషన్సు కోర్టును ఏర్పాటు చేయడం జరిగింది. సెషన్సు జడ్జి జిల్లా న్యాయశాఖాధిపతి. దీనితో స్వాతంత్ర్యానంతరం జిల్లా కలెక్టరుకు న్యాయవిధులు తప్పినవి. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడుటకు కలెక్టరు పోలీస్ సిబ్బంది సహాయాన్ని పొందుతాడు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తదితర పోలీస్ సిబ్బంది జిల్లా కలెక్టరు నియంత్రణ క్రిందనే పనిచేస్తారు. జిల్లాలో అవసరమైనప్పుడు శాంతి భద్రతల ప్రయోజనాల దృష్ట్యా నిషేధాజ్ఞలకు, కాల్పులకు, కర్ఫ్యూ విధింపుకు ఆదేశాలను యివ్వడం; జిల్లా పరిధిలో ఉన్న విద్యాలయాలను, కళాశాలలను నిర్వహించటం; ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, శాంతి భద్రతల ముప్పు వాటిల్లినప్పుడు శెలవులను ప్రకటించటం జిల్లా కలెక్టరుకు ఉన్న అధికారాలు.

### 3. అభివృద్ధికి సంబంధించిన విధులు :

స్వాతంత్ర్యానంతరం మన ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతున్నది. జిల్లా కలెక్టరుకు ఈ అభివృద్ధికి సంబంధించిన బాధ్యతలను అప్పగించడం జరిగింది. గ్రామీణాభివృద్ధి గ్రామీణ పునర్నిర్మాణము కార్యక్రమాలకు పంచాయితీ రాజ్య వ్యవస్థలో, జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న స్థాయి సంఘాలకు ఎక్స్ - అఫీసియో సభ్యుడుగా కలెక్టరుకు ప్రధాన బాధ్యత ఉన్నది. జిల్లాకు సంబంధించిన పారిశ్రామిక, వ్యవసాయక, ప్రణాళికలను జిల్లా పరిషత్ ఛైర్మన్, జిల్లా అభివృద్ధి అధికార్లతో కలసి రూపొందించటంలోను, అమలుపరచే విషయంలోను కలెక్టరు ముఖ్య భూమికను నిర్వహిస్తాడు. కలెక్టరు వ్యవస్థను బలపరచవలసిన ఆవశ్యకతను ప్రణాళిక సంఘం కూడా నొక్కి చెప్పింది.

**4. పౌర సరఫరాలు :**

జిల్లాలో ప్రజలకు సరఫరా చేయబడుతున్న అత్యవసర వస్తువులు అనగా బియ్యం, పంచదార, వంటనూనెలు, కిరోసిన్ మొదలగునవి చౌకధర డిపోలకు సత్వరం, సక్రమంగా అందించి, సమర్ధవంతంగా పంపిణీ చేయించవలసిన బాధ్యత జిల్లా కలెక్టర్‌దే. పౌరసరఫరాల శాఖ కలెక్టరు నియంత్రణలో పనిచేస్తుంది.

**5. జిల్లా పరిపాలనాధికారి :**

జిల్లాలో పనిచేయు పరిపాలనాశాఖలన్నింటికి చెందిన జిల్లా అధికారులు జిల్లా కలెక్టరు పర్యవేక్షణ, దర్శకత్వంలో పనిచేస్తారు. జిల్లా అధికారులందరితోను సన్నిహిత పరిచయం పెట్టుకొని ప్రధాన సమన్వయకర్తగా పనిచేస్తాడు.

**6. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి :**

జిల్లా కలెక్టరు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ప్రతినిధి. ఈ హోదాలో అతడు స్వాతంత్ర్యదినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం మొదలైన సందర్భాలలో పతాకవందనం చేయటం, గౌరవ వందనాలను స్వీకరించటం చేస్తాడు. అధికార బాధ్యత నిర్వహణ నిమిత్తము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖుల పర్యటన, విడిది, స్వాగత, వీడ్కోలులను ఏర్పాటు చేయవలసి ఉంది. జిల్లాకు సంబంధించిన విషయాలన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టరు ఎప్పటికప్పుడు నివేదిస్తాడు.

**7. మిశ్రమ విధులు :**

1) పురపాలక సంఘాలపై పర్యవేక్షణ, 2) తుపాకీ లైసెన్సుల మంజూరు, 3) సినిమాహాలులకు లైసెన్సుల జారీ 4) వ్యవసాయదారులకు సకాలంలో నీటి సరఫరా, 5) జిల్లా పరిపాలనపై ఏ అంశము మీదనైనా సరే ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకారం మొదలైన విధులను కూడా కలెక్టరు తప్పనిసరిగా నిర్వహించవలసియున్నది.

## 3.10 ముగింపు :

ఇన్ని మార్పులు చేర్పులతో స్వాతంత్ర్యానంతరం నిర్మించి, నిర్వహించబడుతున్న మనదేశ పాలనను, రాజకీయ స్వప్రయోజనాల నిమిత్తము కూడా అనేక పర్యాయాలు రాజ్యాంగ సవరణల ద్వారా కూడా మార్చటం జరిగింది. ప్రభుత్వ వ్యవస్థల నిర్మాణ, నిర్వహణ విధులలో కూడా అనేక మార్పులు వచ్చినవి. మన పాలనా యంత్రాంగం మనదేశ, రాజకీయ, ఆర్థిక సాంఘిక అవసరాలకు అనుగుణంగా రూపురేఖలను మార్చుకుంటూనే ఉంది.

: ప్రశ్నలు :

**వ్యాసప్రశ్నలు : ఈ క్రింది వాటికి ఐదు పుటలకు మించని సమాధానములు వ్రాయుము**

1. స్వాతంత్ర్య కాలములో భారత పాలనా వ్యవస్థ ఎదుర్కొన్న సమస్యలను వివరించుము.
2. స్వాతంత్ర్యానంతరం భారత పాలనా వ్యవస్థలో వచ్చిన మార్పులను వివరింపుము.
3. స్వాతంత్ర్యానంతరం జిల్లా కలెక్టరు నిర్వహించుచున్న బహుముఖ పాత్ర వివరించుము.

**లఘు వ్యాసప్రశ్నలు : (ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులు మించకుండా సమాధానములు వ్రాయుము)**

1. పార్లమెంటరీ ప్రభుత్వ విధానమును గురించి వ్రాయుము.
2. కేంద్రీకృత లక్షణాలు గల సమాఖ్య ప్రభుత్వ పరిపాలనా విధానమును గూర్చి వ్రాయుము.

**లఘు వ్యాఖ్యలు వ్రాయుము : (ఈ క్రింది ప్రశ్నలకు ఒక పేజీకి మించకుండా సమాధానము వ్రాయుము)**

1. సమన్వయ పాలన
2. అధికార వికేంద్రీకరణ
3. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్
4. ఏకీకృత న్యాయవ్యవస్థ

**కుశాగ్రబుద్ధి ప్రశ్నలు : (ఒకటి, రెండు వాక్యాలలో సమాధానం వ్రాయండి)**

1. భారతరాజ్యాంగంలో సమాఖ్య
2. బ్రిటీష్ కాలము నాటి బిలీ
3. భారతదేశంలో సామాజిక అభివృద్ధి పథకాలు
4. భారతదేశంలో అమలులో ఉన్న న్యాయవ్యవస్థ
5. భారతదేశంలోని న్యాయపాలనా విధానం
6. జిల్లా కలెక్టరు ముఖ్య విధులు

**చదువదగిన గ్రంథాలు :**


1. భారతదేశ పాలన (బి.ఏ. ద్వితీయ సంవత్సరం) - తెలుగు అకాడమి
2. ప్రభుత్వ పాలనా శాస్త్రం (తృతీయ సంవత్సరం) - తెలుగు అకాడమి
3. భారతదేశ పాలన - రాజకీయాలు (బి.ఏ. ద్వితీయ సంవత్సరం) - తెలుగు అకాడమి
4. కానిస్టిట్యూషనల్ హిస్టరీ ఆఫ్ ఇండియా - యమ్. వి. పైలీ


రచయిత : **శ్రీమతి. మెహరున్నిసా**

పాఠం - 4

# భారతదేశ పాలన - రాజకీయ సందర్భం

విషయసూచిక


4.0 లక్ష్యం
4.1 ఉపోద్ఘాతం
4.2 పాలనను ప్రభావితం చేస్తున్న అంశాలు
4.3 భారత రాజ్యాంగము
4.4 పార్లమెంటరీ ప్రభుత్వ విధానము
4.5 భారత సమాఖ్య పాలనా వ్యవస్థపై రాష్ట్రాల ప్రభావం - కేంద్ర రాష్ట్ర సంబంధాలు
4.6 రాజకీయ ఉద్యోగి - ప్రభుత్వోద్యోగి - సంబంధాలు, సివిల్ సర్వీసు - తటస్థత
4.7 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు


## 4.0 లక్ష్యం

విద్యార్థులకు స్వాతంత్ర్యానంతరము భారతదేశ పాలనను ప్రభావితము చేస్తున్న అంశాలను గురించి తెలియజేస్తూ, కేంద్ర రాష్ట్రపాలన నిర్వహించే తీరుతెన్నులను వివరించుట

## 4.1 ఉపోద్ఘాతం :

ఆధునిక యుగంను ప్రజాస్వామ్య యుగంగా పేర్కొన్న ఎడల, ఆధునిక దేశాల పాలన ఆదేశ రాజకీయ పరిస్థితుల ప్రభావానికి గురియవుతాయి. మరి భారతదేశ విషయంలో కూడా ఇది నిజము అయితే, దేశ పాలనను అధ్యయనం చేయాలంటే స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం చేపట్టిన కార్యకలాపాలు అవి నిర్వహించే సందర్భంలో గల రాజకీయ పరిస్థితులను గూర్చి తెలుసుకొనవలసియున్నది.

భారతదేశ పాలనా విధానాన్ని తెలుసుకొనే ముందు పాలించబడే భారతీయ సమాజ, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను, వీటికి పాలనా వ్యవస్థకు మధ్య ఉన్న సంబంధమును తెలుసుకొనవలయును. 1) పాలనా వ్యవస్థకు సమాజమునకు ప్రత్యక్ష సంబంధము ఉంటుంది. 2) ప్రతి సమాజంలో అనేక ఉపవ్యవస్థలుంటాయి. సమాజము సంపూర్ణమైన అత్యంత శక్తివంతం అయిన గొప్ప పాలనా వ్యవస్థ. ఇది రాజకీయ, సామాజిక పరిస్థితులకు ప్రభావాలకు లోనయి పనిచేస్తుంది. పాలన వ్యవస్థ సమాజంలోని అన్ని వ్యవస్థల ప్రక్రియలను సమగ్రంగా అర్థం చేసుకొనవలసి ఉంటుంది.

భారతీయ సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పడి నిర్వహించబడుతున్న పాలనా వ్యవస్థను ఈ క్రింది అంశాల సహాయంతో వివరించవచ్చును. అవి :

1. పాలనా వ్యవస్థను ప్రభావితం చేస్తున్న వివిధ అంశాలు
2. భారత రాజ్యాంగము
3. ప్రజాస్వామ్య - పార్లమెంటరీ విధానం
4. భారత సమాఖ్య వ్యవస్థపై రాష్ట్రాల ప్రభావం - కేంద్రరాష్ట్ర సంబంధాలు
5. రాజకీయ ఉద్యోగి - ప్రభుత్వ ఉద్యోగి సంబంధములు
6. సివిల్ సర్వీస్ - తటస్థత

## 4.2 పాలనా వ్యవస్థను ప్రభావితం చేస్తున్న వివిధ అంశాలు :

సమాజము అత్యంత ఉన్నతమైన వ్యవస్థ. ఇది రాజ్యం కంటే ముందు పుట్టింది. దేశపాలనా వ్యవస్థలన్నీ దీని ప్రభావానికి లోనుకాక తప్పదు. సమాజంలో అనేక ఉపవ్యవస్థలుంటాయి. పాలనా వ్యవస్థ కూడా సమాజంలోని ఉపవ్యవస్థలలో ఒకటి. సమాజంలోని మిగిలిన ఉపవ్యవస్థలన్నీ పాలనా వ్యవస్థతో సంబంధము కలగి పరస్పర ప్రభావానికి లోనవుతాయి.

స్వాతంత్ర్యానంతరం మన దేశపాలనా వ్యవస్థ కూడ సామాజిక, రాజకీయ, ఆర్థిక ఉపవ్యవస్థల లక్షణాలను ప్రతిబింపచేస్తు ప్రభావితమౌతుంది. ప్రభుత్వ విధులు బాధ్యతలు విస్తృతమై పాలనా విధానాల పునః పరిశీలనకు కారణమౌతాయి. పాలనా నిర్మాణముపై సమాజ ప్రగతి ఆధారపడి ఉంది. ప్రభుత్వ పాలనా పరిసర సంబంధం దృక్పధం, తులనాత్మక ప్రభుత్వ పాలనా అధ్యయనాలలో అగ్రగణ్యుడైన యఫ్.డబ్ల్యు. రిగ్స్ "ఏ దేశపాలనా వ్యవస్థ అయినను సామాజిక పరిస్థితుల ప్రభావానికి కట్టుబడి ఉంటుంది" అని అభిప్రాయపడినాడు. యఫ్. డబ్ల్యు. రిగ్స్ తన పాలనావరణ దృక్పథ సిద్ధాంతం ప్రకారం ఏ దేశంలో అయినా పాలనా వ్యవస్థ ఆ సమాజంలోని ఆర్థిక, సాంస్కృతిక, చారిత్రక, భౌగోళిక ప్రభావములకు లోను అవుతుంది అని అన్నాడు. భారతదేశమునకు రిగ్స్ భావాలను అనునయించిన ఎడల ప్రభుత్వ - పాలనా పరిసర సంబంధమును, సమాజ విలువలను అర్థం చేసుకుంటూ, పాలనను పరిశీలించవలసి వుంటుంది. రిగ్స్ సమాజాభివృద్ధికి ప్రత్యేక నిర్మాణ - విధులను పాలనాపరంగా విశ్లేషించాడు. దీని ప్రకారం రిగ్స్ మూడు రకాల సమాజములను గుర్తించాడు. అవి : 1. ప్రాచీన - సంయోజిత, 2. పారదర్శిక - అభివృద్ధి చెందుతున్న, 3. ప్రతిఫలన - అభివృద్ధి చెందిన సమాజములు. ఈ సమాజాలను విశ్లేషించటం వలన వివిధ దేశాల పాలనను అర్థం చేసుకొనవచ్చును. "ప్రగతిపాలన" అను నూతన దృక్పధాన్ని కూడా రిగ్స్ విశ్లేషించి పరిసరాలపై అదుపు కలిగిన ప్రభుత్వపాలన ప్రజల సంక్షేమమునకు దోహదం చేస్తుందని అన్నాడు.

## 4.3 భారత రాజ్యాంగం :

ఆధునిక రాజ్యాల పాలన రాజ్యాంగమునకు అనుగుణంగా నిర్వహించబడుచున్నది. మన రాజ్యాంగ రచనలో పాల్గొన్న మహామహులందరు భారతదేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని చేకూర్చగలిగిన రాజ్యాంగమును రూపొందించి సమర్పించటం జరిగింది. రాజ్యాంగ మౌలిక శాసనాలు ప్రభుత్వ పాలనా నిర్మాణాన్ని, నిర్వహణను నిర్దేశించుచున్నవి. భారత రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలు, భారతీయుల మనోభావాలకు, రాజకీయ పరిస్థితులకు అనుగుణము అయిన లక్షణాలు. బాధ్యతాయుత ప్రభుత్వము, లౌకికత్వం, న్యాయస్థానాల స్వతంత్ర ప్రతిపత్తి, ప్రజాస్వామిక, సామ్యవాద, శ్రేయోరాజ్య లక్ష్యంగా నిర్ణయించబడినవి.

## 4.4 ప్రజాస్వామ్య - పార్లమెంటరీ ప్రభుత్వ విధానము :

బ్రిటిష్ స్వప్రయోజన వలస పాలన నుండి విముక్తి పొందిన భారతదేశమునకు, స్వాతంత్ర్యానంతరం రచింపబడి 1950వ సంవత్సరం జనవరి 26వ తేదీ నుండి అమలులోనికి వచ్చిన రాజ్యాంగము, పాలనా వ్యవస్థ ప్రజాస్వామ్య పంథాలో

పూర్తిగ ప్రజాసేవకు అంకితమయినదిగ పేర్కొనబడినది. ఇచ్చట స్వాతంత్ర్యానంతర దేశపాలనలో రాజకీయ దృక్పథంలో వచ్చిన మార్పును, వ్యత్యాసమును గమనించవలయును. పార్లమెంటరీ ప్రజాస్వామ్యములో ప్రజా ప్రతినిధులకు ఆధిక్యం ఉంటుంది. పార్లమెంటు నుండి ఎన్నుకోబడిన మంత్రిమండలి (కార్యనిర్వాహక వర్గం) తిరిగి పార్లమెంటుకు (ప్రజాప్రతినిధులకు) బాధ్యతవహించి, జవాబుదారిగ పరిపాలనను నిర్వహించవలసి వుంటుంది. ఈ మార్పు కేంద్ర, రాష్ట్ర పాలనా నిర్వహణలో స్పష్టంగా కనపడింది. పార్లమెంటరీ పాలనా వ్యవస్థలో రాజకీయ పార్టీలు ప్రభుత్వ నిర్మాణ, నిర్వహణకు స్పష్టముగా కనపడింది. పార్లమెంటరీ పాలనా వ్యవస్థలో రాజకీయ పార్టీలు, ప్రభుత్వ నిర్మాణ, నిర్వహణకు తప్పనిసరి. భారత జాతీయోద్యమములో ప్రధాన పాత్ర వహించిన భారత జాతీయ కాంగ్రెస్‌తో పాటు, మరికొన్ని జాతీయ పార్టీలు కూడా ఉద్భవించినవి. స్వాతంత్ర్యానంతరము ప్రాంతీయ పార్టీలు కూడా ఆవిర్భవించినవి. మారిస్ జోన్స్ - భారతదేశ పార్టీ రాజకీయ విధానాన్ని "ఏకపక్ష ఆధిక్యత" (కాంగ్రెస్ పార్టీ) అని పేర్కొన్నప్పటికి ప్రస్తుతము కేంద్ర - రాష్ట్ర పాలనా వ్యవస్థలు బహుపార్టీ విధానమునకు గురికాక తప్పలేదు.

## 4.5 భారత సమాఖ్యపాలనా వ్యవస్థపై రాష్ట్రాల ప్రభావము - కేంద్ర రాష్ట్ర సంబంధాలు :

భారత రాజ్యాంగములో "రాష్ట్రాల సముదాయం"గా పేర్కొన్నప్పటికి; లిఖిత రాజ్యాంగము, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన, స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయవ్యవస్థ, రాజ్యాంగ నిర్మాతల అభీష్టాల మేరకు మనది సమాఖ్య రాజ్యము అని స్పష్టముగా తెలుస్తుంది. "మన దేశ భిన్నత్వం" సమాఖ్య రాజ్య విధానమునకు తోడ్పడటమేగాక, భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు దోహదం చేసింది. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల ఆవిర్భావంతో కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ, చీలికతో ఏకపార్టీ ప్రాబల్యం తగ్గి మిశ్రమ ప్రభుత్వం ఏర్పడింది. బలహీనము అయిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల అభీష్టం మేరకు కేంద్ర-రాష్ట్ర సంబంధాల పునఃవ్యవస్థీకరణకు సర్కారియా కమీషన్‌ను నియమించింది. శాసన, పరిపాలన, ఆర్థిక పరమయిన సంబంధాల నేపధ్యంలో, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలను వాటి పరిపాలనను నియంత్రణ చేయు పద్ధతిపై ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ధ్వజమెత్తటంతో కేంద్ర, రాష్ట్ర సంబంధములు వివాదాస్పదంగా తయారు అయినవి. ఈవిధంగా భారతీయ రాజకీయ వ్యవస్థలో ఇటీవల వస్తున్న మార్పులు కేంద్ర-రాష్ట్ర పాలనా వ్యవస్థలపై గణనీయమయిన ప్రభావమునకు కారణమై రాజ్యాంగపరమైన సవరణలకు అవకాశమును కల్పిస్తున్నవి.

## 4.6 రాజకీయ ఉద్యోగి - ప్రభుత్వ ఉద్యోగి సివిల్ సర్వీసెస్ తటస్థత :

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో పార్టీ ప్రాతిపదికపై అధికారంలో ఉన్న ప్రతినిధులను రాజకీయ కార్యనిర్వాహక వర్గమని అంటారు. వీరు పార్టీ ప్రయోజనములను సాధించే కృషిలో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ యంత్రాంగమును ఉపయోగించడానికి సర్వదా ప్రయత్నము చేస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయములకు దూరంగా ఉండాలని కోరుకుంటారు. రాజకీయ నాయకులు విధాన రూపకల్పన చేస్తే పాలనా సిబ్బంది వాటిని కార్యరూపంలో పెట్టవలసి ఉంటుంది. కాని ప్రస్తుత కాలంలో ఉద్యోగి సంఘాలు ఏదో ఒక పార్టీకి అనుబంధమై ఉంటున్నాయి. అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించే ఉద్యోగిస్వామ్యం అవసరమని కొందరు అభిప్రాయపడితే, సివిల్ సర్వీసెస్ తటస్థత మంచిదని కొందరి అభిప్రాయం. కాని ఇవి సాధ్యం కానప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల శక్తిసామర్థ్యాలకు భంగం కలుగనంతవరకు రాజకీయ ప్రమేయము మన ప్రభుత్వ విధానములో ఆరోగ్యకరమే. ప్రజా ప్రతినిధులు, మంత్రుల, ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి అవసరాన్ని కొందరు పాలనా నిపుణులు పేర్కొంటున్నప్పటికి భారతదేశమునకు 'సమర్పిత' పాలనా యంత్రాంగం అవసరం.

## 4.7 ముగింపు :

పాలనలో రాజకీయంగా చలామణి అవుతున్న కుల, మతతత్వాలు ప్రభుత్వ యంత్రాంగములో పేరుకొనిపోయిన లంచగొండితనం ప్రజలకు పాలనా యంత్రాంగం ఎడల అసంతృప్తికి మూలకారణం అవుతున్నాయి. అవినీతికి కుల, మత తత్వాలకు మూల కారణం ప్రజలేనని గుర్తించవలసి వుంది. పాలనా యంత్రాంగమును రాజకీయపార్టీలు, లంచగొండితనం కలుషితం చేస్తున్నాయి. ప్రజలకు ప్రభుత్వముపై, పాలనపై విశ్వాసం తగ్గుతుంది. ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ కార్యనిర్వాహకులు, ఉద్యోగిస్వామ్యం దీనిని తెలుసుకొని మెలగవలసియున్నది.

### మాదిరి ప్రశ్నలు :

### వ్యాసరూప ప్రశ్నలు :

1. ప్రస్తుత భారతదేశ పాలనను ప్రభావితం చేస్తున్న అంశాలను పేర్కొనుము.
2. భారతదేశ పాలనా వ్యవస్థపై రాష్ట్రాల ప్రభావమును తెల్పి, కేంద్ర రాష్ట్ర సంబంధాలలో వస్తున్న మార్పులను వివరించుము.

### లఘు వ్యాస ప్రశ్నలు :

1. రాజకీయ ఉద్యోగి - ప్రభుత్వోద్యోగి మధ్య సంబంధాలు
2. సివిల్ సర్వీసు తటస్థత ఆవశ్యకతను వివరించుము.

### కుశాగ్రబుద్ధి ప్రశ్నలు :

1. భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ
2. పాలన వ్యవస్థ - సామాజిక పరిస్థితుల ప్రభావం
3. సర్కారియా కమీషన్

### చదువదగిన గ్రంథాలు :

తెలుగు అకాడమీ టెక్స్ట్ బుక్స్ ఆఫ్ 1, 2 మరియు 3వ సంవత్సరము బి.ఏ.,
పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్

రచయిత : **శ్రీమతి మెహ్రున్నిసా బేగం**

పాఠం - 5

# భారతదేశ పాలన వ్యవస్థ సాంఘిక - ఆర్థిక పరిస్థితులు

విషయసూచిక


5.0 లక్ష్యం
5.1 ఉపోద్ఘాతం
5.2 భారతీయ సమాజం
5.3 మతం
5.4 కులం
5.5 ఉమ్మడి కుటుంబం
5.6 పరిశ్రమలు - పట్టణీకరణ - సమస్యలు
5.7 ఆర్థిక పరిస్థితులు
5.8 పారిశ్రామికీకరణ - మిశ్రమ ఆర్థిక విధానం
5.9 పంచవర్ష ప్రణాళికలు - ప్రణాళికాసంఘం
5.10 గ్రామీణాభివృద్ధి పథకాలు
5.11 ఇతర ఆర్థిక పథకాలు
5.12 భూసంస్కరణలు
5.13 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు


## 5.0 లక్ష్యం :

విద్యార్థులకు భారతదేశ సాంఘిక, ఆర్థిక పరిస్థితులను గురించి తెలియజేస్తూ, స్వాతంత్ర్యానంతరము సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఏ విధముగా పాలనా వ్యవస్థను రూపొందించటం జరిగిందో తెలియ చెప్పటం; యింకోమాటలో చెప్పాలంటే మన సాంఘిక, ఆర్థిక పరిస్థితులు పాలనా వ్యవస్థ నిర్మాణ, నిర్వహణపై చూపుతున్న ప్రభావమును తెలియపరచటం..

## 5.1 ఉపోద్ఘాతము :

ప్రపంచ దేశాలను స్థూలంగా రెండు రకాలుగా విభజించారు. ఒకటి అభివృద్ధి చెందిన దేశాలు, రెండు అభివృద్ధి చెందుతూ వున్న దేశాలు. భారతదేశాన్ని అభివృద్ధి చెందుతూవున్న దేశంగా పరిగణించడం జరుగుతుంది. భారతదేశము సంపన్న దేశము. కానీ భారతీయులు చాలా పేదవారు INDIA IS RICH BUT ITS PEOPLE ARE POOR. దీని భావము భారతదేశము అపూర్వమైన సహజ సంపద కలిగి ఉంది. కానీ విదేశీదండయాత్రల వల్ల బ్రిటిష్ వలస పాలన వలన తరలిపోయిన సంపదయేగాక, సాంకేతిక పరిజ్ఞానముతో సహజవనరులు సకాలములో సద్వినియోగం చేయక భారతదేశం వలసపాలనలో వెనుకబడిన దేశమైంది.

భారతీయ సమాజము పేద సమాజంగా మిగిలిపోయింది. స్వాతంత్ర్యానంతరం భారతదేశ ప్రభుత్వ సత్వర కర్తవ్యం వెనుకబడిన సమాజాన్ని సాంఘిక, ఆర్థికరంగాలలో అభివృద్ధిచేయటం. సమాజ సాంఘిక ఆర్థిక అభివృద్ధి రాజకీయ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు దోహదముచేసి ప్రభుత్వాల స్థిరత్వానికి మూలకారణమౌతుంది. స్వతంత్రదేశాల ప్రభుత్వపాలనా లక్ష్యం ప్రజాసంక్షేమం. కాబట్టి ప్రభుత్వ విధానాలలో సమాజ సాంఘిక, ఆర్థిక సంక్షేమ పథకాలకు చాలా ముఖ్యమైన స్థానాన్ని కల్పించడం జరుగుతుంది. సంక్షేమ పథకాలను రూపొందించటానికి ముందు సమాజ వ్యవస్థ యొక్క స్థితిగతులను, సమాజ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న అంశాలను పరిగణనలోకి తీసుకొనవలసి వుంటుంది. సమాజాన్ని దాని పరిసరాలను అర్థంచేసుకొని రూపొందించిన సమగ్ర దృక్పథాన్ని, పాలనావ్యవస్థల ప్రక్రియలను అర్థంచేసుకొనే పరిసరాల ఆవరణ దృక్పథంగా రిగ్స్ పేర్కొనటం జరిగింది. ప్రభుత్వపాలనా వ్యవస్థలు - విధానాలు సామాజిక వ్యవస్థల ప్రతిబింబమే. కాబట్టి పాలనావ్యవస్థలు వాటి చుట్టూవున్న సామాజిక వ్యవస్థల పరిసరాలను సమగ్రంగా అర్థంచేసుకొని, విధానాలను రూపొందించి నిర్వహించని ఎడల పాలన వ్యర్థమైపోతుంది. సమాజాన్ని విశ్లేషించి దాని లక్షణాలను తెలుసుకొని రాజకీయ విధానాలను రూపకల్పన చేయవలసివచ్చింది. ఈ క్రింది లక్షణాలు భారతీయ పాలనను ప్రభావితం చేస్తాయి.

1. భారతీయ సమాజం - గ్రామీణ వ్యవస్థ, 2. మతం, 3. కులవ్యవస్థ - బడుగువర్గాలు, 4. ఉమ్మడి కుటుంబం, 5. పరిశ్రమలు - పట్టీకరణ - సమస్యలు.

## 5.2 భారతీయ సమాజం - గ్రామీణ వ్యవస్థ :

భారతదేశము ప్రధానంగా గ్రామీణ స్వభావం కలిగివున్నది. 70% ప్రజలు గ్రామీణవాసులు. ఈ గ్రామాలన్నీ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలచే నిర్వహింపబడిన కుటీర పరిశ్రమతో సారవంతమైన వ్యవసాయక్షేత్రాలతో స్వయంపోషకాలై, స్వయంసమృద్ధి కలిగి ఉండేవి. విదేశీ దండయాత్రలు, వలసపాలన, ద్వంద్వ భూమిశిస్తు విధానాలు, పారిశ్రామికీకరణలు మన గ్రామాలను, గ్రామజీవితాన్ని చిన్నాభిన్నం చేయుటయేగాక గ్రామవాసులు జీవనోపాధికి పట్టణాలకు వలస రావటానికి కారణభూతమాయ్యాయి. స్వాతంత్ర్య సముపార్జనతో అత్యధిక శాతం దేశ జనాభా నివసించు గ్రామప్రాంతాల అభివృద్ధి, దేశాభివృద్ధి లక్ష్యానికి పెద్ద సవాలుగా నిలిచింది. దేశాభివృద్ధి గ్రామీణాభివృద్ధియేనని, తిరిగి గ్రామాలను సహకార ప్రాతిపదికపై స్వయంపోషకం, సాధింపచేయుటకు పాలన ముఖ్యోద్దేశం కావాలని జాతిపిత మహాత్మాగాంధి ఉద్దేశ్యం. పంచాయితీరాజ్ వ్యవస్థలు, సమాజాభివృద్ధి పథకాలు, అక్షరజ్యోతి, జవహర్ రోజ్‌గార్‌యోజన పథకాల ద్వారా గ్రామాలను పట్టి పీడించుచున్న నిరుద్యోగ, నిరక్షరాస్యత, దారిద్ర్యాలను పారద్రోలటానికి కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు తమ వంతు బాధ్యతను నిర్వహించుచున్నవి. కానీ ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్యం, పథకాల అమలులో చిత్తశుద్ధి లోపించుటవలన ఆశించిన ఫలితాలను సాధించలేకపోతున్నాము.

## 5.3 మతం :

హిందూ దేశంలో హిందూ మతము కేవలము మతముమాత్రమే కాదు. ఇది ఒక జీవనవిధానం. అనేక జాతులు, మతాలు హిందూ సమాజ ప్రవంతిలో కలసిపోయాయి. భిన్న ఆచారాలు, అలవాట్లు, సాంప్రదాయ వ్యవహారాలు కల ప్రజలు కలసి సహజీవనానికి అలవాటుపడ్డారు. అధిక సంఖ్యాకులు హిందువులైనప్పటికి, గౌతమబుద్ధుడు, అశోకుడు ప్రబోధించిన - అహింసా సూత్రం, పరమత సహనం, నైతిక విలువలకు కట్టుబడి హింసకు తావులేని జీవితాన్ని భారతీయులు సాగించుచు ముందుకు సాగక తప్పదు. బ్రిటిష్‌వారి విభజించి పాలించు విధానం దేశాన్ని చీల్చి రెండు ముక్కలు చేసింది. దురదృష్టవశాత్తు ప్రజలలోని సాంప్రదాయ భావాలను, అజ్ఞానాన్ని ఆసరాగా తీసుకొని కొన్ని రాజకీయ పక్షాలు తమ లబ్ధికోసము ప్రజలను మతపరంగా రెచ్చకొట్టుచున్నాయి. దీనితో మైనారిటీ ముస్లింలకు, మెజారిటీ హిందువులకు మధ్య తీవ్ర విబేధాలేర్పడుతున్నాయి. ప్రస్తుతము కొనసాగుతున్న బాబ్రి మసీదు - రామ జన్మభూమి వివాదము యిందుకు నిదర్శనము. ఉగ్రవాదం, వేర్పాటువాదం

పరిష్కారంలేని సమస్యలయినాయి. మన ప్రభుత్వం లౌకిక విధానానికి కట్టుబడి, పాలనా యంత్రాంగాన్ని సమాయత్తం చేసుకొని అనుకొన్న లక్ష్యాన్ని సాధించడానికి అభివృద్ధిపథంలో పయనిస్తుంది. ఆధునికీకరణ సాధనకు, మతపర విలువలను సామాజిక విలువలను, లౌకిక విలువలను కాపాడటానికి పాలకులు సర్వదా కృషిచేస్తూనే ఉన్నారు అనటంలో సందేహంలేదు.

## 5.4 కులం :

హైందవ సమాజం వర్ణాశ్రమ ధర్మాన్ని అనుసరించింది. వృత్తిపరంగా ఏర్పడిన వర్గీకరణ హైందవ సమాజ విలువలను మరచి ఎన్నో కులాలుగా విడిపోయి శాఖోపశాఖలుగా చీలింది. ఒక హిందూ సమాజంలోనే కాదు, ప్రపంచంలోని అన్ని దేశాలలో ఈ చీలికలు కనబడుతున్నవి. హిందూ సమాజములోని కుల వ్యవస్థ భారతదేశ సమాజానికి పెద్ద మచ్చలా తయారైనది. ప్రభుత్వం అనేక శాసనాలతో, పథకాలతో రిజర్వేషన్ పథకాలతో, బడుగువర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నది. రాజ్యాంగము అమలులోకి వచ్చి నాలుగు శతాబ్దాలు నిండినప్పటికి బడుగువర్గాలు ఆశించిన స్థాయికి పెరగకపోగా, రిజర్వేషన్ అనుకూల, ప్రతికూల ఉద్యమాలు ప్రారంభమై దేశ శాంతిభద్రతలకు ముప్పుగా తయారైనవి. ఈ సమస్య పరిష్కార మార్గం ఆర్థికపరమైంది. సమానావకాశమే ఉద్యమంగా ఉండి సమాజంలోని అన్ని వర్గాలను కుల ప్రసక్తి లేకుండా సంతృప్తి పరచాలి. కానీ ఇది ప్రభుత్వంపై ఆర్థికభారాన్ని పెంచుతుంది. రాజకీయ పక్షాలు కూడా స్వప్రయోజనాన్ని వీడి కుల దృక్పధాన్ని మరచి, సాంప్రదాయక సామాజిక వ్యవస్థలో మార్పుతీసుకొని రావటానికి ప్రయత్నించాలి. సంకుచిత కుల దృక్పధం జాతి సమైక్యతను బలహీనపరుస్తుంది. కుల ప్రసక్తిలేని సామాజిక వ్యవస్థ పాలకవర్గం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పౌరుని ఆర్థిక పరిస్థితిని బట్టి వెనుకబడినతనాన్ని గుర్తించి ప్రభుత్వపరంగా సహాయం అందాలి. ఈ దశను చేరిందాకా సాంఘిక, ఆర్థిక వెనుకుబాటుతనానికి ప్రత్యేక రిజర్వేషన్లను అమలుపరచటం ద్వారా, సాధ్యమయినంత వరకు సామాజిక సమానత్వాన్ని సాధించే ప్రయత్నం చేయాలి.

## 5.5 ఉమ్మడి కుటుంబం :

భారత సమాజంలో ఉమ్మడికుటుంబ వ్యవస్థ చాలాకాలం ప్రధానపాత్ర వహించింది. ఇది పితృస్వామికంగానే వుండేది. అంటే తండ్రి లేక పెద్దవాడైన పురుష సభ్యుడు కుటుంబ ఆధిపత్యం వహించేవాడు. పారిశ్రామికీకరణ, ఉద్యోగ వ్యవస్థ, ఉన్నత సాంకేతిక విద్యావిధానాలు, పట్టణీకరణము వ్యష్టి కుటుంబాల ఆవశ్యకతకు కారణమైనవి. కానీ కుటుంబ సభ్యుల మధ్య ఆచిరకాలంగా ఉండెడి మానసికోద్వేగం, సంబంధ బాంధవ్యాలు కొనసాగుతూనే వున్నాయి. ఉమ్మడి కుటుంబవ్యవస్థ ప్రభావం యింకా మన సమాజంపై వున్నది. పాలకవర్గం అత్యధిక సంఖ్యలో గ్రామీణ ప్రాంతానికి చెందినవారై కుల, మత తారతమ్యం వారిలో జీర్ణించుపోయి ఉంది. ఉద్యోగ బృందాలు, ఉన్నతాధికారులకు మోతాదుకు మించిన విధేయతను చూపటం జరుగుతుంది. ప్రభుత్వ విధానాలు రూపొందించటంలో అమలుచేయటంలో ఉద్యోగస్వామ్యం ప్రధానపాత్ర వహిస్తుంది. చిత్తశుద్ధిలేని ప్రజాసంక్షేమ పథకాల రూపకల్పన, అమలు నిరుపయోగం అవుతుంది. కాబట్టి భారతపాలక వర్గం కుల, మత వైషమ్యాలకు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భావోద్వేగానికి, అతీతంగా వ్యవహరించవలసి ఉంది. పాలక వర్గంలో యింకా మిగిలివున్న సాంప్రదాయవాదులకు నిర్ణయీకరణలో తావివ్వక, సాంఘిక న్యాయం, దేశాభివృద్ధికి సహాయపడే కార్యక్రమాన్ని రూపొందించి అమలుజరుపడంలో పాలనవ్యవస్థ నిమగ్నము కావలసి వుంది.

## 5.6 పరిశ్రమలు - పట్టణీకరణ - సమస్యలు :

పారిశ్రామికీకరణ వలన పట్టణాల సంఖ్య పెరగటమే కాకుండా వాటి పరిధులు కూడా విస్తృతమౌతున్నవి. వ్యవసాయ భూమిపై ఆధారపడేవారి సంఖ్య పెరుగుటతో గ్రామీణ ప్రాంతాల నుంచి జీవనభృతి కొరకు పట్టణ ప్రాంతానికి తరలెడివారి

సంఖ్య పెరుగుతున్నది. దీని ఫలితంగా పట్టణాలలో జనరద్దీ, వాహనాల రద్దీ పెరుగుతుంది. గృహవసతి, ఆహారం, విద్య, వైద్య సదుపాయాల వంటి నిత్యావసర వస్తువులు కొరవడుతాయి. విద్యుచ్ఛక్తి, రోడ్డు - రవాణా, మంచినీటి సరఫరా, మురుగునీరు నీటిపారుదల వంటి ప్రజోపయోగ సేవలు అందరికీ తగినంతగా లభించవు. వాతావరణ కాలుష్యం ప్రబలుతుంది. నిరుద్యోగం తీవ్రతరమవుతుంది. ఆరోగ్య, నైతిక ప్రమాణాలు దిగజారుతాయి.

ఈ సమస్యల నివారణ కోసం ప్రభుత్వం తగిన సంక్షేమ విధానాలను రూపొందించుకోవాలి. స్థానిక సంస్థల ద్వారా ప్రజలలో కుటుంబనియంత్రణ, అక్షరాస్యతల ఆవశ్యకతకు సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంచాలి. గ్రామీణ విద్యుద్దీకరణ, పారిశ్రామికీకరణలను ప్రోత్సహించాలి. గృహనిర్మాణం, నిత్యావసర వస్తువుల పంపిణీ పథకాలను సమర్థవంతంగా అమలుజరపాలి. మురికివాడల అభివృద్ధి పథకాలను విస్తృత పరిధిలో చేపట్టాలి. ఆరోగ్య సౌకర్యాలను, పరపతి, భీమా సౌకర్యాలను సమగ్రపరచాలి. ప్రభుత్వం రూపొందించే దారిద్ర్య నివారణల పథకాల అమలుద్వారా ఆర్థిక, సాంఘిక న్యాయాన్ని పెంపొందించుకోవాలి.

## 5.7 భారతదేశ పాలన - ఆర్థిక సందర్భం :

స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతదేశ ఆర్థిక పరిస్థితి దుర్భరంగా వుంది. బ్రిటిష్ వలసపాలన అనుసరించిన ఆర్థిక దోపిడి విధానం, దేశీయ పరిశ్రమలను నాశనం చేసింది. గ్రామీణ ప్రజలపై పడిన అధిక పన్నుల భారం, క్షామం, ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగము, అనారోగ్యాన్ని దేశ ప్రజలకు మిగిల్చింది. భారతీయ సమాజ ఆర్థిక సామాజిక, సాంస్కృతిక విలువలు కరువై, ప్రత్యేక ఉన్నతశ్రేణి వర్గం, పేద ప్రజల మధ్య అగాధం ఏర్పడింది. కులవ్యవస్థ పటిష్టమయింది. రైతులు, రైతు కూలీలు ఒకవైపు అధికారులచేత, మరియొక వైపు భూస్వాములు చేత పీడించబడ్డారు. దేశీయ కుటీర పరిశ్రమలు కుంటుబడి, వాటి స్థానంలో ఫ్యాక్టరీలు, యంత్రాలు పనిచేయసాగాయి. ఆర్థిక, సామాజిక పరంగా పరిణితి పొందిన ప్రజలు అతిదీనావస్థకు దిగజారి "నరక యాతన యుగంగా" చలనంలేని మృగ్య దశగా, శిథిల నాగరికతగా పరిగణించబడ్డారు. జాతి పేదరికానికి బ్రిటిష్ పాలనే కారణమని చెప్పక తప్పదు. స్వతంత్ర భారతదేశము ఈ క్రింది ప్రక్రియల ద్వారా దాని ఆర్థిక పురోభివృద్ధికి కృషిచేస్తున్నది. 1. పారిశ్రామికీకరణ మిశ్రమ ఆర్థిక విధానం, 2. పంచవర్ష ప్రణాళికలు - ప్రణాళిక సంఘం, 3. గ్రామీణాభివృద్ధి పథకాలు, 4. భూ సంస్కరణలు, 5. ఇతర ఆర్థిక అభివృద్ధి పథకాలు.

## 5.9 పారిశ్రామికీకరణ - మిశ్రమ ఆర్థిక విధానం :

స్వాతంత్ర్యము వచ్చిన వెనువెంటనే 1948 సంవత్సరములో భావి భారతదేశాభివృద్ధికి పార్లమెంటు పరిశ్రమల విధాన తీర్మానం చేయడం జరిగింది. ఈ పారిశ్రామిక విధాన తీర్మానాన్ననుసరించి భారీ పరిశ్రమలు ఉదా ॥ బొగ్గు, ఇనుము, చమురు, రైల్వేలు, విమానాలు, ఓడలు అణుశక్తి, టెలిఫోన్, టెలికమ్యూనికేషన్లు మొదలగునవి ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహించాలని నిర్ణయించారు, నిర్వహిస్తున్నారు. కాని పెరుగుతున్న పారిశ్రామిక వస్తువుల అవసరాన్నిబట్టి ఎగుమతులను ప్రోత్సహించి దిగుమతులను తగ్గించాలన్న ఉద్దేశ్యంతో మిశ్రమ ఆర్థిక విధానాన్ని అనుసరించాలని మన పార్లమెంటు అభిప్రాయపడి ప్రైవేటు రంగం పెట్టుబడులను ప్రోత్సహించింది. అయితే ప్రభుత్వ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. సామ్యవాదం, ఆర్థిక సమానత్వం, సంక్షేమ రాజ్యస్థాపనకు ప్రాధాన్యతనిస్తూ భారీ పరిశ్రమల జాతీయకరణతో ప్రభుత్వరంగంలో ఉత్పత్తికి ప్రాధాన్యత యిస్తూ 1956, 1971, 1977, 1980, 1991 పారిశ్రామిక తీర్మానాలను చేయటం జరిగింది. ప్రస్తుతం మనం ఉదార పారిశ్రామిక విధానం అనుసరించుచున్నాము. దీని ననుసరించి ప్రభుత్వరంగ సంస్థలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రభుత్వం తగిన నిబంధనలను రూపొందించినవి. కొన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు రంగానికి తరలించింది. ప్రభుత్వ సంస్థలలో నూతన పెట్టుబడులపై ఆంక్షలను విధించినది. ప్రైవేటు రంగంలో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించుచున్నది. ప్రవాస భారతీయులచే ప్రైవేటు రంగంలో పెట్టుబడిని ప్రోత్సహించి స్వయం సమృద్ధిని సాధించే ప్రయత్నం చేస్తున్నది.

## 5.9 పంచవర్ష ప్రణాళికలు - ప్రణాళికా సంఘాలు :

పరిమిత వనరులతో వ్యవసాయం, పారిశ్రామిక అధిక ఉత్పత్తి సాధించటం అతి ఆవశ్యకమైనందున ప్రణాళికా వ్యూహాన్ని మన ప్రభుత్వం చేపట్టింది. దీనికోసం 1950లో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసింది. 1951 నుంచి ప్రారంభమైన పంచవర్ష ప్రణాళికలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత యివ్వడం జరిగింది. ఆ తరువాత పరిశ్రమలకు ప్రాధాన్యత యిచ్చారు. మధ్యలో చైనా యుద్ధం వలన కొంత అంతరాయము కల్గినప్పటికి, పది పంచవర్ష ప్రణాళికలను విజయవంతంగా పూర్తి చేశాము. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించినప్పటికి, ఈ అభివృద్ధి జనాభా పెరుగుదలతో పోటీ పడలేకపోతుంది. రాష్ట్రాలకు ప్రణాళికా రచన నిర్వహణలో ప్రాధాన్యత నిస్తూ జాతీయ అభివృద్ధి మండలిని కూడ ఏర్పాటు చేయటం జరిగింది. ప్రణాళికల ద్వారా గ్రామీణాభివృద్ధికి పాటుబడుచున్నారు.

## 5.10 గ్రామీణాభివృద్ధి పథకాలు :

బ్రిటిష్ పరిపాలనా కాలములో మన గ్రామీణ వ్యవస్థ విచ్ఛిన్నమైంది. కుటీర పరిశ్రమలుకుంటుబడి వృత్తి కళాకారులునిరుద్యోగులయ్యారు. పరిశ్రమలకు కావలసిన ముడి సరుకులు, గ్రామీణ వ్యవసాయ రంగములో ఉత్పత్తిచేసి చౌకగా ఎగుమతి చేసి, తయారైన వస్తువులను బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకొనెడివారు. బ్రిటిష్‌వారు శాశ్వత భూమిశిస్తు విధానం, రైత్వారీ విధానంతో రైతులను దోపిడీ చేశారు. రైతాంగం పేదరికంతో, వ్యవసాయరంగం క్షీణించిపోయినది. బ్రిటిమువారు అనుసరించిన ఆర్థిక విధానాల ఫలితంగా భారతదేశం తన అభివృద్ధి పథకాలను గ్రామీణ స్థాయి నుంచి మొదలు పెట్టక తప్పలేదు. పంచాయితీరాజ్ వ్యవస్థ, అధికార వికేంద్రీకరణ ద్వారా గ్రామీణాభివృద్ధి, పశుగణాభివృద్ధి, వ్యవసాయం, చిన్న నీటిపారుదల పథకాలు, కాలువలు, చెరువుల త్రవ్వకము, ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక దిగుబడి నిచ్చు విత్తనాల సరఫరా మొదలగునవి రైతులకు సమకూర్చటం జరిగింది. జాతీయం చేసిన బ్యాంకుల ద్వారా, సహకార సంస్థల ద్వారా రైతులకు వ్యవసాయ ఋణాల పంపిణీ, సహకార సంస్థల ద్వారా గ్రామీణ పరిశ్రమల స్థాపన జరిగింది. శ్రీమతి ఇందిరాగాంధి, "గరీబీ హటావో" నినాదం దారిద్ర్యరేఖ దిగువనున్న వారి ఆర్థికాభివృద్ధి కృషిని తీవ్రతరం చేసింది. ప్రస్తుతం అనేక పథకాలు పంచాయితీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామీణ స్థాయిలో నిధులను సమకూర్చి, సత్వర గ్రామీణాభివృద్ధి సాధించి, గ్రామాలను పటిష్టం చేయడానికి మన ప్రభుత్వం కృతనిశ్చయంతో వుంది.

## 5.11 ఇతర ఆర్థిక పథకాలు :

20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం, సంఘటిత గ్రామీణాభివృద్ధి పథకం, గ్రామీణ ఉపాధి కల్పనా పథకాలు, కార్మికుల వ్యవసాయ కూలీల కనీస వేతన చట్టాలు, కార్మిక భీమా చట్టం, స్త్రీ కర్షక, కార్మికులకు ప్రసూతి ఆర్థిక సహాయ సౌకర్య పథకం, కార్మిక నష్ట పరిహార చట్టాలను ప్రభుత్వం అమలులోనికి తెచ్చింది. సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతము కాకుండా సంపద పన్ను, బహుమతి పన్ను, ఎస్టేటు సుంకం మొదలగు వానిని ప్రవేశపెట్టటం జరిగింది. సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతము కాకుండ చూడటం కోసం ఆస్థి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించటం జరిగింది.

## 5.12 భూ సంస్కరణలు :

1950 - 60 సం॥ములలో వివిధ రాష్ట్రములలో జమిందారీ విధానాన్ని రద్దుచేస్తూ, భూ సంస్కరణ చట్టాలను చేశాయి. 'బినామీ' భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచటం, బానిస కూలీ పద్ధతిని రద్దుచేశారు. ఆ తర్వాత కాలంలో అనేక రాష్ట్రాలు భూ గరిష్ట పరిమితిని నిర్దేశిస్తూ అనేక చట్టాలను చేసాయి. అయితే ఈ చట్టాలను అమలుపరచటంలో మాత్రం చిత్తశుద్ధి లోపించినదన్న విమర్శ కూడా ఉంది.

## 5.13 ముగింపు :

ప్రణాళికాబద్ధమైన పథకాల ద్వారా, ఆర్థికాభివృద్ధి, సాంఘిక సంక్షేమాభివృద్ధికి భారత ప్రభుత్వం తన వంతు కృషిని చేస్తున్నప్పటికి, జనాభా పెరుగుదల బలమైన అభివృద్ధి నిరోధక శక్తిగా తయారైంది. మనదేశ ఆర్థికాభివృద్ధి, అంకగణిత నిష్పత్తిలో జరుగుతుండగా, జనాభా పెరుగుదల "క్షేత్ర గణిత నిష్పత్తి" లో నున్నది. దీనికి తోడు అభివృద్ధి పథకాలను అమలు జరుపు ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్యం, అవినీతి, బంధుప్రీతి, లంచగొండితనం, జాప్యం వలన బడుగువర్గాల అభివృద్ధి పథకాలు వారిదాక చేరటంలేదు. దాదాపుదేశ జనాభాలో సగం మంది దారిద్ర్యరేఖకు దిగువనున్నారు. దీనికితోడు ద్రవ్యోల్బణం అధికధరలు ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తూ ఉన్నాయి. కాబట్టి యిప్పటికైన అభివృద్ధి పథకాలలో పాల్గొను ప్రభుత్వ యంత్రాంగం తవ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించి దేశ జనాభాకు న్యాయం చేస్తే బాగుంటుంది.

### మాదిరి ప్రశ్నలు :

### వ్యాసరూప ప్రశ్నలు :

1. భారతీయ సామాజిక వ్యవస్థ పాలనావ్యవస్థపై చూపుతున్న ప్రభావమును వివరింపుము ?
2. భారతీయ సామాజిక వ్యవస్థ లక్షణాలను పరిశీలించుము ?
3. ప్రస్తుత పరిస్థితులలో ఆర్థికాభివృద్ధికి పాలనావ్యవస్థ చేస్తున్న, చేయవలసిన కృషిని వివరింపుము ?
4. గ్రామీణాభివృద్ధికి స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న కృషిని వివరింపుము ?

### లఘువ్యాస ప్రశ్నలు :

1. భారతీయ కుల, మత, వ్యవస్థలను గూర్చి వ్రాయుము ?
2. బడుగువర్గాల అభివృద్ధి పథకాలను తెల్పుము ?
3. భూసంస్కరణలు, పారిశ్రామికీకరణ గురించి వ్రాయుము ?

### కుశాగ్రబుద్ధి ప్రశ్నలు :

1. 'గరీబీ హఠావో'
2. జవహర్‌రోజ్‌గార్ పథకము
3. పారిశ్రామిక విధానము
4. భూసంస్కరణలు

### చదువదగిన గ్రంథాలు :

1. Telugu Academy, B.A., Public Adminstration - Paper - II
2. Telugu Academy B.A., Public Administration - Paper - IV

రచయిత : **శ్రీమతి మెహ్రూన్నిసా బేగం**

పాఠం - 6

# కేంద్ర పాలనా విధానము

## విషయసూచిక


6.0 లక్ష్యం

6.1 ఉపోద్ఘాతం

6.2 మంత్రిత్వ శాఖలు

6.3 పాలనా శాఖ

6.4 మంత్రిత్వ శాఖలో వివిధ అధికారులు, వారి విధులు

6.5 ప్రస్తుత పరిపాలనా శాఖల వ్యవస్థీకరణ మూల్యాంకనం

6.6 ముగింపు

మాదిరి ప్రశ్నలు

చదువదగిన గ్రంథాలు


## 6.0 లక్ష్యం :

విద్యార్థులకు కేంద్రపాలనా విధానమును తెలియజేస్తూ, లోపాలను ఎత్తి చూపిస్తూ, పాలనా సంస్కరణలను గురించి తెలియజేయుట. సచివాలయం స్థాయిలో పాలనా ప్రక్రియను వివరించుట.

## 6.1 ఉపోద్ఘాతం :

భారతదేశంలోని ప్రస్తుత పాలనా వ్యవస్థ బ్రిటిష్ పాలనలో ఏర్పడినదేనని చెప్పవచ్చును. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనా వ్యవస్థ స్వరూప స్వభావాలు చాలా వరకు బ్రిటిష్ పాలనా వ్యవస్థను అనుసరించి వున్నాయి. కేంద్ర ప్రభుత్వ పాలనా పరిధి పార్లమెంటు, కార్యనిర్వహణ శాఖలకు పరిమితమౌతుంది.



మనది బాధ్యతాయుత (పార్లమెంటరీ) ప్రభుత్వ విధానము. శాసనసభ నుంచి ఎన్నుకోబడిన కార్య నిర్వాహక వర్గము తిరిగి శాసనసభకు బాధ్యత వహించి, దానికి విశ్వాసమున్నంతకాలము మాత్రమే అధికారంలో వుంటుంది. క్యాబినెట్ మంత్రి మండలి శాశ్వత ఉద్యోగి బృందం సహాయ సహకారాలతో విధాన రూపకల్పన చేసి శాసనసభ ఆమోదానికి సమర్పిస్తుంది. పార్లమెంటు ఆమోదంతోపాటు రాష్ట్రపతి ఆమోదముద్రతో బిల్లు, శాసనముగా మారి తిరిగి కార్యనిర్వహణ శాఖచే అమలు చేయబడుతుంది. ప్రభుత్వము యొక్క ప్రతి చర్య చట్టబద్ధముగా నుండవలెను. రాజకీయ కార్యనిర్వాహకవర్గం కేవలం కొంత నిర్ణీత కాలం మాత్రమే పదవిలో ఉంటుంది. కాని ఉద్యోగ బృందం శాశ్వతంగా పదవి విరమణ చేసేంతవరకు పదవిలో ఉండుటవలన పాలన నిరంతరం కొనసాగుతుంది. అందుకే ఉద్యోగిస్వామ్యాన్ని శాశ్వత కార్యనిర్వాహక వర్గం అని అందురు.

లూథర్ గల్లిక్ సాంప్రదాయక ధృక్పధం ప్రకారం పాలనా శాఖలు యీ క్రింది అంశముల ప్రాతిపదికగా వ్యవస్థీకరించబడుతాయి :

1. ప్రజలు (Perole లేదా Clintele) 2. ఉద్దేశ్యం (Purpose) 3. ప్రదేశము (Place) 4. పాలనా ప్రక్రియ (Process)

మనదేశంలోను వీటి ఆధారంగానే పరిపాలనా శాఖలనుఏర్పాటు చేసి పాలన నిర్వహించబడుతుంది.

భారతదేశ పాలనా వ్యవస్థలో కనబడే ముఖ్యమైన పరిపాలనా శాఖలోని స్థాయిలు క్రమానుగత శ్రేణి లేక అధికార పరంపర వ్యవస్థీకరీరణ నియమాన్ననుసరించి ఈ విధముగా ఉంటాయి.

## వ్యవస్థీకరణ :

| | |
|---|---|
| 1. మంత్రిత్వ శాఖ (మంత్రి) | ఉద్యోగి బృందం |
| 2. పాలనా శాఖ | కార్యదర్శి |
| 3. వింగ్ | అదనపు లేక సంయుక్త కార్యదర్శి |
| 4. డివిజన్ — బ్రాంచి | ఉపకార్యదర్శి |
| | అండర్ సెక్రటరీ |
| 5. సెక్షన్ | సెక్షన్ ఆఫీసరు |
| 6. 1 2 3 4 5 6 — అనుబంధ కార్యాలయాలు | అసిస్టెంట్లు |
| | గుమస్తాలు |
| 7. 1 2 3 4 5 — ఆధీన కార్యాలయాలు | |

## 6.2 మంత్రిత్వ శాఖలు :

రాష్ట్రపతి ప్రధానమంత్రిని నియమిస్తాడు. అతని సలహాపై మంత్రి మండలి ఏర్పడుతుంది. మంత్రిమండలిని 3 వర్గాలుగా విభజించి ఒక్కొక్క వర్గానికి ప్రత్యేక స్థాయి, హోదా కల్పించి వానికి తగినట్లు పాలనా విధులు, బాధ్యతలు అప్పచెప్పటం

జరుగుతుంది. 1950 వ సంవత్సరము భారత రాజ్యాంగము అమలులోకి వచ్చిన తరువాత శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ తన మంత్రిమండలిని శ్రీ అయ్యంగార్ కమిటీ సిఫార్సులననుసరించి 3 అంచెల్లో నియామకాలు చేశారు. క్రమంగా ఈ నియామక పద్ధతి స్థిరపడింది. ఆ మూడు అంచెలు 1. కాబినెట్ మంత్రులు, 2. రాజ్య మంత్రలు 3. ఉపమంత్రులు. 1. క్యాబినెట్ మంత్రులకు అధికార పార్టీలో అత్యంత ప్రాబల్యం ఉండటమేగాక విశేష పరిపాలనానుభవం పొందినవారై ఉంటారు. తమ మంత్రిత్వ శాఖలను స్వతంత్ర్యంగా నిర్వర్తించే అధికారంతోబాటు, తాత్కాలిక నిర్ణయాలు తీసుకొనే అధికారం కూడా ఉంటుంది. ప్రభుత్వపాలనా వ్యవహారాలన్నింటిలోనూ ప్రధానమంత్రికి తమ వంతు సలహా, సహాయ, సహకారాలను అందిస్తారు. 2. రాజ్య మంత్రులు లేక స్టేట్ మంత్రులు. వీరు తమకు ఒప్పజెప్పిన ప్రభుత్వ పాలనా శాఖలను స్వతంత్రంగా నిర్వహించవచ్చు. ఐతే స్టేట్ మంత్రి తన మంత్రిత్వ శాఖకు సంబంధించి చర్చ జరిగే సమయంలో మాత్రమే ప్రత్యేక ఆహ్వానంపై కాబినెట్ సమావేశాలకు హాజరౌతాడు. ఇతనికి ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఏ పాత్రా ఉండదు. 3. డిప్యూటీ మంత్రులకు స్వతంత్ర ప్రభుత్వ శాఖలను నిర్వహించే బాధ్యత ఉండదు. ఒక స్వతంత్ర మంత్రిత్వ శాఖలో సహాయకుడుగా ఉంటూ ఒప్పజెప్పిన బాధ్యతలను మాత్రము నిర్వహిస్తాడు. స్వతంత్ర అధికారాలు గాని, బాధ్యతలు గాని ఉండవు. పైన తెల్పిన 3 రకాల మంత్రులు గాక పార్లమెంటరీ కార్యదర్శి పదవిని అదనంగా సృష్టించడం జరిగింది. ఇతడు ఏ మంత్రిత్వ శాఖకు సంబంధపరిస్తే, ఆ మంత్రి బాధ్యతా నిర్వహణలో సహాయకుడుగా పనిచేస్తారు.

మంత్రి మండలి అధీనంలో అనేక పాలనా శాఖలు ఉంటాయి. ఆ పాలనా శాఖలకు మంత్రి రాజకీయ ప్రధాన కార్యనిర్వాహకుడు. పాలనాశాఖ కార్యకలాపాలన్నింటికి మంత్రి బాధ్యత వహిస్తాడు. పాలన తీరుతెన్నులు, పాలనా విధానాలు, విధాన రూపకల్పన, విధానాల అమలు మొదలైన విషయాలలో మంత్రి, పార్లమెంటుకు జవాబుదారీ వహిస్తాడు. మంత్రిపాలనా నియంత్రణలో ఒకటి లేదా అనేక మంత్రిత్వశాఖలుండవచ్చు. ఏ మంత్రికి ఎన్ని పాలనా శాఖలుండాలన్న నిర్ణయం మంత్రి మండలి లేదా ప్రధాన మంత్రిపై ఆధారపడి ఉంటుంది. మంత్రి అభిరుచి, యోగ్యత, అనుభవం, నాయకత్వం మొదలైన విషయాలను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి ఆయా మంత్రులకు పాలనా శాఖలను కేటాయించడం జరుగుతుంది. కొన్నిసార్లు దేశపరిస్థితులు, అత్యవసర పరిస్థితి మొదలైన విషయాలను దృష్టిలో ఉంచుకొని పాలనా శాఖలను మంత్రులకు కేటాయించడం జరుగుతుంది.

## 6.3 పాలనా శాఖ :

పాలనా శాఖాధికారి కార్యదర్శి. ఇతని పాలనా నియంత్రణలో శాశ్వత ఉద్యోగి బృందం పనిచేస్తుంది. మంత్రిత్వ శాఖలో విధుల విభజన జరుగుతుంది. సాధారణంగా ఒకే తీరున ఉన్న విషయాలన్నింటిని ఒకే పాలన అంశంగా చేయడం జరుగుతుంది. అయితే పాలనా శాఖ పరిమాణం కార్యనిర్వహణ సౌలభ్యం ఉండేటట్లుగా ఏర్పడాలి. అంతేకాకుండా దర్శకత్వం, నియంత్రణ, సలహా మొదలైన అంశాల నిర్వహణ జరిగేటట్లు ఉండాలి. సాధారణంగా పాలనా శాఖకు కార్యదర్శి ప్రధాన కార్యనిర్వాహకుడుగా వ్యవహరిస్తాడు. కార్యదర్శి హోదాలో ఉన్న ఐ.ఎ.ఎస్. కాడర్‌కు చెంది సీనియర్ అధికారికి విస్తృతమైన పాలన అనుభవం ఉంటుంది.

వింగ్ (Wing) : పాలనా శాఖకు పనిభారం ఎక్కువ. కాబట్టి విభజనను కోరడం సహజం. పని విభజన వల్ల కార్యకలాపాలు శీఘ్రగతిని నిర్వహింపబడి లక్ష్యసాధన తగిన సమయంలో జరుగుతుంది. పని స్వభావాన్ని, పనిభారాన్ని బట్టి వింగ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. సాధారణంగా అదనపు కార్యదర్శిగాని, సంయుక్త కార్యదర్శిగాని దీనికి అధికారిగా ఉంటాడు. విషయ పరిశీలన చేసి నిర్ణయం తీసుకొనే అధికారం ఇతనికి ఉంటుంది. కేవలం విధాన నిర్ణయానికి సంబంధించిన విషయాలను మాత్రం కార్యదర్శికి పంపించడం జరుగుతుంది.

డివిజన్ : వింగ్‌ను కొన్ని డివిజన్లుగా విభజించబడుతుంది. ప్రతి డివిజన్ ఒక ఉపకార్యదర్శి (డిప్యూటీ సెక్రటరీ) పాలన నియంత్రణలో పని చేస్తుంది.

బ్రాంచి : డివిజన్‌ను బ్రాంచీలుగా విభజించడం జరుగుతుంది. ప్రతి బ్రాంచి ఒక అండర్ సెక్రటరీ ఆధీనంలో పనిచేస్తుంది.

సెక్షన్ : సెక్షన్ అనేది డివిజన్ చివరి పాలన విభాగం. సెక్షన్ ఆఫీసర్ నియంత్రణలో ఉంటుంది.

అనుబంధ కార్యాలయాలు : ప్రభుత్వ నిర్ణయాల, విధానాల విషయంలో ఈ కార్యాలయాలు రెండు రకాల విధులను నిర్వహించవలసి ఉంటుంది. మొదటిది విధాన నిర్ణయాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సమాచారాన్ని సలహాలను అందించుట, రెండోది పాలనా శాఖల కార్యనిర్వహణలో దర్శకత్వాన్ని వహించుట.

అధీన కార్యాలయాలు : ప్రభుత్వ పరిపాలనా శాఖల విధాన నిర్ణయాలను ఈ కార్యాలయాలు కార్యరూపములో పెట్టును. విధాన అమలులో అధీన కార్యాలయాలు ప్రభుత్వానికి బాధ్యత వహించును.

## 6.4 మంత్రిత్వ శాఖలో వివిధ అధికారులు - వారి విధులు :

**1.** ప్రభుత్వ కార్యదర్శి - అధికారాలు - విధులు : భారత దేశ పాలనలో ప్రభుత్వ కార్యదర్శి చాల ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తాడు. పాలన నైపుణ్యం, అనుభవం కలవాడై శాశ్వత ఉద్యోగిగా పాలన శాఖకు సంబంధించిన సంపూర్ణ పరిజ్ఞానము, అవగాహనతో మంత్రికి తన సహాయ సహకారాలను అందిస్తాడు. 1. మంత్రికి ముఖ్య సలహాదారుడిగా విధాన రూపకల్పనలో పాలనలో సలహానిస్తాడు. 2. మంత్రిత్వ శాఖ నిర్వహణకు బాధ్యత వహిస్తాడు. 3. పార్లమెంటరీ కమిటీల ముందు తన మంత్రిత్వ శాఖకు బాధ్యత వహిస్తాడు. 4. తన మంత్రిత్వ శాఖ ఉద్యోగ బృందానికి అధికారిగా వ్యవహరిస్తాడు.

**2.** అదనపు కార్యదర్శి : పాలనా శాఖ పనిభారాన్ని బట్టి అదనపు కార్యదర్శిని నియమించటం జరుగుతుంది. ఇతనికి సహాయపడటానికి సంయుక్త కార్యదర్శిని కూడా నియమించటం జరుగుతుంది. విషయ ప్రాముఖ్యతను బట్టి కొన్ని విషయాలలో స్వయంగా మరికొన్ని విషయాలలో కార్యదర్శితో సంప్రదించి నిర్ణయాలు తీసుకునే అధికారం, సంయుక్త కార్యదర్శికి ఉంటుంది. మంత్రికి పంపే ప్రతి ఫైలు కార్యదర్శి ద్వారా పంపించాలి. శాఖకు కేటాయించిన విధుల నిర్వహణ జరపాలి.

**3.** ఉపకార్యదర్శి : ఇతని అజమాయిషీలో వుండే పరిపాలనా భాగాన్ని డివిజన్ అంటారు. పాలనా శాఖలో సాధారణ పరిపాలనా విషయాలను పరిశీలించి నిర్ణయాలను తీసుకునే అధికారము ఇతనిదే. విధాన నిర్ణయానికి సంబంధించిన విషయాలను మాత్రం కార్యదర్శికి పంపించటం జరుగుతుంది.

**4.** సెక్షన్ ఆఫీసర్ : కార్యకలాపాల నిర్వహణపై సెక్షన్ ఆఫీసర్ పర్యవేక్షణ జరుపుతాడు. సెక్షన్ ఆఫీసర్ ఆధీనములో పనిభారాన్ని బట్టి అనేకమంది అసిస్టెంట్‌లు పనిచేస్తారు. ప్రజల వద్ద నుండి, ప్రజావ్యవస్థలు, సంస్థల నుంచి వచ్చిన అర్జీలను (సమస్యలను అవసరాలను) పరిశీలించి అసిస్టెంట్‌లు తయారుచేసిన నోట్‌ను సెక్షన్ ఆఫీసరు పరిశీలించి విషయాలను వివరంగా తెల్పుకుంటాడు.

**5.** సీనియర్ అసిస్టెంట్ : విషయ పరిశీలనకు అవసరమైన నియమ, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు సేకరించి సాధారణ నోట్సును తయారుచేస్తాడు.

**6.** జూనియర్ అసిస్టెంట్స్ : వీరు పనిచేస్తున్న శాఖలకు సంబంధించిన రికార్డులను జాగ్రత్తపరుస్తూ ఉత్తర్వును జారీ చేస్తారు.

## 6.5 ప్రస్తుత పరిపాలనా శాఖల వ్యవస్థీకరణ మూల్యాంకనం :

భారతదేశ పాలనా యంత్రాంగం బ్రిటిష్ పాలనా పద్దతిన ఏర్పడి స్వాతంత్ర్యానంతరం కూడా మారిన పరిస్థితులను అవగాహన చేసుకుంటూ అనేక సవాళ్ళను ఎదుర్కొంటూ విజయవంతంగా పాలన నిర్వహిస్తుందనటంలో సందేహం లేదు. అంతమాత్రంచేత పాలనా వ్యవస్థీకరణలో లోపాలు లేవనటానికి వీలులేదు. కాబట్టి పాలనా సంస్కరణలు చేపట్టి వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచవలసి వుంది. ప్రస్తుతమున్న వ్యవస్థల మూల్యాంకనం చేసి సంస్కరించుటకు గాను అనేక కమీషన్లు, కమిటీలను, మన ప్రభుత్వము నియమించింది. ఇవి అమలులో వున్న వ్యవస్థ పాలనా తీరును పరిశీలించి వాటి అభిప్రాయాలను తెలియజేసినవి.

1. శ్రీ యన్. గోపాల స్వామి అయ్యంగార్ కమిటీ : శ్రీ యన్. గోపాలస్వామి అధ్యక్షతన 1949వ సంవత్సరము భారత ప్రభుత్వ వ్యవస్థీకరణను మూల్యాంకనం చేయడానికి ఏర్పడిన కమిటీ ఈ క్రింది సూచనలు చేసింది.

1. భారత ప్రభుత్వ శాఖలను 28 పాలనా శాఖలుగా, 37 ప్రాథమిక వ్యవస్థలుగా ఏర్పాటు చేసిన యెడల పాలనా సామర్థ్యం పెరుగుటకు అవకాశమున్నది.
2. మంత్రిత్వ శాఖలో సాంఘిక, ఆర్థిక బ్యూరోలను ఏర్పాటుచేయాలి. ఉదా : పారిశ్రామిక, వ్యాపార, రవాణా, కమ్యూనికేషన్ బ్యూరోలు.
3. వ్యవస్థ - పద్దతుల డివిజన్‌లు ఏర్పాటు చేయాలి.
4. పాలనా వ్యవస్థీకరణ మెరుగుపరచడానికి, ఆర్థిక నియంత్రణ వ్యవస్థ పద్ధతులు అమలుచేయాలి.

1950 వ సంవత్సరము ఎ.డి. గోర్వాలా అధ్యక్షతన ఏర్పడిన పాలనా సంస్కరణ కమిటీ పాలన సామర్థ్యం పెరుగుటకు త్వరితగతిన పనులు జరుగుటకు, బాధ్యతాయుతంగా పాలన నిర్వహించబడుటకు ఎన్నో సిఫార్సులు చేసింది. అందులో "సచివాలయం విధాన రూపకల్పన చేస్తుంది, సంచాలక కార్యాలయం ఆ విధానాన్ని అమలు చేస్తుంది. కాని సంచాలక కార్యాలయ కార్యకలాపాల్లో సచివాలయం నిరంతరం జోక్యం చేసుకోవడం వల్ల సంచాలక కార్యాలయ చొరవ సామర్థ్యం దెబ్బ తింటుంది" అనేది ముఖ్యమైన సూచన.

1952వ సంవత్సరం పాల్ హెచ్. ఆపిల్‌బి కమిటి భారతదేశ పాలనను సర్వే చేసి వ్యవస్థలో అనేక ప్రతిబంధకాలున్నాయని, అనేకచోట్ల జాప్యం జరుగుతుందని, తగిన పద్దతిలో మూల్యాంకనం జరగడం లేదని అభిప్రాయపడింది. పాల్ ఆపిల్ బీ చేసిన రెండు ప్రధాన సూచనలు 1. జాతీయ స్థాయిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌ను స్థాపించుట, 2. వ్యవస్థ - పద్దతుల డివిజన్ ఏర్పాటు. భారత ప్రభుత్వం ఈ రెండు సూచనలను త్వరగా అమలు చేసింది.

అంచనాల సంఘం కూడ పాలన వ్యవస్థను మెరుగుపరచడానికి 1. సంబంధిత విషయాలపై, ఒకే రకం విషయాలపై నియంత్రణ, సమన్వయం లేదా 2. సచివాలయం కేవలం విధాన రూపకల్పన విధులకే పరిమితం కావాలి. విధానాల అమలుకు అధీన వ్యవస్థలకు వదిలి వేయాలని సూచించింది.

పాలనా సంస్కరణల నిమిత్తము కేంద్ర ప్రభుత్వము 1966వ సంవత్సరము శ్రీ మొరార్జీదేశాయ్ అధ్యక్షతన పాలన సంస్కరణల సంఘాన్ని ఏర్పాటుచేసింది. ఇది 1. సచివాలయ పరిమాణం బాగా పెరిగిందని, నత్తనడక నడుస్తుందని, అనవసరపు పని పెరిగి ఉద్యోగుల సంఖ్య అనవసరంగా పెరిగి పనిలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపబడింది. 2. అధికార పరంపరలో ఎన్నో స్థాయిల ఉద్యోగులు పాలనా ప్రక్రియలో పాల్గొంటున్నారు. అందువలన గుమస్తాలు కూడా నిర్ణయీకరణ ప్రక్రియలో పాల్గొంటున్నారని యిది అంత వాంఛనీయం కాదని తెల్పింది.

చివరగా సచివాలయం, వ్యవస్థీకరణలోఎన్నో లోపాలున్నాయని అవి సరిదిద్దుకోవడానికి :

1. సచివాలయం స్థాయిలో అధిక అధికార కేంద్రీకరణ ఉంది, దానిని వికేంద్రీకరించాలి.
2. సచివాలయం విధాన రూపకల్పనకే పరిమితం కాక దైనందిన పాలనలో జోక్యం చేసుకొంటుంది. అది మానుకోవాలి..
3. సచివాలయం పాలనా జోక్యం సచివాలయ సంచాలక విధానాలకు కారణభూతమైంది. ఇది సాంకేతిక నిపుణులు, సాధారణ అధికారుల మధ్య వివాదంగా పెరిగింది.
4. నిర్ణయీకరణ ప్రక్రియలో గుమస్తా స్థాయి ఉద్యోగుల ప్రమేయం వుండకూడదు, మొదలగు వానిని సూచించింది.

పాలనా సంస్కరణ సంఘం చేసిన సిఫార్సులను కొన్నింటిని ప్రయత్నము అమలు చేయటం జరిగింది.

## 6.6 ముగింపు :

భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనా వ్యవస్థలు రాజకీయ తాత్కాలిక, శాశ్వత ప్రభుత్వ ఉద్యోగ బృందాలచే సమయానుకూలంగా సంస్కరణ సంఘాలు చేస్తున్న సూచనల మేరకు లోపాలను సరిదిద్దుకుంటూ నిర్వహించబడుచున్నవి.

## మాదిరి ప్రశ్నలు :

### వ్యాసరూప ప్రశ్నలు :

1. కేంద్ర ప్రభుత్వ పరిపాలనా విధానమును వివరించుము.
2. సచివాలయస్థాయిలో నిర్వహించబడు పాలనా విధానమును వివరించుము.
3. ఇప్పటివరకు కేంద్ర పాలనా సంస్కరణల నిమిత్తము ఏర్పాటు చేయబడిన సంస్కరణ సంఘాలను, వాటి సూచనలను తెల్పుము.

### లఘు వ్యాఖ్య ప్రశ్నలు :

1. శ్రీయన్. గోపాలస్వామి అయ్యంగార్ పాలనా సంస్కరణ కమిటీ
2. ఎ.డి. గోర్వాలా కమిటీ
3. పాల్ ఆపిల్‌బీ పాలనా సంస్కరణ కమిటీ

### కుశాగ్రబుద్ధి ప్రశ్నలు : ఒకటి రెండు వాక్యములలో జవాబులు వ్రాయుము

1. శ్రీ యన్. గోపాలస్వామి కమిటి
2. పాలనా సంస్కరణల కమిటీ
3. పాల్ ఆపిల్‌బీ పాలన సర్వే

### చదువదగిన గ్రంథాలు :

1. భారతదేశ పాలన : బి.ఎ. ద్వితీయ సంవత్సరం
2. భారతదేశ ప్రభుత్వం : రాజకీయాలు - బి.ఎ. ద్వితీయ సంవత్సరం, తెలుగు అకాడమీ
3. యమ్.పి. శర్మ : ప్రిన్సిపుల్స్ అండ్ థీరీ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్

రచయిత : **శ్రీమతి మెహ్రూన్నిసాబేగం**

పాఠం - 7

# మంత్రిత్వ శాఖల పాత్ర

విషయసూచిక

7.0 లక్ష్యం
7.1 ఉపోద్ఘాతం
7.2 దేశ వ్యవహారాల మంత్రిత్వశాఖ
7.3 రక్షణ శాఖ
7.4 విదేశీ వ్యవహారాల శాఖ
7.5 విత్త వ్యవహారాల శాఖ
7.6 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు

## 7.0 లక్ష్యం :

కేంద్ర ప్రభుత్వము యొక్క విధులు, బాధ్యతలు సంతృప్తికరముగా, సక్రమముగా నిర్వహించడానికి ఏర్పాటు చేసిన పాలన వ్యవస్థలోని పెద్ద ఉపభాగాలే మంత్రిత్వశాఖలు. ప్రస్తుతము కేంద్రపాలనా వ్యవస్థలో ఎన్నో మంత్రిత్వశాఖలు కలవు. అయినప్పటికి వాటిలో ప్రధానమైన దేశవ్యవహారాల శాఖ, రక్షణశాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, విత్త వ్యవహారాల మంత్రిత్వశాఖల వ్యవస్థీకరణను, వాటి విధులను వివరించుటయే ఈ పాఠము యొక్క ముఖ్య లక్ష్యము.

## 7.1 ఉపోద్ఘాతము :

కేంద్ర ప్రభుత్వ పాలనా వ్యవహారాలను వివిధ మంత్రిత్వ శాఖలుగా, వాటిని విభాగాలుగా విభజించే పద్ధతి ఈస్టిండియా కంపెనీ కాలంలోనే ప్రారంభమైనది. ఆ తరువాత 1958 సం॥లో భారత దేశపాలనా బాధ్యతలను బ్రిటిష్ రాజమకుటం ప్రత్యక్షముగా చేపట్టిన తరువాత కేంద్ర ప్రభుత్వ పాలనా బాధ్యతల నిర్వహణ గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలి సభ్యులకు కేటాయించుట జరిగినది. 1919 మాంటేంగు - ఛెమ్సుఫర్డు సంస్కరణల చట్టము ప్రకారము పాలనా వ్యవహారాలను కేంద్ర, రాష్ట్రాల మధ్య వేర్వేరుగా విభజించినారు. 1935 భారత ప్రభుత్వ చట్టము రాష్ట్రాల స్వయం పరిపాలన, తదనుగుణంగా సమాఖ్య వ్యవస్థను నెలకొల్పడానికి అవకాశము కలిగించింది. దేశానికి స్వాతంత్ర్యము వచ్చినప్పటి నుండి కేంద్ర పాలనా శాఖలను మంత్రిత్వ శాఖలని పిలుచుట ప్రారంభమైనది. నూతన రాజ్యాంగములోని 77వ నిబంధన ప్రకారము ఏ మంత్రిత్వ శాఖ ఏ వ్యవహారాలను నిర్వహించాలి అనే విషయాన్ని ప్రధానమంత్రి సలహానునసరించి రాష్ట్రపతి నిర్ణయిస్తాడు. ప్రస్తుతము మన కేంద్ర ప్రభుత్వములోని ముఖ్య శాఖలైన దేశ వ్యవహారాల మంత్రిత్వశాఖ, రక్షణశాఖ, విదేశీ వ్యవహారాలశాఖ, విత్త వ్యవహారాల శాఖల వ్యవస్థీకరణను, వాటి విధులను గురించి విపులంగా తెలుసుకుందాం.

## 7.2 దేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ :

కేంద్ర ప్రభుత్వ పాలనా వ్యవస్థలోని అనేక మంత్రిత్వ శాఖలలో దేశ వ్యవహారాల మంత్రిత్వశాఖ చాలా ప్రధానమైనది ఈ శాఖను ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో 1843వ సం॥లో మొట్టమొదటగా ఏర్పరచినారు. దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించే బాధ్యత ఈ శాఖదే. శాంతి భద్రతలను పరిరక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదయినప్పటికి ఆ విధిని నిర్వహించుటలో రాష్ట్రాలు కేంద్ర కార్యనిర్వహణాధికారానికి అనుగుణంగా వ్యవహరించవలసి ఉంటుంది. 1947వ సం॥లో దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత ఈ శాఖను ఆంతరంగిక వ్యవహారాల మంత్రిత్వశాఖగా నామకరణం చేసినారు.

### 7.2.1 వ్యవస్థీకరణ :

దేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రాజకీయ అధిపతిగా ఒక కాబినెట్ హోదా కలిగిన మంత్రి ఉంటాడు. అతనికి సహాయపడటానికి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమంది సహాయ మంత్రులు ఉంటారు. సాధారణంగా ఎంతో పరిపాలనానుభవము, ప్రధానికి సన్నిహితులైన వారికి మాత్రమే ఈ శాఖను అప్పగించుట జరుగుతుంది. ఎందుచేతనంటే, ఈ శాఖ యొక్క సామర్థ్యము పైనే దేశ సుస్థిరత ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఈ శాఖకు సంబంధించిన విధానాలను కాబినెట్ మంత్రి నిర్ణయించవలసి ఉంటుంది. అయితే అతి ముఖ్యమైన వ్యవహారాలను నిర్ణయించే బాధ్యత మాత్రము కేంద్ర మంత్రి వర్గానిదే. అదే విధంగా ప్రతి శాఖకు సచివాలయ పాలనాధిపతిగా ఒక కార్యదర్శి ఉంటాడు. ఇతడు మంత్రికి విధాన నిర్ణయంలోను, పాలనా నిర్వహణలోను ప్రధాన సలహాదారుగా ఉంటాడు. కార్యదర్శిగా తన విధి నిర్వహణలో సహాయ, సహకారాలందించుటకు ఎంతోమంది అధికారులు, అధీన సిబ్బంది ఉంటారు. వీరు శాఖ వ్యవస్థీకరణలో తమ భాగములోని విధులను సక్రమంగా నిర్వహించుచూ కార్యదర్శికి తోడ్పడతారు. ఈ శాఖ అధీనంలో 10 అనుబంధ కార్యాలయాలు, 6 అధీన కార్యాలయాలు, 3 సలహా సంఘాలు కలవు. ప్రతి మంత్రిత్వశాఖ కొన్ని విభాగాలు, బ్రాంచిలు, సెక్షన్‌లుగా విభాజితమై ఉంటుంది.

### 7.2.2 దేశవ్యవహారాల శాఖ విధులు :

దేశ వ్యవహారాల మంత్రిత్వశాఖ దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించటానికి రాష్ట్రాలకు కావలసిన సహాయన్నందజేయటంతోపాటు కేంద్రపాలిత ప్రాంతాల పాలన, షెడ్యూలు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులకు సంబంధించిన విషయాలు, కేంద్ర ప్రభుత్వాధీనంలోని ఉద్యోగి బృందాల ఎంపిక, నిర్వహణ, రాష్ట్రపతి ఆమోదము కొరకు పంపిన రాష్ట్రాల బిల్లులు మొదలగు విధులను నిర్వహిస్తూ ఉంటుంది. ఈ శాఖ నిర్వహించే ముఖ్య విధులను సంక్షిప్తముగా ఈ క్రింది విధముగా పేర్కొనవచ్చును.

### ఎ) కేంద్ర జాబితాలోని అంశాలు :

1. నూతన రాష్ట్రాల ఏర్పాటు, ప్రస్తుతము ఉన్న రాష్ట్రాల సరిహద్దులు మరియు వాటి పేర్ల మార్పులకు సంబంధించిన విషయాలు.
2. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతుల ఎన్నికలకు సంబంధించిన అధికారిక ప్రకటనలు చేయుట.
3. కేంద్ర మంత్రివర్గ సభ్యులు, సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు, గవర్నర్లు మొదలైన ఉన్నత పదవుల నియామకాలు, తొలగింపు, రాజీనామాలకు సంబంధించిన వ్యవహారాలు.
4. కేంద్ర రిజర్వు పోలీసు, సరిహద్దు భద్రతా దళం, మొ॥గు వాటికి సంబంధించిన వ్యవహారాలు.
5. కేంద్ర విజిలెన్స్ కమీషన్, అల్ప సంఖ్యాక వర్గాల కమీషన్, ఎన్నికల కమీషన్ వంటి సంస్థలకు సంబంధించిన వ్యవహారాలు.

6. రాష్ట్రపతి పరిశీలన, ఆమోదము కొరకు రాష్ట్రాల నుండి వచ్చిన బిల్లులకు సంబంధించిన వ్యవహారాలు.
7. జనాభా లెక్కల సేకరణ
8. పౌరసత్వానికి సంబంధించిన వ్యవహారాలు
9. జాతీయగీతం, జాతీయజెండా, జాతీయ పండుగలు మొ॥గు వాటికి సంబంధించిన విషయాలు.
10. మన దేశంలోనికి వచ్చే విదేశీయులకు వీసాలను మంజూరు చేసే వ్యవహారం.
11. ఉన్నత న్యాయస్థానాలు విధించిన శిక్షలకు సంబంధించి క్షమాభిక్ష లేదా శిక్ష మార్పిడికి సంబంధించిన వ్యవహారాలు
12. స్వదేశీ సంస్థానాలు, సంస్థానాధీశుల వ్యవహారాలు
13. అత్యవసర పరిస్థితులకు సంబంధించిన రాజ్యాంగ అంశాలు

**బి) కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన అంశాలు :**

1. కేంద్రపాలిత ప్రాంతాలలో శాంతి భద్రతల నిర్వహణ
2. న్యాయపాలన
3. కేంద్రపాలిత ప్రాంతాల ఉద్యోగి బృందాలు
4. కేంద్రపాలిత ప్రాంతాలలో కోర్టు ఫీజులు, స్టాంపు డ్యూటీలు మొ॥నవి.

**సి) ఉమ్మడి జాబితా అంశాలు :**

1. దేశచట్టాలు, నేర విచారణ ప్రక్రియలు
2. వార్తాపత్రికలు, పుస్తకాలు, ముద్రణాలయాలు
3. జనన మరణాల సమాచార సేకరణ
4. నిర్బంధంలో ఉన్న ఖైదీల అంతర్ రాష్ట్రీయ బదిలీ మొదలగునవి.

పైన చెప్పిన విధముగా దేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కేంద్రపాలనా వ్యవస్థలో వ్యవస్థీకరింపబడినది. నేడు ఈ శాఖకు ఒక కాబినెట్ మంత్రి సారధ్యము వహించుచున్నాడు. ఈ మంత్రికి సహాయము చేయడానికి ఒక స్టేట్ మంత్రి మరొక డిప్యూటి మంత్రి కూడా కలరు.

## 7.3 రక్షణ మంత్రిత్వ శాఖ :

ఈస్టిండియా కంపెనీ 1776 వ సం॥ స్థాపించిన మిలటరీ శాఖే ఈనాటి రక్షణ మంత్రిత్వశాఖకు ప్రధానమైన మూలము. ప్రారంభములో ఈ శాఖ యొక్క బాధ్యతలు చాలా పరిమితముగా ఉండేవి. 1833 ఛార్టరు చట్టపలితముగా ఈశాఖ సచివాలయంలో ఒక ప్రధానశాఖ కావడము జరిగినది. 1909వ సం॥లో ఈ శాఖ సైనికశాఖగా మారి ప్రధాన సైనికాధికారి ఆధిపత్యము క్రిందకు వచ్చినది. 1938 సం॥లో ఈ రక్షణశాఖ ఒక కాబినెట్ మంత్రి నిర్వహించే రక్షణ మంత్రిత్వశాఖగా మారినది. ఫలితంగా అంతవరకు ఒకేప్రధానాధికారి క్రింద ఉన్న సైనిక, నావిక, వైమానిక దళాలను వేర్వేరు ప్రధానాధికారుల క్రిందకు తీసుకొని రావడము జరిగినది. నూతన రాజ్యాంగము అమలులోనికి వచ్చిన తరువాత ఈ మూడు దళాలకు రాష్ట్రపతి సర్వోన్నతాధికారి అయినాడు. 1962వ సం॥లో రక్షణ ఉత్పత్తిశాఖ, 1965లో రక్షణ సరఫరాల శాఖలు ఈ శాఖలో భాగాలుగా ఏర్పడినాయి.

వ్యవస్థీకరణ :

రక్షణ మంత్రిత్వశాఖ ఒక కాబినెట్ మంత్రి ఆధీనంలో పనిచేస్తుంది. వీరికి సహాయంగా ఒక స్టేట్‌మంత్రి, డిప్యూటి మంత్రి కూడా ఉంటారు. దేశ రక్షణకు సంబంధించిన అంశాలు చాలా ప్రధానమైనవి కనుక వాటిపై విధాన నిర్ణయాలు చేయటానికి అనేక కమిటీలు కలవు. వాటిలో ప్రధానమంత్రి అధ్యక్షతన పనిచేసే 'రక్షణ కాబినెట్ కమిటీ' అతి ముఖ్యమైన విధాన నిర్ణయాలు చేస్తుంది. ఇతర శాఖలకు మాదిరిగానే ఈ శాఖకు కూడా సచివాలయంలో ఒక ప్రత్యేక భాగముంటుంది. ఈ శాఖకు పాలనాధిపతిగా ఒక కార్యదర్శి ఉంటాడు. అదే విధముగా ఈ శాఖయొక్క వ్యవస్థీకరణలో ప్రత్యేక కార్యదర్శి, అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, ఉపకార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, సెక్షన్ అధికారులు, ఇతర అధీన సిబ్బంది ఉంటారు. వీరు తమకు కేటాయించిన విధులను పై అధికారుల ఆజ్ఞలకు లోబడి నిర్వర్తిస్తారు. రక్షణ మంత్రిత్వశాఖ సచివాలయము 16 విభాగాలుగా విభజింపబడినది. ఈ శాఖ అనుబంధ కార్యాలయాలుగా మూడు రక్షణ ప్రధాన కార్యాలయాలు కలవు (అవి సైనిక, నావిక, వైమానిక కార్యాలయాలు). ఇవి తమ మంత్రిత్వ శాఖ నిర్ణయించిన విధానాల అమలుకు బాధ్యత వహించి అందుకవసరమైన కార్య నిర్వాహక ఆదేశాలను జారీచేస్తాయి. ఈ శాఖకు రెండు అధీన కార్యాలయాలు కలవు. అవి అంతర రక్షణ సేవాసంస్థలు, రక్షణ సంస్థలు. అంతేగాక ఈ శాఖ ఆధ్వర్యంలో అనేక పరిశ్రమలు కలవు. ఇవి రక్షణ శాఖల కవసరమైన సాధనాలను తయారుచేస్తాయి.

రక్షణ మంత్రిత్వ శాఖ విధులు :

1. భారతదేశ రక్షణ కవసరమైన కార్యకలాపాలను నిర్వహించుట.
2. త్రివిధ దళాలకవసరమైన సిబ్బంది ఎంపిక, వారి శిక్షణ, సంక్షేమమునకు సంబంధించిన వ్యవహారాలు చూచుట.
3. ప్రాదేశిక సైనిక వ్యవహారాలు
4. జాతీయ సైనిక దళము (యన్.సి.సి.), ఉపసైనిక దళము (ఎ.సి.సి.) నకు సంబంధించిన వ్యవహారాలు
5. సైనిక కంటోన్మెంటుల ఏర్పాటు, వాటి నిర్వహణ
6. రక్షణావసరాలకు అవసరమైన భూముల సేకరణ మరియు వాటి నిర్వహణ
7. రక్షణ సామాగ్రి ఉత్పత్తి కార్యకలాపములు
8. నౌకా చార్టుల తయారీ
9. మాజీ సైనికుల, నావికుల, వైమానికులకు సంబంధించిన వ్యవహారాలు
10. శాస్త్ర, సాంకేతిక పరిశోధనా ఫలితాలను రక్షణశాఖ కన్వయించుట మొదలగునవి

పైన చెప్పిన విధముగా రక్షణ మంత్రిత్వ శాఖ వ్యవస్థీకరణ కలిగి యుండి దేశ రక్షణకు అత్యంత జాగూకతతో తన విధులను నిర్వహించుచున్నది. అందుచేతనే దేశ రక్షణకు సంబంధించిన సమస్యల పట్ల రక్షణ మంత్రితో పాటు ప్రధానమంత్రి కూడా అత్యంత శ్రద్ధను కనపరచుట జరుగుచున్నది.

## 7.4 విదేశీ వ్యవహారాల శాఖ :

ఈస్టిండియా కంపెనీ మనదేశానికి పాలక వర్గముగా ఉన్నప్పుడు 1783 సం॥లో రహస్యశాఖలో ఒక బ్రాంచిగా విదేశీశాఖ ఏర్పడినది. 1914వ సం॥లో ఈ శాఖను విదేశ రాజకీయశాఖగా మార్చారు. 1937వ సం॥లో ఈ శాఖ విదేశాంగ వ్యవహారాల శాఖగా రూపొందినది. 1947వ సం॥లో ఈ శాఖను విదేశ వ్యవహారాలు, కామన్‌వెల్త్ సంబంధాల శాఖగా రూపొందించినారు. 1949వ సం॥ నుండి ఈ శాఖను విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖగా పిలుచుచున్నారు.

## వ్యవస్థీకరణ :

సాధారణంగా ఈ శాఖ ఒక కాబినెట్ మంత్రి అధీనంలో ఉంటుంది. ఒక సహాయమంత్రి కూడా ఉండవచ్చు. అయితే విదేశ వ్యవహారాలకున్నటువంటి ప్రాధాన్యతను బట్టి కీలకమైన విధాన నిర్ణయాలు చేయడానికి, వాటిని పర్యవేక్షణ చేయడానికి ప్రధానమంత్రి అధ్యక్షతన ఒక ప్రత్యేక భాగముంటుంది. దీనికి పాలనాధిపతిగా ఒక కార్యదర్శి ఉంటాడు. ఇతని తరువాత శాఖలోని అధికార పరంపరలో అనేకమంది అధికారులు, ఇతర సిబ్బంది ఉంటారు. వీరు శాఖలో తమకు కేటాయించిన విధులను పై అధికారుల ఆజ్ఞలకు లోబడినిర్వర్తిస్తారు. ఈ శాఖ యొక్క కార్యదర్శి రాజకీయాధిపతియైన మంత్రికి విధాన నిర్ణయంలో ప్రధాన సలహాదారుగా, సహాయకుడుగా ఉంటాడు. ఒక్క మాటలో చెప్పాలంటే శాఖయొక్క సక్రమ వ్యవస్థీకరణకు, సామర్థ్యానికి కార్యదర్శిదే ప్రధాన బాధ్యత. సచివాలయములోని ఈ మంత్రిత్వ శాఖలో 19 విభాగాలు కలవు. అయితే వీటిలో 9 ప్రాంతీయ విభాగాలు కలవు. ఒక్కొక్క ప్రాంతీయ విభాగము కొన్ని దేశాల వ్యవహారాలను చూస్తుంది. ఈ శాఖకు అనుబంధ కార్యాలయాలు లేవు. కేవలము రెండు అధీన కార్యాలయాలు మాత్రమే గలవు. అవి :

1. కేంద్ర పాస్‌పోర్టు, ఇమిగ్రేషన్ సంస్థ, న్యూఢిల్లీ
2. విదేశీ వ్యవహారాల వసతి గృహము

అంతేగాక మన దేశానికి సంబంధించిన రాయబార, ఇతర దౌత్యకార్యాలయాలు ప్రపంచములోని దాదాపు అన్ని దేశాలోను కలవు.

## విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ విధులు :

1. విదేశాంగ విధానమును నిర్ణయించుట
2. కామన్‌వెల్తు దేశాలు మరియు ఇతర దేశాలతో సంబంధాలు
3. పాస్‌పోర్టులు, వీసాలు మంజూరు
4. భారతదేశం నుండి ఇతర దేశాలకు నేరస్తులు మరియు నేరారోపణ కలవారిని అప్పగించుట. అదే విధంగా విదేశాలలో ఉండే నేరస్థులను రప్పించుట
5. మన దేశంలోని విదేశీ రాయబారుల మరియు ఇతర దౌత్య ఉద్యోగులకు సంబంధించిన విషయాలు.
6. ఐక్యరాజ్యసమితి మరియు దాని ప్రత్యేక సంస్థల అంతర్జాతీయ సమావేశాలలో భారతదేశ ప్రాతినిధ్యానికి సంబంధించిన ఏర్పాట్లు
7. దౌత్య కార్య కలాపములు నిర్వహణ
8. ఇతర దేశాల రాజ్యాధినేతలు, ప్రభుత్వాధినేతలు, ఇతర నాయకులు మన దేశానికి వచ్చినప్పుడు వారికి స్వాగతం, విడిది మొదలగు ఏర్పాట్లు చూచుట
9. విదేశాలతో రాజకీయ ఒప్పందాలు, ఒడంబడికలకు సంబంధించిన విషయాలు.
10. విదేశాలలోని భారతీయుల యోగక్షేమాలను గురించి విచారించుట
11. యుద్ధ ప్రకటన, విరమణలకు సంబంధించిన విషయాలు
12. సరిహద్దు సంఘటనలు, సరిహద్దు నిర్ణయానికి సంబంధించిన విషయాలు
13. ముస్లిం యాత్రికులు విదేశాలలోని పవిత్ర స్థలాలకు వెళ్ళడానికి తగిన ఏర్పాట్లు చేయుట
14. భూమి, సముద్రము, ఆకాశ ప్రాంతాలలో మన ప్రాదేశిక హక్కులకు సంబంధించిన విషయాలు చూచుట
15. ఇండియన్ ఫారిన్ సర్వీసు (ఐ.యఫ్.యస్) కు సంబంధించిన విషయాలు చూచుట మొదలగునవి.

పైన చెప్పిన విధముగా విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన విధులను నిర్వహించుచూ శాంతియుత సహజీవనానికి, ప్రపంచశాంతికి దోహదము చేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ రూపొందించిన విదేశాంగ విధానాన్ని శక్తివంచన లేకుండా అమలు చేస్తున్నది.

## 7.5 విత్త వ్యవహారాల మంత్రిత్వశాఖ :

కేంద్రములోని వివిధ మంత్రిత్వ శాఖలలో ఆర్థిక మంత్రిత్వ శాఖ చాలా కీలకమైనది. ఈ శాఖకు ఎంతో సుదీర్ఘమైన చరిత్ర కలదు. 1810 సం॥లో పబ్లిక్ డిపార్ట్‌మెంటు నుంచి ఒక ప్రత్యేకమైన ఆర్థిక శాఖను ఏర్పాటు చేయడంతో ప్రస్తుతమున్న ఆర్థిక మంత్రిత్వశాఖకు పునాదులు వేయటము జరిగినది. 1879వ సం॥లో ఈ శాఖ పరిధిని వ్యవసాయ, రెవిన్యూ, వాణిజ్య శాఖల కార్యకలాపములకు కూడా విస్తరించుట జరిగినది. ఈ తరువాత 1947లో మన దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత ఆర్థికశాఖ ఆర్థికమంత్రిత్వశాఖగా రూపాంతరము చెందినది. అప్పటినుండి ఈ శాఖ ఒక కాబినెట్ హోదా కలిగిన మంత్రి ఆధ్వర్యంలో ఉంటున్నది. ఇతనికి తన విధి నిర్వహణలో సహాయ సహకారాలందించుటలో ఒక స్టేట్ మంత్రి మరియు ఒక డిప్యూటీ మంత్రి ఉంటారు. ఈ శాఖకు అనుబంధముగా అనేక అధీన కార్యాలయాలు, సంబద్ధ కార్యాలయాలు, సలహా సంఘాలు పని చేస్తున్నాయి.

### వ్యవస్థీకరణ మరియు విధులు :

ప్రస్తుతము ఆర్థిక మంత్రిత్వ శాఖ నాలుగు ముఖ్య శాఖలతో కొనసాగుతున్నది. అవి 1. రెవిన్యూ భీమాశాఖ, 2. ఖర్చు శాఖ, 3. ఆర్థిక వ్యవహారాల శాఖ, 4. బాంకింగ్ వ్యవహారాల శాఖ. వీటిని గురించి సంక్షిప్తముగా తెలుసుకుందాము.

### 1. రెవిన్యూ, భీమా శాఖ :

ఈ శాఖ ఆదాయపు పన్నులకు సంబంధించిన వ్యవహారాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎక్సైజు పాలన, నల్లమందు తయారీ, అమ్మకము, కస్టమ్స్ వ్యవహారాలు, అమ్మకపు పన్ను, స్టాంపుల సరఫరా, ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన విషయాలు చూస్తుంది. ఈ శాఖ ప్రత్యేకంగా ఒక కార్యదర్శి ఆధ్వర్యంలో ఉంటుంది. ఈ శాఖ ఆధీనంలో అనేక సంబంధ, అధీన కార్యాలయాలు కలవు.

### 2. ఖర్చు శాఖ :

ఈ శాఖకు కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రణ చేయటంతో పాటు విత్తపాలనకు సంబంధించిన అనేక విషయాలతో సంబంధమున్నది. ఆర్థిక నియమాలు, స్థానిక పన్నులు, అకౌంటింగ్, ఆడిటింగ్ మొదలగు విషయాలన్నీ ఈ శాఖ పరిధి క్రిందకు వస్తాయి. ఈ శాఖకు అనుబంధ కార్యాలయములు గానీ, అధీన కార్యాలయాలు గాని లేవు. ఈ శాఖకు విషయ సౌలభ్యము కొరకు 7 భాగములుగా విభజించినారు.

### 3. ఆర్థిక వ్యవహారాల శాఖ :

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తయారీకి సంబంధించిన వ్యవహారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే ఋణాల సేకరణ, ఆర్థిక కమీషన్, విదేశ మారక ద్రవ్యము, విదేశాల నుంచి ఆర్థిక సహాయము, కరెన్సీ, నాణెముల ముద్రణ, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన విషయాలను చూస్తుంది. ఈ శాఖకు అనుబంధంగా ఒక సంబద్ధ కార్యాలయము, కొన్ని అనుబంధ కార్యాలయాలు, కొన్ని ప్రభుత్వ ఉపక్రమాలు, కొన్ని సలహా సంఘాలు కలవు.

4. బ్యాంకింగ్ వ్యవహారాల శాఖ :

1968వ సం॥ వరకు ఆర్థిక మంత్రిత్వశాఖ పైన చెప్పిన మూడు శాఖలతో కూడుకొని ఉండేది. కానీ 1969వ సం॥లో 14 బ్యాంకులను జాతీయము చేయటంతో ఈ శాఖను ప్రత్యేకముగా ఏర్పాటు చేయుట జరిగినది. ఈ శాఖ జాతీయము చేయబడిన బ్యాంకుల వ్యవహారాలతో పాటు భారతదేశంలోని విదేశీ బ్యాంకుల వ్యవహారాలు, రిజర్వుబ్యాంకు, చిట్‌ఫండ్ కంపెనీలు మొ॥ వాటికి సంబంధించిన విషయాలను చూస్తుంది.

పైన చెప్పిన విధముగా విత్త వ్యవహారాలను నియంత్రణ చేయుటలో విత్త వ్యవహారాల మంత్రిత్వ శాఖ చాలా కీలకమైన పాత్ర వహిస్తుంది. అంతేగాక బడ్జెట్ తయారుచేసే సమయంలోగాని, దానిని అమలు జరిపే సమయంలో గానీ ఆర్థిక మంత్రిత్వశాఖ చాలా ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తుంది. అదే విధముగా ద్రవ్య సరఫరా, పరపతి, ధరలు, ఎగుమతి దిగుమతులు, పొదుపు, పెట్టుబడి, జాతీయాదాయము మొదలగు వాటిని క్రమబద్ధము చేసి పరిపాలనా నిర్వహణతోపాటు, ఆర్థికాభివృద్ధిని సాధించటంలో కేంద్ర విత్త వ్యవహారాల మంత్రిత్వశాఖ చాలా కీలకమైన పాత్ర వహిస్తున్నదని చెప్పవచ్చును.

## 7.6 ముగింపు :

ఈ విధముగా కేంద్రములోని ప్రధాన మంత్రిత్వ శాఖలైన దేశ వ్యవహారాల శాఖ, రక్షణశాఖ, విదేశ వ్యవహారాల శాఖ తమ విధులను సంతృప్తికరముగా నిర్వహించుచూ దేశ సుస్థిరతకు, రక్షణకు, శాంతియుత సహజీవనానికి,ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

## మాదిరి ప్రశ్నలు :

### లఘువ్యాస ప్రశ్నలు :

1. దేశవ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్మాణమును, విధులను గురించి వ్రాయుము.
2. రక్షణ మంత్రిత్వ శాఖ వ్యవస్థీకరణ, విధులను గురించి వ్రాయుము.
3. విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్మాణమును, విధులను గురించి వ్రాయుము.
4. ఆర్థిక మంత్రిత్వశాఖ నిర్మాణమును, విధులను గురించి వ్రాయుము.

### కుశాగ్రబుద్ధి ప్రశ్నలు :

1. ఆంతరంగిక వ్యవహారాల శాఖ
2. సైనిక శాఖ
3. రక్షణశాఖ
4. విదేశ వ్యవహారాల శాఖ
5. విత్త వ్యవహారాల శాఖ
6. ఆర్థిక శాఖ

### చదువదగిన గ్రంథాలు :


1. యస్.ఆర్. మహేశ్వరి - ఇండియన్ అడ్మినిస్ట్రేషన్
2. పి. సత్యనారాయణ & బి. జగదీశ్వరరావు - భారతదేశ పాలనా వ్యవస్థ (తెలుగు అకాడమీ)
3. యస్.కె. ఛటర్జి - ఇండియన్ అడ్మినిస్ట్రేషన్


రచయిత : నీలకంఠం వెంకటేశ్వర్లు

పాఠం - 8

# మంత్రి మండలి సచివాలయ పాత్ర

విషయసూచిక

8.0 లక్ష్యము
8.1 ఉపోద్ఘాతం
8.2 మంత్రిమండలి సచివాలయ వ్యవస్థీకరణ
8.3 మంత్రిమండలి సచివాలయ విధులు
8.4 మంత్రిమండలి కార్యదర్శి
8.5 ప్రధానమంత్రి సచివాలయము
8.6 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు

## 8.0 లక్ష్యము :

కేంద్ర మంత్రిమండలికి, దాని కమిటీలకు తమ విధి నిర్వహణలో మంత్రి మండలి సచివాలయము ఎటువంటి సహాయ సహకారాలందజేస్తుందో, ఏ విధముగా ఈ సచివాలయము మరియు ప్రధానమంత్రి సచివాలయము పరిణామము చెందినదో వివరించుటయే ఈ పాఠము యొక్క ముఖ్య లక్ష్యము.

## 8.1 ఉపోద్ఘాతము :

పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాలలో ప్రధానమంత్రి అధిపతిగా ఉండే మంత్రిమండలి వాస్తవ కార్యనిర్వాహక వర్గముగా పనిచేస్తుంది. ఆధునిక కాలంలో కేంద్ర కాబినెట్ మరియు ప్రధానమంత్రి నిర్వహించే విధులు విస్తృతంగా పెరిగినందువలన వారికి సహాయ సహకారాలందించి తోడ్పడేందుకు ఒక ప్రత్యేక స్టాఫ్ ఏజన్సీని ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను గుర్తించటము జరిగినది. ఇందుకుగాను ఏర్పడినటువంటిదే మంత్రిమండలి సచివాలయము. మంత్రిమండలి సచివాలయాన్ని మన దేశానికి స్వాతంత్ర్యము రాక పూర్వము ఉన్నటువంటి వైస్రాయ్ యొక్క కార్యనిర్వాహక మండలి సచివాలయముతో పోల్చవచ్చును. 1861వ సం॥లో చేసిన భారతీయ మండలుల చట్టము కేంద్ర పాలనా బాధ్యతలను గవర్నరు జనరల్ కార్యనిర్వాహక మండలి సభ్యులకు పంపిణీ చేయుటను క్రమబద్ధము చేసినది. ఈ కార్యనిర్వాహక మండలికి సహాయ సహకారాలందించడానికి ఒక ప్రత్యేక సచివాలయాన్ని ఏర్పాటు చేసినారు. దీనికి గవర్నరు జనరల్ ఆంతరంగిక కార్యదర్శి అధిపతిగా ఉండేవాడు. కానీ ఇతడు కార్యనిర్వాహక మండలి సమావేశాలకు హాజరయ్యేవాడు కాదు. కానీ 1935 భారత ప్రభుత్వ చట్టము తరువాత వైస్రాయ్‌కి సహాయపడడానికి వైస్రాయ్ ఆంతరంగిక కార్యదర్శి కార్యనిర్వాహక మండలి సమావేశాలకు హాజరవుతూ ఉండేవాడు.

ఇదే సమయంలో వైస్రాయ్ ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేస్తున్న వ్యక్తిని ప్రావిన్షియల్ గవర్నరుగా నియమించటంతో వైస్రాయ్ ఆంతరంగిక కార్యదర్శి పదవి, కార్యనిర్వాహక మండలి కార్యదర్శి పదవులను రెండింటిని వేరు చేసి వాటిని వేర్వేరు

వ్యక్తులకు అప్పగించుట జరిగినది. ఆ తరువాత 1946వ సం॥లో జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వాన కేంద్రంలో తాత్కాలిక ప్రభుత్వము ఏర్పడినపుడు కార్యదర్శిగా పిలువబడినాడు. ఇతని యొక్క కార్యాలయమే మంత్రిమండలి సచివాలయముగా (Cabinet Secretariat) పిలువబడుచున్నది. మన దేశంలో మొట్టమొదటి మంత్రిమండలి కార్యదర్శి యన్.ఆర్.పిళ్ళై.

## 8.2 మంత్రిమండలి సచివాలయ వ్యవస్థీకరణ :

మంత్రిమండలి సచివాలయానికి రాజకీయ అధిపతి ప్రధానమంత్రి. కాగా మంత్రిమండలి కార్యదర్శి దీనికి పాలనాధిపతిగా ఉంటాడు. అయితే మంత్రిమండలి సచివాలయము ప్రధానమంత్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేస్తున్నది. దీని యొక్క నిర్మాణము, విధులు ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితుల కనుగుణంగా మార్పులు చెందుతూ ఉంటాయి. ఉదా : 1970 మే వరకు ఈ సచివాలయము 1. మంత్రి మండలి వ్యవహారాల శాఖ 2. గణాంశ శాఖలతో కూడుకొని ఉండేది. 1970 జూన్‌లో ఈ సచివాలయాన్ని తిరిగి పునర్వ్యవస్థీకరించుట జరిగినది. ఫలితంగా ఇది 5 శాఖలుగా విభజింపబడినది. ఈ తరువత 1973వ సం॥లో చేసిన మార్పుల వలన ఈ సచివాలయంలో కొన్ని ఇతర మంత్రిత్వ శాఖలకు మార్చడం జరిగినది. కానీ ఇటీవల కాలంలో ప్రధానమంత్రి సచివాలయము యొక్క ప్రాముఖ్యత పెరుగుతూ ఉండటంతో దీని యొక్క ప్రాముఖ్యత చాలావరకు తగ్గినదని చెప్పవచ్చును. అంతేకాక చాలా కాలము నుంచి మంత్రిమండలి సచివాలయములో అంతర్భాగముగా వున్న గణాంకశాఖను, ఉద్యోగి బృంద, పరిపాలనా సంస్కరణల శాఖలను ఈ సచివాలయ పరిధి నుండి తొలగించినారు. ఫలితంగా ప్రస్తుతము మంత్రిమండలి సచివాలయములో ఒకే ఒక శాఖ ఉన్నది. అదే మంత్రిమండలి వ్యవహారాల శాఖ. దీనికి పాలనా అధిపతిగా కాబినేట్ కార్యదర్శి ఉంటాడు. ఇతనికి సహాయ సహకారాలందించటానికి మరొక కార్యదర్శి (సమన్వయం), కార్యదర్శి స్థాయికి చెందిన నలుగురు అధికారులు, ఒక అదనపు కార్యదర్శి, 5 గురు సంయుక్త కార్యదర్శులున్నారు. మంత్రిమండలి వ్యవహారాల శాఖను గురించి విపులంగా చర్చించుదాము.

మంత్రిమండలి వ్యవహారాల శాఖ : ఈ శాఖలో నాలుగు విభాగములు కలవు. అవి

1) ప్రధాన సివిల్ సచివాలయము 2) ఆర్థిక విభాగము 3) మిలటరీ విభాగము 4) గూఢచారి విభాగము.

1. ప్రధాన సివిల్ సచివాలయము : ఈ విభాగములో నాలుగు బ్రాంచిలు కలవు. అవి : 1. కాబినెట్ బ్రాంచి 2. పాలనా బ్రాంచి 3. సాధారణ బ్రాంచి 4. సమన్వయ బ్రాంచి. ఒక్కొక్క బ్రాంచికి అధిపతిగా ఒక్కొక్క డిప్యూటీ సెక్రటరీ ఉంటాడు. అన్ని బ్రాంచిలకు అధిపతిగా ఒక అదనపు కార్యదర్శి ఉంటాడు. ఒక్కొక్క బ్రాంచి ఒక్కొక్క రకమైన విధికి బాధ్యత వహిస్తుంది. ఉదా : కాబినేట్ బ్రాంచి కాబినేట్‌లో చర్చించవలసిన విషయాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తుంది. పాలనా బ్రాంచి ఉద్యోగ బృంద వ్యవహారాలను, వ్యవస్థీకరణకు సంబంధించిన వ్యవహారాలను చూస్తుంది. మంత్రిత్వశాఖల కార్యకలాపాలన్నింటిని సమన్వయము చేసే బాధ్యత సమన్వయ బ్రాంచిది. ఈ విధముగా ప్రధాన సివిల్ సచివాలయములోని వివిధ బ్రాంచిలు తమ కార్యకలాపములను నిర్వహిస్తాయి.
2. ఆర్థిక విభాగము : ఈ విభాగము ఉత్పత్తి, పంపిణీల కమిటీ, సరఫరాల కమిటీ మొ॥ అనేక కమిటీలకు కార్యనిర్వాహక సహాయాన్ని అందజేస్తుంది. దీనికి అధిపతిగా ఒక సంయుక్త కార్యదర్శి ఉంటాడు.
3. మిలటరీ విభాగము : ఈ విభాగము రక్షణ మంత్రి కమిటి, త్రివిధ దళాధిపతుల కమిటి, సంయుక్త ప్రణాళికా కమిటి, సంయుక్త గూఢాచారుల కమిటీలకు సంబంధించిన కార్యనిర్వాహక కార్యకలాపాలను చూస్తుంది. ఈ విభాగమునకు ఒక సంయుక్త కార్యదర్శి అధిపతిగా ఉంటాడు.

4. గూఢచారి విభాగము : దేశంలోని వివిధ ప్రాంతాల నుండి సేకరించిన సమాచారమును మదింపు చేయడం మరియు వివిధ గూఢచారి సంస్థల కార్యకలాపాల సమన్వయము, ప్రభుత్వము సమర్ధవంతముగా పనిచేసేటట్లు చూచుట ఈ విభాగము యొక్క ముఖ్య విధి.

## 8.3 మంత్రిమండలి సచివాలయ విధులు :

మంత్రిమండలి సచివాలయము ఈ క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

1. కేంద్ర మంత్రివర్గ మరియు వాటి కమిటీల సమావేశ పట్టికలను తయారుచేసి, సమావేశాలలో జరిగే చర్చల సరళిని, నిర్ణయాలను నమోదు చేయుట
2. కాబినేట్ తీసుకున్న నిర్ణయాలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు తెలియజేసి వాటిని అమలుపరిచేటట్లు చూచుట
3. వివిధ మంత్రిత్వ శాఖల కార్యకలాపముల గురించి రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి నివేదికల రూపంలో తెలియజేయుట
4. రక్షణ కాబినేట్ కమిటి, ఆంతరంగిక వ్యవహారాల కాబినెట్ కమిటి, ఆర్థిక వ్యవహారాల కాబినేట్ కమిటి విదేశీ వ్యవహారాల కాబినేట్ కమిటి, నియామకాల కాబినేట్ కమిటి, మంత్రిత్వ శాఖల కార్యదర్శుల స్థాయీ కమిటీలు మొ॥ వాటి సమావేశలకవసరమైన సచివాలయ సహాయాన్ని అందచేయుట
5. కేంద్ర ప్రభుత్వము విచారణ సంఘాలను నియమించే ప్రతిపాదనలను, వాటి నివేదికలను పరిశీలించుట
6. సివిల్, మిలటరీ, గూఢచారి విభాగముల మధ్య సమన్వయము చేకూర్చుట
7. విదేశాలతో సంధులు, ఒడంబడికలు కుదుర్చుకొనుటకు సంబంధించిన వ్యవహారాలను పరిశీలించుట
8. పార్లమెంటు సమావేశాలు ఎప్పుడు ఎలా జరగాలి అనే విషయమునకు సంబంధించి, వాయిదా వేయడం, లోక్‌సభను రద్దుచేసే విషయాలను గురించి కాబినెట్ ముందుచుట
9. పార్లమెంటులోని ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి చేయవలసి ప్రసంగమును గురించి కాబినెట్‌తో చర్చించుట
10. భారత ప్రభుత్వంచే ప్రాసిక్యూషన్ కేసుల ఉపసంహరణ మొ॥నవి.
11. ప్రభుత్వ కార్యకలాపాల సక్రమ నిర్వహణ కవసరమైన నియమాలు రూపొందించుట
12. వివిధ కేంద్ర మంత్రిత్వశాఖలు నిర్వహించే కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమైన సమావేశాలను సమన్వయము చేయుట మొ॥నవి.

## 8.4 మంత్రి మండలి కార్యదర్శి :

మంత్రిమండలి కార్యదర్శి మంత్రిమండలి సచివాలయానికి అధిపతి. మంత్రిమండలి కార్యదర్శి పదవి 1950వ సం॥లో సృష్టించబడింది. సాధారణముగా ప్రభుత్వములోని అతి సీనియర్ ఐ.ఎ.యస్. అధికారినే ఈ పదవిలో నియమించటము జరుగుతుంది. ఇతనికి ఒక నిర్ణీత పదవి కాలము లేదు. ఈ అధికారి సర్వీసు కాలము పూర్తయిన తరువాత అతని యొక్క స్థానంలో వేరొకరిని నియమించటము జరుగుతుంది. సాధారణంగా సర్వీసు నుండి త్వరలో పదవీవిరమణ గావించేవారు ఈ పదవిలోకి రావటము జరుగుతుంది.

మంత్రిమండలి కార్యదర్శి ప్రధానమంత్రి పర్యవేక్షణలో పనిచేస్తూ ప్రధానమంత్రి కార్యదర్శిగా వ్యవహరిస్తాడు. కాబినేట్ సమావేశాలు జరిగేటపుడు ప్రధానమంత్రి దగ్గరే కూర్చుని అతనికవసరమైన సహాయ సహకారాలందజేస్తాడు. మంత్రులను

నియమించే విషయంలోను, వారి రాజీనామాలకు సంబంధించిన విషయాలలోను, ప్రధానమంత్రికి సంబంధించిన అనేక ఇతర విషయాలలోను ఇతడు తన సహాయసహకారాలందచేస్తాడు. కాబినేట్ మరియు కాబినేట్ సంఘాల సమావేశాల కవసరమైన ఎజెండాను తయారుచేసి వాటిని ప్రధానమంత్రి మరియు సంఘాల అధ్యక్షుల అంగీకారానికి తెలియజేస్తాడు. అంతేగాక కాబినేట్ మరియు దాని సంఘాల సమావేశాలకు హాజరై, సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను రికార్డు చేసుకొని, అవి ప్రధానమంత్రి అంగీకారము పొందిన తరువాత వాటిని సంబంధిత మంత్రిత్వ శాఖలకు, కార్యదర్శులకు పంపుతాడు.

మంత్రిమండలి కార్యదర్శికి వివిధ మంత్రిత్వశాఖల మీద మరియు ఇతర శాఖల మీద ప్రత్యక్ష పర్యవేక్షణాధికారాలు లేనప్పటికి మంత్రులతోను, కార్యదర్శులతోను మంచి సంబంధాలు పెట్టుకొని వారి మధ్య సత్సంబంధాలు నెలకొనేటట్లు చూస్తాడు. అంతేగాక మంత్రిమండలి కార్యదర్శి దేశంలోని ఉద్యోగి బృందంలో సీనియర్ అధికారి కావున అతడు మొత్తము ఉద్యోగి బృందానికి అధిపతిగా వ్యవహరిస్తాడు. అవసరమైనప్పుడు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల సమావేశ ములను ఏర్పాటుచేసి వాటికి అధ్యక్షత వహిస్తాడు. అంతేగాక ఇతడు కేంద్ర ప్రతిష్ఠాపన బోర్డుకు అధ్యక్షుడుగా కూడా వ్యవహరిస్తాడు. వివిధ శాఖాధిపతులు తమకేమైనా శాఖాపరమైన ఇబ్బందులున్నట్లయితే వారు మంత్రిమండలి కార్యదర్శి వద్దకు వెళ్ళి తగినటువంటి సలహాలను పొందుతారు. సంక్షిప్తముగా చెప్పవలెనంటే ఇతడు శాఖలకు ఒక స్నేహితునిగా, తత్వవేత్తగా, మార్గదర్శకునిగా ఉపయోగపడతాడు. అందుచేతనే ఎంతో ప్రతిభ, చొరవ, శక్తి సామర్థ్యాలు, లౌక్యము కలిగిన వ్యక్తులను మాత్రమే ఈ పదవిలో నియమించటము జరుగుతుంది. అందుచేతనే యస్.ఆర్.మహేశ్వరి అనే రచయిత 'మంత్రిమండలి యొక్క సామర్థ్యము సచివాలయము అందించే సహాయ సహకారాలపైన, ముఖ్యంగా దాని కార్యదర్శి యొక్క సామర్థ్యము పైన ఎంతైనా ఆధారపడి ఉంటుందని' అభిప్రాయపడినాడు. ఈ విధంగా కాబినేట్ కార్యదర్శి విధానాల రూపకల్పనలోనూ, వాటి ఆచరణలోనూ క్రియాశీలకమైన పాత్రను నిర్వహిస్తాడు.

## 8.5 ప్రధానమంత్రి సచివాలయము :

కేంద్ర మంత్రిమండలికి తన విధి నిర్వహణలో సహాయ సహకారాలందించటానికి మంత్రిమండలి సచివాలయము ఏర్పడినది. అయినప్పటికి ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాలలో ప్రధానమంత్రి యొక్క బాధ్యతలు అనూహ్యముగా పెరిగినాయి. అందువలన అతనికి తన విధుల నిర్వహణలో సంస్థాగత సహాయము ఎంతైనా అవసరము. ఇందుకు ఉద్దేశించినటువంటిదే ప్రధానమంత్రి సచివాలయము. ఈ సచివాలయము ప్రధానమంత్రికి అనేక విధాలుగా సహాయము చేసి అతడు తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించేటట్లు చూసి అతని యొక్క విలువైన సమయాన్ని వృధా కాకుండా చూస్తుంది.

మన దేశానికి స్వాతంత్ర్యము వచ్చినపుడు దీనిని ఏర్పాటు చేయటము జరిగినది. అయినప్పటికి లాల్ బహదూర్‌శాస్త్రి ప్రధానమంత్రి అయిన తరువాత దీని యొక్క ప్రాముఖ్యత ఎక్కువగా పెరిగినది. అయితే అప్పట్లో దీనిని 'ప్రధానమంత్రి కార్యాలయము' అనేవారు. 1966వ సం॥లో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధాని పదవి చేపట్టిన తరువాత ఈ కార్యలయమునకు సచివాలయ హోదాను కల్పించుట జరిగినది. దీనియొక్క పాలనాధిపతిని "ప్రిన్సిపల్ సెక్రటరీ"గా పిలుచుచున్నారు. 1977వ సం॥లో కేంద్రంలో అధికారములోనికి వచ్చిన జనతా ప్రభుత్వము దీని స్థాయిని సచివాలయము నుండి కార్యాలయమునకు తగ్గించినది.

రాజీవ్‌గాంధి అధికారములోనికి వచ్చిన తరువాత ఈ సచివాలయము మరింత కీలకమైన పాత్రను నిర్వహించింది. నాటి నుండి నేటి వరకు ప్రధానమంత్రి కార్యాలయము కేంద్ర పరిపాలనా వ్యవస్థలో ముఖ్యంగా ప్రధానమంత్రికి తన విధి నిర్వహణలో ఎన్నో సహాయ సహకారాలను అందిస్తూ గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

ప్రధానమంత్రి కార్యాలయ పాలనాధిపతిని "ప్రిన్సిపల్ సెక్రటరీ" అని అందురు. వీరికి తన విధి నిర్వహణలో సహాయ సహకారాలందించుటకు ఒక కార్యదర్శి స్థాయికి చెందిన సమాచార సలహాదారు, అదనపు కార్యదర్శి హోదా కలిగిన ఒక ఆర్థిక సలహాదారు, కొంతమంది సంయుక్త కార్యదర్శులు, ఒక హిందీ అధికారి, మరి కొంతమంది పరిశోధనాధికారులు, ఇతర సిబ్బంది ఉంటారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పదవిని ప్రముఖులైన వ్యక్తులు పి.సి. అలెగ్జాండర్, సి.ఆర్. కృష్ణస్వామిరావు సాహెబ్, బి.జి. దేశ్‌ముఖ్ వంటి వారు నిర్వహించేవారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారానే ప్రధానమంత్రి ఆమోదము అవసరమయ్యే అన్ని జాతీయ, అంతర్జాతీయ విషయాలు పంపబడతాయి. అందుచేతనే ఏంతో పరిపాలనానుభవము, చురుకుదనము, చొరవ, జాతీయ, అంతర్జాతీయ విషయాలపట్ల సమగ్ర అవగాహన కల్గిన వ్యక్తులనే ఈ పదవిలో నియమించుట జరుగుతుంది. ప్రధానమంత్రి కార్యాలయము యొక్క ప్రాధాన్యత ఈ విధంగా పెరగడంతో మంత్రి మండలి సచివాలయము యొక్క ప్రాముఖ్యత కొంతవరకు తగ్గినదని చెప్పవచ్చును. అయితే ప్రధానమంత్రి కార్యాలయము మంత్రి మండలి సచివాలయమునకు ప్రత్యామ్నాయము కాదన్న విషయము గుర్తుంచుకోవలసిన అవసరము ఎంతైనా ఉన్నది.

## 8.6 ముగింపు :

పైన చర్చించిన విధంగ మంత్రి మండలి సచివాలయము కేంద్ర మంత్రిమండలికి, దాని కమిటీలకు సహాయ సహకారాలందజేసే ఒక ముఖ్యస్టాఫ్ ఏజన్సీగా పనిచేస్తుంది. అదేవిధంగా ప్రధానమంత్రి కార్యాలయము కూడా ప్రధానమంత్రికి జాతీయ అంతర్జాతీయ విధానాలను రూపొందించుటలో సహకరించి, అతనికి కుడిభుజము వలే తోడ్పడుతుంది. అందుచేతనే కొంతమంది రచయితలు ప్రధానమంత్రి కార్యాలయమును "సూక్ష్మ కాబినేట్" (Micro Cabinet) అని అభిప్రాయపడినారు.

## మాదిరి ప్రశ్నలు :

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది వాటికి 60 పంక్తులు మించకుండా సమాధానములు వ్రాయుము.

1. కేంద్ర పాలనా వ్యవస్థలో మంత్రిమండలి సచివాలయ పాత్రను గురించి వ్రాయుము.
2. ప్రధానమంత్రి కార్యాలయమును గురించి సంక్షిప్తముగా వ్రాయుము.

**లఘువ్యాస ప్రశ్నలు :** ఈ క్రింది వాటికి 10 పంక్తులు మించకుండా సమాధానములు వ్రాయుము.

1. కాబినేట్ సెక్రటరీ
2. మంత్రి మండలి సచివాలయ విధులు

**కుశాగ్రబుద్ధి ప్రశ్నలు :**

1. కేంద్ర మంత్రి వర్గము
2. కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
3. సచివాలయము
4. మంత్రి మండలి కార్యదర్శి
5. ప్రధానమంత్రి కార్యాలయం

## చదువదగిన గ్రంథాలు :

1. యస్.ఆర్. మహేశ్వరి - ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్
2. పి. సత్యనారాయణ & జె. జగదీశ్వరరావు - భారతదేశ పాలనా వ్యవస్థ (తెలుగు అకాడమీ)

రచయిత : నీలకంఠం వెంకటేశ్వర్లు

పాఠం - 9

# యూనియన్ - రాష్ట్ర పరిపాలనా సంబంధాలు : అఖిల భారత సర్వీసుల పాత్ర

విషయసూచిక

9.0 లక్ష్యం
9.1 ఉపోద్ఘాతం
9.2 కేంద్ర - రాష్ట్రాల మధ్య పాలనా సంబంధాలు
9.3 పరిపాలనా సంబంధాలపై వివిధ సంఘాలు చేసిన సూచనలు
9.3.1 పరిపాలనా సంస్కరణల సంఘం సూచనలు
9.3.2 రాజమన్నారు కమిటీ సూచనలు
9.3.3 సర్కారియా కమీషన్ సూచనలు
9.4 అఖిల భారత సర్వీసుల పాత్ర
9.5 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు

## 9.0 లక్ష్యం :

సమాఖ్య రాజ్యాలలో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన తప్పనిసరి. ఈ అధికార విభజనపైనే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరియైన సంబంధాలు ఏర్పడుట అనేది ఆధారపడి ఉంటుంది. అయితే సమాఖ్య రాజ్యాలలో అధికార విభజన అనేది ఆయా రాజ్యాల ఏర్పాటుకు దారి తీసిన అనేక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు సర్వసత్తాక అధికారము కలిగిన రాష్ట్రాలన్నీ కలసి అమెరికా సంయుక్త రాష్ట్రాలుగా ఏర్పడుట వలన ఆ దేశములోని రాష్ట్రాలకు సంపూర్ణమైన స్వేచ్ఛ సమానముగా యివ్వటము జరిగినది. ఫలితంగా కేంద్రీయ, జాతీయ ప్రాముఖ్యత గల కొన్ని అంశాలను మాత్రమే తన దగ్గర ఉంచుకొని మిగిలిన అధికారాలను రాష్ట్రాలకప్పగించింది. ఇందుకు భిన్నముగా కెనడా దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను వేరు వేరు జాబితాలలో పేర్కొని, మిగిలిన అవశిష్టాధికారాలను కేంద్రానికే వదిలి వేయటము జరిగినది. అధికారము కోసము అమెరికాలోని రాష్ట్రాల మధ్య జరిగిన అంతర్యుద్ధము యొక్క అనుభవమును ఆధారముగా చేసుకొని కెనడా రాజ్యాంగ నిర్మాతలు అక్కడి కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలను అప్పగించినారు. ఇదే విధమైన విభజనా పద్ధతిని కొద్దిపాటి మార్పులతో మనదేశంలో పాటించినారు. అయితే మనదేశంలో కేంద్ర, రాష్ట్రాల జాబితాలతో పాటు ఉమ్మడి జాబితాను కూడా ఏర్పాటు చేయుట జరిగినది. ఈ విషయంలో 1946 నుండి 1949వ సం॥ జరిగిన రాజకీయ మరియు రాజకీయేతర పరిణామాలను దృష్టిలో పెట్టుకొని దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడు కొనుటకు కావాలనే మన రాజ్యాంగ నిర్మాతలు బలమైన కేంద్రము, బలహీనమైన రాష్ట్రాలతో కూడిన అర్థ సమాజ వ్యవస్థను (Quasi - Federal) మన దేశంలో ఏర్పాటు చేసినారు. అందుచేతనే మన రాజ్యాంగములోని మొదటి నిబంధనలో భారతదేశమును 'రాష్ట్రాల యూనియన్' గా (Union of States) పేర్కొనినారు.

అంతేగానీ సమాఖ్య (Federal) అనే పదమును కూడా ఉపయోగించలేదు. ఇది మన సమాఖ్య ప్రభుత్వ విధానము యొక్క ప్రత్యేకతను తెలియజేస్తుంది.

సమాఖ్య రాజ్యం విజయవంతంగా పని చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సామరస్య పూర్వకమైన సంబంధాలుండవలెను. అందుచేతనే వీటి మధ్య సత్సంబంధాలు నెలకొల్పడానికి కేంద్ర - రాష్ట్రాల మధ్య వున్న సంబంధాలను గురించి మన రాజ్యాంగములో సవివరముగా వివరించుట జరిగినది. ఇటువంటి వివరణ ఏ సమాఖ్య రాజ్యాంగంలోనూ కనిపించదు. భారత రాజ్యాంగము ప్రకారము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను మూడు రకాలుగా విభజించవచ్చును. అవి 1) శాసన సంబంధాలు 2. పరిపాలనా సంబంధాలు 3. ఆర్థిక సంబంధాలు. వీటిని రాజ్యాంగములోని 11, 12 భాగములలో సవివరముగా వివరించటము జరిగినది. అయితే ఈ విధంగా వివరించటానికి గల కారణము సాధ్యమైనంత వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు ఏర్పడకుండా చూడటమే. కేంద్ర - రాష్ట్రాల మధ్య గల సంబంధాలను ప్రధానంగా మూడు రకాలుగా విభజించినప్పటికి ప్రస్తుత మన పాఠ్యాంశము కేంద్ర - రాష్ట్ర పాలన సంబంధాలకే పరిమితమై నందు వలన వాటినే పరిశీలించుదాము.

## 9.2 కేంద్ర - రాష్ట్రాల మధ్య గల పాలనా సంబంధాలు :

కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరిపాలనా సంబంధాలను స్పష్టముగా పేర్కొనక పోయినట్లయితే వాటి మధ్య అనేక సంఘర్షణలు, వివాదాలు ఉత్పన్నము కావచ్చును. అందుచేతనే మన రాజ్యాంగ నిర్మాతలు కేంద్ర - రాష్ట్రాల మధ్యగల పరిపాలనా సంబంధాలను స్పష్టముగా పేర్కొనినారు. అమెరికా, ఆస్ట్రేలియా వంటి రాజ్యాంగాలలో శాసన సంబంధాలు మాత్రమే వివరించబడినాయి. కానీ పరిపాలనా సంబంధాలు వివరించబడలేదు. మన రాజ్యాంగములోని 11వ భాగములోని 256 నుండి 263 వరకు వున్న ప్రకరణాలు కేంద్ర - రాష్ట్రాల మధ్యగల పరిపాలనా సంబంధాలను తెలియజేస్తున్నాయి. అంతేగాక ఆ సంబంధాలకు సంబంధించిన ముఖ్యాంశాలను సందర్భోచితముగా రాజ్యాంగములోని ఇతర చోట్ల కూడ వివరించుట జరిగినది. కేంద్ర - రాష్ట్ర పరిపాలనా సంబంధాలను ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

1. రాజ్యాంగములోని 256 వ నిబంధన ప్రకారము రాష్ట్రాలు తమ కార్యనిర్వహణాధికారాన్ని పార్లమెంటు రూపొందించిన చట్టాల కనుగుణముగా చలాయించవలసి వుంటుంది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వము ఎప్పటికప్పుడు రాష్ట్రాలకు తగు ఆదేశాలు జారీచేయవచ్చును. ఈ నిబంధన యొక్క లక్ష్యాలను వివరిస్తూ డాక్టర్ అంబేద్కర్ ఈ నిబంధన క్రింద లభించే అధికారము లేక పోయినట్లయితే పార్లమెంటు చేసే చట్టాలను అమలుపరచడం అసాధ్యమవుతుందన్నారు.
2. 257వ నిబంధన ప్రకారము కేంద్ర కార్యనిర్వహణాధికారానికి ఎటువంటి అడ్డంకులు కలుగజేయకుండా రాష్ట్రాలు తమ కార్యనిర్వాహక అధికారాన్ని చెలాయించాలి. ఇందుకవసరమైన ఆదేశాలను కేంద్రము రాష్ట్రాలకు జారీ చేయవచ్చు. ఇటువంటి ఆదేశాలు రైల్వేలు, జాతీయ మరియు సైనిక ప్రాధాన్యత కలిగిన రహదారులు నిర్మించే మరియు నిర్వహణకు సంబంధించిన విషయాలలోనూ, రైల్వేలు మరియు వాటి ఆస్తులకు రక్షణ కల్పించే విషయంలో కూడా యివ్వవచ్చు. ఈ విషయాల నిర్వహణ కవసరమయ్యే వ్యయాన్ని కేంద్రమే భరిస్తుంది.
3. 258వ నిబంధన ప్రకారము తన పరిపాలనా బాధ్యతలను కొన్నింటిని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించవచ్చు. అదే విధముగా పార్లమెంటు చేసిన శాసనాల అమలుకు సంబంధించిన అధికారాలను, బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించవచ్చు. ఇందుకవసరమైన ధనాన్ని కేంద్రము పరిహారంగా యిస్తుంది.

4. 261వ నిబంధన ప్రకారము భారత భూభాగములో ప్రభుత్వ చర్యలు, చట్టాలు, న్యాయస్థాన వ్యవహారాలు, తీర్పులు మొదలగు వాటి పట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగించే విధముగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుచుకొనవలసి ఉంటుంది.

5. 262వ నిబంధన క్రింద అంతర - రాష్ట్రీయ నదుల లేదా నదీ లోయలోని జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణల విషయాలకు సంబంధించి తల ఎత్తిన వివాదమును పరిష్కరించటానికి చట్టరీత్యా పార్లమెంటు తగు ఏర్పాటు చేయవచ్చు.

6. 263వ నిబంధన క్రింద రాష్ట్రాల మధ్యగానీ లేదా కేంద్ర - రాష్ట్రాల మధ్య గానీ ఏర్పడిన వివాదాలను పరిష్కరించి, వాటికి సంబంధించిన విధానము, ఆచరణలలో యితోధికమైన సమన్వయాన్ని సాధించడానికవసరమైన సిఫారసులు చేయడానికి ఒక 'అంతర్ రాష్ట్ర మండలి' (Inter-State Council) ని రాష్ట్రపతి ఏర్పాటు చేయవచ్చు. అంతేగాక ఈ మండలి యొక్క వ్యవస్థీకరణ, ప్రక్రియలను రాష్ట్రపతి నిర్ధారిస్తాడు.

కేంద్ర - రాష్ట్రాల పాలనా సంబంధాలను క్రమబద్ధము చేయుటకు పైన చెప్పిన రాజ్యాంగ నిబంధనలే కాకుండా, ఇంకా రాజ్యాంగములోని అనేక ఇతర ఏర్పాట్లు కూడా చేయబడ్డాయి. ఆ ఏర్పాట్లను ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

1. రాజ్యాంగములోని 155వ నిబంధన ప్రకారము రాష్ట్రాల గవర్నర్లను రాష్ట్రపతి నియమిస్తారు. ఏదైనా ఒక రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధంగా పరిపాలన నిర్వహించడానికి వీలు కానపుడు గవర్నరు పంపించే నివేదికను చేసుకొని ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించుట జరుగుతుంది. ఇటువంటి సందర్భాలలో గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా వ్యవహరిస్తారు.

2. 312 నిబంధన ప్రకారము ఏర్పాటైన అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారులు కేంద్ర ప్రభుత్వాధీనములో వుంటూ కేంద్ర - రాష్ట్ర పరిపాలనలో చాలా కీలకమైన పదవులలో ఉంటారు. వీరిపై తుది క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారము కేంద్రానిదే.

3. ఎన్నికల సంఘము, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, ఆర్థిక సంఘములు రాష్ట్రపతిచే నియమింపబడి కేంద్ర - రాష్ట్రములకు సంబంధించిన కొన్ని పాలనా విధులను నిర్వర్తిస్తాయి.

4. 339వ నిబంధన ప్రకారము షెడ్యూలు తెగల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తగు కార్యక్రమాలను రూపొందించి అమలు చేయమని కేంద్రము రాష్ట్రాలకు తగు ఆదేశాలు జారీ చేయవచ్చు.

పైన చెప్పిన అనేక రాజ్యాంగపరమైన ఏర్పాట్లే గాకుండా అనేక ఇతర అంశాలు కూడా కేంద్ర - రాష్ట్రాల మధ్య గల సంబంధాలను పూర్తిగా మార్చివేసి కేంద్ర ప్రభుత్వాన్ని చాలా శక్తివంతము చేయటము జరిగినది. అయితే జవహర్‌లాల్ నెహ్రూ పదవిలో ఉన్నంతకాలము కేంద్ర - రాష్ట్రాల మధ్య పెద్దగా సంఘర్షణలు ఏర్పడలేదు. దీనికి నెహ్రూ ఆకర్షణీయమైన వ్యక్తిత్వము మరియు కేంద్రములోను, రాష్ట్రాలలోను కాంగ్రెసు పార్టీయే అధికారములో ఉండుట ముఖ్య కారణాలు. ఫలితంగా కేంద్ర - రాష్ట్రాల మధ్య ఎటువంటి చిన్న సమస్యలు వచ్చినా అవి కుటుంబ సమస్యలుగానే భావించబడి, పరిష్కరించబడినాయి. కానీ 1964వ సం॥లో నెహ్రూ మరణించిన తరువాత ముఖ్యంగా శ్రీమతి ఇందిరాగాంధీ అధికారములోనికి వచ్చిన తరువాత కేంద్ర - రాష్ట్రాల మధ్యగల సంబంధాలు క్రమేణా క్షీణించుట ప్రారంభమైనది. దీనికి సంబంధించిన బీజాలు 1967వ సం॥లో జరిగిన సాధారణ ఎన్నికలలో పడినవి. ఈ ఎన్నికలలో ఆనాడు దేశంలో గల 17 రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కోల్పోయి కాంగ్రేసేతర ప్రభుత్వాలు ఏర్పడినాయి. దీనితో కేంద్ర - రాష్ట్రాల మధ్య తీవ్రమైన ఘర్షణలు ప్రారంభమైనాయి. కానీ ఆ తరువాత 1971వ సం॥లో జరిగిన ఎన్నికలలో శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వములోని కాంగ్రెసు పార్టీ కేంద్రములోను, చాలా రాష్ట్రములలోను తిరిగి అధికారాన్ని కైవసము చేసుకొన్నది. ఫలితంగా 1972-77 సం॥ల మధ్యకాలంలో కేంద్ర - రాష్ట్రాల మధ్య

చెప్పుకోదగిన ఎటువంటి ఘర్షణలు ఏర్పడలేదు. అయితే 1977వ సం॥లో జరిగిన ఎన్నికలలో కేంద్రంలో జనతాపార్టీ అధికారములోనికి వచ్చినది. అదే విధంగా 1978వ సం॥లో రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలలో జనతాపార్టీ అనేక రాష్ట్రాలలో అధికారములోనికి రావటంతో అధికార విషయంలో రాష్ట్రాలు కేంద్రముపై ఒత్తిడిని తీసుకొని రావటానికి ప్రయత్నాలు ప్రారంభమైనాయి. తిరిగి 1980వ సం॥లో లోకసభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ విజయాన్ని సాధించినది. అదే విధంగా చాలా రాష్ట్రాలలో కాంగ్రెసు పార్టీ ఆధీనంలోనికి రావటము జరిగినది. దీనితో కేంద్ర-రాష్ట్రాల మధ్య గల సంబంధాలలో కొంత వరకు సాధారణ స్థితి ఏర్పడినది. కానీ ఇందిరాగాంధీ రాష్ట్రాలపట్ల తన మామూలు ధోరణితో వ్యవహరించుట వలన 1983వ సం॥లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల విధాన సభలకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెసేతర పార్టీలు అధికారములోనికి వచ్చి కేంద్ర - రాష్ట్ర సంబంధాలను పునఃపరిశీలించమని డిమాండ్ చేయటము ప్రారంభించినాయి. ఫలితంగా 1983వ సం॥ జూన్ కేంద్ర - రాష్ట్ర సంబంధాలను సమీక్షించి తగు సూచనలు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజింత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన ఒక కమీషన్‌ను నియమించింది. దీనినే సర్కారియా కమీషన్ అని అంటారు. అయితే ఈ సందర్భముగా ఇంతవరకు కేంద్ర - రాష్ట్ర సంబంధాలను సమీక్షించిన సంఘాల యొక్క సూచనలను పరిశీలించుట ఎంతైనా సమంజసము.

## 9.3 పరిపాలనా సంబంధాలపై వివిధ సంఘాలు చేసిన సూచనలు :

కేంద్ర - రాష్ట్రాల సంబంధాలపై పరిపాలనా సంస్కరణల సంఘము, రాజమన్నారు కమిటీ, సర్కారియా కమీషనులు అనేక సూచనలు చేసినవి. వాటిని విపులముగా పరిశీలించుదాము.

### 9.3.1 పరిపాలనా సంస్కరణల సంఘ సూచనలు :

1966వ సం॥లో కేంద్ర ప్రభుత్వము మొరార్జిదేశాయ్ నాయకత్వములో నియమించిన పరిపాలనా సంస్కరణల సంఘము 1970 నాటికి తన నివేదికలను సమర్పించింది. మొరార్జిదేశాయ్ ఉప ప్రధానిగా నియమించటంతో కె. హనుమంతయ్యా దీని ఛైర్మన్‌గా నియమించబడినాడు. ఈ సంఘము కేంద్ర - రాష్ట్ర సంబంధాలను సమీక్షించి వాటిపై ఈ క్రింది సూచనలను చేసినది.

1. అత్యవసర విషయాలలో తప్ప సాధారణ పరిస్థితులలో కేంద్రము రాష్ట్రాల వ్యవహారాలలో జోక్యము చేసుకోరాదు.
2. ఉత్పాదకశక్తి కలిగి ఉండే ప్రణాళికా కార్యక్రమాలకు మాత్రమే కేంద్రము రాష్ట్రాలకు ఋణాలు యివ్వవలెను. అనుత్పాదక కార్యక్రమాల విషయంలో మూలధన గ్రాంట్లు రూపంలో సహాయము అందజేయవలెను.
3. ఆర్థిక సంఘము నిర్ణయించిన సూత్రాల ఆధారముగా రాష్ట్రాల మధ్య ప్రణాళికా గ్రాంట్ల విభజన జరుగవలెను.
4. కేంద్రానికి, రాష్ట్రానికి లేదా ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి వచ్చే వివాదాలను పరస్పర చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవలెను.
5. ప్రధానమంత్రి అధ్యక్షుడుగా, ఆర్థికమంత్రి, హోమ్ మంత్రి, లోకసభలోని ప్రతిపక్ష నాయకుడు, ప్రతి జోనల్ కౌన్సిల్ నుంచి ఒక ప్రతినిధి సభ్యులుగా వుండే అంతర్ రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయవలెను.
6. గవర్నర్ చలాయించే విచక్షణాధికారాలకు సంబంధించి మార్గదర్శక సూత్రాలను అంతర్ రాష్ట్రమండలి రూపొందించవలెను.
7. మంత్రి వర్గము శాసనసభా విశ్వాసాన్ని కోల్పోయిందని గవర్నర్ భావించే పక్షంలో అతడు వెంటనే శాసనసభను సమావేశ పరచి ప్రభుత్వానికి మెజారిటీ ఉందా ? లేదా అన్న విషయం నిర్ధారణ చేసుకొని అపుడు మాత్రమే ఒక నిర్ణయానికి రావలెను.

8. అంతర్ రాష్ట్రనదీ జలాల వినియోగముపై వచ్చే వివాదాలను మూడు సం॥ల లోపు మధ్య వర్తిత్వము ద్వారా పరిష్కరించవలెను. ఈ కాలపరిమితి దాటిన తరువాత వాటిని నిర్బంధ మధ్య వర్తిత్వము ద్వారా పరిష్కరించవలెను.
9. కేంద్ర ఆస్తిని, సిబ్బందిని కాపాడటానికి కేంద్ర ప్రభుత్వము స్వీయ విచక్షణతో లేక రాష్ట్రాల అభ్యర్థనపై రక్షణ దళాలను ఆయా ప్రాంతాలకు పంపే స్వాతంత్ర్యము కేంద్రానికి ఉండవలెను.

### 9.3.2 రాజమన్నారు కమిటీ సూచనలు :

1969వ సం॥ సెప్టెంబరు నెలలో తమిళనాడులోని డి.యమ్.కె. ప్రభుత్వము మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తియైన పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘము కేంద్ర - రాష్ట్ర సంబంధాలను పరిశీలించి 1971వ సం॥లో తన నివేదికను సమర్పించినది. ఈ సంఘము యొక్క సూచనలను ఈ క్రింది విధముగా అభివర్ణించవచ్చును.

1. ప్రధానమంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కూడిన అంతర్ రాష్ట్రమండలి ఏర్పాటు వెంటనే జరుగవలెను. దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా రాష్ట్రాల ప్రయోజనాలను ప్రభావితం చేయగల ఏ బిల్లునైనా అంతర్ రాష్ట్ర మండలి ఆమోదము లేకుండా పార్లమెంటులో ప్రవేశపెట్టరాదు.
2. కేంద్ర జాబితా, ఉమ్మడి జాబితాలలోని పాలనాంశాలను పునఃపరిశీలించుటకు ఒక ఉన్నతాధికార సంఘమును ఏర్పాటు చేయవలెను.
3. పన్నుల విధింపు విషయాలలో గల అవశిష్టాధికారాలను రాష్ట్రాల కివ్వవలెను.
4. కేంద్ర జాబితా, ఉమ్మడి జాబితాలలోని అనేక అధికారాలను రాష్ట్ర జాబితాకు బదిలీ చేయవలెను. ఉదా : కార్మిక సంక్షేమము, సాంఘిక భద్రత, ఉద్యోగ వ్యవహారాలు, ధరల నియంత్రణ మొ॥నవి.
5. రాష్ట్ర గవర్నర్లను నియమించడానికి ముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించవలెను.
6. గవర్నరు కేంద్ర ప్రభుత్వముతో సంప్రదించవలసిన విషయాల మీద, కేంద్ర ప్రభుత్వము గవర్నరుకిచ్చే ఆదేశాలకు సంబంధించి మార్గదర్శక సూత్రాలను రూపొందించవలెను.
7. శాసనమండలి ఏర్పాటు, రద్దుచేసే పూర్తి అధికారాలు ఆయా రాష్ట్ర శాసనసభలకే వదిలి వేయవలెను.
8. ఆర్థిక సంఘాన్ని రాజ్యాంగము ఒక శాశ్వత సంఘముగా గుర్తించవలెను. దాని సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా పాటించవలెను.
9. ప్రస్తుత ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి, వివిధ రంగాలలో వున్నటువంటి నిపుణులతో కూడిన ఒక నూతన ప్రణాళికా సంఘమును ఏర్పాటు చేయవలెను. ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక ప్రణాళికా సంఘమును ఏర్పాటు చేయవచ్చు.
10. రాష్ట్రశాసన సభలో అత్యధిక స్థానాలు సంపాదించిన పార్టీ నాయకుడు మాత్రమే ముఖ్యమంత్రిగా నియమితుడు కావలెను. ఒకవేళ ఏపార్టీకి కూడా మెజారిటీ లేదని గవర్నరు భావిస్తే శాసనసభలను సమావేశపరచి మెజారిటీ సభ్యులు బలపరచిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా గవర్నరు నియమించవలెను.
11. అస్థిరమైన మంత్రి వర్గాల మనుగడను నిర్ణయించే అధికారము గవర్నర్లకు గాక శాసనసభలకే ఉండవలెను.
12. రాజ్యాంగములోని 236, 257 నిబంధలను వెంటనే తొలగించవలెను.
13. రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధించుటకు అవకాశము కల్పించే 356, 357 ప్రకరణాలను రద్దుచేయవలెను.

14. ఆర్థిక అత్యవసర పరిస్థితికి అవకాశము కల్పించే రాజ్యాంగములోని 360వ నిబంధనను రద్దు చేయవలెను.
15. క్రొత్తగా అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేయరాదు.
16. రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యము ఉండవలెను.
17. అంతర్ రాష్ట్రనదీ జలాల వివాదాలను సుప్రీంకోర్టే పరిష్కరించవలెను.
18. ప్రతి రాజ్యాంగ సవరణకు 3/4 వంతు రాష్ట్రాల ఆమోదముండవలెను.
19. రాష్ట్రాల అంగీకారముతోనే సి.ఆర్. దళాలను కేంద్రము రాష్ట్రాలకు పంపించవలెను.
20. రాష్ట్రాలకు ఋణాలిచ్చేందుకు ఆస్ట్రేలియాలో మాదిరిగా ఒక ప్రత్యేక లోన్ కౌన్సిలుండవలెను..
21. రాజ్యసభకు 12 మంది సభ్యులను నామినేట్ చేసే రాష్ట్రపతికి గల అధికారము రద్దుచేయవలెను. కాని వీటిని కేంద్ర ప్రభుత్వము తిరస్కరించినది.

### 9.3.3. సర్కారియా కమీషన్ సూచనలు :

1983వ సం॥లో కాంగ్రెసేతర పక్షాలు బెంగుళూరు, విజయవాడ, శ్రీనగర్‌లలో జరిపిన సమావేశాలలో కేంద్ర - రాష్ట్ర సంబంధాలను గురించి అనేక సిఫారసులను చేసిన తరువాత పరిస్థితి యొక్క తీవ్రతను గమనించి, శ్రీమతి ఇందిరాగాంధీ 1983వ సం॥ జూన్ 9వ తేదీన సుప్రీంకోర్టు మాజీన్యాయమూర్తి రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన ఒక కమీషన్‌ను నియమించినది. దీనినే సర్కారియా కమీషన్ అని అందురు. ఈ కమీషన్ దాదాపు 5 సం॥ల పాటు దేశములోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను, మేధావులను, నాయకులను సంప్రదించిన తరువాత 1987 అక్టోబరు 27వ తేదీన దాదాపు 5000 పేజీలతో కూడిన సుదీర్ఘ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసినది. ఈ నివేదికలో ఈ క్రింది సూచనలు కలవు.

1. అవశిష్టాధికారాలు ఉమ్మడి జాబితాలో ఉంచవలెను.
2. స్థానిక సంస్థలు సక్రమంగా పనిచేయడానికి వాటికి నిర్ణీతకాలంలోనే ఎన్నికలు జరిపించాలి. ఇందుకు గాను పార్లమెంటు ఒక శాసనమును ఆమోదించవలెను.
3. ఉమ్మడిజాబితాలో ఉన్నటువంటి అంశాలపై కేంద్రము చట్టము చేయబోయే ముందు రాష్ట్రాలను తప్పనిసరిగా సంప్రదించాలి.
4. ఉమ్మడి జాబితాలోనికి మార్చబడిన 'అడవులను' రాష్ట్ర జాబితాలోనికి మార్చనవసరము లేదు.
5. రాజ్యాంగములోని 256, 257, 365వ నిబంధనలు సమగ్రమైనవి. వీటి ద్వారా కేంద్ర శాసనాలను రాష్ట్రాల పాలనా యంత్రాంగము ద్వారా అమలు చేయుటకు వీలవుతుంది.
6. 258వ నిబంధనకు ఉదార అర్థవివరణ నిచ్చి అధికార వికేంద్రీకరణ నెలకొల్పి సహకార సమాఖ్యను నెలకొల్పవచ్చు.
7. రాజ్యాంగములోని 365వ నిబంధనను తొలగించవలసిన అవసరము లేదు.
8. ఒక రాష్ట్రానికి గవర్నరుగా నియమించేటప్పుడు కేంద్ర ప్రభుత్వము తప్పనిసరిగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించాలి. అంతేగాక క్రియాశీలక రాజకీయాలకు దూరముగా వున్నటువంటి వ్యక్తిని మాత్రమే నియమించాలి.
9. శాసనసభలోని మెజారిటీ పార్టీ నాయకుని ముఖ్యమంత్రిగా రాష్ట్ర గవర్నరు ఆహ్వానించాలి. ఒకవేళ ఏపార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోయినట్లయితే వివిధ రాజకీయ పక్షాలతో ఏర్పడిన కూటమిని ప్రభుత్వాన్ని ఏర్పరచమని కోరవచ్చును.

10. శాసనసభలో స్పష్టమైన మెజారిటీ ఉన్న ముఖ్యమంత్రిని భర్తరఫ్ చేయరాదు. ఒకవేళ ప్రభుత్వము మెజారిటీ సభ్యుల మద్దతు కోల్పోయినదని రాష్ట్ర గవర్నరు భావిస్తే ఆ విషయాన్ని శాసనసభలోనే నిర్ధారించుకొనవలెనేగాని రాజ్‌భవన్‌లో కాదు.

11. రాష్ట్రశాసనసభ ఆమోదించిన బిల్లు దేశ సమైక్యతకు, సమగ్రతకు భంగకరమని రాష్ట్ర గవర్నరు భావించినపుడు ఆ బిల్లును రాష్ట్రపతికి పంపవచ్చు. ఇటువంటి బిల్లులకు 4 నెలలలోపు రాష్ట్రపతి తన ఆమోదాన్ని తెలియజేయవలెను. ఒకవేళ ఆమోదముద్ర వేయటానికి అభ్యంతరమైనపుడు అందుకు గల కారణాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలి.

12. 356వ నిబంధనను అతి జాగ్రత్తగా వినియోగించాలి. దీనిని కేవలము విదేశీ దండయాత్రలు, అంతరంగిక కల్లోల పరిస్థితులు ఏర్పడినపుడు మాత్రమే వినియోగించాలి. ఇటువంటి పరిస్థితులలో శాసనసభను రద్దుచేయకుండా సస్పెన్షన్‌లో ఉంచాలి. పార్లమెంటు ఆమోదము లభించేంతవరకు రాష్ట్రశాసనసభను రద్దుచేయరాదు.

13. 263వ నిబంధన క్రిందే అంతర్ రాష్ట్రమండలిని ఏర్పాటు చేయవలెను. దీనిలో ప్రధానమంత్రి, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర కాబినెట్ మంత్రులు సభ్యులుగా ఉండవలెను.

14. అఖిల భారత సర్వీసులు అత్యంత అవసరమని రాష్ట్రాలను ఒప్పించి మరికొన్ని నూతన అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేయవలెను.

15. ప్రకటనలపై వచ్చు ఆదాయంలో రాష్ట్రాలకు కొంత వాటా యివ్వవలెను. స్వల్ప కాలానికి అనగా ఒక సంవత్సరములోపు కాలానికి బ్యాంకుల నుండి ఋణాలను తీసుకొనటానికి రాష్ట్రాలకవకాశము కల్పించాలి.

16. జాతీయాభివృద్ధి మండలిని 'జాతీయ ఆర్థికాభివృద్ధి మండలి'గా పేరు మార్చవలెను.

17. ఆకాశవాణి, దూరదర్శన్‌లను కేంద్ర ప్రభుత్వాధీనములోనే ఉంచవలెను. అంతేగాక వాటికి స్వయం నిర్ణయాధికారాన్ని కల్పించవలెను.

సర్కారియా కమీషన్‌పైన చెప్పిన సూచనలలో కొన్ని సమంజసమైనవి. కానీ విప్లవాత్మకమైనవి మాత్రము కావు. అయితే నేడు కేంద్ర - రాష్ట్ర సంబంధాలను కేవలము రాజ్యాంగ పరిధికి లోబడి మార్పుచేయుట సాధ్యపడదు. కేంద్ర, రాష్ట్రాలు సామరస్య పూర్వకముగా సహకరించుకొన్నప్పుడే పరిస్థితులు మెరుగుపడి దేశసమైక్యత, సమగ్రత కాపాడబడతాయి.

## 9.4 అఖిల భారత సర్వీసుల పాత్ర :

కేంద్ర, రాష్ట్రాల మధ్యగల పాలనా సంబంధాలను సమన్వయాన్ని, సమతౌల్యాన్ని సాధించటంలో అఖిల భారత సర్వీసులు చాలా ముఖ్య పాత్రను వహిస్తున్నాయి. ఈ సర్వీసులను యూనియన్ మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉమ్మడి సర్వీసులుగా చెప్పవచ్చును. ఈ సర్వీసులు దేశపరిపాలనా యంత్రాంగమునకు ఇంధనము వంటివి. భారతదేశంలో ఈ సర్వీసుల చరిత్ర 1854వ సం॥లో బి.బి.మెకాలే చేసిన సిఫారసుల ద్వారా మొదలైనదని చెప్పవచ్చును. ఈ సర్వీసుల పితామహునిగా మొట్టమొదటి హోంమంత్రి అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను పేర్కొనవచ్చు. ఎందుచేతనంటే ఈయన కృషి వల్లనే రాజ్యాంగ నిర్మాణసభ రాజ్యాంగములో ఈ సర్వీసులను పొందుపరచడానికి అవకాశమేర్పడినది. అంతేగాక రాజ్యాంగములో ఈ సర్వీసులకవకాశము కల్పించుటను రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ అయిన డాక్టర్ అంబేద్కర్ సమర్థించినాడు. ఈ సర్వీసులకు చెందిన ఉద్యోగులను జాతీయ ప్రాతిపదికపై జరిగే పోటీ పరీక్షల ద్వారా ఎంపిక చేసుకుంటారు. వీరు దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ పనిచేయవలసి ఉంటుంది. ఫలితముగా వీరు జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించగలరు. అత్యవసర పరిస్థితులలోను, రాష్ట్రాల్లోను రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టినపుడు రాష్ట్రాల పరిపాలనా భారాన్ని స్వీకరించడానికి వీరు సిద్ధముగా ఉంటారు. ఈ

సర్వీసులలో I.A.S., I.P.S., I.F.S., లు ప్రధానమైనవి. అయితే అవసరాన్ని బట్టి పార్లమెంటు క్రొత్త అఖిల భారత సర్వీసులు ఏర్పాటు చేయవచ్చును. ఈ సర్వీసులకు చెందిన అభ్యర్థుల యొక్క జీతభత్యాలను, వారి పని పరిస్థితులను భారత ప్రభుత్వము నియంత్రణ చేస్తుంది. కేంద్రము రాష్ట్రాల మీద ఈ అఖిల భారత సర్వీసుల ద్వారా విపరీతమైన ప్రభావమును చూపగలదు. భారతదేశము 'రాష్ట్రాల యూనియన్' అనే భావనను సార్థకము చేయటానికి ఈ అఖిల భారత సర్వీసులు ఎంతగానో దోహదము చేస్తాయని చెప్పుటలో ఏ మాత్రము సందేహము లేదు.

## 9.5 ముగింపు :

నేడు భారతదేశము అనేక క్లిష్టసమస్యలను ఎదుర్కొనుచున్నది. ఇందుకు రాజ్యాంగ నిబంధనల కంటే రాజకీయ నాయకత్వమే ఎక్కువ బాధ్యత వహించవలసి ఉంటుంది. ఇటువంటి పరిస్థితులలో కేంద్ర - రాష్ట్రాల మధ్యగల సంబంధాలను మార్పుచేయుట ఒక్కటే సరిపోదు. పరస్పరము కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించుకొనవలసిన అవసరము ఎంతైనా వున్నది. అపుడే దేశ సమైక్యత, సమగ్రత కాపాడబడతాయి.

## మాదిరి ప్రశ్నలు :

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది వాటికి ఐదు పుటలకు మించకుండా సమాధానములు వ్రాయము.

1. కేంద్ర - రాష్ట్రాల మధ్యగల పరిపాలనా సంబంధాలను గురించి విపులముగా వ్రాయము.
2. సర్కారియా కమీషన్ సిఫారసులను గురించి విపులముగా వ్రాయుము.

**లఘువ్యాస ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులు మించకుండా సమాధానములు వ్రాయుము

1. కేంద్ర - రాష్ట్ర పాలనా సంబంధాలను మెరుగుపరచుటలో అఖిలభారత సర్వీసుల పాత్రను గురించి వ్రాయము
2. కేంద్ర - రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచడానికి పరిపాలనా సంస్కరణల సంఘ సిఫార్సులను వ్రాయము.

**ఈ క్రింది వానికి 10 పంక్తులు మించకుండా జవాబులు వ్రాయుము.**

1. అఖిల భారత సర్వీసులు
2. రాజమన్నారు కమిటీ

**కుశాగ్రబుద్ధి ప్రశ్నలు :** ఒకటి రెండు వాక్యాలలో సమాధానం వ్రాయండి

1. కేంద్ర - రాష్ట్ర పాలనా సంబంధాలు
2. అఖిల భారత సర్వీసులు
3. ఇండియన్ సివిల్ సర్వీసు
4. రాజమన్నార్ కమిటి
5. సర్కారియా కమీషన్

## చదువదగిన గ్రంథాలు :

1. పి. సత్యనారాయణ & పి. జగదీశ్వరరావు - భారతదేశ పాలన (తెలుగు అకాడమి)
2. యస్.ఆర్. మహేశ్వరి - ఇండియన్ అడ్మినిస్ట్రేషన్
3. యస్.కె. చటర్జీ - ఇండియన్ అడ్మినిస్ట్రేషన్

రచయిత : నీలకంఠం వెంకటేశ్వర్లు

పాఠం - 10

# ఎన్నికల సంఘము

విషయసూచిక

10.0 లక్ష్యం
10.1 ఉపోద్ఘాతం
10.2 ఎన్నికల సంఘము
10.3 ఎన్నికల సంఘము అధికారాలు - విధులు
10.4 నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ
10.5 ఎన్నికల సంఘవిధి, నిర్వహణపై సమీక్ష
10.6 ముగింపు
10.7 మాదిరి ప్రశ్నలు
10.8 చదువదగిన గ్రంథాలు

## 10.0 లక్ష్యం :

విద్యార్థులకు భారత దేశములో ఎన్నికలు నిర్వహించుటకు ఏర్పాటు చేయబడ్డ సర్వస్వతంత్ర రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘపు నిర్మాణము, అధికారము, నిర్వహించు పద్ధతులను గురించి తెలియజేయుట.

## 10.1 ఉపోద్ఘాతం :

ఆధునిక యుగము ప్రజాస్వామ్య యుగము. ప్రజలు ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తప్ప వేరే దేనిని ఒర్చుకొనే పరిస్థితిలో లేరు. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలలో భారత ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొంటున్నారు. ప్రజాస్వామ్యం విజయవంతమవ్వాలంటే నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి. అందుకొరకు రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించే వ్యవస్థ యొక్క అవసరము ఎంతైనా ఉంది. అసంఖ్యాక నిరక్షరాశ్యులైన ఓటర్లు పాల్గొనే మనదేశ ఎన్నికలు రహస్య బాలెట్ పద్ధతి ద్వారా నిర్వహించబడుచున్నవి. రహస్య బాలెట్ లేని యెడల ఓటరు ఓటు చేయటానికి భయపడటానికి అవకాశముంది. ఎన్నికలు నిర్వహించబడటానికి భారత రాజ్యాంగంలో కట్టుదిట్టమైన చర్య తీసుకోబడింది. భారత రాజ్యాంగ చట్టములో 15వ విభాగములో 324వ నిబంధన నుండి 329 నిబంధన వరకు పొందుపరచిన ఎన్నికల కమీషన్‌కు ఎన్నికల నిర్వహణ బాధ్యతను అప్పచెప్పటం జరిగింది.

మనదేశంలో ఎన్నికలు రెండు స్థాయిలలో నిర్వహించబడుచున్నవి. కేంద్రస్థాయిలో లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతికి, రాష్ట్ర శాసనసభలలో దిగువ సభలకు ప్రాదేశిక నియోజక వర్గాల ప్రాతిపదిక పద్ధతిలో ఎన్నికలు జరుగును. దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్షుల పదవులకు ఓటు మార్పిడి నైష్పత్తిక విధానము ద్వారా ఎన్నికలు నిర్వహించబడును. దేశంలో జరిగే ఎన్నికలలో దిగువసభకు జరిగే ఎన్నికలకు అధిక ప్రాధాన్యత ఉన్నది. రాజ్యాంగ పరిషత్ సార్వజనీన వయోజన ఓటింగ్ హక్కుకు అనుకూలంగా నిర్ణయము చేసినది. ఒక్క వయఃనిబంధన తప్ప, ఎటువంటి అర్హతలు లేకుండా వయోజనులందరికి ఓటు

హక్కును ప్రసాదించడం జరిగింది. అల్లాడి కృష్ణస్వామి అభిప్రాయములో ప్రజాస్వామ్యం విజయం కొరకు సామాన్య వ్యక్తి మీద ఉంచిన అపారమైన నమ్మకమే దీనికి కారణము. ప్రస్తుత ఓటరు వయోపరిమితి 21 సంవత్సరముల నుండి 18 సంవత్సరములకు తగ్గించబడినది. రాజ్యాంగం 330, 332 నిబంధనలలో షెడ్యూలు కులాలకు, తెగలకు నియోజక వర్గాలు రిజర్వు చేయవచ్చునని పేర్కొనటం జరిగింది. మత ప్రాతిపదిక మీద రిజర్వేషనుకు స్వస్తి చెప్పటం జరిగింది. ఆంగ్లో ఇండియన్ కమ్యూనిటికి తగిన ప్రాతినిధ్యము లేదని భావించి, అధ్యక్షుడు ఇద్దరు ఆంగ్లో ఇండియన్ సభ్యులను లోక్‌సభకు నామినేట్ చేయుపద్ధతిని, రాష్ట్ర శాసనసభలకు ఒక్క సభ్యుడ్ని మాత్రమే నియమించటానికి వీలు కల్పించటం జరిగింది.

## 10.2 ఎన్నికల కమీషన్ నిర్మాణము :

రాజ్యాంగ శాసన నిబంధనల ననుసరించి దేశంలో ఎన్నికలు నిర్వహించి, పర్యవేక్షించి, ఇతర ఎన్నికల బాధ్యతలను చేపట్టటానికి రాష్ట్రపతి ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల కమీషన్‌ను నియమించును. 1950 నుండి 1989 వరకు మనకు ఒకే ఎన్నికల అధికారి ఉండేవాడు. అక్టోబరు 16, 1989వ తేదీన రాష్ట్రపతి మరి ఇద్దరు ఎన్నికల అధికారులను నియమించెను. దానితో ఎన్నికల కమీషన్ త్రి సభ్య కమీషన్‌గా మారింది. 1990 జనవరిలో తిరిగి ఎన్నికల కమీషన్ ఏకసభ్య కమీషన్‌గా మారింది. అక్టోబర్‌లో 1993లో రాష్ట్రపతి ఇద్దరు కమీషనర్లను నియమించటంతో మన ఎలక్షన్ కమీషన్ తిరిగి మరొకమారు త్రిసభ్య కమీషన్‌గా మారింది. అప్పటి నుండి నేటి దాకా ఎలక్షన్ కమీషన్ త్రిసభ్య కమీషన్‌గానే వ్యవహరిస్తూ ఉన్నది. ఎలక్షన్ కమీషన్ తీసుకునే ఏ నిర్ణయమైనా, మెజారిటీ సభ్యుల అంగీకారంతో తీసుకోబడుతుంది. ఇది రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఎన్నికల ప్రధానాధికారి అతనిని నియమించిన అధ్యక్షుడికి తప్ప వేరెవ్వరికి బాధ్యత వహించడు. కేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక వర్గాలకి, శాసనసభల, ఇతర జాతీయ, ప్రాంతీయ రాజకీయ పక్షాల ప్రభావానికి గురికాడు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగులలో ఒకరిని ఎన్నికల కమీషనర్‌గా నియమిస్తారు. అతని జీతభత్యాలు భారతదేశ సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. అతని పదవీకాలం జీతభత్యాలు పార్లమెంట్ తగ్గించటానికి వీలుకాదు. నిర్దుష్టమైన నేరారోపణ మీద పార్లమెంట్ ఉభయసభ సభ్యుల అత్యధిక మెజారిటీతో మాత్రమే ఎన్నికల కమీషనర్‌ను పదవీచ్యుతుడ్ని చేయవచ్చు. 65 సంవత్సరముల వయస్సు వచ్చేంతవరకు పదవిలో కొనసాగవచ్చు. ఎన్నికల ప్రధానాధికారి, అతని వ్యవస్థతోపాటు రాష్ట్రస్థాయిలో ఎన్నికల వ్యవస్థను ప్రధాన అదికారి ఆధ్వర్యంలో రూపకల్పన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఉంటాడు. 1952లో మొదటి సాధారణ ఎన్నికల నుండి చీఫ్ ఎన్నికల ఆఫీసరు పదవి అమలులోనికి వచ్చినది. ఇతని ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఎన్నికలు నిర్వహించబడును. జిల్లాస్థాయిలో జిల్లాలోని ఎన్నికల యంత్రాంగము మొత్తమునకు జిల్లాకలెక్టరు బాధ్యత వహించును. ఆయనే ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రత్యేక రిటర్నింగ్ ఆఫీసరుగా వ్యవహరించును. ఎన్నికల నిర్వహణ బాధ్యత రెవిన్యూ శాఖకు అప్పజెప్పబడినది.

## 10.3 అధికారాలు - విధులు :

1. ఎన్నికల కమీషన్ విభిన్నమైన బాధ్యతలను నిర్వహించును. అవసరమని తోచిన యితర ఉన్నత ఉద్యోగుల సహాయాన్ని అధ్యక్షుని చేత నియమింప చేసుకొని పొందవచ్చును. కమీషన్ మొదటి బాధ్యత కేంద్ర, రాష్ట్రాలలో జరుపబోవు ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్దము చేయించటము, ఎప్పటికప్పుడు చేర్పులు, మార్పులు చేయించడము. దేశాధ్యక్షుడి, ఉపాధ్యక్షుడి ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను కూడా సిద్ధముగా నుంచవలయును. 5 సంవత్సరములకొక పర్యాయము జరుగు సాధారణ ఎన్నికలతోపాటు, అవసరమైనప్పుడు మధ్యంతర ఎన్నికలు కూడా నిర్వహించవలె.

ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థి ఎన్నికలలో గెలిచిన సభ్యుని మరణముల వలన న్యాయస్థానాల తీర్పు వలన ఏర్పడిన ఖాళీలు భర్తీ చేయించుటకు ఉపఎన్నికలు కూడా నిర్వహించవలెను.

2. ఎలక్షన్ కార్యక్రమమును సిద్ధం చేయవలెను. ఎలక్షన్ జరిపించు తేదీలు, నామినేషన్లు తీసికొనుటకు ఉపసంహారణకు ఆఖరుతేదిని నిర్ణయించటం.
3. అర్హమైన నామినేషన్ల పరిశీలన, ప్రకటన కమీషన్ విధి.
4. దేశ వ్యాప్తంగా ఎన్ని రోజులలో ఎన్నికలు పూర్తి చేయవలెనో నిర్ణయము తీసికొనుట.
5. పోలింగ్ బూత్ లను ఏర్పరచటము.
6. ఓట్ల లెక్కింపు, ఎన్నికలు జరిపిన రోజులు (తేదీలు) లో మార్పు ఉన్నప్పుడు, ఒక ఎన్నిక ఫలితము, ఇంకొక ప్రాంతపు ఎన్నికపై ఉండకుండ నివారించుటకు ఓట్ల లెక్కింపు ఎన్నికలు అన్ని ప్రాంతాలలో ముగిసిన తరువాతనేచేపట్టడము.
7. అంతవరకు బాలెట్ పెట్టెల రక్షణ బాధ్యత.
8. ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడు తరువాత శాంతి భద్రతలను కాపాడు బాధ్యత కూడ ఎన్నికల కమీషన్‌దే.
9. ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీలు అనుసరించవలసిన ప్రవర్తనా నియమావళిని రూపొందించుటతో పాటు దానిని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఆమోదించి అనుసరించేటట్లు చేయటము.
10. రాజ్యాంగ చట్ట నిబంధనల ప్రకారము అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ఖర్చుపెట్టే మొత్తాలపై గరిష్ఠ పరిమితిని విధించటం.
11. ఎన్నికల గుర్తులను కేటాయించవలసిన బాధ్యత కూడా ఎన్నికల కమీషనదే. వాటిని రాజకీయ పక్షాలకు, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించవలసి ఉంటుంది.
12. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పక్షాలను గుర్తించటము.
13. ఎన్నికలలో విజయము సాధించిన అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలను యిచ్చుట.

## 10.4 నియోజక వర్గాల పునర్ వ్యవస్థీకరణ :

ఎన్నికలు సంబంధించినంత వరకు ఒక ప్రధానమైన అంశం నియోజకవర్గాలను ఏర్పాటు చేయడం. మనదేశములో ఏకసభ్య నియోజకవర్గ ఎన్నికల విధానము అమలులో ఉన్నది. పెరుగుతున్న జనాభా, పారిశ్రామికీకరణ వలన జనసాంద్రతలో వస్తున్న మార్పులను అనుసరించి నియోజక వర్గాలను పునర్వ్యవస్థీకరించవలసిన అవసరము ఏర్పడుతున్నది. కేంద్ర పార్లమెంటు మరియు రాష్ట్ర శాసన సభ్యుని ఎన్నుకొను నియోజకుల సంఖ్యలను వీలైనంత వరకు సమానము చేయటం కోసం కూడా ఒక నియోజక వర్గంలోని కొంత ప్రాంతాన్ని తీసి మరో నియోజక వర్గానికి కలపటం తప్పనిసరిఐనది. కాని ఈ ప్రక్రియలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల ప్రభావము, మరియు కుల, మత ప్రాతిపదికపై ఓటర్లను చీల్చటం వంటి చర్యలకు పాల్పడకుండ 1952 సంవత్సరములో అమలులోనికి వచ్చిన చట్టము ప్రకారము 'డిలిమిటేషన్ కమీషన్' ఏర్పాటు చేయటం జరిగింది. ఇందులో ముగ్గురు సభ్యులుంటారు. ఎన్నికల ప్రధానాధికారి అధికార సభ్యుడు. మిగతా ఇద్దరు హైకోర్టు లేక సుప్రీంకోర్టు న్యాయమూర్తులు లేక రిటైర్డ్ అయిన న్యాయమూర్తులు ఒక రాష్ట్రంలోని నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ నిమిత్తము పరిశీలిస్తున్నప్పుడు ఆ నియోజక వర్గం నుంచి ఎన్నుకోబడిన రాష్ట్ర శాసన సభ్యుడు, మరియు పార్లమెంటు సభ్యుడు కూడా పరిశీలకులుగా పాల్గొనవచ్చును. ఆసక్తి ఉన్న వర్గాలు, సంఘాలు కూడా ప్రతిపాదనలను పునర్వ్యవస్థీకరణ సంఘానికి పంపవచ్చు. 10 సంవత్సరముల ఒకసారి జరుగు జనాభా లెక్కల సేకరణ ప్రాతిపదికగా మాత్రమే ఈ నియోజక వర్గాలను పునర్ వ్యవస్థీకరించవలెను. ఒకసారి నియోజక వర్గాలను పునర్వ్యవస్థీకరించిన తరువాత ఎన్నికల సంఘానిదే అంతిమ నిర్ణయము దానిని మార్చటానికి వీలులేదు.

## 10.5 ఎలక్షన్ కమీషన్ విధి నిర్వహణపై సమీక్ష :

ప్రపంచములో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఎన్నికలు నిర్వహించుట అంత సులభమైన పనికాదు. ఎలక్షన్ కమీషన్ ప్రధాన బాధ్యత స్వేచ్ఛాయుత వాతావరణములో, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించుట. విపరీతంగా పెరుగుతున్న జనాభా తదనుగుణంగా పెరుగుతున్న ఓటర్ల సంఖ్య వలన ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను సవరణ చేయవలసి వస్తుంది. ఓటర్ల సంఖ్యతోపాటు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య కూడా ఊహించనంత పెరుగుతున్నది. 1985 సం॥లో లోక్‌సభ ఎన్నికలలో కర్నాటకలో బెంగుళూరు దగ్గర ఒక నియోజకవర్గంలో 50 మందికి పైగా అభ్యర్థులు చివరికి పోటీకి నిలబడగా, వార్తా పత్రికంత బాలెట్ పేపరు, యినుప బీరువా సైజు బ్యాలెట్ బాక్స్ తయారుచేయటంతో పాటు ఎన్నికల చిహ్నాలు కేటాయించటం ఎన్నికల కమీషన్‌కు పెద్దతలనొప్పిగా తయారైంది. విజయం సాధించటమే ధ్యేయంగా పెట్టుకున్న రాజకీయ పక్షాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించటంతోపాటు అనేక అక్రమాలకు పాల్పడుచున్నవి. దౌర్జన్య చర్యలు, బాలెట్ పెట్టెలను ఎత్తుకొని వెళ్ళటం, బూతుల ఆక్రమణ, వ్యతిరేక పక్షము వారిని ఓటు చేయకుండ నివారించడము, దొంగఓట్లు వేయడం జరుగుతున్నది. షెడ్యూల్ కులాలు, తెగల వారిని ఓటు చేయనీయకుండా నివారించడం వంటి చర్యలను కూడా పాల్పడుచున్నారు. ఇక ఎన్నికలలో ధనము పాత్ర చెప్పనవసరము లేనంతగా పెరిగిపోయింది. అభ్యర్థులు అనుమతించిన దానికంటే కొన్ని వందలరెట్లు ఎక్కువ ఖర్చు చేయటమేగాక చిట్టచివరగా ఓట్లను నోట్ల కట్టలతో కొనుగోలు చేయటము సర్వసామాన్యమై పోయింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన వ్యవస్థ ఏ లోపభూయిష్టమైనదని తీవ్ర విమర్శ యున్నది. కాని దీని పరిష్కారమార్గంగా ఎన్నికల కమీషన్ సెప్టెంబర్ 21, 1992న చేసిన సిఫార్సు ననుసరించి 1. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు తాము ఎన్నికల సందర్భంగా చేసిన వ్యయం వాస్తవ వివరాలను అందించలేకపోయినా, తప్పుడు లెక్కలు చూపించినా వారిని శిక్షార్హులుగా పరిగణించించడము. 2. ఈ నేరానికి జరిమానాతో పాటు ఆరు నెలల నుంచి ఏడాదిపాటు కారాగారా శిక్ష ఉండాలని కమీషన్ సూచించింది. ఈ నేరం క్రింద శిక్ష పడిన వారిని కనీసం ఆరేళ్లపాటు ఎన్నికలలో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల సంస్కరణలలో చేసిన సిఫార్సుల్లో కమీషన్ సూచించింది. 4. ప్రతి రాజకీయపక్షం తన వార్షిక ఆదాయ వ్యయ వివరాలను ప్రచురించి కమీషన్ సూచించిన సంస్థతో వాటిని ఆడిట్ చేయించాలని కూడా ఎన్నికల కమీషన్ సూచించింది.

## 10.6 ముగింపు :

భారత దేశములో ఎన్నిక నిర్వహణ వ్యవస్థలో రావలసిన మార్పులను గురించి అనేక వాదోపవాదాలు ఉన్నవి. చిన్నచిన్న పార్టీలను ప్రాంతీయ పార్టీలుగా మాత్రమే గుర్తించి కేంద్రంలో బలమైన ద్విపార్టీ విధానము ప్రవేశ పెట్టడం వల్ల ధనం పాత్రను తగ్గించటం, ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలను ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా ఎన్నికలను మరింత కట్టుదిట్టంగా నిర్వహించవచ్చు. ఆషామాషీగా పోటీ చేయు అభ్యర్థుల సంఖ్యను కూడా తగ్గించవలసి ఉంది.

### మాదిరి ప్రశ్నలు :

#### వ్యాసరూప ప్రశ్నలు :

1. ఎన్నికల కమీషన్ నిర్మాణము, అధికార విధులను వివరించుము.

#### లఘు వ్యాసరూప ప్రశ్నలు

1. ఎన్నికల కమీషన్ విధి నిర్వహణలో ఎదుర్కొనుచున్న సమస్యలను తెలుపుము.
2. నియోజక వర్గాల పునరవ్యవస్థీకరణ ఆవశ్యకతను వివరించుము.

#### కుశాగ్ర బుద్ధి ప్రశ్నలు :

1. ఎన్నికల కమీషన్

రచయిత : శ్రీమతి మెహ్రూన్నీసా బేగం

పాఠం - 11

# ఆర్థిక సంఘం

విషయసూచిక


11.0 లక్ష్యం

11.1 ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగ ప్రతిపత్తి

11.2 ఆర్థిక సంఘ విధులు

11.3 వివిధ ఆర్థిక సంఘాలు - వాటి సూచనలు

11.4 ఆర్థిక సంఘం - ఒక పరిశీలన

11.5 ఆర్థిక సంఘం - ప్రణాళికా సంఘం

11.6 మాదిరి ప్రశ్నలు

11.7 చదువదగిన గ్రంథాలు


## 11.0 లక్ష్యం :

ఈ పాఠంలో ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగ ప్రతిపత్తి, దాని నిర్మాణం, విధులు, వివిధ ఆర్థిక సంఘాలు చేసిన సూచనలు, ఆర్థిక సంఘం మరియు ప్రణాళికా సంఘానికి గల సంబంధం గురించి తెలుసుకుంటారు.

సమాఖ్యలో కేంద్ర రాష్ట్రాల మధ్య రాజకీయ, ఆర్థిక, పరిపాలక అధికారాలు రాజ్యాంగ రీత్యా విభజింపబడి ఉంటాయనేది మనకు తెలిసిందే. ఇవి ఏ విధంగా ఉండాలనేది మన రాజ్యాంగంతో వివరింపబడింది. అయినప్పటికి వీటి విషయమై కేంద్ర - రాష్ట్రాల మధ్య తరచూ సమస్యలు తలెత్తుతూ ఉంటాయనేది కూడా మనకు విదితమే. దీనిని ఊహించే రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ పరిధులకు లోబడి కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల విభజనకు సంబంధించిన స్వతంత్ర ప్రతిపత్తి గల ఆర్థిక సంఘ నిర్మాణానికి వీలు కల్పించారు.

## 11.1 ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగ ప్రతిప్రత్తి :

రాజ్యాంగములోని 280వ ప్రకరణననుసరించి, "రాజ్యాంగం అమలులోనికి వచ్చిన రెండు సం॥రాలు లోపుగా ఆ తర్వాత అయిదు సం॥రాల కొకసారి భారత రాష్ట్రపతి ఒక ఛైర్మన్ మరియు నలుగురు సభ్యులతో కూడిన ఆర్థిక సంఘాన్ని ఏర్పరచాలి".

ఆర్థిక సంఘ అధ్యక్షుడు, ఇతర సభ్యుల నియామకానికి చెందిన విధివిధానాలను రూపొందించే అధికారం రాజ్యాంగంలోని 280వ ప్రకరణ పార్లమెంటుకు అప్పగించింది. దీని ప్రకారం 1951లో ఆర్థిక సంఘ అధ్యక్షుడు, ఇతర సభ్యుల నియామకానికి కావలసిన అర్హతలు, సంఘం పనిచేసే తీరు నిర్దేశిస్తూ పార్లమెంటు ఒక చట్టాన్ని రూపొందించింది.

ప్రజా సంబంధాలలో నిష్ణాతులైన వారిని ఆర్థిక సంఘ అధ్యక్షుడిగా నియమించాలి. ఆర్థిక సంఘ సభ్యులుగా నియమింపబడటానికి ఈ క్రింది అర్హతలు అవసరం. ఎ) హైకోర్టు జడ్జీలుగా నియమింపబడటానికి అర్హులైనవారు, బి) ఆర్థిక లేదా ప్రభుత్వ విత్త వ్యవహారాలలో పరిజ్ఞానం కలవారు, సి) పరిపాలనలో విస్తృతానుభవం కలవారు.

పై పేర్కొన్న అర్హతలు ఆర్థిక సంఘం సజావుగా పనిచేయడానికి తోడ్పడతాయి. సభ్యుల కన్నా ఛైర్మన్ విస్తృత రంగాలలో అనుభవం కలవాడైతే ఆర్థిక సంఘం పనితీరు మెరుగుగా ఉంటుంది.

కాని ఛైర్మన్ ప్రజా వ్యవహారాలలో నిష్ణాతులై ఉండాలని పేర్కొనడం వలన, కేంద్ర ప్రభుత్వం వారికి గల నైపుణ్యం, అనుభవాలను పరిగణనలోనికి తీసుకోకుండా కేవలం రాజకీయ పరంగానే ఛైర్మన్ మరియు సభ్యులను నియమించే అవకాశం ఏర్పడింది.

1,2 మరియు 5 ఆర్థిక సంఘాల అధ్యక్షులు కేంద్ర మంత్రులుగా పనిచేసి ఉన్నారు. నాల్గవ ఆర్థిక సంఘానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిని అధ్యక్షునిగా నియమించారు. మూడవ ఆర్థిక సంఘానికి మాజీ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను అధ్యక్షునిగా నియమించారు. కేంద్ర మంత్రులుగా పనిచేసిన వారికన్నా, రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులైతే ప్రజా వ్యవహారాలలో నిష్ణాతులై ఉండి, ఆర్థిక సంఘానికి మెరుగైన సేవలు అందించగలరని భావించడం జరిగింది. దీని ఆధారంగానే 6వ ఆర్థిక సంఘానికి బ్రహ్మానందరెడ్డిని అధ్యక్షునిగా నియమించడం జరిగింది. కాని ఈ సాంప్రదాయం ఎక్కువ కాలం కొనసాగలేదు. 7వ ఆర్థిక సంఘానికి సుప్రీంకోర్టు జడ్జి షెలాత్‌ను అధ్యక్షునిగా నియమించారు. కేంద్ర రాష్ట్రాల మధ్య ఏర్పడే స్పర్ధలను తొలగించే తుది వేదిక సుప్రీంకోర్టు కాబట్టి, సుప్రీంకోర్టు జడ్జీలను ఆర్థిక సంఘ అధ్యక్షులుగా నియమించడం సరైనది కాదని భావించారు. 8వ ఆర్థిక సంఘానికి వై.బి. చవాన్‌ను అధ్యక్షునిగా నియమించారు. ఇతను మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి. కానీ మాజీ ముఖ్య మంత్రులైతే ఆర్థిక వ్యవహారాలపై సరియైన అవగాహన ఉండటానికి అవకాశం కలదనీ అభిప్రాయం కూడా కలదు. తొమ్మిదవ, పదవ, పదకొండవ ఆర్థిక సంఘాలకు వరుసగా సాల్వే, కె.సి. పంత్, ఎ.ఎమ్. ఖుస్రోలు అధ్యక్షులుగా పనిచేసారు. ప్రస్తుత ఆర్థిక సంఘ అధ్యక్షులు రంగరాజన్.

## 11.2 ఆర్థిక సంఘ విధులు :

రాజ్యాంగములోని 280(3) ప్రకరణ ననుసరించి ఈ క్రింది విధులు కలవు. ఎ) పన్నుల రూపేణా వచ్చిన ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడం, బి) సంఘటిత నిధి నుండి రాష్ట్రాలకు గ్రాంట్లు ఇవ్వడానికి మార్గదర్శక సూత్రాలను నిర్ణయించడం, సి) రాజ్యాంగంలోని 278 మరియు 306 ప్రకరణాల క్రింద ప్రత్యేకంగా పేర్కొనబడినట్లు, కేంద్ర ప్రభుత్వంలో ఏ రాష్ట్ర ప్రభుత్వానికైనా కుదిరిన ఒడంబడికలోని నియమనిబంధనలు కొనసాగింపు లేదా మార్పు గురించి సలహాలిచ్చుట, డి) ఆర్థిక పటిష్టతకు రాష్ట్రపతి సూచించిన ఇతర అంశాలను పరిశీలించడం.

ఆర్థిక సంఘ ఏర్పాటుకు ఒక సంవత్సరం ముందే కేంద్ర ఆర్థిక శాఖలోని సహాయ కార్యదర్శి హోదాకు తగ్గని అధికారి పర్యవేక్షణలో ఆర్థిక మంత్రత్వ శాఖలో ఒక విభాగం ఏర్పాటు చేయబడుతుంది. కేంద్ర ఆర్థిక సంబంధాల విషయంలో ఏర్పడిన లేదా ఏర్పడబోయే సమస్యలను గుర్తించుట ఈ విభాగం పని. దీనిని కేంద్ర క్యాబినెట్ పరిశీలిస్తుంది. క్యాబినెట్ ఆమోదంతో ప్రత్యేక విభాగం రూపొందించిన నివేదిక ఆధారంగానే ఆర్థిక సంఘ నియమావళి రూపొందించబడి రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. ఈ ప్రత్యేక విభాగం కొరకు నియమింపబడిన ప్రత్యేక అధికారి, ఆర్థిక సంఘ సభ్యకార్యదర్శిగా నియమింపబడతాడు.

రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికసంఘ నియమనిబంధనలను రూపొందించేటప్పుడు తమను సంప్రదించాలని భావిస్తున్నాయి. అందుచే ఆర్థిక సంఘ నియమ నిబంధనల రూపకల్పన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర చర్చల ద్వారా రూపొందించాలని భావించడం జరిగింది.

## 11.3 వివిధ ఆర్థిక సంఘాలు :

మొదటి ఆర్థిక సంఘం (1951 - 52) లో ఏర్పాటు చేయబడింది. ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 50% నుండి 55% కు పెంచారు. రాష్ట్రాల మధ్య వాటా 1951 జనాభాలెక్కల ప్రకారం 80% జనాభా ని బట్టి, 20% ఆ రాష్ట్రాల నుండి వచ్చిన

ఆదాయ ప్రాతిపదికగా నిర్ణయించాలని సూచించారు. దీనిని మహారాష్ట్ర, బెంగాల్ వంటి రాష్ట్రాలు విమర్శించాయి. గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ విషయంలో వెనుకబడిన రాష్ట్రాలు కూడా తమ అసంతృప్తిని వ్యక్తీకరించాయి. రాష్ట్రాల ఆదాయవనరులను పెంచవలసిన అవశ్యకతను, గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలకు కేంద్రం సహాయం చేయదగిన పాత్రను ఈ సంఘం గుర్తించింది.

రెండవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 60% పెంచింది. రాష్ట్రాల మధ్య వాటా 90% జనాభా ప్రాతిపదికగా, 10% ఆ రాష్ట్రాల నుండి వచ్చిన ఆదాయ ప్రాతిపదికగా నిర్ణయించాలని సూచించారు. వాణిజ్య పన్నుల రాష్ట్రాల వాటాను 40% నుండి 25% కి తగ్గించాలని సూచించారు. అయితే 15%ని వాణిజ్య పన్నుల పరిధిని పెంచడం ద్వారా పూరించవచ్చునని తెలిపారు. తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తప్ప మిగతా రాష్ట్రాల ఆదాయాన్ని పెంచడానికి గ్రాంట్ల మొత్తాన్ని పెంచాలని సూచించారు. సంపద పన్నులో 99% రాష్ట్రాలకు కేటాయించి 1% కేంద్రం అట్టిపెట్టుకోవాలని సూచించారు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చు ఋణాలు దీర్ఘకాలికంగా ఉండాలని భావించారు.

మొత్తం మీద పన్నులలో ఎక్కువ వాటాను కేటాయించడం, గ్రాంట్లను పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి సూచలను తోడ్పడ్డాయి.

మూడవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 66.6% పెంచింది. రాష్ట్రాల మధ్య విభజన 80% జనాభా ప్రాతిపదికగా, 20% ఆదాయ ప్రాతిపదికగా ఉండాలని సూచించింది. వాణిజ్య పన్నులో రాష్ట్రాల వాటాను 25% నుండి 20% తగ్గించింది. కానీ వాణిజ్య పన్ను విధించే వస్తువుల సంఖ్యను 8 నుండి 35కి పెంచింది. కమ్యూనికేషన్స్ అభివృద్ధిపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉందని భావించి దానికై ప్రత్యేక గ్రాంటుకు సిఫారసు చేసింది. ఆర్థిక సంఘము మరియు ప్రణాళికా సంఘ విధులు ఒకే విధంగా ఉన్నాయి కాబట్టి, వీటి మధ్య సమన్వయం అవసరం అని ఈ సంఘం పేర్కొంది.

నాల్గవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 75% పెంచింది. రాష్ట్రాల ఆదాయపు పన్నులో 80% జనాభా ప్రాతిపదికగా, 20% ఆ రాష్ట్రాల నుండి వచ్చు ఆదాయ ప్రాతిపదికగా ఉండాలని సూచించింది. అభివృద్ధి, అభివృద్ధేతర రంగాలలో వ్యయం పెరగడం ద్వారా రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ఈ సంఘం గుర్తించింది. ఆర్థిక విధానాల రూప కల్పనలో కేంద్ర, రాష్ట్రాల మధ్య తరచు సమావేశాలు జరగాలని సూచించింది.

అయిదో ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 75% గానే ఉంచి, రాష్ట్రాల మధ్య పంపిణీ మాత్రం 90% జనాభా ప్రాతిపదికగాను, 10% వసూలు ప్రాతిపదికగాను ఉండాలని సూచించింది. రాష్ట్రాల వెనుకబాటు తనాన్ని గుర్తించడాన్ని, ఆయా రాష్ట్రాల తలసరి ఆదాయాన్ని కేంద్ర తలసరి ఆదాయంతో పోల్చి చూడాలని భావించారు. గ్రాంట్లను మంజూరు చేయడంలో రాష్ట్రాల ఆదాయ లోటును పరిగణనలోనికి తీసుకోవాలని సూచించారు. అయితే మిగులు ఆదాయం గల రాష్ట్రాలు దీనిని విమర్శిస్తూ, ఆర్థిక వ్యవహారాలు యాజమాన్యం సరిగ్గాలేని రాష్ట్రాలకు ఒక బహుమతిగా దీనిని అభివర్ణించాయి.

రాష్ట్రాలలో వనరుల అభివృద్ధికి అధిక వ్యవసాయ ఆదాయంపై పన్ను, బకాయిపడిన పన్నుల వసూలు, ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మెరుగుపరచడం. నీటి పారుదల పథకాల నుండి ఆదాయం పొందడం మొదలైన సూచనలు చేసింది. ఈ విధంగా కేంద్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతినకుండాను, రాష్ట్రాలు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే విధంగాను సూచనలు చేసింది.

ఆరవ ఆర్థిక సంఘం ఆదాయం పన్నులో రాష్ట్రాల వాటాను 80% పెంచింది. రాష్ట్రాల మధ్య పంపిణీ విధానాన్ని మార్చలేదు. రాష్ట్రాలకు నిధులను సమకూర్చడంలో వాటి వెనుకబాటుతనాన్ని పరిగణలోనికి తీసుకుంది. దేశంలో లభించే వనరుల జాతి మొత్తానికి చెందినవని, వాటిని అవసరమైన చోట వినియోగించవచ్చునని భావించింది. వెనుకబడిన ప్రాంతాలలో

సామాజిక, పరిపాలనా సేవలను మెరుగుపరచవలసిన ఆవశ్యకతను గుర్తించింది. గ్రాంట్లను మంజూరు చేయడంలో వాటి ఆర్థిక వ్యవహారాల యాజమాన్య దక్షతను, ఇతర పాలనా అంశాలను పరిగణలోనికి తీసుకుంది. ప్రకృతి వైపరీత్యాలు తరచు సంభవించే ప్రాంతాలలో వాటి నివారణకు సమగ్ర పథకాన్ని రూపొందించాల్సిన అవసరాన్ని గుర్తించింది. రాష్ట్రాల ఆర్థిక అవసరాలను తీర్చడంలో కేంద్రం యొక్క ఆవశ్యకతను జాతీయ ఆర్థిక అభివృద్ధిలో తగ్గుదల కారణంగా పేర్కొంది. ఈ కాలంలో ప్రకృతి వైపరీత్యాలకు ఎక్కువగా గురైన రాష్ట్రాల మధ్య సంబంధాల మెరుగుకు ఈ సంఘం కృషి చేస్తుంది.

ఏడవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 85%కు పెంచింది. ఆరవ కమీషన్‌తో పోలిస్తే రాష్ట్రాలకు కేటాయించిన నిధులను రెట్టింపు చేసింది. వాణిజ్య పన్నులో రాష్ట్రాల వాటాను 20% నుండి 40% కు పెంచింది. గ్రాంట్ల మొత్తాన్ని కూడా పెంచింది. రాష్ట్రాలకు కేటాయించే నిధులు పెరిగినా మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టడంతో రెవెన్యూ వసూలు తగ్గింది. దీనిలో 50% కేంద్రం పూడ్చాలని సూచించినా అది సరిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాయం లభించే వాటిగా భావించింది. కాని వాస్తవంలో అవి రాష్ట్రాలకు గుదిబండలుగా తయారయ్యాయి. ఎనిమిదవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్ను పంపిణీలో వాటాను 85% గానే ఉంచింది. వాణిజ్య పన్నులో 45% ఆదాయాన్ని లోటు రాష్ట్రాలకు కేటాయించే విధంగా కొత్త సూచనలు చేసింది. అయినప్పటికి 25 రాష్ట్రాలలో 13 రాష్ట్రాలు లోటు బడ్జెట్‌నే కలిగి ఉన్నాయి.

పదవ (ప్రస్తుత) ఆర్థిక సంఘం కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను పరిశీలించడానికి, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు తీసుకోవాల్సిన చర్యల గురించి పరిశీలించడానికి ఏర్పాటు చేయబడింది.

## 11.4 ఆర్థిక సంఘం - ఒక పరిశీలన :

ఆర్థిక సంఘ విధులను మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. 1. రాష్ట్రపతి ఆజ్ఞల కనుగుణంగా చేయబడేవి, 2. పార్లమెంటు చట్టాలననుసరించి, 3. కార్యనిర్వాహక శాఖ ఆదేశాలననుసరించి నిర్వహింపబడేవి. 270 మరియు 275 (1) ప్రకరణల ననుసరించి ఆదాయపు పన్ను, గ్రాంట్ - ఇన్ - ఎయిడ్‌లు మొదలగునవి మొదటి తరగతికి చెందుతాయి. కేంద్ర వాణిజ్య పన్ను, సంపద పన్ను రెండో తరగతికి క్రిందకు వస్తాయి. మిగిలినవి మూడో తరగతికి చెందినవి.

వివిధ ఆర్థిక సంఘాల సూచనలను పరిశీలించినట్లయితే, పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాల వాటాను క్రమంగా పెంచుతూ వచ్చాయి. మన రాజ్యాంగంలో కొన్ని తప్పనిసరి కేటాయింపుగాను, మరికొన్ని ఐచ్ఛిక కేటాయింపులుగాను పేర్కొనటంలో సందిగ్ధత ఏర్పడింది. ఉదాహరణకు ఆదాయపు పన్ను పంపకం గురించి పేర్కొన్నారు. కాని వివిధ రాష్ట్రాల మధ్య ఏవిధంగా పంపిణీ చేయాలో పేర్కొనలేదు. వాణిజ్యపు పన్ను పంపకంలో పరిస్థితి మరీ సందిగ్ధం. దీనిని తప్పనిసరి వనరుగా రాజ్యాంగం పేర్కొనలేదు. వాణిజ్య పన్నుల జాబితాలోనికి వచ్చే వనరుల జాబితా గురించి కూడా పేర్కొన లేదు. ఇది పూర్తిగా పార్లమెంటు నిర్ణయానికే వదిలి వేశారు. పూర్తిగా రాష్ట్రాలకు కేటాయించే వనరుల విషయంలో కూడా రాష్ట్రాల మధ్య వాటి పంపిణీ విషయమై సరియైన మార్గదర్శక సూత్రాలు లేవు.

ఆరిక బాధ్యతలు నిర్వహించుటకు ప్రత్యేక యంత్రాంగం లేదు. అయితే అయిదు సంవత్సరాలకు ఒకసారి ఏర్పడే సంఘం కాబట్టి ఆ సంఘం తన లక్ష్యాలను నెరవేర్చలేదు. ఆర్థిక సంఘాలు కూడా రాష్ట్రాలు నిధులను పెంచడానికి ఎక్కువగా పన్నుల పంపకంపైనే ఆధారపడ్డాయి. గ్రాంట్ల మంజూరుకు అధిక ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రణాళికేతర నిధులను కేటాయించే అధికారం ఆర్థిక సంఘానికి లేకపోవడం కూడా ఆర్థిక సంఘ విధులను పరిమితం చేస్తుంది. ఆదాయపు పన్ను పంపిణీలో జనాభాపై ఆధారపడటం కొంతవరకు సముచిత నిర్ణయమనే భావించాలి. అయితే రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లకు ప్రాధాన్యత ఇవ్వలేదు. పన్నుల ద్వారా పొందిన వాటాలు చాలక ఏర్పడిన లోటును పూరించడానికి ఒక ప్రత్యామ్నాయ సాధనాలుగానే గ్రాంట్లను పరిగణించాయి.

ఆర్థిక సంఘాలు నిర్దిష్టమైన పాత్ర నిర్వహించక పోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. 1) ప్రణాళికా సంఘానికి ఆర్థిక సంఘానికి మధ్య స్పష్టంగా విధుల కేటాయింపు జరుగలేదు. అందుచే ఆర్థిక సంఘ పరిధి పరిమితమై ఎక్కువగా ప్రణాళికా సంఘంపై ఆధారపడవలసి వచ్చింది. 2) ప్రణాళికా సంఘం తాత్కాలిక ఏర్పాటు కావడంతో శాశ్వత యంత్రాంగం లేదు. అందుచే కేంద్ర రాష్ట్రాల మధ్య బదిలీ, పంపకాలపై సహేతుక విధానాన్ని రూపొందించలేక పోయింది. అందుచే దీనిని ఒక శాశ్వత సంఘంగా రూపొందించాలి.

## 11.5 ఆర్థిక సంఘం - ప్రణాళికా సంఘం :

సమాఖ్యలో కేంద్ర రాష్ట్రాల మధ్య తరచు ఏర్పడే ఆర్థిక సమస్యలకు పరిష్కార సూచనలు చేయుటకు రాజకీయేతర వాతావరణములో ఆర్థిక సంఘం వంటి ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అభిలషణీయం. అయితే వనరుల పంపిణీపై విస్తృత అధికారాలు గల ప్రణాళికా సంఘం ఏర్పాటు ఆర్థిక సంఘ లక్ష్యాన్ని విఫలం చేసింది. రాష్ట్ర బడ్జెట్‌లలోని ప్రణాళికేతర రంగాన్ని తొలగించడం, రాష్ట్రాల పన్నుల విధానాలపై పరిశీలనను పరిమితం చేయడం ద్వారా ఆర్థిక సంఘ పనితీరు నిర్వీర్యమైంది. అందువలన సమాఖ్య స్ఫూర్తిని నిలపడానికి ఆర్థిక సంఘ స్వతంత్ర్య ప్రతిపత్తిని పునరుద్ధరించడం అవసరం.

ఆర్థిక సంఘానికి, ప్రణాళికా సంఘానికి మధ్య అవి నిర్వహించాల్సిన పాత్ర స్పష్టంగా నిర్దేశింపబడినపుడే ఆర్థిక సంఘం రాజ్యాంగం పేర్కొన్న లక్ష్యాలను నెరవేర్చకలుగుతుంది. ప్రణాళికా సంఘం జాతీయ ఆర్థిక విధానాన్ని (రాష్ట్రాల ఆర్థిక విధులతో పాటు) రూపొందించడంలో తన పాత్రను కొనసాగించవచ్చు. ఆర్థిక సంఘం పన్నుల ద్వారా రాష్ట్రాలు వనరులు సేకరించుట, గ్రాంట్లు, లోనుల ద్వారా రాష్ట్రాల ప్రణాళికా, ప్రణాళికేతర అవసరాలను తీర్చుకొనుట వంటి వాటిని నిర్ణయించాలి. దీని కొరకై ప్రణాళికా సంఘం, ఆర్థిక సంఘాల మధ్య సమన్వయం తప్పనిసరి.

ఆర్థిక సంఘాన్ని ఒక శాశ్వత సంఘంగా రూపొందించి అవసరమైన పరిశోధన సిబ్బందిని సమకూర్చాలి. దీనికి కావలసిన గణాంక వివరాలను, పద్ధతులను రూపొందించుకోవాలి. అయితే భారత దేశ రాజ్యాంగం రూపొందింపబడిన ఇన్నేళ్లకు కూడా ఇటువంటి యంత్రాంగం రూపొందించలేదు.

## 11.6 మాదిరి ప్రశ్నలు

**వ్యాసరూప ప్రశ్నలు : ఈ క్రింది వాటికి 5 పేజీలకు మించకుండా జవాబు వ్రాయుము**

1. ఆర్థిక సంఘ నిర్మాణం మరియు దాని విధులను గూర్చి వ్రాయుము

**లఘువ్యాస ప్రశ్నలు : ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించకుండా జవాబులు వ్రాయుము**

1. ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగబద్ధ హోదాను గూర్చి వ్రాయుము
2. ఆర్థిక సంఘ పనితీరును విశ్లేషించండి

**ఈ క్రింది వాటికి 10 పంక్తులకు మించక జవాబు వ్రాయుము**

1. ప్రణాళికా సంఘం మరియు ఆర్థిక సంఘాల మధ్య గల సంబంధము

## 11.7 ఉపయుక్త గ్రంథాలు


1. Mishra B.R. : Indian Federal Finance
2. Avasthi & Maheswari : Public Administration
3. Kapoor & pant : Public finance


రచయిత : డా॥ కె. రఘునాథ్

పాఠం - 12

# యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్

విషయసూచిక


12.0 లక్ష్యం

12.1 యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆవిర్భావం

12.2 కమీషన్ నిర్మాణం

12.3 కమీషన్ విధులు

12.3.1 కార్యనిర్వాహక విధులు

12.3.2 రెగ్యులేటరీ విధులు

12.3.3 అర్ధ న్యాయ విధులు

12.4 కమీషన్‌కు గల రాజ్యాంగ బద్ధమైన హోదా

12.5 కమీషన్ స్వతంత్ర ప్రతిపత్తి

12.6 కమీషన్‌కు గల పరిమితులు

12.7 ముగింపు

మాదిరి ప్రశ్నలు

చదువదగిన గ్రంథాలు


## 12.0 లక్ష్యం :

ఈ పాఠంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఏ విధంగా ఆవిర్భవించింది, దాని నిర్మాణం, దాని విధులు, రాజ్యాంగ బద్ధంగా దానికి గల హోదా, కమీషన్ స్వతంత్ర ప్రతిపత్తి, దానికి గల పరిమితులను గురించి మీరు తెలుసుకుంటారు.

## 12.1 యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆవిర్భావం :

వారెన్ హేస్టింగ్స్, లార్డ్ కారన్ వాలిస్‌ల కృషి ఫలితంగా సివిల్ సర్వీసులను శాశ్వత సర్వీసుల గాను, ప్రభుత్వ ఉద్యోగులకు నియమ నిబంధనలు ఏర్పరచి, వాటిని 'కవనెంటెడ్' సర్వీసులుగా గుర్తించడం జరిగింది. సివిల్ సర్వీసుల క్రమబద్ధీకరణలో ఇది తొలిచర్యగా భావించవచ్చు.

మొదటిలో ఆంగ్లేయులనే సివిల్ సర్వీసులలోనికి తీసుకునేవారు. అయితే 1833 చార్టరు చట్టం ద్వారా ఎవరినైనా సివిల్ సర్వీసులలోనికి తీసుకునే అవకాశం కల్పించారు. ఆ తరువాత 1853 చార్టరు చట్టం, 1858 విక్టోరియా మహారాణి ప్రకటనల ద్వారా భారతీయులకు మరింత అవకాశం కల్పించడం మాత్రమే కాక, నిబంధనల ననుసరించి ఉద్యోగులను నియమించాలని భావించడం జరిగింది. కొంత కాలానికి "కవనెంటెడ్" అనే పేరును "ఇంపీరియల్ సివిల్ సర్వీసులు"గా మార్చడం జరిగింది. 1919 చట్టం పబ్లిక్ సర్వీసు కమీషన్ ఏర్పాటుకు అవకాశాన్ని కల్పించింది. 1935 చట్టం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరు వేరు సర్వీస్ సంఘాలను ఏర్పాటు చేసుకోడానికి అవకాశాన్ని కల్పించడం మాత్రమే కాకుండా, ఉద్యోగులకు భద్రత కల్పించింది. ఇప్పుడు భారతదేశంలో పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లు రాజ్యాంగంలోని 14వ భాగంలో పేర్కొన్న విధంగా రూపొందింపబడ్డాయి. ఇవి ఇంచుమించుగా 1935 చట్టంలోని 10వ భాగంలో పేర్కొన్న సివిల్ సర్వీసు నిబంధనలను పోలి ఉంటాయి.

## 12.2 యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్మాణం :

రాజ్యాంగాన్ని అనుసరించి కేంద్రానికి, రాష్ట్రాలకు వేరు వేరు పబ్లిక్ సర్వీసు కమీషన్‌లు ఉండవచ్చు. లేదా కొన్ని రాష్ట్రాలకు కలిపి ఉమ్మడి సర్వీస్ సంఘం ఉండవచ్చు. కేంద్ర పబ్లిక్ సర్వీస్ సంఘ చైర్మన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తాడు. సభ్యుల సంఖ్య 6 నుండి 8 వరకు ఉంటుంది. సభ్యులు ఎంతమంది ఉండాలనే దానిని గురించి రాజ్యాంగం పేర్కొనలేదు.

సర్వీసు కమీషన్‌లో నియమింపబడే సభ్యులు అంతకు మునుపు పది సంవత్సరములు తక్కువ కాకుండా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలలో అనుభవం కలవారై ఉండవలెను. కమీషన్‌లోని సభ్యులు లేదా చైర్మన్ కమీషన్ పదవీకాలం పూర్తి అయ్యాక ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగం చేయరాదు. చైర్మన్ సభ్యుల పదవీ కాలం 6 సంవత్సరాలపాటు లేదా 65 సం॥ల వయస్సు వచ్చే వరకు ఏది ముందు పూర్తి అయితే అది. పదవీ కాలం పూర్తి అయిన తరువాత ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగం స్వీకరింపరాదని ఉన్నప్పటికి, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ సంఘ సభ్యుడు అదే రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ సంఘ చైర్మన్‌గా కాని, ఇతర రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ సంఘ చైర్మన్‌గా కాని లేదా యూనియన్ పబ్లిక్ సర్వీసు సంఘ సభ్యులు అదే కమీషన్ చైర్మన్‌గా నియమింపబడవచ్చు.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘ చైర్మన్‌గా ఎవరూ లేకపోయినట్లయితే కమీషన్‌లోని సీనియర్ సభ్యుడు ఆ పదవీ బాధ్యతలు నిర్వహిస్తాడు. కమీషన్ అంతర్గత పాలనను చైర్మన్ మరియు కార్యదర్శి నిర్వహిస్తారు. కమీషన్ అధిక సభ్యుల ఆమోదంతో నిర్ణయాలు తీసుకుంటుంది.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘ సభ్యుడిని తొలగించాలంటే, ఏ సభ్యుడి ప్రవర్తన గురించి అయినా రాష్ట్రపతి సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురావచ్చు. సుప్రీంకోర్టు నియమావళి ననుసరించి పరిశోధన జరిపి రాష్ట్రపతికి నివేదిక సమర్పిస్తుంది. సుప్రీంకోర్టు నివేదిక వచ్చేలోగా తాత్కాలికంగా ఏ సభ్యుడినైనా సస్పెండ్ చేయు అధికారం రాష్ట్రపతికి గలదు.

రాజ్యాంగాన్ని అనుసరించి ఈ క్రింది పేర్కొన్న కారణాల వలన ఒక సభ్యుణ్ణి అనర్హునిగా ప్రకటించవచ్చు. ఎ) అప్పు చెల్లించు శక్తి లేనివాడు బి) ఇతర లాభదాయకమైన ఉద్యోగము లేదా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే నిర్వహింపబడు లాభదాయకమైన ఒప్పందాలలో భాగస్వామి అయినప్పుడు సి) శారీరకంగా కాని మానసికంగా గాని అశక్తుడు అయినపుడు, డి) అతని ప్రవర్తన సరికాదని భావించనపుడు సుప్రీం కోర్టు ధృవీకరణతోనే రాష్ట్రపతి సభ్యుడుని తొలగించగలడు.

## 12.3 కమీషన్ విధులు :

యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘం తన విధులను రాజ్యాంగంలో నిర్దేశించినట్లుగా నిర్వహిస్తుంది. అంతేగాక కమీషన్ తన విధులకు సంబంధించి, ఎ) కార్యనిర్వహకుని ఆజ్ఞలు, బి) శాసనసభల చట్టాలు, సి) ఆచారాల వంటి పైన కూడా ఆధారపడుతుంది.

రాజ్యాంగంలోని 320వ నిబంధన ననుసరించి, ఎ) ఇది జాతీయ స్థాయిలో సివిల్ సర్వీసులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తుంది. బి) సివిల్ సర్వీసుల నియమ నిబంధనలను రూపొందిస్తుంది. సి) సివిల్ సర్వీసులకు సంబంధించి రాష్ట్రపతి కోరిన యెడల సలహాలు ఇస్తుంది, డి) కొన్ని రాష్ట్రాలు ఉమ్మడిగా కోరినట్లయితే, సిబ్బంది నియామకానికి కావలసిన ఉమ్మడి పరీక్షలను నిర్వహిస్తుంది, ఇ) పార్లమెంటు శాసనం ద్వారా కమీషన్‌కి ఇచ్చిన అదనపు విధులను నిర్వహిస్తుంది.

కమీషన్‌కు గల విధులను ఎ) కార్యనిర్వాహక బి) రెగ్యులేటరీ, సి) అర్ధ - న్యాయ విధులుగా వర్గీకరించవచ్చు.

ఎ) కార్యనిర్వాహక విధులు : కమీషన్ తనకి కావలసిన కార్యదర్శి, ఉపకార్యదర్శి, ఇతర కార్యదర్శులను నియమించుకుంటుంది. తనకు కావలసిన తాత్కాలిక, శాశ్వత ఉద్యోగులను కూడా నియమించుకుంటుంది.

ప్రభుత్వ సర్వీసులకు కావలసిన ఉద్యోగాలకు దేశవ్యాప్తంగా పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. దీనివలన తెలివైన వారిని, సమర్థులను అభ్యర్థులుగా నియమించవచ్చు. అర్హత పరీక్షలో యోగ్యులైన అభ్యర్థుల క్రమపట్టిక తయారుచేయవలసిన బాధ్యత కమీషన్ యొక్క విధి.

బి) రెగ్యులేటరీ విధులు : రెగ్యులేటరీ విధులు కేవలం సలహా రూపకమైనవి. ఉద్యోగులకు చెందిన భర్తీ, పదోన్నతి, బదిలీ మొదలగు విషయాలలో సలహా ఇస్తుంది. అభ్యర్థుల అర్హతలు, వయస్సు మొ॥లగు నియామకాలకు సంబంధించి కూడా సలహాల నిస్తుంది.

సి) అర్ధ న్యాయ విధులు : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఈ క్రింది వాటికి సంబంధించి అర్ధ - న్యాయ విధులను నిర్వహిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు తమ క్రమశిక్షణ విషయాలకు సంబంధించి ప్రభుత్వానికి విన్నవించు కున్నప్పుడు, ఉద్యోగుల నియామకాలకు సంబంధించి, ఏ విషయమైనా కోర్టులో నివేదించుకున్నప్పుడు ప్రభుత్వము ఉద్యోగికి కావలసిన ఖర్చు భరించు సందర్భంలోను, ఉద్యోగి ఉద్యోగంలో ఉండగా ఎటువంటి శారీరక లోపమునకు గురిఅయినా, అతను ఉద్యోగ విరమణ తరువాత భరణం ఇవ్వవలసిన సందర్భంలోను అర్ధ - న్యాయ సలహాలిస్తుంది.

పై అంశాలను పరిశీలించినట్లయితే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ రాష్ట్రపతికి సలహాలు ఇవ్వడానికే ఏర్పాటు చేయబడింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘ సలహాలను పాటించడమా లేదా అన్న విషయాన్ని ఆయా పరిస్థితిని బట్టి రాష్ట్రపతిని నిర్ణయిస్తాడు.

## 12.4 కమీషన్‌కు గల రాజ్యాంగబద్ధ హోదా :

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్మాణము, దాని అధికార పరిధులు గుర్తించి రాజ్యాంగంలోని 315, 316 నిబంధనలు పేర్కొన్నాయి. అదే విధంగా కమీషన్‌కు గల అధికారాలను పెంచడం లేదా తగ్గించడంలో పార్లమెంటుకు గల అధికారాన్ని ఇక్కడ పేర్కొనవచ్చు. కమీషన్ రాష్ట్రపతి ద్వారా తన నివేదికలను పార్లమెంటుకు సమర్పిస్తుంది.

ఈ పై అంశాలను పరిశీలించినట్లయితే రాజ్యాంగం ద్వారా కమీషన్ ఏర్పాటు చేయబడినప్పటికి, పార్లమెంటుకు దానిపైన అదే విధంగా రాష్ట్రపతికి నియంత్రణాధికారం కలదు. అయితే కమీషన్‌కు గల స్వతంత్ర ప్రతిపత్తి ద్వారా కమీషన్ తన సమర్థతను నిరూపించుకునే అవకాశం కలదు.

## 12.5 కమీషన్‌కు గల స్వతంత్ర ప్రతిపత్తి :

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ స్వతంత్ర ప్రతిపత్తి కాపాడుటకు రాజ్యాంగంలో అనేక కట్టుదిట్టాలు చేయబడినాయి. ఇంతకు ముందు మీరు చదివినట్లుగా కమీషన్ చైర్మన్ మరియు సభ్యులు రాష్ట్రపతిచే నియమింపబడతారు. ఏ సభ్యుడి ప్రవర్తన నైనా సుప్రీంకోర్టు ధృవీకరించనిదే రాష్ట్రపతి తొలగించలేడు.

చైర్మన్‌గాని, సభ్యులు కాని పదవిలో ఉండగా వారి జీత భత్యాలను గాని, వారి హోదాలనుకాని తగ్గించరాదు. సభ్యుల పదవీవిరమణ తరువాత లాభసాటి అయిన ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగం చేయరాదు. అయితే ఇంతకు ముందు ప్రస్తావించినట్లు సభ్యులను ఇతర కమీషన్‌లు లేదా అదే కమీషన్ చైర్మన్‌లుగా నియమించవచ్చు.

సభ్యులకు జీతం భారతదేశ సంఘటిత నిధి నుండి చెల్లించబడుతుంది. 1964లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘానికి చేసిన సవరణ ననుసరించి కమీషన్ సభ్యులుగా ఉన్న కాలంలో, ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినా భరణ సౌకర్యాన్ని కల్పించారు. అదే సవరణలో ఏయే సందర్భాలలో సభ్యులు భరణము పొందుటకు వీలు లేదో కూడా వివరింపబడింది.

ఈ విధంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘ సభ్యులు నిష్పక్షపాతంగాను, నిస్సంకోచముగాను వ్యవహరించుటకు కమీషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పింపబడింది.

## 12.6 కమీషన్‌కు గల పరిమితులు :

నియామకాల విషయంలో కమీషన్‌పై పరిమితులు కలవు. 335వ నిబంధన ననుసరించి, పరిపాలనా సామర్ధ్యానికి భంగం కలగకుండా రాష్ట్రపతి షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన అభ్యర్థులను నియమించవచ్చు. 320 నిబంధన ననుసరించి కమీషన్‌ని సంప్రదించిన విషయాలు మినహా మిగతా విషయాలకు సంబంధించి నియమ నిబంధనలు రూపొందించు అధికారం రాష్ట్రపతికి కలదు.

పార్లమెంట్ ఆమోదంతో కొన్ని సర్వీసులను కమీషన్ పరిధిలో నుండి మినహాయించవచ్చు. కొన్ని విభాగాలకు చెందిన క్రమశిక్షణా చర్యలు కూడా కమీషన్ పరిధికి దూరంగా ఉంచబడ్డాయి. ఈ విధంగా కమీషన్ అధికారాలను రాష్ట్రపతి అనేక విధాల పరిమితం చేయవచ్చును. ఇతర న్యాయ నిర్ణయాల విషయంలో కూడా కమీషన్ కేవలం అర్ధ - న్యాయ విధులనే నిర్వహిస్తుంది.

## 12.7 ముగింపు :

యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘం రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేయబడి, స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థ అయినప్పటికి, అది కార్య నిర్వాహక వర్గముచే నియంత్రింప బడుతుందనేది నిర్వివాదాంశం.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ సంఘ అధికారాలను పరిశీలించినట్లయితే అవి ఎక్కువగా సలహా రూపకమైనవి. ప్రభుత్వ ఉద్యోగుల సామర్ధ్యాన్ని అంచనా వేయడం, నివేదికలను పరిశీలించడం వంటి విషయాలలో స్వతంత్రత లేదు. ఉద్యోగుల నియామకాలు, (వారి భర్తీ) విషయంలో పాత పద్దతులనే అనుసరించడం జరుగుతుంది. కాని నూతన పద్దతిని అనుసరించడం లేదు.

సత్వరంగా దరఖాస్తు ఫారాల పరిశీలన, పరీక్షల నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక వంటి వాటికి సంబంధించి ప్రత్యేక సిబ్బంది అవసరం. కమీషన్ సిబ్బంది విషయంలో ఇతర మంత్రిత్వ శాఖలపైన ఆధారపడ వలసి వస్తుంది. ఇది కూడా తన కంటూ ప్రత్యేకత నిలుపుకో లేకపోవడానికి ఒక కారణం.

కమీషన్ చేసిన సిఫార్సులు కూడా అంతంత మాత్రంగానే ఆమోదించడం జరుగుతుంది. కమీషన్ విషయాలలో వివిధ మంత్రిత్వశాఖల జోక్యం వలన, ముఖ్యమైన ఉద్యోగి బృంద ఏజెన్సీగా ఉండాల్సిన కమీషన్ మంత్రిత్వ శాఖలలో ఒకటిగానే గుర్తింపబడుతుంది. వీలైనంత వరకు కార్యనిర్వాహక శాఖ నియంత్రణకు దూరంగా ఉంటూ, స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకుంటూ, నిష్పక్షపాతంగా, నిజాయితీగా ఉన్ననాడే కమీషన్ పట్ల ప్రజలకు సదభిప్రాయం ఏర్పడుతుంది.

**మాదిరి ప్రశ్నలు :**

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నకు 5 పేజీలకు మించకుండా జవాబు వ్రాయుము.

1. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్మాణము, విధులను గూర్చి వ్రాయుము.

**లఘువ్యాస ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించకుండా జవాబులు వ్రాయుము.

1. పబ్లిక్ సర్వీస్ కమీషన్‌కు గల రాజ్యాంగబద్ధ హోదాను గూర్చి వ్రాయుము.
2. పబ్లిక్ సర్వీస్ కమీషన్ అధికారాలు, పరిమితులు

**చదువదగిన గ్రంథాలు :**


1. అవస్తి & మహేశ్వరి : పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
2. మహేశ్వరి : ఇండియన్ అడ్మినిస్ట్రేషన్


**రచయిత : డా॥ కె. రఘునాధ్**

పాఠం - 13

# కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్

విషయసూచిక


13.0 లక్ష్యం

13.1 భారతదేశములో ఆడిట్ మరియు అకౌంటింగ్ కార్యాలయ వ్యవస్థాపరిణామము

13.2 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగ ప్రతిపత్తి

13.3 అధికారాలు - విధులు

13.4 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ - ఒక పరిశీలన

13.5 ముగింపు

మాదిరి ప్రశ్నలు

చదువదగిన గ్రంథాలు


## 13.0 లక్ష్యం :

ఈ పాఠంలో ఖాతాల తనిఖీ మరియు ఖాతాల నిర్వహణ వ్యవస్థ పరిణామము, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగ ప్రతిపత్తి, అతనికి గల అధికారాలు - విధులు, మొదలగు వాటిని గురించి మీరు తెలుసుకుంటారు.

## 13.1 భారతదేశములో ఆడిట్ మరియు అకౌంటింగ్ కార్యాలయ వ్యవస్థా పరిణామం :

ఖాతాల తనిఖీ మరియు ఖాతాల నిర్వహణ అంటే ఏమిటి ?

ఖాతాల నిర్వహణ అనగా ఆర్థికపరంగా జరిగే విషయాలను ఒక క్రమపద్ధతిలో రికార్డుచేసి భద్రపరచడం. ఆ అకౌంట్ల వివరాలను పరిశీలించి దానిలోని చట్ట వ్యతిరేక, అసంబద్ధ ఖర్చులను, ఇతర ఆర్థిక వ్యవహారాలను శాసన నిర్మాణశాఖకు తెలియజేసి, పాలనాపరంగా ఒక సంస్థ తన బాధ్యతలను సక్రమముగా నిర్వహించిందో లేదో తెలుపుటను ఆడిట్ అంటారు. ఆడిట్ అకౌంటింగ్ పూర్తి అయిన పిదప ప్రారంభమయ్యే చర్య.

పబ్లిక్ అకౌంట్స్ ఆడిట్ మొదట ప్రారంభించిన దేశం ఇంగ్లండ్. ఆడిట్‌కు 19వ శతాబ్దములో ప్రాధాన్యత లభించింది. ప్రభుత్వ విత్త వ్యవహారాలపై పార్లమెంటరీ అదుపు లేక అజమాయిషీలో భాగంగా ఆడిట్‌ను పేర్కొనవచ్చు. ఆడిటర్ కార్యనిర్వాహక శాఖతో సంబంధం లేకుండా స్వతంత్రంగా పనిచేస్తూ, తన నివేదికను పార్లమెంటుకు సమర్పిస్తాడు.

భారతదేశములో ఆడిట్ మరియు అకౌంట్స్ శాఖ చాలా ముందుగానే ప్రారంభింపబడినది. అయితే 1919 మాంటేగు - ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలతో స్వతంత్ర ఆడిట్ వ్యవస్థ ఏర్పడినది. ఈ సంస్కరణల ననుసరించి ఆడిటర్ జనరల్ భారత వ్యవహారాల కార్యదర్శిచేత నియమింపబడి, బ్రిటిష్ రాజు లేదా రాణీ అభీష్టం ఉన్నంత వరకు కొనసాగుతాడు. ఇతను గవర్నర్ జనరల్ కౌన్సిల్ ద్వారా తన నివేదికను భారత వ్యవహారాల కార్యదర్శికి నివేదించాలి.

1935 భారత ప్రభుత్వ చట్టం ఆడిటర్ జనరల్ అధికారాల పరిధిని మరింత విస్తృత పరచినది. అతనికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడానికి, అతను పదవీ విరమణ చేసిన తరువాత ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగం చేయకూడదని నిషేధించినది. అతనని తొలగించాలంటే ఫెడరల్ కోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలో తొలగించాలి.

1950లో భారత రాజ్యాంగం ఆమోదింపబడిన తరువాత ఆడిట్ జనరల్ పదవిని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా పునర్వ్యవస్థీకరించారు. కొన్ని అంశాలలో అతని అధికారాలు మరింత విస్తృతంచేయబడ్డాయి.

1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం అప్పటి రాష్ట్రాలకు (బ్రిటిష్ పాలిత ప్రాంతములకు) స్వతంత్రంగా ఆడిటర్స్ నియమించుకునే అధికారం కలదు. అయితే దీనిని ఏ రాష్ట్రం ఉపయోగించలేదు. అయితే భారతరాజ్యాంగాన్ని అనుసరించి కేంద్ర - రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాల తనిఖీకి ఒకే వ్యవస్థను ఏర్పరిచారు. అదే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ.

## 13.2 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగ ప్రతిపత్తి :

భారత రాజ్యాంగంలోని 149 నుండి 151 వరకు గల ప్రకరణముల ననుసరించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ ఏర్పరచబడినది. అతను రాష్ట్రపతిచే నియమింపబడతాడు. సాధారణముగా కేంద్ర ప్రభుత్వంలో విస్తృత అనుభవం ఉన్న వ్యక్తిని ప్రధానమంత్రి సలహాపై రాష్ట్రపతి నియమిస్తాడు. అతను పదవి చేపట్టిన 6 సం॥లు లేదా 65 సం॥లు వయస్సు వచ్చు వరకు అధికారములో కొనసాగుతాడు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ హోదా, జీతభత్యాలు సుప్రీంకోర్టు జడ్జి హోదా, జీతభత్యాలతో సమానంగా ఉంటాయి. అతను రాజీనామా చేయాలంటే ముందుగా రాష్ట్రపతి నుండి అనుమతి పొందాలి. అతని సర్వీసు నిబంధనలను పార్లమెంటు రూపొందిస్తుంది. అతను అధికారములో ఉండగా అతనికి నష్టం కలుగునట్లు సర్వీసు నిబంధనలు, జీతభత్యాలు మార్పు చేయరాదు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ స్థానం చాలా ప్రాధాన్యత కలిగి ఉంది. అతను నిర్వహించవలసిన విధులు బాధ్యతలు అతనికి ఇతర సివిల్ సర్వీసు ఉద్యోగుల కన్నా ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. అతను నిర్భయముగాను, నిష్పక్షపాతముగాను పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో తన విధులను నిర్వహించడానికి గాను పదవీ విరమణ తరువాత ఎటువంటి ప్రభుత్వ పదవి చేపట్టరాదనే ఆంక్ష విధించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను తొలగించాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఏ విధముగా తొలగించవచ్చో అదే విధమైన పద్ధతిలో తొలగించవచ్చు. అనగా పార్లమెంటు రెండు సభలలోను చర్చ జరిపి, అధిక సంఖ్యాకుల ఆమోదం పొందిన తరువాత, సభకు హాజరైన వారిలో 2/3 వంతు సభ్యులు ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదముద్ర పడితే కంప్ట్రోరల్ అండ్ ఆడిటర్ జనరల్‌ను తొలగించవచ్చు.

## 13.3 అధికారాలు - విధులు :

1947 భారతదేశ తాత్కాలిక రాజ్యాంగములో (ఆర్డర్‌లో) పేర్కొన్న కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అధికారాలు, విధులకు 1926లో చేయబడ్డ భారతప్రభుత్వ ఆడిట్ మరియు అకౌంట్స్ ఆర్డర్ ఆధారం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ భారతదేశములోను బయట జరిగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలు తనిఖీ చేస్తాడు. అకౌంట్స్‌లో చూపబడిన పద్దులు ఎంతవరకు చట్టబద్ధమైనవో, అవి ఎంతవరకు నిర్దేశింపబడిన నియమాలకు లోబడి ఖర్చు చేయబడినవో పరిశీలిస్తాడు.

అశోక్ చందా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అధికారాలు, విధులకు విస్తృత అర్థాన్ని ఇచ్చాడు. ప్రభుత్వం చేసిన ఖర్చు కేవలం పార్లమెంటు అనుమతించిన మేరకు ఖర్చు చేయబడినదా అనేదే కాకుండా, ఆ ఖర్చు పొదుపుగాను, విజ్ఞతతోను,

విశ్వసనీయతతోను చేయబడిందా లేదా అనే దాని గురించి ఆయన సంతృప్తి పడవలసి ఉంటుంది. దీనిని బట్టి ఖాతాల నిర్వహణలో పేర్కొన్న ఖాతాల పరిశీలనేగాక, పరిధిని మించి వృథా ఖర్చు జరిగినదా, అసంబద్ధంగా ఖర్చు జరిగినదా అని పరిశీలించే విచక్షణాత్మక ఆడిట్‌గా రూపొంది, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ అధికారాలను మరింత విస్తృతమైనాయని పేర్కొనవచ్చును. ఈ విధముగా ఆడిట్ అనేది కేవలం చట్టబద్ధమైనదేగాక, విచక్షణాత్మకమైనది అని కూడ స్పష్టమవుతుంది.

ఆర్థిక పాలన లేదా వ్యవహారాలలో రాజ్యాంగంలోను, చట్టాలలోను పొందుపరచబడిన న్యాయసూత్రాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పరిరక్షిస్తాడు. ప్రభుత్వ ఆదాయవ్యయాలకు సంబంధించి చట్టబద్ధ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు నియమాలకు లోబడి చేయబడినవో లేదో పరిశీలిస్తాడు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ భారత సంఘటితనిధిని, కేంద్ర, రాష్ట్రాల జమా ఖర్చులను, ప్రభుత్వ ఖాతాలను పరిశీలిస్తాడు. వివిధ ప్రభుత్వ శాఖలు నిర్వహించే వర్తకం, లాభనష్టాల ఖాతాలు, బ్యాలన్స్ షీట్‌లను పరిశీలిస్తాడు. సంఘటిత నిధి ద్వారా సహాయం పొందే సంస్థల వ్యవహారాలను కూడ ఆడిట్ చేస్తాడు. దీనికొరకై ఏ కార్యాలయాన్నైనా తనిఖీ చేయడానికి, వాటి అకౌంట్ పుస్తకాలు ఆడిట్ చేయడానికి, అవసరమైన సమాచారాన్ని పొందడానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు అధికారం కలదు. ఇతని అధికార పరిధి రహస్య సేవావిభాగానికి మాత్రం వర్తించదు. ఈ విభాగానికి సంబంధించిన ఖర్చులకై వివరణ కోరే అధికారం లేదు. కాని ఆ శాఖకు చెందిన ఒక బాధ్యతాయుత అధికారి నుండి పొందే నిరూపణ పత్రం ద్వారా అంచనాలను, ఆదాయ వ్యయాలను పరిగణనలోనికి తీసుకోవచ్చు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు సహాయ పడటానికి దేశవిదేశాలలో వంద క్షేత్రకార్యాలయాలు, 60,000 మందికి పైగా సిబ్బంది కలరు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నివేదికను రాష్ట్రపతికి, రాష్ట్రప్రభుత్వాల నివేదికలను గవర్నర్లకు సమర్పిస్తాడు. వారు ఆయా చట్టసభలకు సమర్పిస్తారు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ద్వారా పార్లమెంటు కార్యనిర్వాహక వర్గంపై ఆర్థిక పాలనాపర నియంత్రణ చేస్తుంది. దీనికితోడు పార్లమెంటు ఆమోదం మేరకు ఖర్చు జరిగినది లేనిది తెలుసుకోవడానికి ప్రభుత్వ ఖాతాల సంఘం (పి.ఎ.సి.) కలదు. ప్రభుత్వ ఆదాయ వ్యయాలను పరిశీలించడం దాని విధి. ఈ ఖాతాలను పరిశీలించి ఆడిట్ నివేదిక రూపొందించేటప్పుడు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌తోపాటు ప్రభుత్వ ఖాతాల సంఘం కూడ సంతృప్తి చెందాలి.

ప్రభుత్వ కార్పొరేషన్లు, వ్యాపార సంస్థలు ఇతర ప్రణాళికా బద్ధ సంస్థల లాభనష్టాల గురించి ప్రభుత్వ ఖాతాల సంఘం పరిశీలన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ఆధారముగా జరుగుతుంది. ప్రభుత్వం చేసే ఖర్చులో మితవ్యయం పాటింపబడింది లేనిది, నైతిక విలువలు పాటించింది లేనిది పార్లమెంటు ఆమోదం మేరకే ఖర్చు జరిగిందా, లేదా మొదలగు వాటిని ప్రభుత్వ ఖాతాల సంఘం చేస్తుంది. టి.జి.బేల్స్ దృష్టిలో "ప్రభుత్వ ఖాతాల సంఘానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ హస్తం వంటివాడు". ఈ విధముగా ప్రభుత్వ ఖాతాల పర్యవేక్షణలో కంప్ట్రోలర్ అండ్ జనరల్ స్నేహితుడుగాను, మార్గదర్శిగాను, పని చేయును.

## 13.4 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ - ఒక పరిశీలన :

పాల్. హెచ్. ఆపిల్‌బి భారత ఆడిట్‌ను తన రెండవ నివేదికలో తీవ్రంగా విమర్శించాడు. ఆడిట్ వ్యవస్థను వలసవాద వారసత్వముగా భావిస్తూ, మంచి పాలన ఎలా ఉండాలనే అవగాహన ఆడిటర్లకు ఉండదని పేర్కొన్నాడు. నిర్ణయాలు తీసుకొనుట, అమలుపరచుట వంటి వాటిల్లో ఏర్పడే స్తబ్దతకు ఆడిటర్ జనరల్ వ్యవస్థే కారణమని ఆయన అభిప్రాయం. ఇతని అభిప్రాయములో కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ సిబ్బంది పూర్తి ఆడిటింగ్ పిదప కనుగొనే సమస్యలు లేదా లోపాలపై, ఒక శాఖలో పనిచేసే డిప్యూటి

కార్యదర్శి ఎక్కువ అవగాహన కలిగి ఉంటాడు. ఆపిల్‌బి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థను రద్దు చేయవలసిందిగా సూచించాడు.

బహుశా అమెరికా పాలనా వ్యవస్థలో ఈ పదవికి అంతగా ప్రాధాన్యత లేకపోవడం ఆపిల్‌బి అభిప్రాయాలకు కారణం కావచ్చు. అయితే భారత పాలనా వ్యవస్థ బ్రిటిష్ వారసత్వంగా వచ్చినది. అందుచే మన పాలనా వ్యవస్థలో ఆడిటర్ జనరల్‌కు ఒక నిర్దిష్ట స్థానం కలదు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడడానికి ఆడిట్ తోడ్పడుతుంది. దేశ ఆర్థిక వ్యవహారాలలో ఆడిట్ అనేది "విశ్వసనీయతతో కాపలా కాచే శునకం"తో పోల్చవచ్చు. కాబట్టి ఈ వ్యవస్థను రద్దుచేయడం లేదా నిర్వీర్యం చేయడం సాధ్యం కాని పని.

భారతదేశములో చాలా కాలం వరకు ఆడిట్, ఎకౌంటింగ్ విధులు కలపి ఉన్నాయి. అది సిద్ధాంత రీత్యా సమంజసం కాదని 1924 మడ్డిమన్ కమిటీ మొదలుకొని అనేక కమీషన్‌లు పేర్కొన్నాయి. స్వతంత్ర భారతదేశములో మొదటి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్‌గా పనిచేసిన నరహరిరావు ఎకౌంటింగ్ మరియు ఆడిట్ విధులు ఒకే వ్యవస్థలో ఉండటంలో గల అసంబద్ధతను ఎత్తి చూపారు.

దీనికి కారణము ఖర్చు చేసేవారు ఖర్చు ఏ విధముగా కొనసాగుతుందో తెలియజేసే ఖాతాలను నిర్వహించక, వాటిని వేరుగా ఆడిట్ శాఖ నిర్వహించటం, ఖర్చుచేసే వారికి బాధ్యతలు తెలియచేయక అసంబద్ధతకు దారితీస్తుంది. దీనిని సరిదిద్దాలనే ఆదాయవ్యయాలను నిర్వహించే పరిపాలనాశాఖలోనే దానికి తగిన ఎకౌంటింగ్ యంత్రాంగం ఉండాలని సూచించబడినది.

ఖాతాల నిర్వహణ కార్యనిర్వాహక విధి. ఆడిట్ పార్లమెంటు అర్థవిధి. అందుచే ఈ రెండు బాధ్యతాయుతమైన అధికారాలు ఒకే పరిధిలో ఉండుట పార్లమెంటుకుగాని, కార్యనిర్వాహక వర్గానికిగాని వాంఛనీయం కాదు. దీనిని వెల్లీ కమీషన్ ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ప్రభుత్వ ఖాతాల సంఘం కూడ ఈ రెండు విధులు వేరుగా నిర్వహింపబడాలని సూచించింది. వీటిని విభజించినట్లయితే ఆయా శాఖల మితవ్యయాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించడం మాత్రమే కాకుండా, ఒక స్వతంత్ర వ్యవస్థ ఆ ఖాతాలను పరిశీలించి వాటిలోని తప్పొప్పులను కప్పిపుచ్చడానికి వీలు లేకుండా జాగ్రత్త పడవచ్చు.

భారతదేశములో 1976 వరకు ఆడిట్ మరియు అకౌంటింగ్‌లను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ చేపట్టేవారు. 1976 తరువాత అకౌంట్స్‌ని నిర్వహించి, రూపొందించే బాధ్యతలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నుండి తొలగించారు. ఆడిటర్ జనరల్, కార్యనిర్వాహక వర్గం మధ్య సత్సంబంధాలు ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. కాని మనదేశంలో అవిచెప్పుకోదగినంత సామరస్యముగా లేవు. సాఫీగా పోయే పాలనలో ఖాతాల తనిఖీ 'బాధాకరమైన ముల్లుగా' భావించడం జరుగుతుంది. ప్రజాస్వామ్య దేశంలో ఆడిట్‌ను తప్పనిసరిగా కొనసాగించాల్సిన వ్యవస్థగా భావించాలని (ఒక ఆవశ్యక్లేశంగా) అశోక్ చందా పేర్కొన్నాడు. ప్రజాస్వామ్యం అర్థవంతంగా పనిచేయడానికి ఆడిట్‌ను నిర్వహించే ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థ అవసరమేగాని, అది కార్యనిర్వాహక శాఖ నిర్ణయాలు తీసుకోవడంలోను, పథకాలు అమలులోను అనవసర జాప్యానికి కారణం కాకూడదు.

## 13.5 ముగింపు :

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయడానికి వీలుగా పదవీ విరమణ తరువాత ఎటువంటి లాభదాయకమైన ప్రభుత్వ ఉద్యోగం చేయరాదని పేర్కొనడం జరిగినది. అయితే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా పనిచేసిన అశోక్‌చందా 1960లో మూడవ ఆర్థిక సంఘ అధ్యక్షునిగా నియమించబడ్డాడు. ఇది కొంత విమర్శకు దారి తీసినది. దీనిపై ఆనాటి స్పీకర్, "లాభదాయకమైన పదవి కాకపోయినా, భారత ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండే పదవి కాబట్టి ఈ నియామకం గౌరవప్రదమైనది కాదని" వ్యాఖ్యానించాడు.

అందుచే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నియామక విషయంలోగాని, పదవీ విరమణ పిదపగాని, వివాదరహితముగా మసలినపుడే ఈ వ్యవస్థ గౌరవం మరింత పెరుగుతుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సిబ్బంది నియామకం విషయంలో కూడ, వారు కార్యనిర్వాహక శాఖపై ఆధారపడకుండా, వారి సిబ్బందిని వారే నియమించుకునే ఏర్పాటు కల్పించడం వలన కూడ ఆ వ్యవస్థ స్వతంత్ర్య ప్రతిపత్తిని కాపాడవచ్చు.

**మాదరి ప్రశ్నలు :**

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 5 పేజీలకు మించక జవాబు వ్రాయుము.

1. కంప్ట్రోలర్ జనరల్ వ్యవస్థానిర్మాణము, అతని అధికారాలు లేదా విధులను గూర్చి వ్రాయుము?
2. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థపై ఒక పరిశీలనాత్మక వ్యాసం వ్రాయండి?

**లఘువ్యాస ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించకుండా జవాబు వ్రాయుము.

1. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగబద్ధ హోదాను గూర్చి వ్రాయుము ?

**ఉపయుక్త గ్రంథాలు :**


Mishra B.R. : Indian Federal Finance

Avasthi & Maheswari : Public Administration

Kapoor & Pant : Public Finance


**రచయిత : డా॥ కె. రఘునాథ్**

పాఠం - 14

# ప్రభుత్వ రంగ సంస్థలు

## విషయసూచిక


14.0 లక్ష్యం

14.1 ప్రభుత్వరంగ సంస్థల నిర్వచనం

14.2 ప్రభుత్వరంగ సంస్థలు - రకాలు

14.3 భారతదేశములో ప్రభుత్వరంగ సంస్థల పెరుగుదల

14.4 ఆర్థిక వ్యవహారాలలో ప్రభుత్వపాత్రకు గల కారణములు

14.5 ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థానిర్వచనము

14.5.1 డిపార్టుమెంటు లేదా శాఖీయ వ్యవస్థానిర్మాణం

14.5.2 కార్పోరేషన్ల వ్యవస్థానిర్మాణం

14.5.3 కంపెనీల వ్యవస్థానిర్మాణం

14.5.4 హోల్డింగ్ కంపెనీ వ్యవస్థానిర్మాణం

14.6 ప్రభుత్వరంగ సంస్థలు ఒక పరిశీలన

14.7 ముగింపు

14.8 మాదిరి ప్రశ్నలు

14.9 చదువదగిన గ్రంథాలు


## 14.0 లక్ష్యం :

మీరు ఈ పాఠంలో ప్రభుత్వరంగ సంస్థలంటే ఏమిటి ? వాటి రకాలు, భారతదేశములో ప్రభుత్వరంగ సంస్థల పెరుగుదలకు గల కారణములు, ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాలను నెరుపుటకు గల కారణాలు, ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థా నిర్మాణాలు, ప్రభుత్వరంగ సంస్థల పనితీరు, వాటిపై అదుపును గూర్చి తెలుసుకుంటారు.

## 14.1 ప్రభుత్వరంగ సంస్థలు - నిర్వచనం :

కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలచే ప్రభుత్వ రంగంలో కానీ లేదా ఉమ్మడి రంగంలో గాని ఆర్థిక, వ్యాపార, పారిశ్రామిక, సేవాకార్యకలాపాలను నిర్వహించే సంస్థలను ప్రభుత్వరంగ సంస్థలు అంటారు.

1962లో లోక్‌సభ స్పీకరు, "భారతప్రభుత్వం తరుపున ఆర్థిక, పారిశ్రామిక, వ్యాపార లేదా సేవాకార్యకలాపాలను చేపట్టుటకు చట్ట ప్రకారము ఏర్పాటు చేయబడి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థగా" ప్రభుత్వరంగ సంస్థలను నిర్వచించాడు. అయితే దీనిలో రాష్ట్రప్రభుత్వంచే నిర్వహింపబడే సంస్థల ప్రసక్తి లేదు. ఖేరా నిర్వచనము ప్రకారం కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వాలచే లేదా ఉమ్మడి యాజమాన్యంలో స్వయంగా కాని, ప్రైవేటు సంస్థల సహచర్యంలో కాని, పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థిక కార్యకలాపములను నిర్వహించే సంస్థ ప్రభుత్వరంగ సంస్థ.

## 14.2 ప్రభుత్వరంగ సంస్థలు - రకాలు :

ఖేరా ప్రభుత్వరంగ సంస్థల యాజమాన్య పద్ధతులను బట్టి నాలుగు రకాలుగా వర్గీకరించాడు.

1. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, ఉదా : హిందూస్థాన్ స్టీల్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్
2. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు. ఉదా : విద్యుచ్ఛక్తి బోర్డు, స్టేట్ ట్రాన్స్‌పోర్టు కార్పోరేషన్‌లు
3. ఉమ్మడి యాజమాన్యం లోని సంస్థలు. ఉదా : దామోదర వ్యాలీ కార్పోరేషన్, భాక్రానంగల్ ప్రాజెక్టు మొదలగునవి.
4. ప్రైవేటు సంస్థల సహకారముతో నెలకొల్పబడిన సంస్థలు. ఉదా : ఆయిల్ ఇండియా లిమిటెడ్.

విలియం ఎం. రాబ్‌సన్ ప్రభుత్వరంగ సంస్థలను వాటి పరిధి, స్వభావాన్ని బట్టి ఏడు రకాలుగా గుర్తించాడు.

1. ప్రజోపకర కార్యకలాపములు నిర్వహించేవి. ఉదా : వాటర్, గ్యాస్, ఎలక్ట్రిసిటి.
2. రవాణా సమాచార రంగంలోని సంస్థలు. ఉదా : రైల్వేలు, ఎయిర్‌లైన్స్, షిప్పింగ్, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్
3. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగంలోనివి. ఉదా : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్, ఫైనాన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా.
4. బహుళార్థక ప్రయోజనం కలవి. ఉదా : దామోదర వాలి కార్పోరేషన్
5. ఆర్థిక వనరులు పెంపొందించడానికి నెలకొల్పబడిన ప్రాథమిక సంస్థలు. ఉదా : హిందూస్థాన్ షిప్‌యార్డు, కోల్ మైనింగ్ మొ॥నవి.
6. నూతన పరిశ్రమలు మరియు సేవలు. ఉదా : ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్, హిందూస్థాన్ మెషీన్ టూల్స్, స్టేట్ ట్రేడింగ్ కార్పోరేషన్
7. సాంస్కృతిక కార్యకలాపములు నిర్వహించేవి. ఉదా : ఫిల్మ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా.

## 14.3 భారతదేశములో ప్రభుత్వరంగ సంస్థల పెరుగుదల :

భారతదేశములో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 1931 కరాచీ సమావేశములో స్వరాజ్యాన్ని నిర్వచిస్తూ ముఖ్య పరిశ్రమలను సేవావిభాగములను రాజ్య యాజమాన్యం క్రిందకు తీసుకురావాలని పేర్కొంది. 1948 పారిశ్రామిక విధానంలో పబ్లిక్‌రంగ సంస్థలను నెలకొల్పడంలో ప్రభుత్వ విధానాన్ని స్పష్టపరిచారు. 1956 ఆవడి తీర్మానంలో కాంగ్రెసు ప్రభుత్వ రంగానికి మరింత విస్తృతిని, ప్రాధాన్యతను కల్పించాలని భావించింది.

1980 దశకానికి 20,000 కోట్ల పెట్టుబడితో 20 మిలియన్ ఉద్యోగులతో కూడిన 186 ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వంచే నెలకొల్పబడ్డాయి. ఇవికాక అనేక రాష్ట్రాలు కూడ ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పాయి. మూడవ ప్రణాళికాంతమునకు రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో 2,000 కోట్ల పెట్టుబడితో 175 సంస్థలు నెలకొల్పబడ్డాయి.

మనదేశములో ప్రభుత్వ రంగ సంస్థల పరిధి చాలా విస్తృతమైనది. పరిశ్రమలకు ఋణాలివ్వడం, వాణిజ్యాన్ని నిర్వహించడం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రోత్సాహం, భారీయంత్ర పరికరాల ఉత్పత్తి, విద్యుచ్ఛక్తి, రవాణా సేవల నిర్వహణ, పాలసేకరణ, సరఫరా మార్కెట్లు, హోటల్స్ వంటి రంగాలలో ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి.

## 14.4 ఆర్థిక వ్యవహారాలలో ప్రభుత్వపాత్రకు గల కారణములు :

ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వం చురుకైన పాత్ర నిర్వహించాలని ఖేరా సూచించాడు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశం పరిమిత వనరులతో నియమిత కాలంలో అభివృద్ధి చెందడానికి ప్రణాళికబద్ధమైన ఆర్థిక విధానం అవసరం. ఇటువంటి బాధ్యతలను ప్రభుత్వం మాత్రమే సమర్థవంతముగా నిర్వహించగలదు.

పారిశ్రామికాభివృద్ధి పెద్దగా లేని భారతదేశములో, త్వరితముగా పారిశ్రామికీకరణ జరగటానికి అవసరమైన పెట్టుబడుల సమీకరణకు ప్రభుత్వ ప్రమేయం తప్పనిసరి. సామ్యవాద సమాజమే లక్ష్యంగా గల మనదేశం, ఆ ఆశయ సాధనకు పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో ప్రత్యక్షంగా ప్రవేశించడమ్మ తప్పని సరైనది. రాజకీయపరంగా కొన్ని సంక్షేమ లక్ష్యాలు కలిగిన ప్రభుత్వం అవి నెరవేరటానికి ధరలు అదుపు చేయుట, సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇచ్చుట వంటి చర్యల ద్వారా ఆర్థిక వాణిజ్య కార్యకలాపాలలో పాల్గొనవలసి ఉంటుంది. పారిశ్రామిక, ఆర్థిక రంగాలలో పెద్ద ఎత్తున పాల్గొనడం ద్వారా జాతీయ ఆదాయాన్ని కూడ పెంపొందించ వీలుకలుగుతుంది.

## 14.5 ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థా నిర్మాణం :

ప్రభుత్వరంగ సంస్థల ఆదర్శ వ్యవస్థ అంటూ ప్రత్యేకంగా ఏదీలేదు. స్థూలంగా ప్రభుత్వ రంగ వ్యవస్థానిర్మాణాలను మూడుగా గుర్తించవచ్చు. అయితే ఈ పాఠంలో నాల్గవ దాని గురించి కూడ పేర్కొనడం జరిగింది. ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థా నిర్మాణాల ముఖ్యంగా మూడు. అవి 1) డిపార్టుమెంటులు (శాఖీయరకం), 2) కార్పోరేషన్లు, 3) కంపెనీలు.

### 14.5.1 డిపార్టుమెంటు లేదా శాఖీయ రకం :

డిపార్టుమెంటు అతి పురాతన రకం. పోస్టల్, టెలిఫోన్, రైల్వేలు మొ॥న వాటిని నిర్వహించుట, పెట్టుబడి పెట్టుట నియంత్రించుట ఒక ప్రభుత్వశాఖ ద్వారా జరుగుతుంది. 1951లో రంగూన్‌లో నిర్వహింపబడ్డ ఐక్యరాజ్యసమితి సదస్సులో శాఖీయ రకం వ్యవస్థా లక్షణాలు ఈ విధంగా పేర్కొనబడ్డాయి.

1. డిపార్టుమెంటు లేదా శాఖ కేంద్ర ప్రభుత్వంలోని ఒక శాఖలో ఒక పెద్ద ఉపవిభాగంగా ఉంటుంది. ఆ శాఖాధిపతి ప్రత్యక్ష నియంత్రణ క్రింద ఉంటుంది.
2. దీనిలో పనిచేసే ఉద్యోగుల నియమాక పద్ధతి, సర్వీసు నిబంధనలు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి ఉంటాయి.
3. ప్రభుత్వ ఖజానా నుండి డిపార్టుమెంటులకు డబ్బు జారీ చేయటం జరుగుతుంది. దాని ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ చేయబడుతుంది. ప్రభుత్వంలోని ఇతర శాఖల వలెనే ఇవి కూడ బడ్జెట్, అకౌంటింగ్, ఆడిట్ నియంత్రణలకు లోబడి ఉంటాయి.
4. దీని మీద దావా వేసినట్టయితే ప్రభుత్వం మీద దావా వేసినట్లే. దీనికి ప్రభుత్వం నుండి చట్టబద్ధ రక్షణ ఉంటుంది.

**గుణాలు :** శాఖీయ లేదా డిపార్టుమెంటు ఆమోదయోగ్యమైన వ్యవస్థా నిర్మాణాన్ని, పద్ధతులను కలిగి ఉంటుంది. సిబ్బంది పరంగా పెద్ద ఇబ్బంది ఉండదు. ఆర్థిక వనరులను సమర్థవంతముగా ఉపయోగించుకోవచ్చు. ప్రభుత్వ జవాబుదారి, కార్యనిర్వాహక దక్షత ఎక్కువగా ఉంటుంది. రహస్యాలను దాచి ఉంచుట సులభం. ఉదాహరణకు రక్షణ పరమైన సమాచారాన్ని చెప్పమని ఒక మంత్రిని పార్లమెంటు వత్తిడి చేయజాలదు. ప్రభుత్వ నియంత్రణ అధికంగా ఉంటుంది.

**దోషాలు :** దీనిలోని ఉద్యోగులను సివిల్ ఉద్యోగులుగా పరిగణించడం చేత దక్షతను బట్ట పదోన్నతి ఇవ్వడంగాని, పని సామర్థ్యం లేకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకోడానికి గాని అంతగా వీలు ఉండదు. కావలసిన నిధులు సేకరించడం కష్టం. దీనికి కారణం ఆర్థికపరమైన నియంత్రణ అధికముగా ఉండటం. దీనివలన ఉద్యోగులలో చొరవ నశిస్తుంది. ముడిపదార్థాల సేకరణ, ఉత్పత్తి అమ్మకం వంటి వాటిపై నిర్ణయాలకు శాఖాపరమైన పద్ధతి అవలంబిస్తే చాలా జాప్యం జరుగుతుంది. రాజకీయ జోక్యం అధికముగా ఉండి పనితీరు దెబ్బతినవచ్చు. అయితే కొన్ని ప్రభుత్వాలు ఈ లోపాన్ని సవరించడానికి సరళతతో కూడిన విధానాలను ప్రవేశపెట్టి యాజమాన్యానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తున్నాయి. ఉదాహరణకు రైల్వేల నిర్మాణానికి రైల్వేబోర్డు.

### 14.5.2 కార్పొరేషన్ :

ప్రభుత్వ రంగ సంస్థలలో గత 40 సం॥ల నుండి అభివృద్ధి చెందిన కొత్త వ్యవస్థా రూపమే కార్పొరేషన్. ఈ శతాబ్దపు రాజకీయ పరికల్పనలుగా దీనిని డబ్ల్యు. ఎ. రాబ్‌సన్ అభివర్ణించాడు. కార్పొరేషన్ ఒక ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటు చేయబడుతుంది. అధికారాలు, విధులు యాజమాన్య విధానం, ఇతర సంస్థలతో సంబంధాలు ఈ చట్టంలోనే పేర్కొనబడతాయి. ఇది ప్రత్యేక వ్యక్తిగత హోదాను కలిగి ఉంటుంది. న్యాయ అంశాలలో ఒప్పందాలు చేసుకోవడం ఆస్తులు అమ్ముకోవడం, కొనడం మొదలైన అంశాలలో స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది. మూలధనాన్ని పెంపొందించడానికి, నష్టాలను పూడ్చుకోవడానికి మాత్రమే ప్రభుత్వంపై ఆధారపడుతుంది. ప్రజల నుండి కాని, ప్రభుత్వ ఖజానా నుండి కాని అప్పులు పొందవచ్చు. వస్తువులు, సేవలు, అమ్మకం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చు.

ప్రభుత్వ నిధుల వినియోగంపై ఉండే ఆంక్షలు సాధారణముగా దీనిపై ఉండవు. దీనిలోని ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు కానవసరం లేదు. వ్యవస్థ స్వతంత్రముగా రూపొందించుకున్న నియమ నిబంధనల ననుసరించి నియామకాలు జరుగుతాయి. ఈ వ్యవస్థలో ఉన్న ప్రయోజనం దీనికి గల స్వతంత్ర ప్రతిపత్తి. ప్రైవేటు కార్పొరేషన్‌కు భిన్నంగా ప్రజలకు జవాబుదారీగా ఉంటుంది. ఎక్కువ ఆదాయం వచ్చే సేవారంగాలలో కార్పొరేషన్లు స్థాపించడం ద్వారా కొనుగోళ్ళు, అమ్మకాలు, నిర్మాణాలు వంటి వాటిల్లో అనవసర జాప్యాన్ని తొలగించవచ్చు. దక్షత కలిగిన వారికి ప్రోత్సాహక బహుమతులు, పని దక్షత లేని వారికి శిక్షించే అధికారం ఉండటంతో ఈ సంస్థలు సమర్థవంతముగా పనిచేయగలవు.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థగా, లాభార్జనే ధ్యేయముగా ఉంటే వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించలేవు. కార్మిక సంక్షేమ కార్యక్రమాల పట్ల శ్రద్ధ చూపవు. ఇవి ఎంతవరకు చట్టానికి లోబడి పని చేస్తున్నాయో అంచనా వేయడం కష్టం. అయితే ఇవి నెలకొల్పడానికి చేసే చట్టంలోనే దీనిపై పార్లమెంటుకు నియంత్రణా పరిధిని, అంతర్గత స్వయంప్రతిపత్తిని నిర్వచించి వీటిని ప్రజోపకరమైన సంస్థలుగా తీర్చిదిద్దవచ్చునని అంచనాల సంఘం అభిప్రాయం.

### 14.5.3 కంపెనీలు :

ప్రభుత్వ రంగంలో వస్తువులను ఉత్పత్తి చేయుటకు ఆధునిక కాలంలో ఎక్కువగా ఉపయోగింపబడే వ్యవస్థా నిర్మాణం జాయింట్ స్టాక్ కంపెనీ. దీనిలో ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యక్తులు లేదా సంస్థల పాత్ర ఉంటుంది. ప్రభుత్వేతర పాత్ర దేశవిదేశాలలో ప్రజలచేగాని, సంస్థలచే గాని నిర్వహించబడవచ్చు. షేర్లు లేక వాటాల రూపంలో అనేక మంది పౌరుల నుండి మూలధనం సమకూర్చబడుతుంది. పరిపాలనా సంస్కరణల సంఘం రూపొందించిన ప్రభుత్వరంగ సంస్థలపై నివేదికలో ప్రభుత్వ కంపెనీల లక్షణాలను పేర్కొన్నారు.

దీనికి ఎక్కువగా ప్రైవేటు కంపెనీ లక్షణాలు ఉంటాయి. దీనిలో 51% లేదా ఆ పైన వాటాలు ప్రభుత్వానివై ఉంటాయి. కంపెనీ డైరెక్టర్లలందరిని గాని లేక ఎక్కువ మందిని గాని ప్రభుత్వం నియమిస్తుంది. ఇది చట్టం ప్రకారం ఏర్పడి కార్పొరేట్ హోదా కలిగి ఉంటుంది. దీనిపై కోర్టులో దావా వేయవచ్చు లేదా దీనిపై ఇతరులు దావా వేయవచ్చు. ఇతర సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు. ఆస్తులు సమకూర్చుకోవచ్చు. జాయింట్ స్టాక్ కంపెనీలు 1956 భారతదేశ కంపెనీ చట్టాన్ని అనుసరించి ఏర్పాటు చేయబడ్డాయి. ప్రభుత్వ కార్పొరేషన్ వలె కాక, ఒక కార్యనిర్వాహక శాఖ నిర్ణయంతో దీనిని ఏర్పాటు చేయవచ్చు. పార్లమెంటు ప్రత్యేక అనుమతి అవసరం లేదు. దీని నియమ నిబంధనలు చట్టానికి లోబడి ఉన్నా, ప్రభుత్వం వాటిని మార్పు చేయవచ్చు. నిధులను ప్రభుత్వం నుండి, కొన్ని సందర్భాలలో ప్రైవేటు వాటాదారుల నుండి, వస్తువుల సేవల

అమ్మకం ద్వారా సమకూర్చుకోవచ్చు. గవర్నమెంటు శాఖలకు వర్తించే బడ్జెట్, అకౌంట్, ఆడిట్ నిబంధనలు నుండి దీనికి మినహాయింపు ఉంటుంది. డెప్యుటేషన్‌పై పని చేసేవారు తప్ప మిగతా వారెవ్వరూ సివిల్ ఉద్యోగులుగా పరిగణింపబడరు.

కంపెనీ వ్యవస్థను అమలు పరచడానికి మూడు ప్రధాన కారణాలు కలవు.

1. జాతీయ ప్రాముఖ్యం దృష్ట్యా ఏదైనా ప్రైవేటు సంస్థను జాతీయం చేయడానికి,
2. జాతీయ ప్రాముఖ్యత కలిగిన వస్తువులు, సేవలు అందించే ప్రైవేటు సంస్థలు దివాలా తీసే స్థితిలో ఉంటే వాటిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం వాటి వాటాలను సేకరిస్తుంది. దీనికి ఉదాహరణగా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీని పేర్కొనవచ్చు. దీని వలన జాతీయ ప్రయోజనాల దృష్ట్యా దేశవిదేశ వ్యక్తులు లేక సంస్థలతో కలిసి వ్యాపారాన్ని నిర్వహించడానికి వీలవుతుంది. ఉదా : హిందుస్థాన్ షిప్ యార్డు లిమిటెడ్.
3. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థలలో కొంత భాగాన్ని ప్రైవేటు పరం చేయాలన్నా కంపెనీ వ్యవస్థల వలనే వీలవుతుంది. ఉదా. ఆల్విన్ అండ్ ఆల్విన్ కంపెనీలోని జీపుల విభాగాన్ని మహేంద్ర అండ్ మహేంద్ర కంపెనీకి బదలాయింపు. ప్రధాన ప్రభుత్వరంగ సంస్థలలోని వాటాలను నూతన ఆర్థిక విధానానికి అనుగుణముగా కొన్ని ప్రైవేటు సంస్థలకు బదిలీ చేయడం.

కంపెనీ వ్యవస్థపై కొన్ని పరిమితులు కలవు. ఇది ప్రభుత్వానికి లేదా పార్లమెంటుకు పూర్తి బాధ్యత వహించదు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన నివేదికలో ప్రభుత్వ యాజమాన్య సంస్థలకు కొనసాగించడం కంపెనీల చట్టం మరియు రాజ్యాంగాన్ని దుర్వినియోగ పరచడమేనని పేర్కొన్నాడు. వీటిని సమర్థవంతంగా నిర్వహించడానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పర్యవేక్షణలో పనిచేసే ఒక ఆడిట్‌ను ఏర్పాటు చేయాలని పరిపాలనా సంస్కరణల సంఘం సూచించింది. ప్రస్తుత సరళీకృత ఆర్థిక విధానాన్ని అనుసరించి ప్రభుత్వం 51% వాటా కలిగి ఉండవక్కరలేదు. వ్యక్తులు లేదా సంస్థలు కాని అధిక షేర్లు కలిగి ఉండవచ్చు.

## 14.5.4 హోల్డింగ్ కంపెనీ :

యాజమాన్య మూలధనంలో ఒక కంపెనీ అధిక వాటాలు కలిగి ఇతర కంపెనీలపై నియంత్రణ కలిగి ఉంటే అటువంటి దానిని హోల్డింగ్ కంపెనీ అంటారు. ఇతర కంపెనీలు ఈ హోల్డింగ్ కంపెనీకి అనుబంధ కంపెనీలుగా పని చేస్తాయి. ఉదా. జనరల్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, స్టీల్ అథారిటి ఆఫ్ ఇండియా లిమిటెడ్ మొ॥నవి.

ఈ వ్యవస్థ హిందూ అవిభక్త కుటుంబాన్ని పోలి ఉంటుంది. ఆర్థిక సంక్షోభం ఏర్పడినపుడు హోల్డింగ్ కంపెనీ అనుబంధ కంపెనీలను గాని లేదా అనుబంధ కంపెనీలు హోల్డింగ్ కంపెనీని గాని ఆదుకోవచ్చు. ఈ పద్ధతి పారిశ్రామిక సంబంధాల మెరుగుకు దోహదం చేస్తుంది. అయితే హోల్డింగ్ కంపెనీలు గుత్తాధిపత్యానికి దారి తీయవచ్చు. వాటి నిర్వహణా భారం అధికమై అసమర్థతకు దారి తీయవచ్చు.

## 14.6 ప్రభుత్వరంగ సంస్థలు - ఒక పరిశీలన :

ఆర్థిక అసమానతలను రూపుమాపడం, సామాజిక న్యాయాన్ని చేకూర్చడం వంటి అంశాలలో ప్రభుత్వ రంగ సంస్థలు గణనీయమైన పాత్ర పోషిస్తున్నప్పటికి, అవి కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

ప్రభుత్వ రంగ కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం ఎక్కువైంది. ఈ సంస్థల ఆశయాలలో అస్పష్టత గోచరిస్తుంది. అవి అమలు పరిచే విధానములో కూడ స్పష్టత లేదు. వీటిలో సిబ్బంది జీతభత్యాలు ప్రైవేటు రంగ సంస్థల కన్నా తక్కువ. అందుచే నిపుణులు, అనుభవజ్ఞులు వీటిపట్ల ఆకర్షితులు కావడం లేదు. దక్షత ఉద్యోగులకు కొరత కలదు. ఫలితముగా వీటి నిర్వహణలో అసమర్ధత చోటు చేసుకుంటుంది.

ప్రభుత్వరంగ సంస్థలలో నిర్ణయాలు తీసుకోవడానికి ఆర్ధికాంశాలపైనే కాక రాజకీయాంశములకు కూడ ప్రాధాన్యత ఇస్తున్నారు. సమిష్టి నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుంది. అధికంగా నియమ నిబంధనలకు ప్రాధాన్యత ఇవ్వడంలో వీటి పనితీరు నిర్వీర్యమవుతుంది. ప్రభుత్వ రంగ ఉన్నతాధికారులలో చొరవ, స్వాతంత్ర్యం కనపడటం లేదు. ఇవి అందించే వస్తువుల, సేవల ధరలు ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అందుచే దొడ్డిదారిలో పన్నులు వేయడానికి ఇవి మార్గాలుగా ఉపయోగపడుతున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలలోని మూడు రకాల వ్యవస్థలో ప్రయోజనాలు, పరిమితులు కనపడుతున్నాయి. శాఖీయ రకం యాజమాన్యం స్వతంత్ర్య ప్రతిపత్తికి, సరళతకు వ్యతిరేకమయినదని గోర్‌వాలా అభిప్రాయం. అందుకే ఉపహాత్మక ప్రాముఖ్యం, నిగూఢత అవసరమైన సందర్భాలలోనే శాఖీయ రకం అమలుపరచాలని భావించాడు. సరళతతో కూడిన వాణిజ్య విధులను నిర్వహించడానికి కంపెనీ యాజమాన్యం సరైనదని భావించాడు. సమాచార, నీటిపారుదల మొదలైన ప్రభుత్వ విధుల వంటి అనుబంధిత పనుల నిర్వహణకు కార్పొరేషన్ యాజమాన్య విధానాన్ని ఉపయోగించవచ్చునని గోర్‌వాలా అభిప్రాయం.

పార్లమెంటరీ నియంత్రణ, అంతర్గత స్వయం ప్రతిపత్తి కలిగింది, కార్పొరేట్ విధాన వ్యవస్థ అని అంచనాల సంఘం భావించింది. రక్షణ, ఉపహాత్మక, భద్రతా అవసరాలు, ఆర్ధిక నియంత్రణ కావలసిన చోట మాత్రమే శాఖీయ విధానాన్ని అమలు పరచాలని అంచనాల కమిటీ భావించింది. ఇప్పటికే ఉన్న సంస్థను అత్యవసరంగా అధీనంలోనికి తెచ్చుకోవడం, ప్రైవేటు మూలధన సహకారముతో సంస్థను స్థాపించడం, సంస్థలను క్రమంగా ప్రైవేటు పరం చేయడం లాంటి ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కంపెనీ తరహా వ్యవస్థా నిర్మాణం వాంఛనీయం అని అంచనాల సంఘం భావించింది.

సమాజం మొత్తం అవసరాలను లేక దేశ రక్షణ అవసరాలను తీర్చే చోట శాఖీయరకం యాజమాన్యాన్ని ఉపయోగించాలని పరిపాలనా సంస్కరణల సంఘం అభిప్రాయ పడింది. వాణిజ్య పారిశ్రామిక రంగాలలో కావలసిన సరళత, స్వతంత్ర ప్రతిపత్తి శాఖీయ విధానం చేకూర్చలేదని భావించడం జరిగినది. ఈ రెండూ కంపెనీ లేదా కార్పొరేషన్ తరహా వ్యవస్థలలోనే చేకూరుతాయి. సంస్థల స్వభావం, ప్రాధాన్యత, పరిధి, పెట్టుబడి, ఆర్ధికాభివృద్ధిలో వాటి పాత్ర, అవి సమకూర్చే వస్తువులు, సేవలపై ఆధారపడి ఈ రెంటిలో ఒక దానిని ఎన్నుకోవాలని ఈ సంఘం అభిప్రాయపడింది.

ప్రజాస్వామ్య పరిపూర్ణతకు అవసరమైన పవిత్రత, వ్యక్తిత్వం, మరియు ప్రభుత్వరంగ సమర్ధత ప్రభుత్వ కార్పొరేషన్ వ్యవస్థా పద్ధతిలోనే పొందగలమని పరిపాలనా సంస్కరణల సంఘం భావించింది. వ్యాపార పారిశ్రామిక రంగాలలోని ప్రభుత్వ రంగ సంస్థలకు కార్పొరేషన్ వ్యవస్థా పద్ధతే మంచిదని 1967లో ప్రభుత్వరంగ సంస్థల అధ్యయనంపై ఇచ్చిన నివేదిక పేర్కొంది.

ప్రభుత్వరంగ సంస్థలు అసమర్ధంగా పనిచేస్తూ అధిక నష్టాలలో ఉన్నవనేది అనుభవాన్ని బట్టి తెలుస్తుంది. అవి ప్రభుత్వం మీద, పన్ను కట్టేవారి పైన అధిక భారాన్ని మోపుతున్నాయి. ప్రభుత్వం తనకున్న షేర్లను నష్టాలలో ఉన్న ఎనిమిది ప్రభుత్వరంగ కార్పొరేషన్లకు తరలించడం ద్వారా ప్రభుత్వరంగంలో మారటోరియం విధించి, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సాహించాలని భావిస్తుంది.

మాదిరి ప్రశ్నలు :

వ్యాసరూప ప్రశ్నలు : ఈ క్రింది ప్రశ్నలకు 5 పేజీలకు మించకుండా జవాబు వ్రాయుము.

1. ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థా నిర్మాణాలను గూర్చి వ్రాయండి ?
2. భారతదేశములో ఆర్థిక నిర్వహణలో ప్రభుత్వ జోక్యానికి అవసరమైన కారణాలేవి?

లఘువ్యాస ప్రశ్నలు : ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. ప్రభుత్వరంగ సంస్థల పనితీరును విమర్శనాత్మకంగా పరిశీలించండి?
2. కార్పొరేషన్ మరియు కంపెనీ వ్యవస్థల నిర్మాణంలో గల భేదాలేవి?
3. శాఖీయ సంస్థల వలన కలుగు ప్రయోజనాలు-నష్టాలు ఏవి?
4. ప్రభుత్వరంగ సంస్థలనగా నేమి? వాటిలోని రకాలేవి?

లఘుటీక వ్రాయుము :

1. ప్రభుత్వశాఖ
2. కార్పొరేషన్
3. హోల్డింగ్ కంపెని

ఉపయుక్త గ్రంథాలు :


Avasthi & Maheswari — Public Administration

Sharan — Public Administration in India.


రచయిత : డా॥ కె. రఘునాథ్

పాఠం - 15

# రాష్ట్ర స్థాయి పాలనా వ్యవస్థ - రేఖా చిత్రము

విషయసూచిక :


15.0 లక్ష్యం

15.1 రాష్ట్రస్థాయి పాలనా వ్యవస్థ - ఉపోద్ఘాతం

15.2 రాష్ట్రస్థాయి పాలనా స్వరూపం - స్థూల పరిశీలన

15.3 రాష్ట్ర పాలనలో గవర్నర్ పాత్ర

15.3.1 గవర్నర్ నియామకం, పదవీ కాలం, జీత భత్యాలు

15.3.2 అధికారాలు లేదా విధులు

15.3.3 గవర్నర్ వ్యవస్థ ఒక పరిశీలన

15.4 మంత్రి మండలి

15.5 ముఖ్యమంత్రి

15.6 సచివాలయం

15.7 సంచాలక కార్యాలయాలు

15.8 జిల్లా పాలన


## 15.0 లక్ష్యం :

ఈ పాఠంలో రాష్ట్ర స్థాయి పాలనా వ్యవస్థ గురించి రేఖా మాత్రంగా మీరు చదువుతారు. రాష్ట్ర స్థాయిలో గవర్నర్, మంత్రి మండలి, ముఖ్యమంత్రి వారి నియామకాలు, పదవీ కాలం, తొలగింపు, వారి అధికారాలు, విధుల గురించి మీరు తెలుసుకుంటారు. అంతేకాక వారికి తోడ్పాటు వహించడానికి ఏర్పాటు చేయబడిన ప్రభుత్వ ఉద్యోగి స్వామ్యం గురించి కూడా కొంత వరకు అవగాహన ఏర్పడుతుంది. చివరిగా జిల్లా, మండల, తాలుకా స్థాయిలలోని ప్రజల చేత ఎన్నుకోబడ్డ సంస్థల గురించి కూడా ఒక అవగాహన ఏర్పడుతుంది. మొత్తం మీద ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం పాలనా వ్యవస్థలోని వివిధ స్థాయిలలో గల పాలన గురించి రేఖా మాత్రంగా మీకు తెలియచేయడం.

## 15.1 రాష్ట్ర స్థాయి పాలన - ఉపోద్ఘాతం :

రాష్ట్ర స్థాయి పాలన గురించి తెలుసుకునే ముందు మనం కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. జాతీయ స్థాయిలో ఏకత్వ సాధనలో భాగమైన లక్షణాలను రాష్ట్ర పాలన ప్రతిబింబిస్తుంది. అంతే కాకుండా ప్రాంతీయ వైరుధ్యాల సమ్మేళనంపై కూడా అది ఆధారపడి ఉంటుంది. 1) వైరుధ్యాలనేవి రాష్ట్రంలోనే కాకుండా రాష్ట్రాంతరంగా ఉండవచ్చు. అవి సూక్ష్మమైనవి కావచ్చు లేదా స్థూలమైనవైనా కావచ్చు. 2) ఆయా రాష్ట్రాల పాలనపై చరిత్ర, రాజకీయాలు, భౌగోళిక పరిస్థితులు తమ ప్రభావాన్ని చూపుతాయి. 3) రాష్ట్ర రాజకీయాలు, ఉద్యోగిస్వామ్య స్వభావం వీటిపై కూడా ఆధారపడి రాష్ట్ర పాలన ఉంటుంది.

భారత రాజ్యాంగమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాల్సిన అధికార విధులను స్పష్టం చేసింది. ప్రభుత్వ వ్యవస్థ స్వరూపం కేంద్ర, రాష్ట్రాలలో ఒకే విధంగా ఉంటుంది. ప్రస్తుతం భారతదేశంలో 25 రాష్ట్రాలు ఉన్నాయి. స్థూలంగా అన్ని రాష్ట్రాలలో ఒకే విధమైన పాలనా వ్యవస్థ ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణకు సంబంధించి జమ్మూ-కాశ్మీర్‌కు కొన్ని ప్రత్యేకతలు 370 రాజ్యాంగ ప్రకరణ ప్రకారం కల్పించబడ్డాయి. రాష్ట్ర స్థాయి పాలనా స్వభావం గురించి ఇక్కడ స్థూలంగా పరిశీలిద్దాం.

## 15.2 రాష్ట్ర స్థాయి పాలనా స్వరూపం - స్థూల పరిశీలన :

రాష్ట్ర ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో రాజకీయ కార్యనిర్వాహకుడు గవర్నర్. కేంద్రంలో వలనే రాష్ట్రంలో కూడా మంత్రి మండలి యదార్థ కార్య నిర్వాహక వర్గం. మంత్రి మండలి రాష్ట్ర ప్రభుత్వ పాలనను గవర్నర్ పేరు మీద అతని ఆదేశాల మేరకు నిర్వహిస్తుంది. అందుచే గవర్నర్ నామ మాత్ర ముఖ్య కార్య నిర్వాహకుడిగానే ఉంటాడు. మంత్రి మండలి యదార్థ కార్యనిర్వాహక వర్గంగా వ్యవహరిస్తుంది.

విధానాల రూపకల్పనను చేపట్టేది రాష్ట్ర సచివాలయం (సెక్రటేరియట్). సచివాలయ వ్యవస్థ వివిధ శాఖలుగా విభజింపబడి ఉంటుంది. మంత్రి మండలికి సలహాలివ్వడం, శాసనాల రూప కల్పనలో సహాయం చేయడం, ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు సమన్వయం చేయడం సచివాలయ విధులు. సచివాలయములోని ప్రతి శాఖకు ఐ.ఎ.ఎస్ హోదా గల అధికారి ఆధిపత్యం వహిస్తాడు. సచివాలయం ప్రభుత్వానికి గుండె మాదిరిగా పని చేస్తుంది.

మంత్రుల అధీనంలో కార్యనిర్వహణ శాఖలు ఉంటాయి. వీటిని సంచాలక కార్యాలయాలు లేదా డైరక్టరేట్‌లని వ్యవహరిస్తారు. దీని అధిపతిని డైరెక్టర్ అంటారు. వీటికి రాష్ట్రమంతటా క్షేత్ర కార్యాలయాలు ఉంటాయి. ప్రభుత్వ ఆదేశాలు రాష్ట్రమంతటా అమలు జరిగే లాగా చూడటం ఈ సంచాలక కార్యాలయాల పని.

పరిపాలనా వికేంద్రీకరణకు క్షేత్ర స్థాయిలో జిల్లాలు ఉంటాయి. జిల్లా ముఖ్య కార్యనిర్వాహకుడు కలెక్టర్. జిల్లాలో కలెక్టరుతో పాటు వివిధ శాఖలకు సంబంధించి ఇతర అధికారులు ఉంటారు. పరిపాలనను క్రింది స్థాయి వరకు తీసుకువెళ్ళే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాను తిరిగి మండలము మరియు గ్రామాలు అని విభజించారు.

## 15.3 రాష్ట్ర పాలనలో గవర్నర్ పాత్ర :

రాజ్యాంగాన్ని అనుసరించి రాష్ట్రపతిచే గవర్నర్ నియమింపబడతాడు. ప్రజా సంక్షేమం, జాతీయ సమగ్రత దృష్ట్యా రాజ్యాంగ నిర్మాతలు గవర్నర్‌ను ప్రజలు స్వయంగా ఎన్నుకోడానికి బదులు రాష్ట్రపతిచే నియమించే పద్ధతిని రూపొందించారు.

### 15.3.1 నియామకం, పదవీ కాలం :

రాజ్యాంగ 153వ ప్రకరణ ప్రకారం 35 సం॥ నిండిన ఏ భారత పౌరుడైనా గవర్నరుగా నియమింపబడవచ్చు. 158వ ప్రకరణ ప్రకారం అతను పార్లమెంటులో గాని, శాసన సభలో గాని సభ్యుడుగా ఉండరాదు. ఒకవేళ అయి ఉంటే పదవీ స్వీకారం చేసిన నాటి నుండి సభ్యత్వాన్ని కోల్పోతాడు. పదవిలో ఉండగా ఏ లాభసాటి ఉద్యోగం చేయరాదు. రాష్ట్రపతి అభీష్టం ఉన్నంత వరకు పదవిలో కొనసాగుతాడు. సాధారణంగా పదవీ కాలం 5 సం॥లు.

పదవీ కాలంలో ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి బదిలీ కాబడవచ్చు. పదవీ కాలం ముగియక మునుపే గవర్నర్‌ను తొలగించు అధికారం రాష్ట్రపతికి కలదు లేదా రెండో పర్యాయం కొనసాగించవచ్చు. హై కోర్టు న్యాయమూర్తి ముందు గవర్నర్

ప్రమాణ స్వీకారం చేస్తాడు. గవర్నర్ పదవికి ఖాళీ ఏర్పడినపుడు తిరిగి నియమింపబడేవరకు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి తాత్కాలిక గవర్నరుగా వ్యవహరిస్తాడు. గవర్నర్ జీత భత్యాలు రాష్ట్ర సంఘటిత నిధి నుండి చెల్లిస్తారు. ఇతనికి ఉచిత నివాస వసతి (రాజ్ భవన్) కల్పించబడుతుంది. తన అధికారాలు, విధులలో ఏ న్యాయస్థానానికి జవాబు దారి వహించనవసరం లేదు.

## 15.3.2 గవర్నర్ అధికారాలు లేక విధులు :

164వ నిబంధన ప్రకారం విధుల నిర్వహణలో సహకరించడానికి శాసన సభలో మెజారిటి పార్టీ నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమించి ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిందిగా నియమిస్తాడు. మంత్రి మండలి గవర్నర్ ఆదేశానుసారం అతని పేరుతో రాష్ట్ర ప్రభుత్వ పాలన నిర్వహిస్తుంది.

గవర్నర్ అడ్వకేట్ జనరల్‌ను, పబ్లిక్ సర్వీసు కమీషన్ ఛైర్మన్, సభ్యులను నియమిస్తాడు. హై కోర్టు న్యాయమూర్తుల నియామకంలో రాష్ట్రపతి గవర్నర్‌ను సంప్రదిస్తాడు. మంత్రి మండలి విఫలమైనపుడు ప్రత్యేక నివేదిక ద్వారా రాష్ట్రపతికి తెలియపరచి రాష్ట్రపతి పాలన విధించవలసిందిగా సూచించవచ్చు. రాష్ట్రపతి ప్రతినిధిగా గవర్నర్ పాలన కొనసాగిస్తాడు. విశ్వ విద్యాలయాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తూ వైస్ ఛాన్సలర్‌లని నియమిస్తాడు.

174వ ప్రకరణ ప్రకారం 6 నెలల కొకసారి రాష్ట్ర శాసనసభను సమావేశ పరచు అధికారం కలదు. పరిస్థితులను బట్టి శాసనసభ సమావేశాలను వాయిదా వేయుటకు, శాసన సభ రద్దు చేయుటకు తగిన అధికారాన్ని రాజ్యాంగం గవర్నర్‌కు కల్పించింది. 175వ నిబంధన ప్రకారం సాధారణ ఎన్నికలు జరిగిన తరువాత తన ప్రసంగంతో గవర్నర్ తొలి శాసనసభ సమావేశాన్ని ప్రారంభిస్తాడు. సంవత్సరారంభంలో జరిగే శాసన సభ సమావేశంలో కూడా ప్రసంగిస్తాడు. సభ సమావేశంలో ఉండగా తన సూచనలు పరిశీలించాల్సిందిగా గవర్నర్ కోరవచ్చు.

శాసన సభ తీర్మానాన్ని పునః పరిశీలించవలసిందిగా కోరే అధికారం గవర్నర్‌కు ఉంది. అయితే ఆ తీర్మానాన్ని రెండవసారి పంపినపుడు గవర్నర్ తప్పని సరిగా తన ఆమోదాన్ని తెలియచేయాలి. విత్త వ్యవహారాలకు సంబంధించిన తీర్మానాలను త్రిప్పి పంపే అధికారం గవర్నర్‌కు లేదు. శాసనసభ సమావేశంలో లేనపుడు ఆర్డినెన్స్‌లను జారీ చేయు అధికారం గవర్నర్‌కు కలదు. ఇది శాసన సభ సమావేశమైన ఆరు వారాల వరకు అమలులో ఉంటుంది. ఈ లోపల శాసనసభ దీనిని ధృవపరచాలి లేకపోతే రద్దు అవుతుంది.

ఎగువసభ ఉన్న రాష్ట్రాలలో దాని సభ్యుల సంఖ్యలో 1/6 వంతు మందిని వివిధ రంగాలలో విశిష్ట పరిజ్ఞానం కల వ్యక్తులను గవర్నర్ నియమిస్తాడు. ప్రభుత్వ ఆదాయ వ్యయాల అంచనాల నివేదికను రానున్న ఆర్థిక సంవత్సరానికై గవర్నర్ రాష్ట్ర శాసన సభకు సమర్పించాలి. శాసనసభ చేసే ద్రవ్య బిల్లు గవర్నర్ ఆమోదం లేనిదే చట్టం కాదు.

గత సంవత్సరపు ప్రభుత్వ ఖాతాలకు సంబంధించిన కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికను శాసన సభ ముందు ఉంచుతాడు. రాష్ట్ర ప్రభుత్వ ఆగంతుక నిధి రాష్ట్ర గవర్నర్ ఆధిపత్యంలో ఉంటుంది. ఈ నిధి నుండి గవర్నర్ సమకూర్చిన ఎడ్వాన్స్‌లను ప్రభుత్వ పరంగా ఖర్చు చేయవచ్చు. ఆ ఖర్చును శాసనసభ ఆమోదించాలి.

జిల్లా జడ్జీల తదితర న్యాయాధికారుల నియామకాలు, పదోన్నతులు గవర్నర్ పరిధిలో ఉంటాయి. చట్టం అతిక్రమించినందులకు ఏ పౌరుడినైనా న్యాయస్థానం శిక్షిస్తే మానవతా దృష్టితో ఆ శిక్ష స్వభావాన్ని మార్చుటకు, శిక్షా కాలాన్ని తగ్గించుటకు, రద్దు చేయుటకు గవర్నర్‌కు అధికారం కలదు.

రాజ్యాంగరీత్యా గవర్నర్ రాష్ట్రానికి అధిపతి. రాష్ట్రపతి ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు లేదా విదేశీ ప్రతినిధులు రాష్ట్రాన్ని సందర్శించినపుడు రాష్ట్ర ప్రజల తరపున స్వాగత సత్కారాలు అంద చేస్తాడు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ వార్షిక నివేదికను శాసన సభ పరిశీలనార్థం రాష్ట్రపతికి పంపుతాడు..

## 15.3.3. గవర్నర్ వ్యవస్థ - ఒక పరిశీలన :

కేంద్ర రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత వరకు గవర్నర్ అధికారాలు, విధులపై ఎటువంటి అభిప్రాయబేధాలు రాలేదు. 1967లో అనేక రాష్ట్రాలలో ప్రతిపక్షాలు అధికారం లోనికి వచ్చాయి. రాష్ట్రాలలోని గవర్నర్లు కాంగ్రెస్ పార్టీ అభిమానులు లేక కార్యకర్తలు కావడంతో వారు తమ ఆధిక్యతను, అధికారాలను కేంద్ర ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించడానికి ప్రయత్నించారు. తరువాత అనేక సందర్భాలలో గవర్నర్‌ను పావుగా కేంద్రం ఉపయోగించుకుంటోందని విమర్శ వచ్చింది. ప్రతి పక్షాల అధీనంలోని ప్రభుత్వాలు పార్టీ ఫిరాయింపుల వలన తమ అధికారాన్ని కోల్పోయినపుడు గవర్నర్లు ప్రవర్తించిన తీరు ప్రతిపక్షాల విమర్శకు గురైంది. ఆయా సందర్భాలలో గవర్నర్లు తీసుకున్న నిర్ణయాలు రాజ్యాంగ సహితమా? కాదా? అనేది రాజ్యాంగంలో ఎక్కడా స్పష్టంగా పేర్కొనలేదు. అందుచే అవి వివాదాస్పదంగా తయారయ్యాయి.

అవసరమనుకున్నప్పుడు గవర్నర్ స్వతంత్రించి తన అధికారాలను ఉపయోగించ వచ్చునని 1970లో రాష్ట్రపతిచే నియమింపబడ్డ గవర్నర్ల అధికారాల అధ్యయన సంఘం అభిప్రాయ పడింది. అయితే రాష్ట్రాలలో కూడా పార్లమెంటరీ ప్రభుత్వాన్ని ఏర్పరచి, గవర్నర్‌ను కేవలం రాజ్యాంగాధిపతిగా మాత్రమే ఉంచాలన్న రాజ్యాంగ నిర్మాతల దృఢ సంకల్పం మరువరానిది. అందుచే గవర్నర్ విచక్షణతో తీసుకునే నిర్ణయం మంత్రి మండలి అభీష్టానికి వ్యతిరేకంగా ఉండరాదని కొంత మంది భావించారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలకై నియమించబడ్డ రాజమన్నార్ కమిటీ, పాలనా సంస్కరణల సంఘం, సర్కారియా కమీషన్ గవర్నర్ పదవి వివాదరహితంగాను, సమర్థవంతంగాను నిర్వహింపబడాలని పేర్కొన్నాయి.

## 15.4 మంత్రి మండలి :

రాష్ట్ర ప్రభుత్వ దైనందిక పాలనలో గవర్నర్ నామమాత్ర కార్య నిర్వాహణాధికారి. కార్యనిర్వాహక విధులను యదార్థంగా నిర్వహించేది మంత్రి మండలి. గవర్నర్ తన విధులలో సలహా సహకారాలు అందించడానికి మంత్రి మండలిని ఏర్పాటు చేస్తాడు. శాసన సభలోని మెజారిటీ పార్టీ నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమిస్తాడు. అతని సలహా మేరకు మంత్రి మండలి ఏర్పరచబడుతుంది. మంత్రి మండలిలో మూడు హోదాలు ఉంటాయి, అవి : క్యాబినెట్, స్టేట్ మరియు డిప్యూటీ.

ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చేత రాజ్యాంగానికి విధేయులమై ఉంటామని, రాజ్యాంగాన్ని కాపాడుతామని గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయిస్తాడు. రాజ్యాంగ పరంగా అన్ని అధికారాలు గవర్నర్ పేరు మీద నిర్వహింపబడినా, యదార్థంగా నిర్వహించేది మంత్రి మండలి. సాధారణ పరిస్థితులలో మంత్రి మండలి సలహా ననుసరించి గవర్నర్ వ్యవహరిస్తాడు.

మంత్రిమండలి గవర్నర్ అభీష్టం ఉన్నంత వరకే అధికారంలో ఉంటుందని పేర్కొనబడినప్పటికీ, సాధారణంగా శాసనసభలో మెజారిటీ ఉన్నంతకాలం అధికారంలో ఉంటుంది. మంత్రిమండలి కొన్ని నియమాలకు లోబడి, ముఖ్యమంత్రి నాయకత్వాన పని చేస్తుంది. అందుచేతనే మంత్రి మండలి అనే నౌకకు ముఖ్యమంత్రి చుక్కాని వంటివాడని వ్యవహరించడం సర్వసాధారణం.

## 15.5 ముఖ్యమంత్రి :

శాసన సభలో మెజారిటీ వర్గ నాయకుడు ప్రభుత్వం నిర్వహించడానికి వీలుగా గవర్నర్‌చే ముఖ్యమంత్రిగా నియమింపబడతాడు. ఒకే పార్టీకి మెజారిటీ లేనపుడు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచవచ్చు. గవర్నర్ అభీష్టం ఉన్నంతకాలం

పదవిలో కొనసాగుతాడు అని చెప్పినప్పటికి, వాస్తవంలో శాసనసభలో మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నంత వరకు పదవిలో ఉంటాడు. ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల జీతభత్యాలు శాసనసభచే నిర్ణయించబడతాయి.

రాష్ట్రస్థాయిలో రాష్ట్రగవర్నర్ పేరు మీద పరిపాలన జరిగినా కార్యనిర్వహణాధికారాలు మంత్రి మండలి చెలాయిస్తుంది. ఇందులో ముఖ్యమంత్రి ప్రముఖ పాత్ర వహిస్తారు. శాసనసభ సభ్యుడు కాని వ్యక్తి, ముఖ్యమంత్రిగా నియమింపబడితే ఆరు నెలల లోపల శాసనసభ్యుడిగా ఎన్నుకోబడాలి.

మంత్రిమండలిని ఏర్పాటు చేయు అధికారం ముఖ్యమంత్రికి కలదు. మంత్రి మండలి పరిమాణం ఎంత ఉండాలో రాజ్యాంగం పేర్కొనలేదు. మంత్రి మండలి అంతా ముఖ్య మంత్రి నాయకత్వాన పనిచేస్తుంది. తనకు విశ్వాసం లేని మంత్రులను తొలగించమని గవర్నర్‌కు సలహా ఇచ్చు అధికారం ముఖ్యమంత్రికి కలదు. మంత్రి మండలి సమావేశాలకు గవర్నర్‌కు ముఖ్యమంత్రి అనుసంధానకర్త. మంత్రి మండలి నిర్ణయాలు గవర్నర్‌కు తెలియజేస్తాడు. శాసనసభా సమావేశం ఎజెండా గురించి తగినంత ముందుగా గవర్నర్‌కు తెలియజేస్తాడు, తన ప్రభుత్వ నిర్ణయాలు సభలో ప్రకటిస్తాడు. సభాపతి శాసనసభ ఎజెండాను రూపొందించినప్పుడు శాసనసభలో మెజారిటీ పార్టీ నాయకుడైన ముఖ్యమంత్రిని సంప్రదిస్తాడు.

శాసన సభ కాలపరిమితి పూర్తి కాకుండానే శాసనసభను రద్దు పరచమని గవర్నర్‌కు సిఫారసు చేయవచ్చు. రాష్ట్రపాలనా సౌధానికి అధిపతిగా, ముఖ్య కార్యనిర్వాహకుడిగా, రాష్ట్రంలో ప్రజా సంక్షేమ విధానాలు చేపడతాడు. కేంద్రంలో వలెనే రాష్ట్రమంత్రి మండలి పోర్టు ఫోలియో పద్ధతిలో పనిచేస్తుంది. ప్రతి మంత్రి తనకి కేటాయించబడిన దైనందిన పాలనపై తుది నిర్ణయాలు తీసుకోగలడు. మంత్రులకు సహాయ పడటానికి ఆయా శాఖలకు సంబంధించి కార్యదర్శులు ఉంటారు.

## 15.6 సచివాలయం (సెక్రటేరియట్) :

మంత్రి మండలికి సలహాలివ్వడం, శాసనాల రూపకల్పనలో సమన్వయం చేయటం వంటి విధులను సచివాలయం చేస్తుంది. ఇది ఒక సలహా సంస్థ. దీనిని లైన్ ఏజన్సీగా పేర్కొనవచ్చు. ఒక శాఖకు కార్యదర్శి, ఎడిషనల్ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, డెప్యూటీ కార్యదర్శులు, అసిస్టెంట్ కార్యదర్శులు ఉంటారు. ఒక్కొక్క శాఖ తిరిగి సెక్షన్స్‌గా విభజింపబడి ఉంటుంది. ఒక్కొక్క సెక్షన్‌కు సెక్షన్ ఆఫీసర్ అతని క్రింద సహాయకులు లేదా అండర్ సెక్రటరీలు, క్లర్కులు ఇతర స్టాఫ్ ఉంటారు.

ప్రతి శాఖకు ఐ.ఎ.ఎస్. స్థాయి వ్యక్తి ఆఫీసర్ అయి ఉంటాడు. సచివాలయంలోని శాఖలన్నింటిని సమన్వయపరుస్తు ముఖ్యమంత్రికి ప్రధాన సలహాదారుగా వ్యవహరించు వ్యక్తిని ప్రధాన కార్యదర్శి అంటారు.

## 15.7 డైరెక్టరేట్‌లు :

రాష్ట్ర స్థాయిలో మంత్రుల ఆధీనంలోని కార్యనిర్వహణ శాఖలను డైరెక్టరేట్‌లు లేదా సంచాలక కార్యాలయాలు అని అంటారు. దీని అధిపతిని డైరెక్టర్ లేదా సంచాలకుడు అంటారు. మంత్రి జారీ చేసిన ఆదేశాలను అమలు పరచడం డైరెక్టరేట్ విధి. డైరెక్టరేట్‌కు సంబంధించి రాష్ట్రమంతటా క్షేత్ర కార్యాలయాలు ఉంటాయి. వీటి ద్వారా ప్రభుత్వ ఆదేశాలు రాష్ట్రమంతటా అమలు చేయబడతాయి.

విధానాల రూపకల్పన సచివాలయంది. అయితే వాటిని అమలు చేయు బాధ్యత డైరెక్టరేట్‌లు లేదా సంచాలక కార్యాలయాలది. ఈ రెండు సంస్థలు రెండు కళ్ళు వంటివి. సచివాలయం మరియు డైరెక్టరేట్‌ల మధ్య సమన్వయం అవసరం. వీటి మధ్య సమన్వయం లేకపోతే పాలన అస్తవ్యస్తమవుతుందనే విషయాన్ని రాబోయే పాఠాలలో మీరు నేర్చుకుంటారు.

## 15.8 జిల్లా పాలన :

రాష్ట్ర స్థాయిలో తీసుకున్న పాలనా సంబంధ నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో అమలు పరచడానికి రాష్ట్రాన్ని జిల్లాలుగా విభజించారు. జిల్లాకు కలెక్టర్ ప్రధాన కార్యనిర్వాహకుడు. మొదటగా రెవిన్యూ వసూలుకు సంబంధించి కలెక్టర్ ఆఫీసును ఏర్పరచడం జరిగింది. అయితే కాలక్రమేణా శాంతి భద్రతలు, పౌర సంబంధాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా అభివృద్ధి ఆయన క్రిందకే తేబడినాయి. ఈ కారణాల వలన అతని బరువు బాధ్యతలు తగ్గించడానికి జిల్లాలో మరో ఐ.ఎ.ఎస్. అధికారిని జిల్లా రెవిన్యూ అధికారిగా నియమించడం జరిగింది. అయినప్పటికి జిల్లా కలెక్టరు రెవిన్యూ విషయములలో చురుకుగా పాల్గొనక తప్పడంలేదు. దీనికి కారణం సాధారణ పాలనలో రెవిన్యూ పాలన ముడిపడి ఉండటం.

జిల్లా మెజిస్ట్రేట్‌గా అతను జిల్లా పోలీస్ యంత్రాంగం మీద అజమాయిషీ చేయగలడు. తుపాలకులకు లైసెన్స్ ఇచ్చే అధికారం కూడా అతనికి కలదు. గ్రామీణాభివృద్ధి పాలనలో కూడా కలెక్టరు చురుకుగా పాల్గొంటాడు. అతను జిల్లా పరిషత్ మరియు జిల్లాపరిషత్ స్టాండింగ్ కమిటీలో సభ్యుడు. కలెక్టరుకు సహాయపడటానికి జిల్లాలో ప్రతి శాఖకు సంబంధించి ఒక అధికారి ఉంటాడు.

రెవిన్యూ పాలనకు జిల్లాను కొన్ని డివిజన్‌లుగా విభజించి ఒక్కొక్క దానిని ఒక్కో రెవిన్యూ డివిజనల్ అధికారి ఆధీనంలో ఉంచుతారు. ఈ డివిజన్‌ను కొన్ని మండలాలుగా విభజించి ఒక్కొక్క దాని మీద రెవిన్యూ అధికారిని, ఆయనకు సహాయము చేయడానికి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, విలేజ్ అసిస్టెంటులు పనిచేస్తారు.

గ్రామీణ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలకు పంచాయితీ రాజ్ వ్యవస్థ, పట్టణ ప్రాంత అభివృద్ధికి నగరపాలక లేదా పురపాలక సంస్థలు ఏర్పరచబడ్డాయి.

### మాదిరి ప్రశ్నలు :

**వ్యాపరూప ప్రశ్నలు : ఈ క్రింది ప్రశ్నలకు 5 పేజీలకు మించకుండా జవాబు వ్రాయుము.**

1. రాష్ట్ర పాలనా పని తీరును గూర్చి ఒక వ్యాసం వ్రాయుము.
2. రాష్ట్ర గవర్నర్ అధికారాలు, విధులను గూర్చి వ్రాయుము.

**లఘువ్యాస ప్రశ్నలు : ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించకుండా జవాబు వ్రాయుము.**

1. జిల్లా పాలన
2. మంత్రి మండలి
3. ముఖ్యమంత్రి

### చదువదగిన గ్రంథాలు :

అవస్థి & మహేశ్వరి : పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
ప్రొఫెసర్. మహేశ్వరి : ఇండియన్ అడ్మినిస్ట్రేషన్

రచయిత : డా॥ కె. రఘునాధ్

పాఠము - 16

# సచివాలయము - వ్యవస్థీకరణ మరియు విధులు

విషయసూచిక

16.1 ఉపోద్ఘాతము
16.2 సచివాలయము - వ్యవస్థీకరణ
16.3 ప్రధాన కార్యదర్శి
16.4 సచివాలయము - విధులు
16.5 సచివాలయ పునర్వ్యవస్థీకరణ - వివిధ కమిటీలు
16.6 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు

## 16.1 ఉపోద్ఘాతము :

భారతదేశ పాలనా వ్యవస్థ చాలా వరకు బ్రిటిష్ పాలనా వ్యవస్థననుసరించడం జరిగినది. బ్రిటన్‌లో వలె భారతదేశంలో కూడా సచివాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి రాష్ట్రంలోను ఒక సచివాలయం ఉంటుంది. సచివాలయం రాష్ట్ర పాలనకు నాడీమండలం లేదా జీవగర్ర వంటిది. సచివాలయం ప్రభుత్వ విధానాలకు, కార్యక్రమాలకు, పాలనా యంత్రాంగానికి కేంద్ర బిందువు వంటిది. ఇది పాలనకు సంతులిత్వాన్ని, స్థిరత్వాన్ని కల్పిస్తూ పాలనపై రాజకీయ ఒత్తిడులను తట్టుకొని షాక్ అబ్సార్బర్‌గా పనిచేస్తుంది. విధాన రూప కల్పన, ఆచరణ వేరుగా ఉండాలనే సిద్ధాంత ప్రాతిపదికపై, సచివాలయం రూపకల్పనా విధులను నిర్వహిస్తే, సంచాలక కార్యాలయము (Directorate) విధానాలను అమలుపరుస్తాయి. ప్రభుత్వ పేరు ప్రతిష్టలు, శక్తి సామర్థ్యాలు సచివాలయ సామర్థ్యం మీదనే ఆధారపడి వుంటాయి.

## 16.2 రాష్ట్ర సచివాలయము - వ్యవస్థీకరణ :

సచివాలయం వివిధ శాఖలుగా విభజింపబడుతుంది. అన్ని రాష్ట్రాలలో శాఖల సంఖ్య ఒకే విధముగా ఉండదు. ప్రతి శాఖకు కొన్ని విధులను, వ్యవహారములను కేటాయిస్తారు. ఉదాహరణకు ఆర్థికశాఖ, హోంశాఖ, సాధారణ పరిపాలనాశాఖ, రెవెన్యూశాఖ మొదలగు శాఖలు, రాష్ట్ర పాలన రాజకీయ అవసరాలను బట్టి ఈ శాఖలు విడిగానూ లేదా కొన్ని శాఖలను కలిపి ఒక మంత్రిత్వ శాఖగా ఏర్పాటు చేస్తారు. ఒక్కొక్క శాఖ కార్యకలాపాలు ఒక మంత్రిత్వ శాఖకు మాత్రమే సంబంధించి వుండవచ్చు. కొన్ని సందర్భాలలో ఇద్దరూ లేక ముగ్గురు మంత్రులు నిర్వహించే శాఖలకు సంబంధించిన వ్యవహారాలను కూడా సచివాలయ శాఖ నిర్వహిస్తుంది.

స్వాతంత్ర్యానంతరం సచివాలయ శాఖల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నాయి. సచివాలయశాఖల సంఖ్య, వాటికి కేటాయించే అంశాలు, వాటి అంతర్గత వ్యవస్థీకరణ ఒకే విధంగా వుండదు. సచివాలయంలోని వివిధ శాఖలకు వేరు వేరుగా కార్యదర్శులుంటారు. ఈ కార్యదర్శులే సచివాలయ శాఖలకు పాలనాధిపతులుగా ఉంటారు. వీరు ప్రభుత్వానికి కార్యదర్శులే

కాని మంత్రులకు వ్యక్తిగతంగా ఉండే కార్యదర్శులు కారు. వీరు ప్రభుత్వ విధానాలను నిర్ణయించుటలో ఆయా మంత్రులకు సలహాలనిస్తారు. వీరంతా ఐ.ఎ.ఎస్ కు చెందిన సీనియర్ ఉద్యోగులే. ఆయా శాఖలు సమర్ధవంతంగా పనిచేసేటట్లు చూచే బాధ్యత కార్యదర్శులదే. వారి వారి శాఖలలో పనిచేసే సిబ్బందిని వీరు నియంత్రణ చేస్తారు. ప్రతి కార్యదర్శికి సహాయంగా అదనపు, సంయుక్త, ఉపకార్యదర్శులు మరియు తదితర ఉద్యోగులు వుంటారు.

## 16.3 ప్రధాన కార్యదర్శి :

రాష్ట్ర సచివాలయం ఒక కార్యదర్శి లేదా ప్రధాన కార్యదర్శి అధీనంలో పని చేస్తుంది. సాధారణంగా ప్రధాన కార్యనిర్వహణాధికారిగా పరిపాలనలో విశేషానుభవం ఉన్న వారిని ప్రధాన కార్యదర్శిగా నియమిస్తారు. సాధారణ పరిపాలన శాఖను కూడా ప్రధాన కార్యదర్శియే నిర్వహిస్తాడు. సచివాలయ శాఖలన్నింటిపైన ప్రధాన కార్యదర్శి నిర్వహణాధికారాన్ని కలిగి వుంటాడు. సచివాలయ కార్యదర్శి ప్రభుత్వానికి ప్రధాన కార్యదర్శిగా కూడా ఉంటాడు. ప్రధాన కార్యదర్శి క్రింద సంయుక్త కార్యదర్శి, ఉపకార్యదర్శులు, సహాయ కార్యదర్శులు మొదలగు వారు ఉంటారు.

## 16.4 సచివాలయం - విధులు :

కేంద్ర సచివాలయం కాని, రాష్ట్ర సచివాలయం కాని ఈ క్రింది విధులను నిర్వహిస్తుంది.

1. ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను రూపొందించడంలో మంత్రిమండలికి తగిన సలహాలిచ్చుట.
2. ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను సమన్వయపరచుట,
3. శాసన సభలోపల, వెలుపల ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను సమర్థించుకోవడానికి మంత్రి వర్గానికి కావలసిన సమాచారాన్ని అందించుట.
4. ప్రభుత్వ యంత్రాంగం సమర్ధవంతంగా, అభివృద్ధి పథంగా నడవడానికి కావలసిన చర్యలు తీసుకొనుట.
5. ప్రణాళికలను, వివిధ కార్యక్రమాలను రూపొందించుట.
6. కేంద్ర ప్రభుత్వంతోను, ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలతోను సంబంధాలను, ఉత్తర ప్రత్యుత్తరాలను నిర్వహించుట.
7. ఉద్యోగి బృందంలో నైపుణ్యమును, శక్తి సామర్ధ్యములను పెంపొందించడానికి కృషి చేయుట.
8. ప్రభుత్వ సాంవత్సరిక ఆదాయ, వ్యయ అంచనాలను తయారు చేయుట.
9. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను, అప్పీళ్లను, ప్రాతినిధ్యాలను విని తగిన చర్యలను తీసుకొని, తగిన సమాధానాలను ఇచ్చుట.
10. క్రింది ఉద్యోగుల కార్యనిర్వహణకు సూచనలు చేయుట, సలహాలిచ్చుట, ఆదేశాల నిచ్చుట మరియు మార్గదర్శకత్వాన్ని వహించుట.
11. అధికార బిల్లులు శాసన రూపం పొందేవరకు వివిధ దశలలో మంత్రులకు తగిన సలహాలు ఇచ్చుట.
12. ప్రజా సంక్షేమానికి కావలసిన క్రొత్త శాసనాలను తయారు చేయుటలోను, అమలులో వున్న శాసనాలను ప్రజలలో వచ్చే మార్పుకమగుణంగా సవరణ చేయుటకు మంత్రి వర్గానికి సహాయపడుట.
13. ప్రభుత్వ విధానాల ఆచరణను పర్యవేక్షించుట, ఆచరణ వల్ల కలిగిన ఫలితాలను సమీక్షించుట.
14. సచివాలయానికి దాని ఆధీన, అనుబంధ, వ్యవస్థలకు కార్యాలయ ప్రదేశాన్ని, భవనాల కేటాయింపును, సదుపాయాలను కల్పించుట.

15. కేంద్ర ప్రభుత్వం ద్వారా లేదా ఇతర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు, సమావేశాలకు, గోష్ఠులకు హాజరయ్యే వ్యక్తుల పేర్లను సూచించుట.

## 16.5 సచివాలయ పునర్వ్యవస్థీకరణపై వివిధ కమిటీల సిఫారసులు :

గత కొద్ది సంవత్సరాలలో సచివాలయం పనిచేసే విధానం, దాని వ్యవస్థీకరణ విమర్శలకు గురియగుచున్నది. సచివాలయాలు అనవసరమైన బాధ్యతలను తమ నెత్తిన వేసుకోవటం వల్ల వాటి పనిభారం పెరిగి పాలనా నిర్వహణా సామర్థ్యం తగ్గుచున్నది. నేడు సచివాలయం కూడా మారుతున్న పరిస్థితులకనుగుణంగా వ్యవస్థీకరింపబడాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ సచివాలయాన్ని పునర్వ్యవస్థీకరించడానికి 1949లో ఏర్పాటు చేయబడ్డ గోపాలస్వామి అయ్యంగార్ నివేదిక, 1965లో ఏర్పాటు చేయబడ్డ మొరార్జీదేశాయ్ నివేదికలు సచివాలయ పునర్వ్యవస్థీకరణపై కొన్ని సూచనలను సూచించినవి.

గోపాలస్వామి అయ్యంగార్ నివేదికలో వ్యవస్తీకరణ పద్ధతుల విభాగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర సచివాలయాన్ని 37 ప్రాథమిక యూనిట్లుగా 25 శాఖలుగా విభజించాలని, సచివాలయంలో పారిశ్రామిక, వ్యవసాయ, సమాచార, వాణిజ్య మొదలగు వానికి సంబంధించిన బ్యూరోలను ఏర్పాటు చేయాలని సూచించడం జరిగింది.

మొరార్జీదేశాయ్ నివేదిక భారత ప్రభుత్వ యంత్రాంగం, దాని ప్రక్రియ ముఖ్యమైనవిగా పరిగణిస్తూ అధికార వికేంద్రీకరణ ఉండాలని సూచించినది. ఈ కమిటీలే కాక A.C. గోర్వాల, పాల్ అపిల్ బి అనువారు కూడా సచివాలయ వ్యవస్థీకరణకు సంబంధించి తగు సూచనలు చేసారు.

### 16.5.1 K.M. ఉన్నితన్ అధ్యక్షతవ కమిటీ (1960) :

ఆంధ్రప్రదేశ్ సచివాలయ పునర్వ్యవస్థీకరణపై 1960లో రెవెన్యూ బోర్డు ప్రధాన సభ్యుడైన K.M. ఉన్నితన్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణలు సంఘం ఏర్పడింది. ఆ కమిటీలోని 6గురు సభ్యులలో 5గురు I.A.S. మరియు I.P.S. ఉద్యోగులుకాగా, ఒక సభ్యుడు మాత్రం సాంకేతిక నిపుణుడు (చీఫ్ ఇంజనీర్). ఈ కమిటీ పాలనా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ క్రింది సూచనలు చేసింది.

1. సచివాలయము - సంచాలకుల సంబంధాలను సమీక్షిస్తూ, శాఖాధిపతుల కార్యాలయాలు సచివాలయంలో దశల వారిగా విలీనం కావాలని ఈ కమిటీ సూచించింది. కాని ఈ అభిప్రాయాన్ని ఈ కమిటీలో సభ్యుడైన నాయుడు తిరస్కరించారు.
2. కార్మికసంక్షేమశాఖ మరియు సాంఘిక సంక్షేమశాఖలు ఏర్పరచవలెను.
3. వివిధ పాలనా మంత్రిత్వ శాఖలకు బడ్జెట్ పరిధిలో ఆర్థిక స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛను కల్పించాలి.
4. కలెక్టర్ల పని భారాన్ని తగ్గించుటకు జాయింట్ కలెక్టర్‌లను నియమించి జిల్లాలను పునర్వ్యవస్థీకరించవలెను.
5. ప్రజా పనుల శాఖ (Public works Department) ను నీటి పారుదల, రహదారులు మరియు భవనాల శాఖలుగా వేరుపరచాలి.

**16.5.2** 1964లో రెవెన్యూ మంత్రి ఎన్. రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పడిన పరిపాలనా సంస్కరణల సంఘం కూడా కొన్ని ప్రధానమైన సిఫార్సులను చేసినది. అవి :

1. సచివాలయ శాఖలను తక్కువ సంఖ్యలో హేతుబద్ధంగా వ్యవస్థీకరించాలి.
2. కార్యనిర్వాహక శాఖలకు ఎక్కువ అధికారాన్ని దత్తత చేయాలి.

3. అనవసరపు బాధ్యతలను సచివాలయం నుండి తొలగించాలి.
4. అభివృద్ధి నిర్వహణకు బాధ్యత వహించే సచివాలయ శాఖలకు, కార్యనిర్వాహక శాఖలకు మధ్య అవినాభావ సంబంధములు పెంపొందించాలి.
5. సచివాలయ శాఖల సంఖ్య 12 కు మించి ఉండరాదు.

సచివాలయ, వాటి శాఖల వ్యవస్థీకరణను, పరిపాలనా సామర్థ్యాన్ని, నిర్వహణా శక్తిని కార్యక్రమాల సజాతీయతను, పొదుపును దృష్టిలో ఉంచుకొని జరపాలని పరిపాలనా సంస్కరణల సంఘం సూచించింది.

### 16.5.3 రుస్తుంజీ కమిటీ సిఫార్సులు : (1985-86) :

1985లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాలనా సంస్కరణలను సూచించుటకు గాను రుస్తుంజీ కమిటీని ఏర్పరచినది. ఈ కమిటీ రాష్ట్ర సచివాలయ పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడానికి తగిన పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి 162 సిఫార్సులతో తన నివేదికను 1986 లో ప్రభుత్వానికి సమర్పించినది. ఈ కమిటీ సచివాలయం, పరిపాలనలో జాప్యము, విద్య, పంచాయితీ రాజ్ వ్యవస్థలు, వ్యవసాయము, పాలనా శిక్షణ, పోలీస్ పాలన, నీటి పారుదల, వైద్యపాలన మొదలగు విషయాలకు సంబంధించి అనేక సిఫార్సులను చేసింది.

**ముఖ్యమైన సిఫార్సులు :**

1. సచివాలయంలోను, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుచున్న జాప్యాన్ని నివారించుటకు గాను నిర్ణీత కాలవ్యవధిలో పాత ఫైళ్ళను పరిష్కరించాలి. అప్పీళ్ళను పరిశీలించడానికి న్యాయశాఖలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. నిర్ణయీకరణలో జాప్యాన్ని నివారించుటకు తగుచర్యలు తీసుకోవలెను.
2. ఉద్యోగులలో అవినీతిని, అధికార దుర్వినియోగాన్ని అరికట్టుటకు నిఘా విభాగాన్ని ఏర్పరచవలెను.
3. అన్ని స్థాయిలలో ప్రభుత్వోద్యోగులు పౌరులతో సన్నిహిత సంబంధాలు కలిగి వుండవలెను.
4. ఉద్యోగులలో తమ విధులపట్ల శ్రద్ధ కనబరచుటకు గాను తగిన ప్రోత్సాహకాలు కల్పించవలెను.
5. ప్రభుత్వోద్యోగులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చుటకు గాను ప్రతి సచివాలయ శాఖలో సంయుక్త కార్యదర్శి లేదా ఉపకార్యదర్శి అంతర్గత శిక్షణాధికారిగా ఉండాలి.
6. సచివాలయ ఉద్యోగులకు కార్యాలయం నుంచి వారి యింటికి, యింటి నుంచి కార్యాలయానికి ప్రయాణించడానికి బస్సు సౌకర్యాన్ని కల్పించవలెను.
7. పరిపాలనా సామర్థ్యానికి ఆటంకం కలుగకుండా ఉద్యోగులకు పాలనా నిర్వహణలోను, ఆర్థిక విషయాలలో తగిన అధికార దత్తత జరగాలి. ఆర్థికశాఖ అజమాయిషి అవసరమైనప్పటికి, అనవసర జోక్యం కోరతగినది కాదు.
8. మహారాష్ట్రలోని 'అహ్మద్ నగర్' జిల్లాలో కలెక్టరేట్ నమూనాపై రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్‌లను పునర్వ్యవస్థీకరించుటకు ప్రభుత్వం తగిన శ్రద్ధ వహించవలెను.
9. జపాన్‌లో అనుసరించిన శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ఆమోదించి అనుసరించడం ద్వారా అధికోత్పత్తి సాధించుటకు ప్రభుత్వం కృషి చేయవలెను.

ఈ సిఫార్సులను ప్రభుత్వం పాటించుటకు తగిన శ్రద్ధ కనబరుచుటలేదు. కారణం ఈ సిఫార్సుల అమలు వలన

ఉద్యోగుల సంఖ్య తగ్గుతుందనే భావనతో ఉద్యోగస్తులు వీటిని వ్యతిరేకించడం వలన ప్రభుత్వం ఈ సిఫార్సుల పట్ల తగు శ్రద్ధ కనబరచలేకపోవుచున్నది.

## 16.6 ముగింపు :

ప్రభుత్వ పాలనా వ్యవస్థలో సచివాలయం కీలకమైనది. నేడు మంత్రులు, ఇతర శాఖలు మార్గదర్శకత్వం కోసం సచివాలయం పైననే ఆధారపడుచున్నారు. ప్రభుత్వ విధానాలు నిర్వహించడంలో, వాటిని అమలు పరచుటలో సచివాలయం కీలక పాత్రను వహిస్తుంది. ప్రభుత్వ నిర్వహణా సమర్థత సచివాలయ సమర్థతపై ఆధారపడి వుంటుంది.

## మాదిరి ప్రశ్నలు :

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 5 పేజీలకు మించకుండా జవాబు వ్రాయుము.

1. సచివాలయ వ్యవస్థీకరణను మరియు విధులను తెల్పుము.
2. సచివాలయ పునర్వ్యవస్థీకరణకు వివిధ కమిటీల సిఫారసులు వివరించుము.

**లఘుటీక ప్రశ్నలు :**

1. కె.ఎమ్. ఉన్నితన్ కమిటి
2. రుస్తుంజీ కమిటి
3. రామచంద్రారెడ్డి కమిటి
4. సచివాలయ విధులు

**చదువదగిన గ్రంథములు :**

1. భారతదేశపాలనా వ్యవస్థ - తెలుగు అకాడమి
2. సచివాలయము - డా॥ డి. రవీంద్ర ప్రసాద్
3. ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ - యస్.ఆర్. మహేశ్వరి

**రచయిత : వి. పూర్ణచంద్రరావు**

పాఠము - 17

# సచివాలయమునకు - సంచాలక కార్యాలయమునకు మధ్య గల సంబంధము

విషయసూచిక


17.1 ఉపోద్ఘాతము
17.2 కార్యనిర్వాహక శాఖల విధులు
17.3 సంచాలక కార్యాలయాల వ్యవస్థీకరణ
17.4 సచివాలయానికి సంచాలకుల కార్యాలయమునకు మధ్య సంబంధము
17.5 సచివాలయంపై సంచాలక కార్యాలయం - విమర్శ
17.6 సంచాలక కార్యాలయంపై సచివాలయం - విమర్శ
17.7 సచివాలయం, కార్యనిర్వాహక వ్యవస్థ విలీనం కావాలనే వారి అభిప్రాయాలు
17.8 వేరువేరుగా వుండే ప్రస్తుత పద్ధతే కొనసాగాలనే వారి అభిప్రాయములు
17.9 వివిధ రాష్ట్రాల పరిపాలనా సంస్కరణల సంఘాల ప్రతిపాదనలు
1. బెంగాల్ పాలనా పరిశీలనా సంఘం
2. బొంబాయి పాలనా పరిశీలనా సంఘం
3. కేరళ పాలనా సంస్కరణల సంఘం
4. హైదరాబాదు పొదుపు సంఘం
5. రాజస్థాన్ పాలనా సంస్కరణల సంఘం
6. పంజాబ్ పాలనా సంస్కరణల సంఘం
7. ఎం.ఆర్.పాయ్, జి. రాంరెడ్డి పరిశీలనా నివేదిక
8. పాలనా సంస్కరణల సంఘం
9. భారత ప్రభుత్వ వ్యవస్థీకరణ - పద్ధతుల అధ్యయన బృందం
10 ఆంధ్రప్రదేశ్ పాలనా సంస్కరణ సంఘం
11. పాలనా సంస్కరణల సంఘం
17.10 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు


## 17.1 ఉపోద్ఘాతము :

భారతదేశపు పాలనా యంత్రాంగంలో సచివాలయం, సంచాలక కార్యాలయాలు ప్రముఖపాత్ర వహించుచున్నవి. సచివాలయం విధాన రూపకల్పనకు సంబంధించిన ప్రభుత్వానికి అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది. కార్యనిర్వాహక శాఖలు (సంచాలక కార్యాలయాలు) విధానాల ఆచరణకు లేదా అమలుకు సంబంధించి అధికారం చెలాయిస్తాయి. సచివాలయం రూపొందించిన ప్రభుత్వ విధానాలను సమర్ధవంతంగా అమలుపరచడం కార్యనిర్వాహక శాఖల విధి. విధానాల రూపకల్పనలో

మంత్రి వర్గాలకు సహాయ పడటం, విధానాల ఆచరణ కోసం నియమ నిబంధనలను రూపొందించడం, ఆర్థిక నియంత్రణ, శాసన నిర్మాణ, సవరణ విషయాలు, విధానాల అమలు కృషిని సమీక్షించడం, ప్రభుత్వ విధానాల స్పష్టీకరణ మొదలైన విధులను సచివాలయం నిర్వహించును. సచివాలయం స్టాఫ్ ఏజన్సీగా పరిగణించబడగా కార్యనిర్వాహక శాఖలు లైన్ ఏజన్సీలుగా పరిగణించబడుచున్నవి. మన దేశంలోని అన్ని రాష్ట్రాలలో సచివాలయం మరియు కార్యనిర్వాహక శాఖలు వేరువేరుగా పనిచేస్తున్నాయి.

## 17.2 కార్యనిర్వాహక శాఖల లేదా సంచాలక కార్యాలయముల విధులు :

విధానాల అమలు కార్యనిర్వాహక శాఖ ప్రాథమిక విధి. దీనితోపాటు ఈ క్రింది విధులను కూడా అది నిర్వహిస్తుంది.

1. రాబోయే సంవత్సరానికి తగిన కార్యక్రమాలను ప్రతిపాదించుట.
2. వివిధ శాఖల ఆదాయ వ్యయ అంచనాలను తయారుచేయుట.
3. తమ శాఖకు సంబంధించిన జిల్లా అధికారుల, ప్రాంతీయ స్థాయి అధికారుల కార్యక్రమాలను పర్యవేక్షించుట.
4. ఉద్యోగి బృంద వ్యవహారములను నిర్వహించుట.
5. ప్రమోషన్ (పదోన్నతి) కు సంబంధించిన విషయాలపై పబ్లిక్ సర్వీస్ కమీషన్‌కు సలహాలనిచ్చుట.
6. మంత్రులకు ప్రభుత్వేతర సంస్థలలో చేసే నియామకాలపై సలహాల నిచ్చుట.
7. వివిధ శాఖల పని పద్ధతులను మెరుగుపరుచుట.
8. సచివాలయానికి, మంత్రి వర్గానికి సాంకేతిక సలహాదారుగా పనిచేయుట.
9. సమావేశాలలో గోష్ఠులలో పాల్గొనే అధికారులకు కార్యాలయ విధులకు హాజరైనట్లు భావించడం వంటి విధులను నిర్వహించుట.

## 17.3 సంచాలక కార్యాలయాల వ్యవస్థీకరణ :

కార్యనిర్వాహక శాఖల మరియు సచివాలయ శాఖల వ్యవస్థీకరణకు మధ్య చాలా తేడా ఉంటుంది. సాధారణంగా అన్ని సచివాలయ శాఖల అంతర్గత వ్యవస్థీకరణ ఒకే విధంగా ఉంటుంది. కాని అన్ని కార్యనిర్వాహక శాఖల వ్యవస్థీకరణ ఒకే విధంగా వుండదు. కొన్ని కార్యనిర్వాహక శాఖలకు క్షేత్రస్థాయిలో పాలనా వ్యవస్థలు వుండగా, మరి కొన్నింటికి కేవలం కేంద్రస్థాయిలో కార్యాలయం వుండి ప్రాంతీయ, జిల్లా, క్షేత్రస్థాయిలో పరిపాలనా యూనిట్లు వుండవు.

కార్యనిర్వాహక సంస్థలను 1) అధీన వ్యవస్థలని, 2) అనుబంధ వ్యవస్థలుగా వర్గీకరించవచ్చు. అధీన వ్యవస్థల పరిపాలనలో సచివాలయం జోక్యం చేసుకోవచ్చు, నియంత్రించవచ్చు. వీటికి పాలనా విషయంలో స్వేచ్ఛ, స్వయం పాలన వుండవు. అనుబంధ వ్యవస్థలు కేవలం విధానాల విషయంలో సచివాలయ సాధారణ పరిరక్షణ క్రింద పనిచేస్తూ పరిపాలనా విషయాలలో స్వేచ్ఛను, స్వయంపాలనా అధికారాన్ని కలిగి వుంటాయి. ఇవి చట్టబద్ధ హోదాను కలిగి వుంటాయి. కార్పొరేషన్‌లు, కంపెనీలు, బోర్డులు, కమీషన్‌లు, సహకార సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ట్రిబ్యునళ్లు మున్నగు సంస్థలను సచివాలయ అనుబంధ వ్యవస్థలుగా పేర్కొనవచ్చును. అధీన వ్యవస్థల క్రింద సంచాలక కార్యాలయాలు (డైరెక్టరేట్‌లు), కమీషనరేట్లు, ఇన్‌స్పెక్టర్ జనరల్, రిజిస్ట్రార్, చీఫ్ ఇంజనీర్, కంట్రోలర్ మొదలైన కార్యాలయాలు వస్తాయి.

సచివాలయ శాఖల కార్యనిర్వాహక సంస్థల సంఖ్య రాష్ట్రానికి రాష్ట్రానికి మారుతూ వుంటుంది. మన రాష్ట్రంలో ప్రస్తుతం షుమారు 30 సచివాలయ శాఖలు, దాదాపు 250 కార్యనిర్వాహక సంస్థలు వున్నాయి. సాధారణంగా సచివాలయ అధికారులు సాధారణ జ్ఞానం కలవారు ఉండగా, కార్యనిర్వాహక శాఖాధిపతులు సాధారణంగా నిపుణులై, సాంకేతికాధికారులై వుంటారు. కొన్ని సందర్భాలలో నిపుణులు కాని సాధారణ పరిపాలనాధికారులను కూడా కార్యనిర్వాహక శాఖాధిపతులుగా నియమిస్తారు.

## 17.4 సచివాలయానికి - సంచాలకుల కార్యాలయమునకు మధ్య సంబంధము :

వివిధ మంత్రిత్వశాఖలు జారీచేసిన ఆదేశాలను సంచాలక కార్యాలయాలు ఎంతవరకు అమలుపరుస్తున్నాయో చూచే బాధ్యత సచివాలయమునకు కలదు. ప్రభుత్వ ఉత్తర్వులను అమలుపరచడంలో సంచాలక కార్యాలయాల సామర్థ్యాన్ని సచివాలయం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వ విధానాలను అమలుపరుచుటకు సచివాలయం సూచించిన కార్యక్రమాలకు అనుగుణంగా సంచాలక కార్యాలయాలు తమ విధానాలను రూపొందించుకుంటాయి.

## 17.5 సచివాలయంపై సంచాలక కార్యాలయం - విమర్శ :

1. తమ ప్రతిపాదనలను పరిశీలించి అంగీకరించే సచివాలయం అవసరమైన జాప్యానికి నిలయం.
2. సచివాలయం తమపై చలాయించే నియంత్రణ అసమంజసమైనది. తమలో చొరవను, ఉత్సాహాన్ని తగ్గిస్తుంది.
3. కార్యక్రమాల నిర్వహణలో కార్యవిధాన నిబంధనలను, నియమాలను తప్పకుండా పాటించాలనే సచివాలయ ఆదేశం సమర్థవంత కార్యాచరణకు ప్రతిబంధకం.
4. కార్యక్రమాలు అమలు జరుగవలసిన ప్రాంతాల స్థానిక పరిస్థితుల సమాచారం, అవగాహన లేకుండా, కేవలము సాధారణ పరిజ్ఞానం మాత్రమే గల సచివాలయం తమ సాంకేతిక కార్యక్రమాల ప్రతిపాదనలను పరిశీలించడం అశాస్త్రీయము.

## 17.6 సంచాలక కార్యాలయంపై సచివాలయం - విమర్శ :

1. శాఖాధిపతులు సంకుచిత మనస్తత్వం కలిగి తమతమ రంగాలలో సాంకేతిక నైపుణ్యాన్ని కలిగి వుండవచ్చు గాని వారికి ప్రభుత్వ పాలనను గూర్చి సమగ్రమైన దృక్పథం ఉండదు.
2. కార్యనిర్వాహక శాఖాధిపతులకు పాలనా విధానాలు తెలియకపోవడం వలన వాటిని అమలుపరచడంలో కూడా శ్రద్ధ వుండదు.
3. పాలనా కార్యక్రమాలను అమలు చేయడానికి అవసరమైన ఉత్తర్వులను జారీచేసే అర్హత సంచాలకులకు ఉండదు.
4. కార్యనిర్వాహక నియమ నిబంధనల పట్ల వారికి గౌరవ భావము ఉండదు.

సమర్థమైన పరిపాలన దృష్ట్యా సచివాలయం - సంచాలక కార్యాలయాల మధ్య సహకారం, సదవగాహన ఎంతైనా అవసరం. ఈ రెండింటి మధ్య బేధాభిప్రాయాలు ప్రబలినట్లయితే ప్రభుత్వ పాలనా యంత్రాంగం సాఫీగా కొనసాగదు. కాబట్టి ఈ రెండు శాఖల మధ్య సత్సంబంధం వుండుట ఎంతైనా అవసరము. కాని విధానాల రూపకల్పన చేసే సచివాలయము, విధానాల అమలుపరచే సంచాలక కార్యాలయాలు వేరువేరుగా వుండవలెనని కొందరి వాదనైతే, మరికొందరు ఈ రెండింటిని విలీనం చేయవలెనని భావించుచున్నారు.

## 17.7 సచివాలయం, కార్యనిర్వాహక వ్యవస్థ విలీనం కావాలనే వారి అభిప్రాయాలు :

1. ఆధునిక ప్రభుత్వ వ్యవస్థలో విధాన రూపకల్పన, ఆచరణల మధ్య ఉన్న తేడాలు క్రమేపి తగ్గిపోతున్నందు వలన విధానానికి, ఆచరణకు వేరువేరు ప్రత్యేక సంస్థలు ఉండవలసిన అవసరం లేదు.
2. కార్యనిర్వాహక శాఖాధిపతులుగా ఉన్న సాధారణ జ్ఞానం కలవారి ప్రతిపాదనలు సచివాలయాధిపతిగా వుండే మరొక సాధారణ పరిజ్ఞానం కలిగినవారు పరిశీలించిన అవసరం లేదు.
3. మంత్రులకు, సాంకేతిక ప్రావీణ్యం కలవారికి మధ్య సాధారణ జ్ఞానం గల మధ్యవర్తులు ఉండవలసిన అవసరం లేదు.
4. సచివాలయం, సంచాలక కార్యాలయాలు వేరుగా వుండుట వలన పరిపాలనలో జాప్యం జరుగుటకు వీలున్నది.

5. కేంద్ర మంత్రిమండలి, ప్రణాళికా సంఘం తయారుచేసే విధానాలను, కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నందు వలన, రాష్ట్రాల స్థాయిలో విధానాలను నిర్ణయించుటకు ప్రత్యేక సచివాలయం ఉండవలసిన అవసరం లేదు.
6. కార్యనిర్వాహక శాఖలు చేసే ప్రతిపాదనలోని తప్పులను వెదుకుటకే సచివాలయం ప్రయత్నిస్తుంది కాని సరియైన సలహాల ఇవ్వడానికి కృషి చేయడం లేదు. కాబట్టి ఈ రెండు వేరువేరుగా వుండవలసిన అవసరం లేదు.
7. కార్యనిర్వాహక శాఖల వ్యయాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ అజమాయిషీ చేస్తుంది. కాబట్టి ఆర్థిక నియంత్రణకు సంబంధించి ప్రత్యేకంగా సచివాలయ నియంత్రణ అవసరం.
8. కార్యనిర్వాహక శాఖల ప్రతిపాదనలను పరిశీలించి ఆమోదించడానికి మించిన బాధ్యతలేవీ సచివాలయానికి లేవు.

## 17.8 వేరువేరుగా వుండే ప్రస్తుత పద్ధతే కొనసాగాలనే వారి అభిప్రాయములు :

1. ప్రభుత్వ విధానాల రూపకల్పన, ఆచరణ వీలైనంత వరకు వేరువేరుగానే వుండటం శ్రేయస్కరం. ఈ రెండింటిని కలిపినందు వలన అది అయోమయ పరిస్థితికి దారితీయగలదు.
2. సాంకేతిక పరిజ్ఞానం లేని రాజకీయ నాయకులకు ప్రభుత్వ విధానాల నిర్ణయంలో సాధారణ విషయ పరిజ్ఞానం వున్న ఉద్యోగులు వుండుట ఎంతైనా అవసరం.
3. కార్యనిర్వాహక శాఖాధిపతులు పంపే ప్రతిపాదనలను చర్చించి శాస్త్రీయ, నిష్పాక్షిక అభిప్రాయాలను ఏర్పరచుకోవడంలో మంత్రులకు సహాయ పడటానికి అనుభవజ్ఞులైన ఉద్యోగులు ఉండాలి.
4. ఆధునిక ప్రజాస్వామ్యపు ప్రభుత్వాలు ప్రజాసంబంధ వ్యవహారాలను, శాసన కార్యకలాపాలను నడపటానికి సచివాలయం వంటి స్టాఫ్ ఏజన్సీ తప్పనిసరి.
5. కార్యక్రమాల నిర్వహణ మంచి కార్యనిర్వాహక శాఖాధిపతుల చర్యల వల్ల కలిగే నష్టాలు, కష్టాలను వాటిపై నియంత్రణ, అజమాయిషీ వహించే సచివాలయం దృష్టికి తెచ్చి నివారణ పొందవచ్చు.
6. కార్యనిర్వాహక శాఖాధిపతులు రాజకీయ బాధ్యతలకు, నిర్ణయీకరణకు దూరంగా వుండటం మంచిది. శాఖాధిపతులకు, మంత్రులకు మధ్య సచివాలయం సమన్వయ సాధనంగా పనిచేస్తుంది.
7. సాంకేతిక నిపుణులైన వ్యక్తులను కార్యనిర్వాహక శాఖాధిపతులుగా నియమించుట మంచిది. సాధారణ విషయ పరిజ్ఞానం అవసరమున్న సచివాలయ పదవులలో వారిని నియమించుట వలన వారికి ప్రత్యేక జ్ఞానం ఉపయోగపడే అవకాశాలు తక్కువ. అదే వారు కార్యనిర్వాహక శాఖాధిపతులుగా తమ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు జరుపగలుగుతారు.

పై అంశాలను బట్టి సచివాలయమును - కార్యనిర్వాహక శాఖలను విలీనం చేయాలని లేదా వేరువేరుగా ఉంచాలనే అభిప్రాయాలు బలమైనవి. కాని సచివాలయం రద్దును కోరేటంత బలమైనవి కావు. ఈ వాదాలలో విధాన, ఆచరణ వేర్పాటు భావానికి సిద్ధాంతపరంగా బలం లేనప్పటికి, వేర్పాటు పద్ధతిలో వున్న లోపాలను కాదనలేము. సచివాలయము, కార్యనిర్వాహక శాఖ మధ్య వుండవలసిన సంబంధాన్ని గూర్చి అనేక రాష్ట్రాలు నియమించిన పరిపాలనా సంస్కరణలు సంఘాలు, ఇతర ప్రముఖ వ్యక్తులు అనేక ప్రతిపాదనలు చేయడం జరిగింది.

## 17.9 వివిధ రాష్ట్రాల పరిపాలనా సంస్కరణల సంఘాల ప్రతిపాదనలు :

1. బెంగాల్ పాలనా పరిశీలనా సంఘం, 1944-45 : సచివాలయం, కార్యనిర్వాహక శాఖల మధ్య వుండే సంబంధాల మీద పునరాలోచన జరగాలని, ప్రస్తుత వ్యవస్థలో భారీఎత్తున మార్పులు అవసరమని ఈ సంఘం సూచించినది. కార్యనిర్వాహక శాఖాధిపతులకు ఉద్యోగ హేతుక (పదవిరీత్యా) సచివాలయ హోదా కల్పించవలసిన అవసరం లేదు.

2. బొంబాయి పాలనా పరిశీలనా సంఘం, 1948 : సచివాలయం కార్యనిర్వాహక విధులను చేపట్టరాదు. సచివాలయం కార్యదర్శులుగా వృత్తి నిపుణులను, సాంకేతిక ప్రవీణులను నియమించరాదు. కార్యనిర్వాహక శాఖాధిపతులు, సచివాలయాధికారుల మధ్య తలయెత్తే విభేదాలు వ్యక్తిగత సంప్రదింపుల ద్వారా పరిష్కరించాలి. ఈ రెండు వ్యవస్థలు వేరువేరుగా వుండాలి.

3. కేరళ పాలన సంస్కరణల సంఘం, 1958 : చిన్న చిన్న పనులు కూడా సచివాలయం చూడవలసి రావడంతో దాని అధికారాల పనిభారం అధికమైనది. అధికార వికేంద్రీకరణ జరగాలి. ఉభయ వ్యవస్థల సమైక్యత వాంఛనీయం కాదు. సచివాలయం జోక్యం వుండని విధంగా శాఖాధిపతులకు అధికార దత్తత జరగాలి.

4. హైదరాబాదు పొదుపు సంఘం,1960) : సచివాలయం తనకు కాని విధులను చేపట్టి పెత్తందారీ మనస్తత్వాన్ని పెంచుకున్నందు వలన అసమర్థతకు దారితీసింది. ఉభయ వ్యవస్థల విధులను స్పష్టంగా నిర్వచించాలి. కార్యనిర్వాహక శాఖాధిపతులకు, కార్యదర్శులకు మధ్య పరస్పర విశ్వాసం, సదవగాహన పెరగాలి.

5. రాజస్థాన్ పాలనా సంస్కరణల సంఘం, 1962 - 63 : కొన్ని శాఖల కార్యనిర్వాహక శాఖాధిపతులకు (రహదారుల భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్, పరిశ్రమల సరఫరా శాఖ డైరెక్టర్‌కు) ప్రయోగాత్మకంగా కార్యదర్శుల హోదా కల్పించి ఫలితాలను వాస్తవికంగా పరిశీలించి, ఆ ప్రయోగం జయప్రదమైతే దానిని శాఖలకు వర్తింపచేయాలి.

6. పంజాబ్ పాలనా సంస్కరణ సంఘం, 1964-65) : కొన్ని శాఖల, ఎంపికైన శాఖాధిపతులకు సముచిత హోదాలు కల్పించడం వల్ల అధికారులలో సంఘీభావం, మానసిక సంతృప్తి పెరుగుతుంది. తద్వారా కార్యక్రమాల నిర్వహణ పటిష్టంగా, సమర్థవంతంగా జరుగుతుంది.

7. ఎం.ఆర్.పాయ్, జి. రాంరెడ్డి పరిశీలనా నివేదిక, 1964 : మంత్రులకు సలహాలు ఇవ్వడంలో కార్యదర్శులతో పాటు శాఖాధిపతులకు అవకాశం కల్పించి, ప్రభుత్వ విధానం రూపొందించడంలో వారు తగిన పాత్ర వహించేటట్లు చూడాలి. శాఖాధిపతులకు అధికార దత్తత ఎక్కువ జరగాలి. శాఖాధిపతులకు అంచల వారీగా సచివాలయ హోదా కల్పించి, ఒకే ఫైల్ పద్ధతిని ప్రవేశపెట్టవలెను.

8. పాలనా సంస్కరణల సంఘం : ఈ రెండు వ్యవస్థలు తప్పనిసరిగా వేరుగా ఉండాలి. వినిమాయుత సర్వీస్, శిక్షణ సర్వే, పరిశోధనా సంస్థలు సమర్థవంతంగా పనిచేయడానికి కావలసిన నిర్వహణా స్వేచ్ఛ సచివాలయంతో సంబంధం లేనప్పుడే సమకూరుతుంది.

9. భారత ప్రభుత్వ వ్యవస్థీకరణ - పద్ధతుల (O & M) అధ్యయన బృందం : ఈ రెండు వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నిర్మూలించవలెనని సూచించినది. ఈ రెండింటికి మధ్య గల బేధం అవాంఛనీయమైనదని, పేర్కొని, ఈ రెండింటిని సమ్మేళనం చేయాలని ఈ సంఘం సూచించినది.

10. ఆంధ్రప్రదేశ్ పాలనా సంస్కరణల సంఘం (1969) : అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా, త్వరితంగా అమలు జరగటానికి మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు మధ్య నిరంతరం సామరస్య పూర్వక సంబంధాలు, వుండవలెను. కార్యనిర్వాహక శాఖలను క్రమేపి సచివాలయంలో విలీనం చేయవలెను.

11. పాలనా సంస్కరణ సంఘం : పోలీస్, ఎక్సైజ్ సుంకాలు, కార్మికుల తనిఖీ, జైళ్ళు మొదలగు శాఖలు సచివాలయానికి వేరుగా ఉండవలెను. అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెద్ద శాఖలను సచివాలంలో విలీనం చేసినందువలన సచివాలయ శాఖాధిపతుల గౌరవ మర్యాదలకు లోటు కలుగకపోగా వారి పనిభారం తగ్గుతుంది.

ఈ విధంగా వివిధ రాష్ట్రాల పరిపాలనా సంస్కరణల సంఘాలు చేసిన ప్రతిపాదనలను మూడు రకాలుగా పేర్కొనవచ్చును.

1. కార్యనిర్వాహక శాఖ అధిపతులకు సచివాలయ కార్యదర్శుల హోదాను కల్పించడం.
2. కార్యనిర్వాహక శాఖాధిపతులకు ఎక్సఫిషియో అధీన కార్యదర్శుల హోదాను కల్పించడం.
3. ప్రస్తుత వేర్పాటువాద పద్ధతిని అనుసరిస్తూనే కార్యనిర్వాహక శాఖ అధిపతులకు ఎక్కువ అధికారాన్ని దత్తత చేయడం.

## 17.10 ముగింపు :

ఈ రెండు వ్యవస్థలు వేరువేరుగా ఉన్నప్పటికిని వీని మధ్య అవినాభావ సంబంధం వుండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. కార్యనిర్వాహక శాఖాధిపతులకు కేవలం విధానాల అమలుపై మాత్రమేగాక విధానాల నిర్ణయంలో కూడా కొంత అవకాశం కల్పించడం సముచితము. కార్యనిర్వాహక శాఖల సంఖ్యను తగ్గించి వాటికి ఎక్కువ అధికారాన్ని దత్తత చేయడం అవసరం. అయితే ఈ రెండు వ్యవస్థలు పరిపాలనా సామర్థ్యం, ప్రయోజనాల దృష్ట్యా వేరువేరుగానే ఉండుట శ్రేయస్కరము.

## మాదిరి ప్రశ్నలు :

**వ్యాసరూప ప్రశ్నలు ; 5 పేజీలకు మించకుండా సమాధానం వ్రాయండి**

1. రాష్ట్ర ప్రభుత్వంలో సచివాలయము, సంచాలక శాఖల (కార్యనిర్వాహక శాఖ) మధ్యగల సంబంధమును వివరింపుము.
2. సచివాలయ శాఖలో, సంచాలక కార్యాలయాలు విలీనం కావాలని వేరు వేరుగా వుండాలని కోరేవారి అభిప్రాయాలను తెల్పుము.
3. సచివాలయ, సంచాలక కార్యాలయాలపై వివిధ రాష్ట్రాల సంస్కరణల సంఘాలు సూచించిన అభిప్రాయాలను వివరించుము.

**లఘువ్యాస ప్రశ్నలు : రెండు పేజీలకు మించకుండా సమాధానం వ్రాయండి**

1. సచివాలయము
2. సంచాలక కార్యాలయములు

**లఘుటీకలు : రెండు, మూడు వాక్యాలలో సమాధానం వ్రాయండి**

1. పరిపాలనా సంస్కరణల సంఘం
2. సంచాలక కార్యాలయంపై విమర్శలు
3. సచివాలయంపై విమర్శలు
4. ఆంధ్రప్రదేశ్ పాలనా సంస్కరణల సంఘం

## చదువదగిన గ్రంథాలు


1. భారతపాలన - డాక్టర్ యస్. ఆర్. మహేశ్వరి
2. భారతదేశ పాలనా వ్యవస్థ - తెలుగు అకాడమి


**రచయిత : వి. పూర్ణచంద్రరావు**

# జిల్లా పాలన

విషయసూచిక

18.0 ఉపోద్ఘాతము
18.1 కేంద్ర ప్రభుత్వ పాలన
18.2 రాష్ట్ర ప్రభుత్వ పాలన
18.3 జిల్లా పాలన - యంత్రాంగము
18.4 జిల్లా పాలన - కలెక్టర్
18.5 పురపాలక సంఘములు
18.6 పంచాయితీరాజ్ సంస్థలు
18.7 ముగింపు
18.8 మాదిరి ప్రశ్నలు
18.9 చదువదగిన గ్రంథాలు

## 18.0 లక్ష్యం :

భారతదేశ పాలన కేంద్రస్థాయి, రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయిలలో నిర్వహించబడుచున్నది. జిల్లాస్థాయిలో జరిగే పాలన తీరు తెన్నులను వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 18.1 కేంద్ర ప్రభుత్వ పాలన :

కేంద్ర పాలనలో దేశాధినేతయైన రాష్ట్రపతి అగ్రభాగాన వుండును. ప్రధానమంత్రి నాయకత్వాన మంత్రి వర్గము పాలనా వ్యవస్థను నియంత్రించును. విధానాలు రూపొందించి అమలుపరచుటలో సచివాలయము తోడ్పడును. కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖలలో ఉన్నతాధికారులెందరో కేంద్ర పాలనలో భాగస్వామ్యాన్ని కలిగి పరిపాలనను నిర్వహించుచున్నారు.

## 18.2 రాష్ట్ర ప్రభుత్వ పాలన :

రాష్ట్ర ప్రభుత్వ పాలనలో రాష్ట్రాధినేతగా గవర్నర్ వుండును. ముఖ్యమంత్రి నాయకత్వాన గల మంత్రి వర్గము నిజమైన కార్యనిర్వాహక వర్గము. మంత్రి వర్గ విధానాలను రూపొందించి అమలుపరచుటలో సచివాలయం తోడ్పడును. సచివాలయానికి అధిపతి ప్రధాన కార్యదర్శి. ప్రతి శాఖకు కార్యదర్శి, అదనపు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, విభాగాధిపతి, ఉప విభాగాధిపతి దిగువ స్థాయి సిబ్బంది వుంటారు.

## 18.3 జిల్లా పాలన - యంత్రాంగం :

ప్రతి రాష్ట్రమును పరిపాలనా సౌలభ్యము కొరకై జిల్లాలుగా విభజించిరి. రాష్ట్ర ప్రభుత్వ పాలన యందు జిల్లా పాలన అతి ముఖ్యమైనది. జిల్లా పాలన పౌరునికి ప్రభుత్వ ప్రక్రియకు సంబంధం ఏర్పరుస్తుంది. జిల్లాలో జరిగే అనేక పాలనా

కార్యక్రమాలు ప్రజల జీవితంలో మార్పులు తెస్తాయి. జిల్లా అధికారులు తమ విధులను నిర్వర్తించే విధానాన్ని బట్టి ప్రభుత్వ సమర్ధతను గ్రామీణ ప్రజలు నిర్ణయిస్తారు.

జిల్లా పాలనా యంత్రాంగంలో కలెక్టర్ అగ్రభాగాన ఉంటే, సహాయకారిగా రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా జడ్జి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, జిల్లా విద్యా శాఖాధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జిల్లా అటవీ అధికారి మొదలగు ఉన్నతాధికారులు ఉందురు. జిల్లా పాలనా యంత్రాంగంలో వీరు నిర్వహించు పాత్రను ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

## 18.4 జిల్లా పాలన - కలెక్టర్ :

జిల్లా పాలనకు అధినేత కలెక్టర్. భారత దేశంలో 1772 నుండి కలెక్టర్ పదవి అమలులోనికి వచ్చెను. ఆనాటి ఈస్ట్ ఇండియా కంపెనీకి ప్రధాన రాబడియైన భూమిశిస్తును వసూలు చేయుటకు నియమించబడిన అధికారి కలెక్టర్. 1774లో ఈ పదవి రద్దు చేయబడి మరల 1781లో పునరుద్ధరించబడినది. నేడు కలెక్టర్ జిల్లా పాలనలో తిరుగులేని అధికారములను చెలాయించుచున్నాడు. జిల్లాలో ఇతడు ప్రభుత్వ తరపు కార్యనిర్వహణాధికారి. జిల్లా అభివృద్ధి కలెక్టర్ అమలుపరచే విధానాల దక్షతపై ఆధారపడి వుంటుంది. ఇతడు రాష్ట్ర ప్రభుత్వం తరుపున జిల్లాలో కార్యనిర్వహణాధికారిగా వ్యవహరించును.

Indian Administrative Service (I.A.S.) కు చెందిన వ్యక్తులను ముందుగా డిప్యూటి కలెక్టర్‌లుగా నియమించి, పాలనా యంత్రాంగంలో 5 లేదా 6 సంవత్సరాలు పాలనా అనుభవం గడించిన తదుపరి వారిని కలెక్టర్‌లుగా నియమించుచున్నారు.

### 1. కలెక్టర్ - విధులు :

1. జిల్లాలో భూమి శిస్తును వసూలు చేయుట కలెక్టర్ ప్రధాన విధి.
2. ఈ విషయంలో కలెక్టర్‌కు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ (R.D.O.), తహసీల్‌దార్లు లేదా మండల రెవిన్యూ అధికారులు (M.R.O.), రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు (R.I.), గ్రామ సహాయకులు (Village Assistants) సహాయపడుదురు.
3. జిల్లాలోని అన్నిస్థాయిల రెవిన్యూ అధికారుల సిబ్బందిపై పర్యవేక్షణ చేయును.
4. ఋణములను పంపిణీ చేయుట, వాటిని వసూలు చేయుట మరియు భూమికి సంబంధించిన రికార్డులను నిర్వహించి భద్రపరచుట, ప్రభుత్వ ఎస్టేట్‌లను నిర్వహించుట ఇతని ఇతర విధులు.
5. జిల్లాలోని రెవిన్యూ విషయములకు సంబంధించి, రెవిన్యూ సిబ్బందికి రెవిన్యూ బోర్డుకు కలెక్టర్ బాధ్యత వహించును.

### 2. మేజిస్టీరియల్ విధులు :

జిల్లాలో శాంతి భద్రతల విషయంలో కలెక్టర్‌ది అంతిమ అధికారము. కార్యనిర్వాహక, న్యాయధికారాలు వేరుపడని జిల్లాలలో కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్‌గా వ్యవహరించును. ఇతడు జిల్లాలో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అధికారాలను చెలాయించును. అయితే ఇవి శాంతి భద్రతలకు అవసరమైన చర్యలకు మాత్రమే పరిమితము.

1. జిల్లాలో వివిధ ఆందోళలను లేదా ఉద్రిక్త పరిస్థితులను అదుపుచేసి, శాంతి భద్రతలను పరిరక్షించుటకు తగు చర్యలు తీసుకొనును.
2. జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితిని గూర్చి జిల్లా పోలీస్ సూపరింటెండ్ సమర్పించిన నివేదికను పరిశీలించును శాంతి భద్రతలను గూర్చి ఎప్పటికప్పుడు నివేదికలను తయారు చేయును.

3. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అవసరమైన చోట తగిన సాయుధ దళాలను పంపును, తుపాకులు వంటి ఆయుధాలను ధరించుటకు తగిన లైసెన్సులను ఇచ్చును.
4. జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా పౌర న్యాయ సూత్రాలు సవ్యంగా అమలు జరుగునట్లు చూచును.

### 3. అభివృద్ధి సంబంధ విధులు :

జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను సంబంధించి ప్రధాన బాధ్యత కలెక్టర్‌దే.

1. వ్యవసాయ భూములు పంపిణీ, పంపిణీకి సంబంధించిన చర్యలను పర్యవేక్షించడం మరియు ఎరువుల సరఫరా.
2. జిల్లా యందు వివిధ రుణాలిచ్చే సంస్థలపై అజమాయిషీ చేసే అధికారం.
3. జిల్లా యందు నీటిపారుదల సౌకర్యాలను కల్పించుట, వానికి సంబంధించిన నిధుల వినియోగమును పర్యవేక్షించుట మరియు రుణాల మంజూరును పరిశీలించుట.
4. జిల్లా లో గల వివిధ సహకార సంస్థల పనితీరును సమీక్షించుట మరియు వాని సమస్యలను పరిశీలించుట.
5. జిల్లా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడుగా కలెక్టర్ జాతి విస్తరణ సమాజాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అధికారుల కార్యకలాపాలను సమన్వయం చేయుట.
6. జిల్లాలోని అన్ని శాఖలలోని ఉద్యోగులపై అజమాయిషి చేయుటకు, వారి ఉద్యోగ విధి నిర్వహణను తనిఖీ చేయుటకు, తగిన రికార్డులను పరిశీలించుటకు, తగిన చర్యలు తీసుకొనుటకు కలెక్టరుకు అధికారం కలదు.

### 4. సంక్షేమ విధులు :

1. కుటుంబ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రజాదరణను సమీకరించుట.
2. స్త్రీ శిశు సంక్షేమ కార్యక్రమాల అమలు, వివిధ సంస్థలు నిర్వహించే అనాధాశ్రయాలపై పర్యవేక్షణ జరపుట.
3. హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాల సంక్షేమమునకు తగిన కృషి చేయుట, ఈ వర్గాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలను జిల్లా వ్యాప్తంగా అమలు పరచుట, స్కాలర్ షిప్‌లు, హాస్టల్ వసతులు, ఉద్యోగాల రిజర్వేషన్‌లు తదితర విషయాలను పర్యవేక్షించడం మొదలగున్నవి.

### 5. అత్యవసర విధులు :

ప్రకృతి వైపరీత్యాలైన తుఫాను, వరదలు, కరువు, అగ్ని ప్రమాదాలు మొదలగునవి సంభవించినపుడు వాటిని విచారించుటయే గాక తగు చర్యలు తీసుకొనే అధికారం కలెక్టర్‌కు కలదు.

### 6. ఇతర విధులు :

1. జిల్లా ప్లానింగ్ కమిటీ చైర్మన్‌గా ఉండి, జిల్లా ప్రణాళికను తయారు చేయించి అమలు పరుచుట.
2. పురపాలక సంఘ పరిపాలనను, వాటి నిర్వహణను పర్యవేక్షించుట.
3. జిల్లాలోని ఏ అంశములపైనైననూ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి వాటిపై తగు చర్యలు తీసుకొనుట.
4. బంజరు భూములను సాగులోనికి తెచ్చుట, రాజకీయ బాధితులకు భూములను కేటాయించి సహాయపడుట.
5. ఓటర్ల జాబితాను తయారు చేయించి ఎన్నికలను జరిపించుట.
6. జిల్లాలోని సినిమా థియేటర్లకు లైసెన్సులను జారి చేయుట మరియు రద్దు చేయుట.
7. జిల్లాను సందర్శించే రాజకీయ ప్రముఖులను, ఉన్నతాధికారులను ఆదరించుట.

8. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే వివిధ పథకాలను జిల్లాలో అమలు పరచుట.
9. జిల్లాలోని బ్యాంకుల రుణ సదుపాయాలపై తగు నిర్ణయాలను ప్రతిపాదించుట.
10. జిల్లా క్రీడా మండలి, జిల్లా రెడ్ క్రాస్ మొదలైన అనధికార సంఘాల కార్యక్రమాలకు హాజరవుట.
11. జాతీయ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించుట.

**1. కలెక్టర్ - పంచాయతీ రాజ్ సంస్థలు :**

పంచాయతీ రాజ్ సంస్థలకు మరియు కలెక్టర్‌కు ఉండవలసిన సంబంధాన్ని గూర్చి బల్వంత రాయ్ మెహతా కమిటీ సమాజాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే అధికారులందరిపై కలెక్టరు నాయకత్వం వహించాలని సూచించెను. కాని ఈ అంశాన్ని కొన్ని రాష్ట్రాలు తిరస్కరించుట వలన అన్ని రాష్ట్రాలలో కలెక్టర్‌లకు పంచాయతీరాజ్ సంస్థలతో గల సంబంధాలు ఒకే మాదిరిగా లేవు.

పై విధులను బట్టి కలెక్టర్ పని భారం పెరిగినదనుట వాస్తవము. జిల్లాలో కలెక్టర్ ప్రభుత్వం తరుపున ప్రజాసేవకుడని చెప్పాలి. జిల్లా పాలనకు సంబంధించి కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి "కండ్లు, చెవులు మరియు చేతులు" గా పరిగణించబడుతున్నాడు. జిల్లా కలెక్టర్ శక్తి సామర్థ్యములపై జిల్లా పరిపాలనా దక్షత ఆధారపడి ఉన్నది.

జిల్లా పాలనలో కలెక్టర్ తర్వాత ఉన్నతాధికార బృందం ఈ క్రింది విధముగా వుండును.

**2. రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్** : జిల్లా పాలనలో కలెక్టర్ ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తుండగా ఆయనకు రెవిన్యూ విషయాల యందు సహాయకారిగా R.D.O. ఉంటాడు.

**3. పోలీస్ సూపరింటెండెంట్** : జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుటకుగాను జిల్లా ప్రధానమైన పోలీసు ఉద్యోగి పోలీసు సూపరింటెండెంట్ (Superintendent of Police). ఇతనికి సహాయకారులుగా D.S.P. లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, హెడ్ కానిస్టేబుళ్ళు, సాధారణ పోలీస్ జవానులు ఉందురు. వీరు జిల్లా యందు శాంతి భద్రతలను, ప్రజల ధన, ప్రాణ మానముల కాపాడుతూ ఉంటారు.

**4. జిల్లా జడ్జి** : జిల్లాలోని న్యాయ స్థానముల కన్నింటిని జిల్లా జడ్జి ఉండును. ఇతను క్రింది కోర్టుల నుండి వచ్చు అప్పీళ్లను విచారించి తీర్పు చెప్పును.

**5. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి** : జిల్లాలోని వైద్యశాలలు ఇతని అదుపు ఆజ్ఞలలో ఉండి పనిచేయును. జిల్లాలోని వైద్యశాలలను తనిఖీ చేయుటకు వైద్య సిబ్బందిపై అజమాయిషీ చేయుటకు ఇతనికి అధికారం కలదు.

**6. జిల్లా విద్యాశాఖాధికారి** (District Educational Officer) : జిల్లాలోని పాఠశాలలు, హైస్కూళ్లపై అజమాయిషి చేయును. ఈ విద్యా సంస్థలను పర్యవేక్షించుటకు, తగు క్రమశిక్షణా చర్యలు తీసుకొనుటకు జిల్లా విద్యాశాఖాధికారికి అధికారం కలదు. జిల్లాలో హైస్కూళ్ల స్థాయి వరకు ప్రభుత్వ పరీక్షలను నిర్వహించును.

**7. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి** (District Social Welfare Officer) : జిల్లాలోని సంక్షేమ పథకాలను అమలుపరుచును. విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, హాస్టలుల నిర్వహణ మున్నగు సంక్షేమ పథకాలను అమలు పరుచును.

**8. జిల్లా వ్యవసాయాధికారి** (District Agriculture Officer) : జిల్లాలోని వ్యవసాయ కార్యకలాపములను అజమాయిషి చేయును. ఎరువులను, విత్తనములను, నీటి సౌకర్యాలను వ్యవసాయదారులకు కల్పించును. వ్యవసాయోత్పత్తి గణనీయంగా అభివృద్ధి చెందుటకు వ్యవసాయదారులకు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేయును.

**9. జిల్లా ఉపాధి కల్పనాధికారి (District Employment Officer) :** జిల్లాలోని నిరుద్యోగుల పేర్ల నమోదు, జిల్లాలోని వివిధ సంస్థలలో వచ్చు ఖాళీలను భర్తీ చేయుటకు అభ్యర్థులకు కాల్ లెటర్‌లు పంపించుట వంటి అధికారాలను ఇతడు నిర్వహించును.

**10. జిల్లా అటవి అధికారి (District Forest Officer) :** జిల్లాలోని అడవులపై ఇతడు అధికారం చలాయించును. అడవులను ఎవరూ నరికి వేయకుండా పరిరక్షించుట, అడవులపై, అటవిక భూములపై వచ్చిన ఫలితమును ప్రభుత్వ వశము చేయుట లాంటి విధులను ఇతడు నిర్వహించును. వీరే గాక జిల్లా కోశాధికారి (District Treasury Officer), జిల్లా కమర్షియల్ టాక్స్ ఆఫీసర్, జిల్లా కో - ఆపరేటివ్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ లాండ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జిల్లా పౌర సంబంధాల అధికారి మొదలగు అధికారులు ఉందురు.

## 18.5 జిల్లా పాలనలో స్థానిక స్వపరి పాలనా సంస్థలు :

**1. పురపాలక సంఘములు (Municipalities) :**

పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించుకొను నిమిత్తం పురపాలక సంఘములు ఏర్పరచబడెను. 18 సంవత్సరాలు నిండిన వయోజన ఓటర్లందరూ వారి వార్డు కౌన్సిలర్లను, చైర్మన్‌ను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకొనుచున్నారు. వైస్ చైర్మన్‌ను ఎన్నికైన కౌన్సిలర్‌లు ఎన్నుకొనెదరు. వీరు పట్టణ శుభ్రత, మురికి నీటి కాలువలు, విద్యుద్దీపములు, మురికి నీటి విద్యా సౌకర్యములు, పార్కులు, రోడ్లు నిర్మించుట మున్నగు సౌకర్యములను ప్రజలకు కల్పించెదరు. హైద్రాబాదు, విశాఖపట్టణం, విజయవాడలకు నగర పాలక సంస్థలు (Municipal Corporations) ఉన్నాయి.

**2. పంచాయతీ రాజ్ సంస్థలు :** దాదాపు 70 శాతము వరకు ప్రజలు గ్రామీణ ప్రాంతములోనే నివసిస్తున్నారు. వారి సంక్షేమము నిమిత్తము పంచాయతీ రాజ్ వ్యవస్థ రూపొందించబడింది. భారత రాజ్యాంగంలో ఆదేశ సూత్రాలలో 40వ నిబంధన ప్రకారంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ స్థాపన సూచించబడింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శక్తి నిచ్చుటకు 1952 లో సామాజిక అభివృద్ధి పథకం (Community Development Programme) ప్రారంభించబడింది. అయితే ఈ పథకం కొంత ప్రగతిని సాధించినప్పటికిని మొత్తానికి విఫలమైనది. ఈ పథకం విఫలం చెందుటకు గల కారణాలను పరిశీలించి స్థానిక సంస్థల అభివృద్ధికి తగిన కారణములను చూచించమని 1957 లో బల్వంతరాయ్ మెహతా కమిటీని ప్రణాళికా సంఘంలోని ప్లాన్ ప్రాజెక్టు కమిటీ నియమించినది. బల్వంతరాయ్ మెహతా కమిటీ సూచనలను జాతీయ అభివృద్ధి మండలి 1958 లో ఆమోదించగా మొదట రాజస్థాన్ మూడంచెల పంచాయతీరాజ్ విధానమును అమలుపరచెను.

## 18.6 ఆంధ్ర ప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ - పరిణామము :

1959 అక్టోబరు 2వ తేదీన రాజస్థాన్‌లోను, 1959 నవంబరు 1వ తేదీన ఆంధ్ర ప్రదేశ్‌లోనూ బల్వంతరాయ్ మెహతా కమిటి సిఫారసులను అనుసరించి మూడంచెల పంచాయతీరాజ్ విధానము ప్రవేశపెట్టబడినది. ఈ మూడంచెల పద్ధతిలో దిగువ స్థాయిలో జిల్లా పరిషత్‌లు ఏర్పరచబడినవి. గ్రామ సభకు సర్పంచ్, పంచాయతీ సమితికి అధ్యక్షుడు, జిల్లా పరిషత్‌కు చైర్మన్ పదవులను ప్రజలు పరోక్షముగా ఎన్నుకొనెడివారు. తదనంతరం 1981లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్, పంచాయతీ సమితి అధ్యక్ష పదవులకు ప్రత్యక్ష ఎన్నిక విధానం ప్రవేశ పెట్టిరి. పంచాయతీ రాజ్ విధానంపై అశోక్ మెహతా కమిటి, జలగం వెంగళరావు కమిటీ, సి. నరసింహం కమిటీలు కూడా అనేక సిఫార్సులను చేసినవి.

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1986 జూలైలో పంచాయతీరాజ్ వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చినది. రాష్ట్రంలోని 330 పంచాయతీ సమితులను రద్దు చేసి 1104 మండల ప్రజా పరిషత్‌లను ఏర్పరచినది. జిల్లా

పరిషత్‌ను జిల్లా ప్రజాపరిషత్‌గా, గ్రామ పంచాయతీను గ్రామ ప్రజా పరిషత్‌గా ఏర్పరచినది. దీని ప్రకారంగా 1987 మార్చిలో ఎన్నికలు నిర్వహించబడినవి.

అధికార వికేంద్రీకరణ సూత్రం ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దగ్గర సంబంధాన్ని నెలకొల్పుటకు, స్థానిక సంస్థలను ప్రజల వాకిట్లోకి తీసుకొని వెళ్లుటకు మరియు ప్రజల అవసరాలను సత్వరం తీర్చుటకు గాను మండల ప్రజాపరిషత్‌ను నెలకొల్పెను. అప్పటి వరకు పంచాయతీ సమితులు ఎక్కువ విస్తీర్ణమును కలిగి, సకాలములో గ్రామీణ ప్రజల అవసరాలను తీర్చలేక పోతున్నవి. అదియును గాక దూరంగా నున్న సమితి కేంద్రానికి ప్రజలు సమస్యలు చేత బట్టి తరచూ సమితి కార్యాలయం చుట్టూ తిరిగినా, దాని నుండి తగిన సమస్యల పరిష్కారాన్ని పొందుట కష్టతరముగా నుండెడిది. అందుచేత ఒక్కొక్క సమితి పరిధిని ప్రజల అవసరాలను తీర్చుటకు గాను మూడు లేక నాలుగు మండలాలుగా రూపొందించడమే గాక, ప్రతి మండలమునకు ఒక పోలీస్ స్టేషన్, ఒక జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆసుపత్రి, కో - ఆపరేటివ్ బ్యాంక్, ఒక బ్యాంక్ శాఖ, విస్తరణాధికారుల కార్యాలయాలు మొదలగునవి ఏర్పాటు చేసి మండల కేంద్రమే ప్రజా సౌకర్యాలకు సింగిల్ విండోగా వ్యవహరించాలని ఉద్దేశ్యముతో ప్రభుత్వం మండల వ్యవస్థను ఏర్పరచినది.

## పంచాయతీ రాజ్ విధానము - మూడంచెల పద్ధతి :

### 1. గ్రామ ప్రజా పరిషత్ - నిర్మాణము :

ఇది పంచాయతీరాజ్ విధానంలో మొదటి అంచ. గ్రామంలో 18 సం॥లు నిండిన వారందరూ ఓటు హక్కును కలిగి ఉంటారు. గ్రామ ప్రజా పరిషత్‌కు సభ్యులను, సర్పంచ్‌ను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకొనుచున్నారు. చట్టరీత్యా 500 మంది జనాభా తక్కువ లేకుండా గల ప్రాంతమును గ్రామంగా పరిగణించి, గ్రామ ప్రజా పరిషత్‌ను ఏర్పాటుచేయు అధికారము పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఉంటుంది. గ్రామ ప్రజాపరిషత్ వార్షిక నివేదికను, బడ్జెట్‌ను, చేపట్టవలసిన కార్యక్రమాలను గూర్చి చర్చిస్తుంది. ఇది సంవత్సరానికి రెండు సార్లు సమావేశం అవుతుంది.

గ్రామ ప్రజా పరిషత్‌లో 7 నుండి 19 వరకు సభ్యులుండెదరు. గ్రామ ప్రజాపరిషత్‌ను కొన్ని వార్డులుగా విభజించి ఒక్కొక్క వార్డుకు ఒక్కొక్క సభ్యుని ఓటరు ఎన్నుకొనును. కొన్ని సీట్లు షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు మరియు స్త్రీలకు రిజర్వు చేయబడినవి. సర్పంచ్ ఓటర్లందరిచే ప్రత్యక్షముగా ఎన్నుకోబడతాడు. గ్రామ ప్రజా పరిషత్‌లో ఎన్నిక కాబడిన సభ్యులు తమలో ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకొనెదరు. సర్పంచ్, ఉప సర్పంచ్ పదవీ కాలము 5 సంవత్సరములు. గ్రామ ప్రజా పరిషత్ సమావేశములకు సర్పంచ్ అధ్యక్షత వహించును. మేజర్ గ్రామ ప్రజా పరిషత్‌కు ప్రభుత్వంచే నియమించబడిన కార్యనిర్వహణాధికారి ఉంటాడు. ఇతడు గ్రామ ప్రజా పరిషత్ చేసిన తీర్మానములను అమలు పరుచును. మైనర్ గ్రామ పరిషత్‌లలో కార్యనిర్వహణాధికారి ఉండడు.

### గ్రామ ప్రజా పరిషత్ - విధులు :

1. గ్రామ ప్రజలకు మంచి నీటి సౌకర్యములు కల్పించుట.
2. మురుగు నీటి పారుదల సౌకర్యములను కల్పించుట.
3. రోడ్లు వేయించుట, వీధుల శుభ్రత, వీధి దీపములను ఏర్పరచుట, అంటు వ్యాధుల నిర్మూలన, మరుగు దొడ్లు నిర్మించుట మొదలగు విధులను గ్రామ ప్రజా పరిషత్ నిర్వహించును.

### 2. మండల ప్రజాపరిషత్ - నిర్మాణము :

మండలములోని గ్రామ ప్రజాపరిషత్‌ల సర్పంచ్‌లు, ఎం.ఎల్.ఏ., లోకసభ సభ్యుడు మండల ప్రజా పరిషత్ సభ్యులుగా

వుంటారు. మండల ప్రజా పరిషత్ చైర్మన్‌ను ప్రజలే ప్రత్యక్షముగా ఎన్నుకుంటున్నారు. చైర్మన్ పదవీ కాలం 5 సంవత్సరములు. 21 సం॥లు నిండినవారు చైర్మన్ పదవికి పోటీ చేయవచ్చు. మండల ప్రజా పరిషత్ సభ్యులు తమలో ఒకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకొంటారు. ఎం.ఎల్.ఏ. తన నియోజిక వర్గ పరిధిలో గల మండలాలన్నింటిలో సభ్యత్వం కలిగినప్పటికిని, ఏదో ఒక మండలంలో మాత్రమే ఓటు హక్కును కలిగి వుంటాడు. మైనారిటీల నుండి ఒక వ్యక్తిని కో - ఆప్ట్ చేసుకొంటారు. మండల సమావేశం ప్రతి 60 రోజుల కొకసారి తప్పక జరుగవలెను.

మండల ప్రజా పరిషత్ ఎన్నికలలో వివిధ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్‌ను కల్పించారు. వారిలో వెనుకబడిన తరగతులకు 20 శాతం, షెడ్యూల్డు కులాలకు 15 శాతం, షెడ్యూల్డు తెగలకు 6 శాతం మరియు స్త్రీలకు 9 శాతం రిజర్వేషన్‌లను కల్పించారు.

**మండల అభివృద్ధి అధికారి (Mandal Development Officer, M.D.O.) :**

గతంలో ప్రతి సమితికి ఒక ముఖ్య కార్య నిర్వహణాధికారి ఉండేవాడు. అతనినే బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (B.D.O.) అనేవారు. కాని నేడు ఆ పదవి స్థానంలో మండల అభివృద్ధి అధికారి పదవిని ఏర్పరచారు. మండలానికి ముఖ్య కార్య నిర్వహణాధికారి M.D.O. ఇతడు రాష్ట్ర ప్రభుత్వముచే నియమింపబడును. ఇతడు మండల ప్రజా పరిషత్ చేసిన తీర్మానములను అమలుపరచడమే గాక ప్రభుత్వం దత్తత చేసిన ఇతర పనులను కూడా నిర్వహించును. మండల ప్రజా పరిషత్ సమావేశములో పాల్గొనును. కాని తీర్మానాలు ప్రవేశ పెట్టుటకు, ఓటు చేయుటకు అధికారమును కలిగి వుండడు. మండల ఆఫీసు సిబ్బంది M.D.O. ఆధీనంలో వుంటారు.

**మండల ప్రజా పరిషత్ విధులు :**

1. సమితిలోని గ్రామ పంచాయితీల వార్షిక బడ్జెట్‌ను ఆమోదించుట
2. గ్రామ పంచాయితీలకు సంబంధించిన సమిష్టి పథకాలు చేపట్టుట.
3. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో రుణాలు స్వీకరించుట.
4. మండల ప్రజా పరిషత్ సిబ్బందిపై నియంత్రణ చేయుట.
5. రద్దయిన గ్రామ పంచాయితీల పరిపాలనను నిర్వహించుట
6. మండల ప్రజాపరిషత్ బడ్జెట్‌ను రూపొందించుట
7. గ్రామీణ సంక్షేమ విధులను, ఉదాహరణకు, చెట్లను నాటించుట, బంజరు భూములను సేద్యం చేయుటకు అనువుగా మార్చుటలో రైతులకు తోడ్పడుట, నాణ్యమైన విత్తనములను తెప్పించి రైతులకు సప్లయ్ చేయుటమొదలగునవి, చేపట్టుట.
8. ఆరోగ్య సంబంధమైన, విద్యా సంబంధమైన, సహకార సంబంధమైన విధులను నిర్వహించుట.

**3. జిల్లా ప్రజాపరిషత్ - నిర్మాణం :**

పంచాయితీరాజ్ విధానంలో మూడవ అంచె జిల్లా పరిషత్. జిల్లా ప్రజాపరిషత్‌లో జిల్లాలోని మండల ప్రజాపరిషత్‌ల చైర్మన్‌లు, ఎం.ఎల్.ఏ., లు మరియు లోకసభ సభ్యులు సభ్యులుగా వుంటారు. సభ్యులు తమలో ఒకరిని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకుంటారు. మైనారిటీలకు చెందిన ఒక వ్యక్తిని కో-ఆప్ట్ చేసుకుంటారు. కలెక్టర్ ఎక్స్-ఆఫీషియో మెంబరుగా ఉంటాడు. జిల్లా ప్రజాపరిషత్ సభాకార్యకలాపాలను నిర్వహించును. జిల్లా ప్రజాపరిషత్ 3 నెలలకొకసారి తప్పనిసరిగా సమావేశం జరుపవలెను. జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల తీర్మానాల అమలులో జిల్లా అభివృద్ధి అధికారిపై పరిపాలనా విషయాలకు సంబంధించి చైర్మన్ నియంత్రణ చేయును. జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యునిగా జిల్లా ప్రజా పరిషత్ సిబ్బందిని భర్తీ చేయడంలో చైర్మన్ ప్రముఖపాత్ర నిర్వహిస్తాడు. జిల్లా పరిషత్ సిబ్బందిని చైర్మన్ పర్యవేక్షిస్తాడు.

## ప్రధాన కార్యనిర్వహణాధికారి :

ప్రభుత్వం సాధారణంగా ఐ.ఏ.ఎస్. కేడర్‌కు చెందిన ఒక అధికారిని జిల్లా ప్రజాపరిషత్ కార్యనిర్వహణాధికారిగా నియమిస్తుంది. అతనిని జిల్లా అభివృద్ధి అధికారి అని పిలుస్తారు (District Development Officer, D.D.O.). జిల్లా ప్రజాపరిషత్ చేసిన తీర్మానములను D.D.O. అమలుపరుస్తుంటాడు. D.D.O. జిల్లా ప్రజా పరిషత్ సమావేశాల, స్థాయీ సంఘాల తీర్మానాలు అమలుపరుస్తాడు. జిల్లా ప్రజాపరిషత్‌కు బడ్జెట్‌ను తయారు చేసి సమర్పిస్తాడు.

## స్థాయీ సంఘములు :

జిల్లా ప్రజా పరిషత్ కార్యకలాపాలు ఈ క్రింది స్థాయీ సంఘాల (Standing Committees) సూచనల మేరకు నిర్వహించబడుచున్నాయి.

1. అభివృద్ధి స్థాయీ సంఘము
2. విద్యా స్థాయీ సంఘం
3. సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం
4. స్త్రీ సంక్షేమ స్థాయీ సంఘం
5. పనుల స్థాయీ సంఘం
6. ఆర్థిక స్థాయీ సంఘం ప్రజా పరిషత్ సభ్యుల సంఖ్యను 6చే భాగిస్తే వచ్చే సంఖ్య స్థాయీ సభ్యుల సంఖ్య అవుతుంది. ఆర్థిక స్థాయీ సంఘమునకు జిల్లా పరిషత్ ఛైర్మన్, అభివృద్ధి స్థాయీ సంఘమునకు డిప్యూటీ ఛైర్మన్‌లు అధ్యక్షతన వహిస్తారు.

## జిల్లా ప్రజాపరిషత్ విధులు :

1. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను మండల ప్రజాపరిషత్‌ల మధ్య పంపిణీ చేయుట
2. జిల్లాలోని మండల ప్రజాపరిషత్‌ల బడ్జెట్ అంచనాలను ఆమోదించుట
3. మండల ప్రజాపరిషత్‌లకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను తయారుచేసి ప్రభుత్వానికి నివేదించుట
4. జిల్లా గ్రామీణాభివృద్ధిని, జిల్లా అభివృద్ధిని పర్యవేక్షించుట
5. మండల స్థాయిలో ప్రణాళికలు, పథకాలు అమలు జరిగేటట్లు చూచుట.
6. జిల్లాలో రహదారుల నిర్మాణము, రిపేరు చేయుట
7. సెకండరీ, హయ్యర్ సెకండరీ విద్యను ప్రోత్సహించుట
8. మార్కెట్‌లను స్థాపించుట
9. జిల్లాలో వైద్యశాలల నిర్మాణము
10. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశములను నిర్వర్తించుట
11. మండల ప్రజాపరిషత్ క్రిందలేని ప్రాంతముల పరిపాలన నిర్వహణ చేపట్టి నిర్వహించుట

## జిల్లా పాలనపై సంస్కరణల సంఘం చేసిన సూచనలు :

మనదేశ పరిపాలనను పరిశీలించి వివిధ సర్వీసుల సామర్థ్యమును ఉన్నతస్థాయికి తీసుకొని వెళ్లేందుకు తగిన పునర్వ్యవస్తీకరణ సిఫార్సులు చేయుటకు 1985 జనవరి 5న పరిపాలనా సంస్కరణల సంఘాన్ని (Administrative Reforms Committee) నియమించిరి. ఈ కమిటి జిల్లా పాలనపై ఈ క్రింది ముఖ్యమైన సూచనలు చేసెను.

1. జిల్లా యందు కార్యనిర్వహణాధికారాన్ని, న్యాయాధికారాన్ని వేరుపరచి కలెక్టర్‌చే నిర్వహించబడే న్యాయవిధులను న్యాయశాఖకు బదిలీ చేయాలి.
2. జిల్లా అధికారులకు భూమి శిస్తుపాలన, మేజిస్ట్రేట్స్ సంబంధ కార్యకలాపాలకు సంబంధించిన విద్యుక్త రంగాన్ని కేటాయించాలి.

## 18.7 ముగింపు :

నేడు ఆంధ్రప్రదేశ్ జిల్లా స్థాయిలో, దిగువ స్థాయిలో అధికార వికేంద్రీకరణ సిద్ధాంత ఆధారంగా పాలనా యంత్రాంగంలో అనేక మార్పులు చేసినది. కాని నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా, దిగువ స్థాయిలో పాలనా సంస్థలకు కావలసిన నిధులను సమకూర్చకపోవుట, నిర్ణీత సమయాలలో ఎన్నికలు జరిపించకపోవుట మొదలైన కారణాలు వలన జిల్లాస్థాయిలో, దిగువస్థాయిలో పాలనా యంత్రాంగం సమర్ధవంతంగా పనిచేయలేక పోతున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడు ప్రభుత్వ యంత్రాంగంలో భాగస్వామి కావలెను. అందుచేత జిల్లా పాలనకు, దిగువ స్థాయిలో పాలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాముఖ్యతనిచ్చి, తగిన ఆర్థిక వనరులను సమకూర్చి, అభివృద్ధి పథకాలను చేపట్టి దిగువస్థాయిలో వున్న అన్ని సమస్యలను పరిష్కరించుటకు కృషి చేసిననాడు ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టవంతం కాగలదు.

## మాదిరి ప్రశ్నలు :

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించక సమాధానం వ్రాయుము.

1. జిల్లా మరియు దిగువ స్థాయిలలో పాలనా సంస్కరణలు వివరించుము.
2. జిల్లా పాలనలో కలెక్టర్ పాత్ర తెల్పుము.
3. పంచాయితీ రాజ్ సంస్థలలో వచ్చిన మార్పులు పేర్కొనుము.

**లఘుటీక ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు రెండు లేదా మూడు వాక్యాలలో సమాధానం వ్రాయుము.

1. పంచాయతీరాజ్ ముఖ్య ఉద్దేశ్యము
2. బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫార్సులు
3. పంచాయతి వ్యవస్థ
4. ఆంధ్ర ప్రదేశ్‌లో మండల ప్రజా పరిషత్‌లకు ముందువున్న పంచాయతీ వ్యవస్థ
5. మండల ప్రజా పరిషత్, జిల్లా పరిషత్‌ల చట్టము
6. గ్రామ పంచాయతి
7. ఆంధ్రప్రదేశ్‌లోని మండలములు
8. జిల్లా ప్రజా పరిషత్‌లో స్థాయీ సంఘములు
9. జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్
10. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు
11. స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటింగ్ వయస్సు
12. మండల అభివృద్ధికారి

రచయిత : వి. పూర్ణచంద్రరావు

పాఠము - 19

# పరిపాలనపై పౌర నియంత్రణ

విషయసూచిక


19.0 ఉపోద్ఘాతం

పౌర నియంత్రణ - సాధనాలు

19.1 ఎన్నికల విధానము

19.2 పునరాయనము (Recall)

19.3 ప్రజాభిప్రాయ సేకరణ, చొరవ

19.4 సలహా సంప్రదింపుల సంఘాలు

19.5 నిర్బంధ సముదాయాలు

19.6 ప్రజాభిప్రాయము

19.7 పత్రికలు (Press)

19.8 రాజకీయ పక్షములు

19.9 ముగింపు

మాదిరి ప్రశ్నలు

చదువదగిన గ్రంథాలు


## 19.0 ఉపోద్ఘాతము :

నేటి ఆధునిక రాజ్యాలు ప్రజాస్వామ్య రాజ్యాలు. ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రజలే సార్వభౌమాధికారులు. ప్రజల శ్రేయస్సుకు ప్రభుత్వము కృషి చేయవలెను. ప్రభుత్వ పాలనను నిర్వహించునది ప్రభుత్వ ఉద్యోగులు. ఇ.ఎన్. గ్లాడెన్ చెప్పినట్లు "పరిపాలకుడు ప్రజాసేవకుడే కాని ప్రజలకు యజమాని కాడు". కాబట్టి ఉద్యోగులు ప్రజా సంక్షేమాన్ని పెంపొందించుటలో సమాజంలో ఒక భాగంగా పని చేయుదురు. ప్రభుత్వ పాలన మరియు ప్రజల సంక్షేమాన్ని పెంపొందించుటలో సమాజంలో ఒక భాగంగా పని చేయుదురు. ప్రభుత్వ పాలన మరియు ప్రజల ఒకరిపై ఒకరు ఆధారపడి, అవినాభావ సంబంధాన్ని కలిగి వుంటారు. ప్రభుత్వ పాలనపై శాసన నిర్మాణశాఖ, న్యాయశాఖ సమర్ధవంతమైన నియంత్రణ చేయుచున్నప్పటికిని, ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రభుత్వ యంత్రాంగంలో ప్రజలే భాగస్వాములైనందువలన ప్రభుత్వ పాలనపై ప్రజలు కూడా నియంత్రణ చేయు హక్కును కలిగి వుంటారు. కాని ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రజలు నిరక్షరాస్యులై, రాజకీయ చైతన్యరహితులైనందువలన ప్రభుత్వ పాలనపై శక్తివంతమైన నియంత్రణ చేయలేకపోతున్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజలు ప్రత్యక్షంగా నియంత్రణ చేయలేక పోయినప్పటికి పరోక్షంగా ప్రభుత్వ పాలనపై ఈ క్రింది విధంగా నియంత్రణ చేయుచున్నారు.

## పౌర నియంత్రణ - సాధనాలు :

## 19.1 ఎన్నిక విధానము (System of Election) :

ప్రజాస్వామ్యంలో నిర్ణీత సమయాలలో జరిగే ఎన్నికలలో ప్రజలే తమ ప్రతినిధులను ఎన్నుకొనెదరు. ప్రజా ప్రతినిధులే శాసన నిర్మాతలు. ప్రజా ప్రతినిధులు రూపొందించే శాసనములే ఉద్యోగుల అధికార పరిధిని, ప్రభుత్వ పాలనా పరిధిని నిర్ణయిస్తాయి.

శాసనములకు లోబడి ఉద్యోగులు, ప్రభుత్వ పాలన ఉంటుంది. శాసన సభలలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చ జరిపెదరు. ప్రతిపక్ష సభ్యులు తమ విమర్శల ద్వారా ప్రభుత్వాన్ని హద్దుల్లో వుంచి పాలించేటట్లు చేయగలరు. ఈ విధంగా ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా ప్రభుత్వ పాలనపై నియంత్రణ చేయుచున్నారు.

నేటి ప్రజాస్వామ్య రాజ్యాలలో దేశాధినేతలు ప్రజల చేత ప్రత్యక్షంగా గాని లేక పరోక్షంగా గాని ఎన్నుకోబడెదరు. దేశంలో ఉన్నత ఉద్యోగులందరూ దేశాధినేతలచే నియమింపబడి, దేశాధినేతలకే బాధ్యత వహించెదరు. ఉన్నత ఉద్యోగులు దేశాధినేతలు బాధ్యత వహించుట వలన వీరందరిపై ప్రజలు పరోక్షమైన నియంత్రణ చేయగలుగుతున్నారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులను పాటిస్తున్న స్విట్జర్లాండ్‌లోను, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలలో స్థానిక సంస్థలలోను ఉద్యోగులను ప్రజలే ఎన్నుకొనుచున్నారు. ఇచ్చట ప్రజలే ఉద్యోగులపై ప్రత్యక్షంగా నియంత్రణ చేయగలుగుతున్నారు. కాని ఈ విధానం వలన పాలనా యంత్రాంగం రాజకీయమై అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి దారి తీయవచ్చు. ఈ తరహా విధానము పెద్ద పెద్ద దేశాలలో అనుసరించ సాధ్యంకాదు.

## 19.2 పునరాయనము (Recall) :

ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలే ఎన్నుకునే విధానం అమలులో గల రాజ్యాలలో ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతా రహితంగా ప్రవర్తించినప్పుడు నిర్ణీత సంఖ్యలో ఓటర్లు వారిని పదవి నుండి తొలగించాలని కోరే అధికారం కలదు. దీనినే రీకాల్ అందురు. ఆ తర్వాత ఆ విషయమై ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, మెజారిటీ ఓటర్లు రీకాల్ చేసినచో ఆ ఉద్యోగి పదవి నుండి తొలగించబడును. కాని ఈ విధానం ఫలితంగా ప్రజల మద్దతు చూరగొనుటకు ప్రభుత్వోద్యోగులు అనేక అడ్డదారులు త్రొక్కుటకు ప్రయత్నించెదరు.

## 19.3 ప్రజాభిప్రాయ సేకరణ, చొరవ (Referendum and Initiative) :

స్విట్జర్లాండ్‌లో ఓటర్లు శాసనసభ ప్రతిపాదించిన శాసనాలను ప్రజాభిప్రాయ సేకరణ సాధనం ద్వారా ఆమోదించడము లేక తిరస్కరించడము జరుగుతుంది. చొరవ (Initiative) అనే సాధనం ద్వారా ప్రజలు శాసన నిర్మాణ విషయంలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావడము జరుగుచున్నది. ఈ విధంగా శాసన నిర్మాణంలో ప్రజలే ప్రత్యక్షంగా పాల్గొనుట ద్వారా ప్రభుత్వ పాలనను నియంత్రణ చేయగలుగు తున్నారు.

## 19.4 సలహా సంప్రదింపుల సంఘాలు (Advisory Bodies) :

నేడు ప్రభుత్వ పాలనలో ప్రజలకు విశ్వాసాన్ని కలిగించుటకు గాను కొన్ని సలహా, సంప్రదింపుల సంఘాలు ఏర్పరచబడినవి. ఈ సంఘాలు కేవలం సలహా సంఘాలు మాత్రమే. ఈ సలహా సంప్రదింపుల సంఘాలలో ఆయా రంగాలలో అనుభవజ్ఞులైన వారిని నియమించెదరు. కావున వివిధ పరిపాలనా శాఖలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ సలహా సంప్రదింపుల సంఘాలు ప్రజల కోర్కెలను, ఆశయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని పోగలవు. ఇవి ప్రభుత్వమునకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను నెలకొల్పుటకు ప్రయత్నించుతాయి. ప్రభుత్వ పాలన ప్రజానురంజకముగా సాగుటకు ఈ సలహా సంప్రదింపుల సంఘాలు తోడ్పాటు ఎంతైనా అవసరము. నేడు భారతదేశంలో వివిధ మంత్రిత్వ శాఖలలో ఉదాహరణకు ఆహార వ్యవసాయశాఖ, రైల్వేశాఖ, పరిశ్రమల మంత్రిత్వశాఖ మున్నగు శాఖలన్నింటిలో సలహా సంప్రదింపుల సంఘాలు కలవు.

## 19.5 నిర్బంధ సముదాయాలు (Pressure Groups) :

ట్రేడ్ యూనియన్‌లు, విద్యార్థి సంఘాలు, రైతు సంఘాలు, వాణిజ్య మండలులు, వృత్తి సంఘాలు, పారిశ్రామిక సంఘాలు మొదలైనవి నిర్బంధ సముదాయాలకు (ఒత్తిడి సంఘాలు) ఉదాహరణలు. ఇవి ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తీసుకువచ్చి తమ స్వప్రయోజనాలను సాధించుకోవడానికి సర్వత్రా కృషి చేస్తూ వుంటాయి. ప్రభుత్వ విధానాలపై ఈ ఒత్తిడి సంఘాల ప్రభావం ఉంటుంది. ప్రభుత్వం కూడా కొన్ని విషయాలలో నిర్ణయాలను తీసుకొనుటకు ఈ సంఘాలతో చర్చలు జరుపుతుంది.

నిర్బంధ సముదాయాలు ప్రభుత్వ విధాన నిర్ణయంలోను, వాటి అమలులోను ముఖ్యపాత్ర నిర్వహిస్తుంటాయి. నిర్బంధ సముదాయాలు వారి వారి వర్గాల స్వప్రయోజనాలకే పాటుపడుతూ ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం ఈ నిర్బంధ సముదాయాల పట్ల జాగ్రత్త వహించవలెను.

**19.6 ప్రజాభిప్రాయము (Public Opinion) :**

దేశ ప్రయోజనాలను దృష్టిలోనుంచుకొని మేధావులు, పత్రికలు, వివిధ వర్గాలు వ్యక్తం చేసిన అభిప్రాయములు ప్రజామోదం పొందినప్పుడు అది ప్రజాభిప్రాయ మవుతుంది. ప్రభుత్వ విధానాలపై పత్రికలు, రాజకీయ పక్షములు, వత్తిడి వర్గములు మరియు మేధావులు వారి వారి అభిప్రాయాలు ఎంతో ప్రభావాన్ని చూపిస్తాయి. ఏ ప్రభుత్వము ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేయలేదు. కాబట్టి ప్రజాభిప్రాయం కూడా పాలనను నియంత్రణ చేయును.

**19.7 పత్రికలు (Press) :**

పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయే సాధనములుగానే గాక, ప్రభుత్వ విధానాలపై తన సునిశిత విమర్శల ద్వారా పాలనా యంత్రాంగం లోప భూయిష్టతను బహిర్గత పరచే సాధనములు కూడా పత్రికలు ఉపయోగపడతాయి. కాబట్టి పత్రికలు ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తాయి.

**19.8 రాజకీయ పక్షములు (Polictical Parties) :**

ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయే సాధనములు రాజకీయ పక్షములు. ఉపన్యాసాల ద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొనిపోయి ప్రభుత్వ పాలన ప్రజాభీష్టానికి అనుకూలముగా రాజకీయ పక్షములు పని చేయగలవు. అధికార పక్ష నియంతృత్వాన్ని అదుపులో పెట్టి సమర్థవంతమైన పాలన అమలుపరచేందుకు రాజకీయ పక్షములు కృషి చేయగలవు.

**19.9 ముగింపు :**

ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రభుత్వ పాలనపై శక్తివంతమైన పౌర నియంత్రణ వుండవలసిన అవసరం ఎంతైనా కలదు. ప్రత్యక్ష ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రజలే ప్రత్యక్షంగా ప్రభుత్వ విధానాలపై నియంత్రణ చేస్తే, పరోక్ష ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రజలు పరోక్షంగా మాత్రమే ప్రభుత్వ విధానాలపై నియంత్రణ చేయగలుగుతున్నారు. ప్రజలలో అక్షరాస్యత పెరిగి, అజ్ఞానము తొలగి, రాజకీయ చైతన్యం ఎప్పుడైతే ఆవిర్భవించగలదో ఆనాడే ప్రభుత్వ పాలనపై పౌర నియంత్రణ సమర్థవంతముగా వుండగలదు.

**మాదిరి ప్రశ్నలు :**

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులు మించక జవాబు వ్రాయుము.

1. పరిపాలనపై పౌర 2నియంత్రణను తెల్పుము.
2. పౌరనియంత్రణా సాధనాలు

**లఘువ్యాస ప్రశ్నలు :**

1. ప్రజాభిప్రాయ సేకరణ
2. చొరవ (Initiative)
3. రీకాలు
4. నిర్బంధ సముదాయాలు

**రచయిత : వి. పూర్ణచంద్రరావు**

పాఠము - 20

# పరిపాలనపై శాసన సభ నియంత్రణ

విషయసూచిక


20.0 ఉపోద్ఘాతం
20.1 విధాన నిర్ణయము
20.2 ప్రజాద్రవ్యంపై నియంత్రణ
20.3 ప్రశ్నోత్తరములు
20.4 శాసన సభలలో చర్చలు
20.5 ఆడిట్ - నివేదికలు
20.6 తీర్మానాలు
20.7 శాసనసభ దర్యాప్తులు
20.8 వాగ్దానాల పరిరక్షణ కమిటి
20.9 శాసనసభ - కమిటీలు
20.10 ఉద్యోగి బృంద నిర్ణయము
20.11 వ్యవస్థీకరణ నిర్ణయము
20.12 శాసన నిర్మాణశాఖ నియంత్రణ - పరిమితులు
20.13 పరిపాలన యంత్రాంగంపై శాసనశాఖ నియంత్రణ సమర్ధవంతముగా వుండుటకు అమలు చేయవలసిన అంశాలు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు


## 20.0 ఉపోద్ఘాతం :

ఆధునిక కాలములో ప్రపంచ రాజ్యాలన్నింటిలోను ప్రభుత్వ పాలనా పరిధి అనూహ్యంగా అభివృద్ధి చెందింది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజల సమస్యలను తొలగించి, చక్కటి పరిపాలనా యంత్రాంగాన్ని ఏర్పరచేది శాసన నిర్మాణ సభయే. ఆధునిక రాజ్య ఆశయాలు, స్వభావం, విధుల దృష్ట్యా రాజ్యాధికారం విస్తరించడంతో ప్రభుత్వోద్యోగుల అధికారాలు కూడ విస్తరించబడ్డాయి. లార్డ్ ఆక్టన్ చెప్పినట్లు "అధికారం వ్యక్తిని అవినీతిపరుణ్ణి చేస్తుంది", కాబట్టి ప్రభుత్వోద్యోగుల చర్యలపై కొంత నియంత్రణ అవసరమే గాక తప్పని సరికూడ. ఎల్.డి.వైట్ చెప్పినట్లు "నానాటికి పెరుగుతున్న పాలనా యంత్రాంగ ప్రాధాన్యత ప్రజల హక్కులను హరించకుండా నిరోధించడానికి తగిన నియంత్రణలు కూడ అవసరమయ్యాయి." పరిపాలన నియంత్రణ విధానాలను తయారు చేయడం ద్వారాను, చట్టాలను రూప కల్పన చేయడం ద్వారాను, వాటిని సవరించి, రద్దు పరచడం ద్వారాను శాసనసభ ప్రభుత్వ పాలనపై నియంత్రణ చేయగలుగుతుంది. ప్రభుత్వ పాలనపై ఉన్న బాహ్య నియంత్రణలలో శాసన నిర్మాణ శాఖ నియంత్రణ చాలా ప్రధానమైనది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ పాలన ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఉండాలి. ప్రొఫెసర్ బెర్నార్డ్ క్రిక్ ఈ అంశాన్ని వివరిస్తూ "నిరంతరము మారుతున్న ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రతిస్పందించడానికి శాసన సభ నియంత్రణ ఎంతగానో దోహదం చేస్తుంది" అని పేర్కొన్నాడు.

## 20.1 విధాన నిర్ణయము :

పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాలలో ప్రభుత్వ కార్యకలాపాలన్నింటికి మూలం శాసన సభయే. తగిన శాసనముల ద్వారా ప్రభుత్వ పాలనను నిర్దేశించడానికి, నియంత్రించడానికి, అజమాయిషీ చేయడానికి శాసనసభకు మాత్రమే అధికారం కలదు. శాసనాలు ద్వారా పరిపాలనా విధానాలన్నింటిని నిర్ణయించేది శాసనసభయే. శాసనసభ తాను చేసిన శాసనములను మారే పరిస్థితులకు అనుగుణముగా మార్చుటకు లేదా రద్దు చేయుటకు అధికారాన్ని కలిగి వుంటుంది. ప్రభుత్వ పాలనను శాసన పరిధికి లోబడి నిర్వహించవలసి వుంటుంది.

కాని నేడు శాసనసభ విధులు అసంఖ్యాకంగా పెరుగుట, శాసనసభ తక్కువ కాలం మాత్రమే సమావేశం అగుట, సాంకేతిక పరిజ్ఞానం లోపించడం వల్ల శాసన సభ శాసనములన్నింటిని సమర్ధవంతముగా రూపొందించ లేకపోతుంది. అందువలన పరిపాలనా విధానాలకు సంబంధించిన ప్రధాననిర్ణయాలను మాత్రమే తాను నిర్ణయించి, వాటికి సంబంధించిన వివరాలను రూపొందించుకునే అధికారాన్ని కార్యనిర్వాహక శాఖకే శాసన సభ దత్తత చేయుచున్నది. దీనిని దత్త శాసన అధికారం అని, లేదా నియోజిత శాసన అధికారం అని అందురు. కార్యనిర్వాహక శాఖ చేసిన నిర్ణయాలు శాసనసభ తీసుకున్న ప్రధాన విధాన నిర్ణయాలకు ఎంత వరకు అనుగుణంగా వున్నది దత్త అధికారానికి సంబంధించి పార్లమెంటు కమిటి పరిశీలిస్తుంది. అనగా విధానాలను నిర్ణయించడం ద్వారానే గాక కార్యనిర్వాహకశాఖ తీసుకునే వివరాలపై కూడ శాసనసభ అజమాయిషీ వుంటుంది.

## 20.2 ప్రజాద్రవ్యంపై నియంత్రణ :

శాసనసభ ఆమోదం లేనిదే ప్రభుత్వం ఏ పన్నులను విధించలేదు. పాలనా నిర్వహణకు అవసరమైన నిధులను మంజూరు చేయడానికి, తగ్గించడానికి లేక తిరస్కరించడానికి శాసనసభకు మాత్రమే అధికారం కలదు. దేశ ఆర్థిక వ్యవహారాలపై శాసనసభకు సంపూర్ణ నియంత్రణ వుంటుంది. శాసనసభ ఉపకల్పన బిల్లును ఆమోదించడం ద్వారా ప్రభుత్వ పాలనా నిర్వహణకు అవసరమైన నిధులను మంజూరు చేస్తుంది. బడ్జెట్‌ను తిరస్కరించుట, కోత తీర్మానాలను ఆమోదించుట ద్వారా శాసనసభ ప్రభుత్వాన్ని తొలగించగలదు. కాని మంత్రివర్గానికి సభలో మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నంతకాలం శాసనసభ శక్తి వంతమైన నియంత్రణ చేయలేదు. అధ్యక్ష తరహా ప్రభుత్వంలో శాసనసభ బడ్జెట్‌ను తిరస్కరించినను ప్రభుత్వం రాజీనామా చేయవలసిన అవసరం లేదు. ప్రభుత్వ శాఖల డిమాండ్‌లను ఆమోదించే సందర్భంలో సభ్యుల ప్రశ్నలకు, అనుబంధ ప్రశ్నలకు, తీర్మానాలకు శాఖాధిపతులైన మంత్రులు సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చి తీరాలి. కాబట్టి బడ్జెట్ శాసన సభలలో జరిగే చర్చలు, విమర్శలు, తీర్మానాలు ప్రభుత్వాన్ని బాధ్యతాయుతంగా వ్యవహరించేటట్లు చేయగలవు.

## 20.3 ప్రశ్నోత్తరములు :

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయం చాలా ముఖ్యమైనది. ఈ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు మంత్రులను ప్రశ్నించుటకు, ఉప ప్రశ్నలు వేయుటకు అధికారాన్ని కలిగి వుంటారు. శాసన సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రులు తగిన సమాధానము చెప్పవలసి ఉంటుంది. ఈ ప్రశ్నోత్తర సమయం ద్వారా పరిపాలనా యంత్రాంగాన్ని శాసనసభ్యులు అదుపులో పెట్టగలరు. మంత్రులను, పరిపాలనా యంత్రాంగాన్ని బాధ్యతాయుతంగా పని చేయగలిగేట..ల..స్తుంది. కాని అధ్యక్ష తరహా ప్రభుత్వంలో అధ్యక్షుడు, మంత్రులు శాసనసభలో సభ్యులు కానందు వలన, వారు శాసనసభకు బాధ్యత వహించనవసరం లేనందువల్ల పాలనా యంత్రాంగాన్ని శాసనసభ అంత సమర్ధవంతముగా అదుపులో ఉంచలేదు.

## 20.4 శాసన సభలో చర్చలు :

శాసన సభలో ప్రజా సమస్యలపై చర్చలు జరుగుతుంటాయి. ప్రభుత్వ విధానాలను వివరించే దేశ అధినేత ప్రసంగంపై బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి ప్రసంగము, సభ్యులు ప్రవేశపెట్టే అధికార, అనధికార బిల్లులపై నిర్ణీత సమయాలలో, చర్చలు జరుగుతాయి.

ఈ చర్చలలో సభ్యులు ప్రభుత్వ విధానాలపై తగిన విమర్శలు చేయవచ్చు. ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వ విధానాలను నిశితంగా విమర్శించుకొనుటకు ఈ చర్చలను వినియోగించుకుంటారు. ఈ చర్చలలో ప్రభుత్వ పని తీరు, అసమర్ధత, సమర్ధత సమగ్రంగా పరిశీలనకు వస్తాయి. ఈ చర్చలు ప్రభుత్వాన్ని కొంత వరకు అదుపు చేయగలుగుతాయి. ప్రజా సమస్యలు ప్రభుత్వ దృష్టికి ఈ చర్చల ద్వారా తీసుకొని వెళ్లవచ్చు. కాని వివిధ రాజకీయ పక్షాలకు సంబంధించిన సభ్యులు ఈ చర్చలలో క్రమశిక్షణాయుతంగాను, బాధ్యతాయుతంగాను, సభా కార్యక్రమాలకు అంతరాయం కలుగకుండా తగిన క్రమశిక్షణాయుతంగా మెలుగవలసి ఉంటుంది.

## 20.5 ఆడిట్ నివేదికలు :-

ప్రభుత్వం తాను చేసిన ఖర్చు వివరాలను చూపించాలి. దీనిని ఖాతాల నిర్వహణ లేక అకౌంటింగ్ అంటారు. ఉద్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వం ఖర్చు చేసినదా? లేదా? అని తనిఖీ చేయుటనే ఆడిట్ అంటారు. ప్రభుత్వ ఆదాయ వ్యయాలను తనిఖీ చేయటం ద్వారా శాసనసభ పాలనా యంత్రాంగాన్ని అదుపులో ఉంచగలదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఖాతాల నిర్వహణను (Accountancy), ఖాతాల తనిఖీ (Audit) లను వేరుపరచినందు వలన కేవలం ఖాతాల తనిఖీ (Audit) ని మాత్రమే భారత కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (C & A G) నిర్వహించుచున్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వ్యయాలను తనిఖీ చేసి తన నివేదికలను రాష్ట్రపతి, గవర్నర్‌లకు అందించును. ఈ నివేదికలను కేంద్ర స్థాయిలో రాష్ట్రపతి, రాష్ట్ర స్థాయిలో గవర్నర్ శాసనసభలకు సమర్పిస్తారు. ఈ ఆడిట్ నివేదికల ఆధారముగానే ప్రభుత్వ ఖాతాల సంఘం (పబ్లిక్ అకౌంట్స్ కమిటి) ప్రభుత్వ వ్యయ ఖాతాలను తనిఖీ చేసి ప్రభుత్వం ధనాన్ని బడ్జెట్ హద్దుల్లో ఖర్చు చేసింది లేనిది నిర్ధారణ చేసి పార్లమెంట్‌కు తన నివేదికను సమర్పిస్తుంది. అలాగే అంచనాల సంఘం ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలను పరిశీలించి తగిన పొదుపు చర్యలను సూచిస్తుంది.

## 20.6 తీర్మానాలు :

శాసన సభలలో వాయిదా తీర్మానాలు, అవిశ్వాస తీర్మానాలు మొదలగునవి ప్రవేశ పెట్టబడి ఆమోదించబడుతూ ఉంటాయి. ఈ తీర్మానాలను ప్రవేశ పెట్టుటకు సభాపతి ఆమోదం అవసరం. ఒక మంత్రిని లేదా ప్రభుత్వం మొత్తాన్ని అభిశంసించుటకు తీర్మానం చేయవచ్చు. ఈ తీర్మానం ఆమోదించబడితే ప్రభుత్వం రాజీనామా చేయాలి. అత్యవసర ప్రజా ప్రాధాన్యత గల విషయాలను సభా దృష్టికి తీసుకు రాదల్చినపుడు స్పీకర్ అనుమతితో వాయిదా తీర్మానాలను ప్రతిపాదించవచ్చు. ఆ తీర్మానము సభ చేత ఆమోదించబడితే సభ ఎజెండాలోని విషయాలను నిలుపుదల చేసి ఆ విషయాన్ని సభ చర్చించాలి. ఈవిధంగా అనేక తీర్మానాల సహాయంతో, సభ ప్రభుత్వ యంత్రాంగాన్ని అదుపులో ఉంచుతుంది.

## 20.7 శాసన సభ దర్యాప్తులు :

పార్లమెంటరీ దేశాలలో సాధారణముగా శాసన సభ, సభాకమిటీలను నియమించి, దర్యాప్తులు చేయించి పార్లమెంటుకు తమ నివేదికలను సమర్పిస్తుంది. కాని అధ్యక్ష తరహా ప్రభుత్వమైనా అమెరికాలో కాంగ్రెస్ అనేక దర్యాప్తు సంఘాలను నియమిస్తుంది. ఈ సంఘాలు చేసిన దర్యాప్తులు భవిష్యత్తులో శాసన నిర్మాణానికి ఉపయోగకరమే గాక ప్రభుత్వాన్ని కూడ నియంత్రించగలవు.

## 20.8 వాగ్దానాల పరిరక్షణ కమిటీ :

ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రులు సభలోని సభ్యులకు కొన్ని విషయాలకు సంబంధించి కొన్ని వాగ్దానాలు చేస్తూ వుంటారు. మంత్రులు తాము సభకు ఇచ్చిన వాగ్దానాలు ఎంతవరకు అమలు జరుపబడినవి పరిశీలించుటకు గాను ఒక ప్రత్యేక సంఘమును ఏర్పాటు చేస్తారు. ఈ సంఘము మంత్రులు చేసిన వాగ్దానాలకు సంబంధించి పరిశీలన జరిపి నిర్ణీత సమయాలలో శాసన సభలకు నివేదికలను సమర్పిస్తూ వుంటుంది. ఈ వాగ్దానాల పరిరక్షణ సంఘం ద్వారా పాలనా యంత్రాంగంపై శాసన సభ శక్తివంతమైన నియంత్రణ చేయగలుగుచున్నది.

## 20.9 శాసన సభ - కమిటీలు :

ఆధునిక శాసన సభ నిర్మాణంలో పార్లమెంటరీ కమిటీలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. శాసన సభకు సంబంధించిన అనేక విధులు ఈ కమిటీల ద్వారానే నిర్వర్తించబడుచున్నాయి. పరిపాలన అసమర్ధతను విచారించడానికి, అధికార దుర్వినియోగాన్ని నివారించడానికి ఈ శాసన సభా కమిటీలు చాలా వరకు ఉపయోగపడుతున్నాయి. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ ఎస్టిమేట్స్ కమిటీ, ప్రభుత్వ ఉపక్రమాల సంఘం మొదలగునవి ప్రభుత్వ ఆర్థిక విషయాలపై అజమాయిషీ చేస్తాయి. దత్త శాసన కమిటి కార్యనిర్వాహక శాఖ రూపొందించిన నియమ నిబంధనల వల్ల ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా చూస్తుంది. ఈ కమిటీలతో పాటు విజ్ఞప్తుల కమిటీ, మంత్రిత్వ శాఖలకు అనుబంధముగా పని చేసే సంప్రదింపుల కమిటీలు, స్టాండింగ్ కమిటీలు మున్నగునవి పరిపాలన సామర్థ్యం పెంపొందించుటలో తోడ్పడగలవు. అధ్యక్ష తరహా ప్రభుత్వ విధానం అమలులో ఉన్న అమెరికాలో కాంగ్రెస్ కమిటీలే పరిపాలనా యంత్రాంగాన్ని అదుపు చేయగలుగుచున్నవి.

## 20.10 ఉద్యోగిబృంద నిర్ణయము :

ప్రజాస్వామ్య రాజ్యాలలో శాసన నిర్మాణశాఖ ప్రభుత్వ ఉన్నతోద్యోగుల సంఖ్యను, వారి విధులను, జీత భత్యాలను నిర్ణయిస్తుంది. అమెరికాలో అధ్యక్షుడు చేసే ముఖ్యమైన నియామకాలను కాంగ్రెస్‌లోని ఎగువ సభయైన సెనెట్ ఆమోదించాలి.

## 20.11 వ్యవస్థీకరణ నిర్ణయము :

అధ్యక్ష తరహా ప్రభుత్వ విధానం అమలులో గల అమెరికాలో వివిధ పాలనా శాఖలను వ్యవస్థీకరించుటకు లేదా పునర్వ్యవస్థీకరించుటకు లేదా రద్దు చేయుటకు కాంగ్రెస్‌కు అధికారం వుంది. ఆ సంస్థలకు సంబంధించిన వివరాలను కార్యనిర్వాహక శాఖ చూస్తుంది. పార్లమెంటరీ దేశాలలో కార్యనిర్వాహక శాఖయే పాలనా శాఖలను వ్యవస్థీకరించుటకు, పునర్ వ్యవస్థీకరించుటకు అధికారాన్ని కలిగి ఉంటుంది.

## 20.12 శాసన సభ నియంత్రణ - పరిమితులు :

ఆధునిక కాలములో శాసన సభ విధులు అసంఖ్యాకంగా పెరుగుట వలన కొన్ని సాధనాల ద్వారా శాసన సభ ప్రభుత్వ పాలనపై నియంత్రణ చేయుచున్నప్పటికి, ఈ నియంత్రణ సమర్ధవంతముగా వుండుట లేదు. దీనికి అనేక కారణములు కలవు.

1. శాసన సభ్యులకు సాంకేతిక పరిజ్ఞానము ఉండదు. అందువల్ల వీరు వివిధ అంశములను సమర్ధవంతముగా అర్థం చేసుకోలేక పోతున్నారు.
2. నేడు సభ తక్కువ కాలము సమావేశం అవుతున్నది. తుదకు నిర్దేశించిన విధులను అయినా సమర్ధవంతముగా నిర్వహించగల సమయం శాసన సభకు లేదు.
3. నేడు శాసన సభ్యులు వారి వారి పార్టీ తీర్మానాలకు లోబడి తమ అభిప్రాయములను వ్యక్తం చేయగలుగుతున్నారే తప్ప, తమ అంతరాత్మ ప్రబోధాన్ని బట్టి నిర్భయంగా సభ్యులు అభిప్రాయాలను గాని ఓటు హక్కుకు గాని వినియోగించుకోలేక పోవుచున్నారు.
4. పార్లమెంటరీ ప్రభుత్వంలో శాసన సభ మంత్రి వర్గాన్ని అదుపు చేయాలి. కాని నేడు శాసన సభలో మెజారిటీ సభ్యుల మద్దతు గల మంత్రి వర్గం శాసన సభని నియంత్రించగలుగుచున్నది. మంత్రి వర్గ సభ్యులు తమ పార్టీకున్న మెజారిటీ సభ్యుల మద్దతుతో అనుకున్న లక్ష్యాలను సాధించుకోగలుగుతున్నారు.

5. అధ్యక్ష తరహా ప్రభుత్వంలో అధ్యక్షుడు గాని, మంత్రులు గాని శాసన సభకు బాధ్యత వహించనవసరం లేదు. పార్లమెంటరీ దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణకు ప్రత్యక్షంగా బాధ్యత వహించరు. వారి తరుపున మంత్రులే శాసన నిర్మాణ శాఖకు బాధ్యత వహిస్తారు.
6. విధాన నిర్ణయాలపైన సభ ఆమోదించే తీర్మానాలు ఖచ్చితంగా, స్పష్టంగాను ఉండుట లేదు.

**20.13 ఈ క్రింది సూచనలు అమలుచేయడం ద్వారా శాసన సభ పాలనా యంత్రాంగంపై ఇతోధిక నియంత్రణ చేయవచ్చు:**

1. శాసన సభ్యులు సమావేశాలలో ఉండే కాలపరిమితి ఇంకా పెంచాలి.
2. దత్త శాసనాధికారాన్ని ఇతోధికంగా తగ్గించాలి.
3. శాసన సభలలో వివిధ బిల్లులు సమగ్రంగా చర్చించకుండా ఆమోదించరాదు.
4. పద్దులపై చర్చలు జరుగకుండా గిలిటిన్ ఉపయోగించరాదు.
5. శాసన సభలో కమిటీ వ్యవస్థను ఇంకా సమర్ధవంతంగా పని చేయించాలి. అవసరమైనచో క్రొత్త కమిటీలను నియమించాలి.
6. శాసన సభలలో సభ్యుల ఓటింగ్ "పార్టీ విప్" ప్రాతిపదికపై కాకుండా ఉండాలి.
7. శాసన సభ సభ్యులు అనవసరపు వాదోపవాదాలు, వ్యక్తిగత విమర్శలకు దిగకుండా, కాలాన్ని నిర్మాణాత్మకంగా వినియోగించుకోవాలి.

**మాదిరి ప్రశ్నలు :**

**వ్యాసరూప ప్రశ్నలు : 5 పేజీలకు మించకుండా వ్రాయండి**

1. పరిపాలనాపై శాసననిర్మాణశాఖ నియంత్రణలను తెల్పుము?
2. నియోజిత శాసన అధికారం (దత్త శాసన అధికారం) అంటే ఏమిటి, దాని ప్రాముఖ్యత ఏమిటి?

**లఘువ్యాస ప్రశ్నలు :**

1. ప్రశ్నోత్తరాల సమయం
2. ఆడిట్
3. అకౌంటింగ్
4. ప్రభుత్వఖాతాల సంఘం
5. అంచనాల సంఘం
6. అభిశంసన తీర్మానము

**చదువదగిన గ్రంథములు :**


1. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ — అవస్థి మరియు మహేశ్వరి
2. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ — పి.ఆర్. త్యాగి
3. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ థియరీ అండ్ ప్రాక్టీసు — యం.పి. శర్మ
4. కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ — ఆర్.బి. జైన్


రచయిత : **వి. పూర్ణచంద్రరావు**

పాఠము - 21

# పరిపాలనపై న్యాయశాఖ నియంత్రణ

విషయసూచిక


21.0 లక్ష్యం

21.1 పరిచయము

21.2 న్యాయశాఖ జోక్యమునకు ఆధారాలు

21.3 న్యాయశాఖ నియంత్రణా పద్ధతులు

21.4 న్యాయశాఖ నియంత్రణపై పరిమితులు

21.5 ముగింపు

మాదిరి ప్రశ్నలు

చదువవలసిన గ్రంథాలు


## 21.0 లక్ష్యం :

ప్రభుత్వ పరిపాలనపై న్యాయశాఖ ఎటువంటి సందర్భాలలో ఏ విధముగా నియంత్రణ చేస్తుందో వివరించుట ఈ పాఠము యొక్క ముఖ్య లక్ష్యం.

## 21.1 పరిచయము :

ప్రభుత్వాంగములో ఒకటైన న్యాయశాఖ ఎంతో ప్రాముఖ్యతను కలిగినది. అంతేగాక ఏ యుగంలోనైనా ఒక దేశపు ఔన్నత్యం, నాగరికతా స్థాయి ఆ దేశంలోని న్యాయశాఖ పనిచేసే తీరుతెన్నులను బట్టి నిర్ణయింపబడుతుంది. అయితే పరిపాలనపై న్యాయశాఖ నియంత్రణను గురించి తెలుసుకొనబోయే పూర్వము న్యాయము (Law) నకు సంబంధించిన రెండు ప్రధాన భావనలను గురించి తెలుసుకొనుట ఎంతైనా సమంజసము. అవే 1. సాధారణ న్యాయము 2. పరిపాలక న్యాయములు. అమెరికా, బ్రిటన్, ఇండియా, మరియు ఇతర కామన్వెల్తు దేశాలు సమ న్యాయపాలన లేదా చట్ట సమతత్వము (Rule of Law) ను పాటించుచున్నాయి. దీని ప్రకారం సాధారణ పౌరుడు గాని, ఉద్యోగి గాని ఎవరైనా చట్టము దృష్టిలో అందరూ సమానమే. అయినప్పటికి ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చేసిన తప్పులకు రాజ్యము బాధ్యత వహించదు. వారిపై బాధిత వ్యక్తులు సాధారణ న్యాయస్థానములలో దావాలు వేయవచ్చును. కానీ ఇందుకు భిన్నముగా ఫ్రాన్సు, జర్మనీ, స్వీడెన్ వంటి దేశాలలో పరిపాలక న్యాయము అమలులో కలదు. దీని ప్రకారం ప్రభుత్వ పరిపాలనకు, ఉద్యోగులకు, ప్రజలకు మధ్య ఏర్పడిన వివాదములను పరిష్కరించుటకు ప్రత్యేక పరిపాలక న్యాయస్థానములు కలవు. ఫలితముగా ఉద్యోగులు తమ అధికార విధి నిర్వహణలో చేసిన తప్పిదములకు సంబంధించి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. కావున దావాలు ప్రభుత్వంమీదే వేయవలెను గానీ ఉద్యోగుల మీద మాత్రము కాదు. కానీ ఉద్యోగులు తమ ఉద్యోగ విధులకు తప్ప మిగిలిన విధులకు సంబంధించి సాధారణ న్యాయస్థానాలకు తప్పనిసరిగా బాధ్యత వహించవలసి ఉంటుంది. అయితే మన దేశములో సమన్యాయపాలన లేదా చట్టసమత్వము (Rule of Law) అమలులో ఉన్నందువలన పరిపాలనపై సాధారణ న్యాయశాఖ యొక్క నియంత్రణ ఎక్కువగా ఉంటుంది. పాలనావ్యవస్థ క్రమేణా క్లిష్టతరమౌతున్న దృష్ట్యా కామన్‌వెల్త్ దేశాలలోకూడ పరిపాలనా న్యాయస్థానాలు (Administrative Tribunals) ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. మనము యిపుడు న్యాయశాఖ యొక్క నియంత్రణను గురించి పరిశీలించుదాము.

## 21.2 న్యాయశాఖ జోక్యమునకు ఆధారములు :

ఆధునిక రాజ్యాలు సంక్షేమ రాజ్యస్థాపన తమ లక్ష్యముగా పెట్టుకున్నందువలన ప్రభుత్వము నిర్వహించే కార్యక్రమాల సంఖ్య విపరీతముగా పెరిగినది. ఫలితముగా వివిధ పాలనా సంస్థలకు, ప్రభుత్వ అధికారాలకు సంక్రమింపచేసిన అధికారాలు బాధ్యతలు కూడా పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో ఉద్యోగులు తమ అధికారాలను దుర్వినియోగపరచకుండా ప్రజల హక్కులను కాపాడి, వాటిని పరిరక్షించడానికి న్యాయశాఖ యొక్క నియంత్రణ తప్పనిసరి. సాధారణముగా ఏ దేశములోనైనా న్యాయశాఖ ఈ క్రింది పరిస్థితులలో జోక్యం చేసుకొని ప్రజలకు రక్షణ కల్పిస్తాయి. అవి :

ఎ) ప్రభుత్వోద్యోగులు తమ అధికార పరిధిని అతిక్రమించి వ్యవహరించినపుడు లేదా లేనటువంటి అధికారము చలాయించినపుడు

బి) ఉద్యోగులు శాసనమును సక్రమంగా అర్థము చేసుకొనక దానికి తప్పుడు భాష్యము చెప్పి, అన్వయించుటలో పొరపాటు చేసినపుడు

సి) ఉద్యోగులు యదార్థములను లేదా వాస్తవాలను పూర్తిగా తెలుసుకొనకుండా తమ ఊహల లేదా సొంత ఆలోచనల ప్రకారము నడుచుకొని పౌరులకు నష్టము కలిగించినపుడు.

డి) ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చట్టాలు నిర్ణయించిన ప్రక్రియలను, పద్ధతులను పాటించక ప్రజల హక్కులను భంగపరచినపుడు.

## 21.3 న్యాయశాఖ నియంత్రణా పద్ధతులు :

న్యాయశాఖా నియంత్రణా పద్ధతులు ఆ దేశపు రాజ్యాంగ తరహాను బట్టి రూపొందించబడతాయి. భారతదేశంలో పరిపాలనపై న్యాయశాఖ యొక్క నియంత్రణ ఈ క్రింది పద్ధతులు ద్వారా జరుగుతుంది.

### 1. న్యాయ సమీక్ష :

న్యాయశాఖ యొక్క నియంత్రణా పద్ధతులలో ఇది చాలా ప్రధానమైనది. దీని ప్రకారము ప్రభుత్వోద్యోగులు నిర్వహించిన కార్యకలాపముల వలన ఎవరైనా నష్టపడి, వారు న్యాయస్థానములకు విన్నవించుకుంటే అపుడు న్యాయశాఖ పాలనా చర్యలను సమీక్షించి ఒక వేళ ఆ చర్యలు రాజ్యాంగమునకు, చట్టానికి వ్యతిరేకంగా ఉన్నట్లయితే అవి 'చెల్లనేరవు' అని తీర్పు చెబుతాయి. దీనినే 'న్యాయ సమీక్ష' అని అందురు. అయితే న్యాయశాఖకు గల ఈ న్యాయ సమీక్షాధికారము అన్ని దేశాలలోనూ ఒకే రకముగా లేదు. ఇది ఆయా దేశాల రాజ్యాంగాల కామన్‌లా సూత్రాల మీద ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు బ్రిటనులోని న్యాయస్థానములకు అన్ని రకాలైన పాలనా చర్యలను సమీక్షచేసే అధికారము లేదు. కానీ ఇందుకు భిన్నముగా అమెరికా, భారత దేశాలలోని న్యాయస్థానములకు విస్తృతమైన అధికారములు కలవు.

### 2. నియత శాసన విజ్ఞప్తులు :

ప్రభుత్వోద్యోగుల చర్యలు లేదా నిర్ణయాల వలన కష్టనష్టములకు గురైన పౌరులు ఫలానా పరిస్థితులలో సాధారణ లేదా పరిపాలక న్యాయస్థానములకు వెళ్ళవచ్చునని కొన్ని చట్టాలలో స్పష్టముగా చెప్పబడి ఉంటుంది. దీనినే నియత శాసన అప్పీలు లేదా చట్టబద్ధమైన విజ్ఞప్తి అని అందురు. ఉదాహరణకు ఆదాయపు పన్ను విషయంలో అధికారుల నిర్ణయాలకు వ్యతిరేకంగా పౌరులు న్యాయస్థానాలలో వెళ్ళే అధికారాన్ని చట్టములోనే కల్పించినారు.

### 3. ప్రభుత్వముపై దావాలు :

ప్రభుత్వ చర్యల వలన నష్టపడిన పౌరులు నష్ట పరిహారము కొరకు ప్రభుత్వముపై దావాలు వేయవచ్చును. సాధారణముగా ప్రభుత్వముపై రెండు సందర్భాలలో దావా వేయవచ్చును. అవి 1. ఒడంబడికలు 2. టార్ట్‌లు (Torts). ప్రభుత్వము తన విధి

నిర్వహణలో వ్యక్తులతోను, సంస్థలతోను ప్రయివేటు వ్యక్తుల మాదిరిగానే ఒడంబడికలు చేసుకుంటుంది. ఒక వేళ వ్యక్తులతో చేసుకున్న ఒడంబడికలకు విరుద్ధముగా ప్రభుత్వము వ్యవహరించినట్లయితే ఆ వ్యక్తులు నష్ట పరిహారము కొరకు ప్రభుత్వముపై దావాలు వేయవచ్చును. అయితే ప్రభుత్వముపై దావాలు వేసే హక్కు ప్రజలకు ఎంతవరకు కలదు అనునది ఆ దేశములోని న్యాయవిధానము బట్టి ఆధారపడి ఉంటుంది. అదే విధముగా టార్ట్సును గురించి కూడా తెలుసుకొనుట ఎంతైనా అవసరము. టార్ట్స్ అంటే ఒకరు మరొకరికి చేసిన హాని లేదా నష్టము అని చెప్పవచ్చును. ప్రభుత్వ చర్యల వలన ఎవరైనా నష్టపడినట్లయితే వారు నష్ట పరిహారము కొరకు న్యాయస్థానాలకు ఫిర్యాదు చేసుకొనవచ్చును. అయితే దేశ సార్వభౌమత్వాన్ని, శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించిన విధుల నిర్వహణలో జరిగిన నష్టములకు సాధారణముగా ప్రభుత్వము బాధ్యత వహించదు. కాని పురపాలక న్యాయము అమలులో వున్న దేశాలలో ప్రభుత్వోద్యోగులు తమ విధి నిర్వహణలో కలిగించిన నష్టానికి బాధ్యత వహించి, నష్టపరిహారము చెల్లించును.

## 4. ప్రభుత్వోద్యోగుల మీద దావాలు :

ప్రభుత్వోద్యోగులు అధికార హోదాలో గాక, వ్యక్తిగత హోదాలో చేసిన తప్పులకు వారే బాధ్యత వహించవలసి వుంటుంది. కానీ అధికార హోదాలో చేసే తప్పులకు వారి బాధ్యత అన్ని దేశాలలోనూ, అన్ని రకాలైన ఉద్యోగులకు సంబంధించి ఒకే రకముగా లేదు. బ్రిటన్‌లో రాజు లేదా రాణి తాను చేసిన చర్యలకు సంబంధించి ఏ న్యాయస్థానానికి బద్ధుడు కాదు. ఈ విధమైన మినహాయింపు అతనికి లేదా ఆమెకు కల్పించటము జరిగినది. కానీ బ్రిటన్‌లోని ఇతర ప్రభుత్వోద్యోగులు ఒడంబడికల విషయంలో వారు చేసిన తప్పులకు బాధ్యత వహించరు. కానీ టార్ట్స్‌కు సంబంధించి వారు చేసిన నేరాలకు వారు బాధ్యత వహించవలసి ఉంటుంది. మన దేశంలో రాష్ట్రపతి మరియు గవర్నర్లు కూడా రాజ్యాంగ పరమైన చర్యల విషయంలో ఏ న్యాయస్థానమునకు జవాబుదారీ కాదు. కానీ వ్యక్తిగతమైన చర్యల విషయంలో రెండు నెలల ముందుగా నోటీసు యిచ్చిన తరువాత వారిపై దావా వేయవచ్చును. కానీ ఇటువంటి సౌకర్యము మనదేశంలోని మంత్రులకు లేదు. అదే విధముగా ఉద్యోగులు కూడా తమ అధికార పరిధిని అతిక్రమించి వ్యవహరించినట్లు ఋజువైతే అందుకు ఉద్యోగులే బాధ్యత వహించాలి. అయితే కొన్ని సందర్భాలలో ఉద్యోగులు తమకు చెందిన అధికారాలను చిత్తశుద్ధితో అమలు జరిపినప్పటికీ దాని వలన ఏవైనా పొరపాటు జరిగినట్లయితే దానికి ఉద్యోగుల బాధ్యత ఏ మాత్రముండదు. ఇక క్రిమినల్ కేసులకు సంబంధించి ఉద్యోగులు కూడా సాధారణ పౌరులు మాదిరిగా న్యాయస్థానములకు బాధ్యత వహించవలసి ఉంటుంది.

## 5. అసాధారణ పరిహారాలు :

పై పేర్కొన్న పద్ధతుల ద్వారానే గాక న్యాయస్థానాలు అనేక రిట్లను లేదా పరిహారాలను జారీచేయుట ద్వారా కూడా ప్రజల హక్కులను పరిరక్షిస్తాయి. వీటినే ఇంగ్లండ్‌లో 'కామన్‌లా రిట్‌లు' అని కూడా అందురు. మనదేశంలో తప్పనిసరి పరిస్థితులలో వీటిని మంజూరు చేయవలసినదని పౌరులు న్యాయస్థానములను అర్థించవచ్చును. అయితే యీ రిట్లను మంజూరు చేసే అధికారము కేవలము సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే యివ్వబడినది. ఈ రిట్లను 6 రకములుగా వర్గీకరించవచ్చును. అవి :

**ఎ) హేబియస్ కార్పస్ :** 'హేబియస్ కార్పస్ అంటే 'వ్యక్తిని హాజరు పరచుట' అని అర్థము. ఏ కారణము చేతనైనా ఒక వ్యక్తిని పోలీసులు నిర్బంధములోనికి తీసుకొని ఉంచినపుడు ఆ వ్యక్తి తరపు బంధువులు న్యాయస్థానమును అర్థించినపుడు అవి ఈ రిట్‌ను జారీ చేస్తాయి. దీని ప్రకారము నిర్బంధములో ఉంచిన వ్యక్తిని 24 గంటలలోపు న్యాయస్థానము ముందుంచవలసినదిగా ఈ రిట్ సంబంధిత అధికారులను ఆదేశిస్తుంది. అతనిని హాజరు పరచగానే అతని నిర్బంధము చట్ట సమ్మతమైనదీ, లేనిదీ న్యాయస్థానము విచారణ చేసి న్యాయ నిర్ణయము చేస్తుంది.

**బి) మాండమస్** : ఒక ప్రభుత్వాధికారి చట్ట రీత్యా తాను చేయవలసిన పనిని నిర్లక్ష్యము చేసినపుడు ఆ పనిని వెంటనే చేయుమని న్యాయస్థానము యిచ్చే ఉత్తర్వును మాండమస్ అని అంటారు.

**సి) ప్రొహిబిషన్** : ఒక ఉన్నత న్యాయస్థానము తన క్రింద ఉన్నటువంటి న్యాయస్థానాలను లేదా ట్రిబ్యునల్‌ను తమ అధికార పరిధి దాటి వ్యవహరించవలదని జారీ చేసే ఉత్తర్వును ప్రొహిబిషన్ అందురు. అంటే ఇది ఒక రకముగా అధికార పరిధులు దాటకుండా నిరోధించే నిషేధపు ఉత్తర్వు అని చెప్పవచ్చును.

**డి) సర్షియోరరీ** : ఏదైనా ఒక కేసుకు సంబంధించి దిగువ న్యాయస్థానములో అనుసరిస్తున్న ప్రక్రియలు, పద్ధతులు చట్టబద్ధముగా లేనపుడు, ఉద్దేశ్యపూర్వకముగా న్యాయ నిర్వహణకు భంగము కలుగుతున్నపుడు నష్టపడే వ్యక్తుల కోరిక మీద ఉన్నత న్యాయస్థానాలు ఇటువంటి రిట్‌ను జారీ చేస్తాయి. ఫలితంగా దిగువ న్యాయస్థానములో జరుగుతున్న విచారణను నిలిపివేసి, రికార్డులను ఉన్నత న్యాయస్థానమునకు పంపించుట జరుగుతుంది. ఒకవేళ అప్పటికే విచారణ పూర్తయినట్లయితే దిగువ న్యాయస్థానము యొక్క నిర్ణయాలను పునఃపరిశీలించి వీటిని ధృవీకరించే లేదా తిరస్కరించే అధికారము ఈ రిట్టు ద్వారా ఉన్నత న్యాయస్థానాలకు లభిస్తుంది.

**ఇ) కోవారెంటో** : ఒక పదవిని లేదా అధికారాన్ని లేదా ఒక అధికారి డిమాండ్ చేసి, వాటి బాధ్యతల నిర్వహణకు స్వయంగా పూనుకుంటే, అతడికి ఆ అధికారం ఉన్నదీ, లేనిదీ ఈ రిట్ ద్వారా నిర్ధారించుట జరుగుతుంది. ఒక వేళ అర్హతలు లేకపోయినట్లయితే అతనిని ఆ పదవి నుండి లేదా అధికారాన్ని చెలాయించకుండా ఈ రిట్ అరికడుతుంది. ఇది సాధారణముగా ఎన్నికలకు సంబంధించిన వివాదాలలో జారీచేయటము జరుగుతుంది.

**యఫ్) ఇంజక్షన్** : ఈ రిట్‌ను గురించి రాజ్యాంగములో పేర్కొనలేదు. అయినప్పటికి పాలనాధికారులపై న్యాయ నియంత్రణ చేసే పద్ధతులలో దీనిని కూడా ఒక ప్రధానమైన పద్ధతిగా పేర్కొనవచ్చును. దీని ప్రకారము న్యాయస్థానము ఒక వ్యక్తిని ఒక పనిని చేయమని గానీ లేదా చేయవద్దని గానీ ఆదేశిస్తుంది. పూడ్చటానికి వీలు లేని నష్టాన్ని నిలుపుదల చేయుటయే దీని యొక్క ముఖ్యోద్దేశ్యము.

పైన చెప్పిన వివిధ రకాలైన రిట్‌లను మన రాజ్యాంగములోని 32వ నిబంధన ప్రకారము సుప్రీంకోర్టు పౌరుల యొక్క ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి జారీ చేస్తుంది. కానీ హైకోర్టులు ఈ రిట్టులను కేవలము ప్రాథమిక హక్కుల పరిరక్షణ కొరకే గాక, ఇతర పాలనా సంబంధమైన విషయాలకు కూడా జారీచేసే అధికారాలను కలిగియున్నాయి.

## 21.4 న్యాయశాఖ నియంత్రణపై పరిమితులు :

పైన చెప్పిన వివిధ రకాలైన పద్ధతుల ద్వారా పరిపాలనపై న్యాయశాఖ నియంత్రణ సమర్థవంతంగా చేస్తున్నప్పటికి ఆచరణలో న్యాయశాఖ చేసే నియంత్రణపై అనేక పరిమితులు కలవు. వాటిని ఈ క్రింది విధముగా వివరించవచ్చును. అవి:

1. న్యాయస్థానములు ప్రభుత్వోద్యోగుల అన్నిరకములైన పాలనా చర్యలను, చట్ట విరుద్ధ చర్యలను స్వయముగా గుర్తించలేదు ప్రభుత్వ చర్యల వలన నష్ట పడినవారు ఫిర్యాదు చేసిన తరువాత మాత్రమే న్యాయస్థానములు చర్య తీసుకోవడము జరుగుతుంది.
2. న్యాయస్థానములో పాటించే ప్రక్రియలు, పద్ధతులు చాలా ఆలస్యముతో కూడుకున్నవి. అంతేగాక న్యాయస్థానములలో తీర్పులు పొందుటకు చాలా ధనము అవసరము. ఫలితముగా ఎన్నో వ్యయ, ప్రయాసలకు గురికావలసి వస్తుంది. అందుచేతనే 'ఆలస్యంగా అందించిన న్యాయము న్యాయమును త్రోసి పుచ్చినట్లే లేదా నిరాకరించినట్లే' (Justice Delayed is justice denied) అనే నానుడి బహుళ ప్రచారము పొందినది.

3. కొన్ని రకాల పాలనా చర్యలు లేదా చట్టాల వలన ప్రజలకు నష్టము కలిగినప్పటికీ న్యాయస్థానములు ప్రజలకు సహకరించలేవు. ఉదాహరణకు మన రాజ్యాంగములోని 9వ షెడ్యూలులో చెప్పబడిన కొన్ని విషయాలు న్యాయస్థానాల పరిధి నుండి మినహాయింపబడినాయి.
4. కొన్ని సందర్భాలలో న్యాయస్థానాలు ప్రభుత్వ పాలనలో జోక్యము చేసుకోవటానికి తమ మీద తామే కొన్ని నిర్బంధాలు విధించుకొని తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే జోక్యము చేసుకొంటాయి.
5. న్యాయస్థానాలకు వెళ్ళుట ఖర్చుతో కూడుకొన్న పని కావున సామాన్య ప్రజానీకానికి ఇవి అందుబాటులో లేవు.
6. న్యాయశాఖ నియంత్రణ అధికముగా ఉన్నట్లయితే ప్రభుత్వోద్యోగులు చురుకుగా పనిచేయలేరు. ఫలితంగా పాలనలో అసమర్థత ప్రవేశించి, విపరీతమైన కాలయాపన జరుగుతుంది. ఒకవేళ న్యాయశాఖ జోక్యము చేసుకొనక పోయినట్లయితే ఉద్యోగులు నిరంకుశముగా వ్యవహరించే ప్రమాదమున్నది. అందువలన న్యాయశాఖ పౌరుల హక్కులను పరిరక్షించుటలో మధ్యే మార్గాన్ని అనుసరించవలసి వున్నది. అపుడే ప్రజాస్వామ్యము విజయవంతమవుతుంది.

## 21.5 ముగింపు :

పైన చెప్పిన విధముగా పరిపాలనపై న్యాయశాఖ చేసే నియంత్రణలో కొన్ని పరిమితులున్నప్పటికీ, ప్రజల హక్కులను కాపాడి, వారికి న్యాయమును ప్రసాదించుటలో న్యాయశాఖ కీలకమైన పాత్ర వహిస్తుందని చెప్పుటలో ఏ మాత్రము సందేహము లేదు. అయితే ఈ నియంత్రణ సమర్థవంతంగా ఉండాలంటే దీని పనితీరులో కొన్ని విప్లవాత్మకమైన సంస్కరణలను ప్రవేశపెట్టవలసిన అవసరము ఎంతైనా ఉన్నది. ముఖ్యంగా న్యాయస్థానాలలో పాటించే నిబంధనలు మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఉండాలి. అతి తక్కువ కాలంలో కేసుల విచారణను పూర్తిచేసి, సామాన్య మానవులకు అవి అందుబాటులో ఉండాలి. అపుడే న్యాయశాఖ పరిపాలనపై చేసే నియంత్రణకు ఒక సార్థకత ఉంటుంది. అంతేగాక న్యాయమూర్తుల వైఖరిలో కూడా మార్పు రావాలి. సాంప్రదాయవాదుల స్థానములో అభ్యుదయ వాదులు న్యాయమూర్తులుగా నియమించబడాలి. చివరిగా పాలనా న్యాయస్థానాల పరిధిని (Scope of Administrative Tribunals) మరింత విస్తరింపచేయాలి.

### మాదిరి ప్రశ్నలు :

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులు మించక జవాబు వ్రాయుము.

1. పరిపాలనపై న్యాయశాఖ చేసే నియంత్రణను గురించి విపులముగా వ్రాయుము.
2. ఉన్నత న్యాయస్థానాలు జారీచేసే అసాధారణ పరిహారాలను గురించి వ్రాయుము.
3. న్యాయశాఖ నియంత్రణపై గల పరిమితులను వ్రాయుము.

**సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించని సమాధానములు వ్రాయుము.

1. న్యాయ సమీక్ష
2. నియత శాసన విజ్ఞప్తులు
3. ప్రభుత్వముపై దావాలు

### చదువదగిన గ్రంథాలు :


1. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ : అవస్థి మరియు మహేశ్వరి
2. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ : ఎ.ఆర్. త్యాగి
3. భారత దేశ పాలన : తెలుగు అకాడమి


రచయిత : నీలకంఠం వెంకటేశ్వర్లు

**(DPAD 21)**

B.A. DEGREE EXAMINATION, JUNE 2010.

(Examination at the end of Second Year)

Part II — Public Administration

Paper II — INDIAN ADMINISTRATIONS

Time : Three hours

Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. What are the salient features of the Mughul period of Indian Administration? Explain.

   మొగలుల కాలపు భారత పాలనా వ్యవస్థ లక్షణాలు ఏమి? వాటిని వివరింపుము.

2. Describe the composition, powers and functions of election commission.

   ఎన్నికల సంఘము యొక్క నిర్మాణం, అధికారాలు మరియు విధులను వర్ణించుము.

3. Write an essay on social welfare policy in India.

   భారతదేశంలో సాంఘిక సంక్షేమ విధానాన్ని గూర్చి ఒక వ్యాసమును వ్రాయుము.

4. Examine the Administrative Relations between the centre and states.

   కేంద్ర రాష్ట్ర పరిపాలనా సంబంధాలను గూర్చి పరిశీలింపుము.

5. Explain the evolution and working of the central secretariat.

   కేంద్ర సచివాలయం ఆవిర్భావం మరియు పనితీరును గూర్చి వివరించుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Describe the position and functions of the state chief secretary.

   రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యొక్క హోదా మరియు అధికారాలను గూర్చి వర్ణించుము.

7. Discuss the structure of the Administrative Organisation of the Government of India Level.

   భారత ప్రభుత్వ పాలనా వ్యవస్థను గూర్చి చర్చించుము.

8. Write a note on Generalist Vs Specialist controversy in civil services.

   సివిల్ సర్వీసుల నందున్న సాధారణ మరియు నిపుణుల వివాదం పై ఒక వ్యాసము వ్రాయుము.

9. Describe the maladies of Indian Bureaucracy.

భారతదేశ ఉద్యోగస్వామ్యములోని రుగ్మతలను వివరింపుము.

10. Explain the means of parliamentary control over public enterprises.

ప్రభుత్వ రంగ సంస్థలపై పార్లమెంటు నియంత్రణా సాధనాలను వివరింపుము.

11. "District collectorism over burdened official". Discuss.

"జిల్లా కలెక్టర్ పని భారంతో సతమతమవుతున్నాడు". చర్చించుము.

12. 'Secretariat and Directorate are two sides of Administration'. Discuss.

'సచివాలయం సంచాలక కార్యాలయం పాలనకు రెండు ముఖాలు' – చర్చింపుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Ombudsman.

అంబుడ్సమెన్.

(b) Democratic decentralisation.

అధికార వికేంద్రీకరణ

(c) Collector.

కలెక్టర్.

(d) Corruption.

అవినీతి.

(e) Redtapism.

జాప్యము.

(f) Microplanning.

సూక్ష్మ ప్రణాళిక.

(g) National Integration Council.

జాతీయ సమైక్యతా మండలి.

## SECTION D — (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Zero based budget.

శూన్యాధార బడ్జెట్.

(ii) Neutrality of civil servants.

ప్రభుతోద్యోగుల తటస్థము.

(iii) Planning commission.

ప్లానింగ్ కమిషను.

(iv) Reservations.

రిజర్వేషన్లు.

(v) Writs.

రిట్స్.

(vi) Public enterprises.

ప్రభుత్వ రంగ సంస్థలు.

(vii) Concurrent list.

ఉమ్మడి జాబితా.

(viii) Estimates committee.

అంచనాల సంఘము.

(ix) Consumer's forum.

కన్స్యూమర్ల ఫోరం.

(x) Nominal executive.

నామమాత్ర కార్య నిర్వాహకుడు.

(b) Answer the following in a Word or Two : (5 × 1 = 5)

(i) Who is the chairman of the planning commission

ప్లానింగు కమిషను ఛైర్మన్‌లు ఎవరు?

(ii) Who is the Chief Election Commissioner?

చీఫ్ ఎలక్షను కమీషనరు ఎవరు?

(iii) Who is Lokayukta of Andhra Pradesh?

ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త ఎవరు?

(iv) Which Article Prescribes Appointment of the Prime Minister?

ప్రధాన మంత్రి నియామకము తెలుపు నిబంధన ఏది?

(v) Which Article prescribes the creation or abolition of the Legislative council of a state?

రాష్ట్ర విధాన పరిషత్తు ఆవిర్భావము, రద్దుచేయడము తెలుపు నిబంధన ఏది?

**(DPAD 21)**

# B.A. DEGREE EXAMINATION, DECEMBER 2010.

**(Examination at the end of Second Year)**

**Part II — Public Administration**

**Paper II — INDIAN ADMINISTRATION**

Time : Three hours

Maximum : 100 marks

## SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Discuss the main features of British Administration in India.

   భారతదేశంలో బ్రిటిష్‌పాలన ముఖ్య లక్షణాలను చర్చింపుము.

2. Explain the powers and functions of comptroller and Auditor General of India.

   భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అధికారాలు, విధులను తెల్పుము.

3. Explain the role of Finance Commission in India.

   భారతదేశంలోని ఆర్థిక కమీషన్ పాత్రను తెల్పుము.

4. What are the federal features in Indian Constitution?

   భారత రాజ్యాంగములో గల సమాఖ్య లక్షణాలు తెల్పుము.

5. Discuss the role of cabinet Secretariat in policy formulation.

   విధాన రూపకల్పనలో కేబినెట్ సచివాలయ పాత్రను వివరింపుము.

## SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Explain briefly the administrative reforms in Andhra Pradesh.

   ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలన సంస్కరణలపై క్లుప్తముగా వ్రాయుము.

7. Discuss the functions of Election Commission in India.

   భారతదేశంలోని ఎన్నికల సంఘం విధులను గురించి చర్చింపుము.

8. Explain the characteristics of corporation form of public enterprise.

   ప్రభుత్వరంగ సంస్థ యొక్క లక్షణాలను పేర్కొనుము.

9. Examine the role of All India services in Indian Administration.

   భారతదేశ పాలనలో అఖిలభారత సర్వీసుల పాత్రను పరిశీలింపుము.

10. Discuss the role of the chief secretary in the setup of State Administration.

రాష్ట్రపాలనా వ్యవస్థలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాత్రను చర్చింపుము.

11. "The mistakes of the civil servants are the mistakes of the ministers'. – Comment.

"ప్రభుత్వోద్యోగుల పొరబాట్లు మంత్రుల పొరబాట్లే" – వ్యాఖ్యానించుము.

12. Evaluate the administration of welfare programmes in Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును అంచనా వేయుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Cabinet committees.

కేబినెట్ కమిటీలు.

(b) Human Rights Commission.

మానవ హక్కుల సంఘము.

(c) National Development Council.

జాతీయ అభివృద్ధి మండలి.

(d) Guptas Administration.

గుప్తుల పాలన.

(e) District collector.

జిల్లా కలెక్టర్.

(f) Politics of Reservation.

రిజర్వేషన్ రాజకీయాలు.

(g) Autonomy of the U.P.S.C.

U.P.S.C. యొక్క స్వయం ప్రతిపత్తి.

SECTION D — (25 marks)

Answer ALL questions.

14. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Indian civil service (ICS).

భారతీయ సివిల్ సర్వీస్.

(ii) Central vigilance commission

కేంద్ర విజిలెన్స్ కమీషన్.

(iii) Consumer's council.

వినియోగదారుల కౌన్సిల్.

(iv) Loka Yukta.

లోకాయుక్త.

(v) Cabinet secretary.

కేబినెట్ సెక్రటరి.

(vi) Pleasure of the Governor.

గవర్నర్ అభీష్టం.

(vii) Red Tapism.

రెడ్ టేపిజం.

(viii) Directorates.

డైరెక్టరేట్స్.

(ix) All India services.

అఖిల భారత సర్వీసులు.

(x) Rustomji committee.

రస్టోమ్జీ కమిటీ.

(b) Answer the following in 1 or 2 words : (5 × 1 = 5)

(i) Who is the Chairman of the second administrative reforms commission?

రెండవ పాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు ఎవరు?

(ii) On the basis of whose recommendation the Institute of Public Administration established at the national level.

ఎవరి సిఫారసు ఆధారంగా జాతీయ స్థాయిలో 'Institute of Public Administration' ను నెలకొల్పబడినది.

(iii) What is the tenure of U.P.S.C. members?

U.P.S.C. సభ్యుల పదవీకాలము ఎన్ని సంవత్సరాలు?

(iv) Police department is under the control of which Ministry?

ఏ మంత్రిత్వ శాఖ నియంత్రణలో పోలీసు శాఖ ఉండును.

(v) Directorates are an example of which agency.

డైరెక్టరేట్స్ ఏ ఏజెన్సీకి ఉదాహరణ.

(DPAD 21)

B.A. DEGREE EXAMINATION, MAY 2011.

(Examination at the end of Second Year)

Part II — Public Administration

Paper II — INDIAN ADMINISTRATIONS

Time : Three hours

Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Describe Indian Administration under Ancient and medieval period.

ప్రాచీన మరియు మధ్యకాలంలో భారతపాలనను వివరించుము.

2. Describe the powers and functions of president of India.

భారత రాష్ట్రపతి అధికారాల్ని మరియు విధులను వివరించుము.

3. Examine the political context of Indian Administration.

భారతపాలన రాజకీయ పూర్వరంగ విషయాలను పరిశీలింపుము.

4. Discuss the constitutional provisions relating to Union-State Administrative relations.

కేంద్ర రాష్ట్ర సంబంధాలలో పరిపాలనా పరమైన అంశాలను చర్చించుము.

5. Describe the role of All-India services.

అఖిల భారత సర్వీసుల పాత్రను గురించి వర్ణించుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Discuss the main features of the British Administration.

బ్రిటీష్ పాలనా ప్రధాన లక్షణాలను చర్చించుము.

7. 'Secretariat and directorate are two sides of administration'. Discuss.

"సచివాలయం సంచాలక కార్యాలయం–పాలనకు రెండు ముఖాలు". చర్చించుము.

8. What is training? What are the objectives of training?

శిక్షణ అనగానేమి? శిక్షణ లక్ష్యాలేవి?

9. Explain the functions of Chief Secretary.

చీఫ్‌సెక్రటరీ విధులను వివరింపుము.

10. Explain the main features of the constitution.

భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలను వివరింపుము.

11. What is Zero-Base-Budget? What are its advantages?

శూన్యాధార బడ్జెట్ అనగానేమి? దాని లాభాలేవి?

12. Discuss Judicial control Over Administration.

పరిపాలనపై న్యాయ నియంత్రణా పద్ధతులను చర్చించుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Good governance.

సుపరిపాలన.

(b) Micro Planning.

సూక్ష్మ ప్రణాళిక.

(c) Directorate.

సంచాలక కార్యాలయము.

(d) Rule of Lapse.

అతిక్రమణ నిబంధన.

(e) Parliamentary control over administration.

పాలనపై పార్లమెంటరీ నియంత్రణ.

(f) Sarkaria Commission.

సర్కారియా కమిషను.

SECTION D — (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Interview.

మౌఖిక పరీక్ష.

(ii) Cabinet.

కేబినెట్.

(iii) E-governance.

ఎలక్ట్రానిక్ పాలన.

(iv) Collective responsibility.

సమిష్టి భాద్యత.

(v) Consumer Forums.

వినియోగదారుల సంఘాలు.

(vi) Urban Development Authority.

నగరాభివృద్ధి సంస్థ.

(vii) Administrative Reforms.
పాలనా సంస్కరణలు.

(viii) Federalism.

సమాఖ్య.

(ix) Judicial Accountability.

న్యాయశాఖ జవాబు దారితనం.

(x) Bureaucracy.

ఉద్యోగిస్వామ్యం.

Answer the following in 1 or 2 words : (5 × 1 = 5)

(i) Who is the external affairs minister?

భారత విదేశ వ్యవహారాల శాఖ మంత్రి ఎవరు?

(ii) Where is the N.I.R.D. located?

జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఎక్కడ ఉన్నది?

(iii) Who is the central vigilance commissioner?

కేంద్ర విజిలెన్స్ కమిషనర్ ఎవరు?

(iv) Who is the chief election commissioner?

భారతదేశ ముఖ్య ఎన్నికల కమిషనరు ఎవరు?

(v) Which article of Indian constitution provides for an appointment of Prime Minister at the centre?

కేంద్రంలో ప్రధాన మంత్రి నియామకం, భారత రాజ్యాంగంలోని ఏ అధికరణ తెలుపుతుంది?

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. & Title** |
| --- | --- | --- |
| B.A. | IInd Year | Paper - II : Indian Administrations |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)